www.andhrajyothy.com

హైదరాబాద్ సిటీ*

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సంపుటి (Volume) : 65
సంచిక (Issue) : 131

ఆదివారం | 25-8-2024 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, బహుళపక్షం; తిథి: సప్తమి తె. 3.39 తదుపరి అష్టమి; నక్షత్రం: భరణి సా. 4.45 తదుపరి కృత్తిక; వర్జ్యం: తె.4.20-5.52; దుర్ముహూర్తం: సా.4.50-5.40; అమృతఘడియలు: మ.12.13-1.43; రాహుకాలం: సా.4.30-6.00; సూర్యోదయం: 6.03; సూర్యాస్తమయం: 6.30

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



ధనిక గ్రామం

ఆ ఊరి ప్రజల ఫిక్స్‌డ్ డిపాజిట్లు రూ.7 వేల కోట్లు 2

ఆసియాలోనే అత్యంత ధనిక గ్రామంగా గుజరాత్‌లోని మాదాపూర్



పింఛనుకు కొత్త పథకం



కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఏకీకృత పింఛను

వచ్చే ఏడాది ఏప్రిల్ నుంచి అమల్లోకి

- చివరి 12 నెలల మూలవేతనం సగటులో పింఛన్‌గా 50% పొందే వెసులుబాటు
- 25 ఏళ్ల సర్వీసుకు అంతమొత్తం.. 10 ఏళ్ల సర్వీసుకు కనీస పింఛను 10 వేలు
- ఆమోదించిన కేంద్ర మంత్రివర్గం.. 23 లక్షల మంది కేంద్ర ఉద్యోగులకు లబ్ధి
- రాష్ట్రాలు అమలు చేయాలని సూచన.. అమలైతే 90 లక్షలకు లబ్ధిదారుల సంఖ్య
- బయో ఈ-3 విధానానికి క్యాబినెట్ పచ్చజెండా.. విజ్ఞాన్ ధార పథకానికి ఆమోదం

న్యూఢిల్లీ, ఆగస్టు 24: ఏకీకృత (యూనిఫైడ్) పింఛన్ పథకానికి కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. దీని వల్ల పదవీ విరమణ పొందే ఉద్యోగులకు ఇప్పుడు లభిస్తున్న ప్రయోజనాల కంటే.. ఏకీకృత పింఛన్ పథకం(యూపీఎస్)లో మరింత లబ్ధి చేకూరనుంది. రాష్ట్రాలు కూడా ఈ విధానాన్ని అమలు చేయాలని కేంద్రం కోరింది. శనివారం సాయంత్రం ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. దీంతోపాటు.. బయోఈ-3 విధానానికి క్యాబినెట్ పచ్చజెండా ఊపింది. శాస్త్రసాంకేతిక రంగాల్లో మూడు వేర్వేరు పథకాలను కలిపి.. విజ్ఞాన్ ధార పథకంగా అమలు చేయాలని నిర్ణయించింది. క్యాబినెట్ భేటీ తర్వాత ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేంద్ర మంత్రి అశ్వినీవైష్ణవ్ వివరాలను వెల్లడించారు. యూపీఎస్ ద్వారా సుమారు 23 లక్షల మంది ఉద్యోగులకు లబ్ధి చేకూరుతుందని ఆయన వివరించారు.

త్వరలో బయో విప్లవం
కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్

రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఈ విధానాన్ని అమలు చేస్తే.. లబ్ధిదారుల సంఖ్య 90 లక్షల వరకు ఉంటుందని అంచనా వేశారు. వచ్చే ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ 1 నుంచి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు కొత్త పింఛన్ విధానాన్ని అమలు చేస్తామన్నారు. "ప్రస్తుతం పింఛన్ విధానాల బకాయిలు రూ.800 కోట్లుగా ఉన్నాయి. కొత్త పింఛన్ అమలుతో తొలి ఏడాది రూ.6,250 కోట్ల వరకు అదనంగా

మిగతా 2వ పేజీలో...

రుణభారం

ఉపశమనం కల్పించండి

- రుణాల రీస్ట్రక్చరింగ్‌కు సహకరించండి
- వెనుకబడిన ప్రాంతాల నిధులివ్వండి
- ఏపీ నుంచి రావాల్సిన బకాయిలను ఇప్పించండి
- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విజ్ఞప్తి



హైదరాబాద్/న్యూఢిల్లీ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): సాగునీటి ప్రాజెక్టులు, తాగునీటి వసతుల కల్పన కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న బడ్జెటేతర రుణాల రీస్ట్రక్చరింగ్‌కు సహకరించాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు విజ్ఞప్తి చేశారు. శనివారం ఆయన ఢిల్లీలో నిర్మలా సీతారామన్‌తో సమావేశమై, రాష్ట్రానికి రావాల్సిన నిధులపై వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మీడియాకు భేటీ వివరాలు తెలిపారు. కేంద్ర ప్రాయోజిత పథకాల నిధులతో పాటు విభజన చట్టం ప్రకారం రావాల్సిన నిధుల

మిగతా 12వ పేజీలో...

ఢిల్లీలోనే పీసీసీ ఆశావహులు
ముగిసిన సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన 12



హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో కూల్చివేతకు గురైన ఎన్ కన్వెన్షన్ సెంటర్


ఎన్ కన్వెన్షన్ కూల్చివేత

సినీనటుడు నాగార్జునకు చెందిన నిర్మాణం నేలమట్టం

- తెల్లవారుజామునే అనూహ్యంగా రంగంలోకి హైడ్రా
- ఉదయం నుంచి కూల్చివేతలు.. ఐదు గంటల్లో పూర్తి
- హైకోర్టులో నాగార్జున పిటిషన్.. మధ్యంతర స్టే జారీ
- అప్పటికే సింహభాగం పూర్తయిన కూల్చివేత
- 14 ఏళ్ల క్రితం నిర్మాణం.. తమ్మిడికుంట చెరువు
- ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పరిధిలో 3.30 ఎకరాలు
- నిర్మాణానికి జీహెచ్‌ఎంసీ అనుమతులు లేవు
- గతంలో కోర్టు స్టే ఆర్డర్లు లేవు: హైడ్రా

హైదరాబాద్ సిటీ/రాయదుర్గం/మాదాపూర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): చెరువులు, పార్కుల్లో అక్రమ నిర్మాణాల తొలగింపు, ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించేందుకు ఏర్పాటైన హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అసెట్స్ ప్రొటెక్షన్ మానిటరింగ్ ఏజెన్సీ (హైడ్రా) మరో కీలక చర్య చేపట్టింది. ప్రముఖ సినీనటుడు నాగార్జునకు చెందిన హైదరాబాద్‌లోని ఎన్ కన్వెన్షన్ సెంటర్‌ను శనివారం కూల్చివేసింది. ఎన్ కన్వెన్షన్.. ఖానామెట్ గ్రామంలోని తమ్మిడికుంట చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో ఉందంటూ దానిని నేలమట్టం

మిగతా 13వ పేజీలో...



చట్టవిరుద్ధం

- స్టే ఆర్డర్, కోర్టు కేసులున్నా పట్టించుకోలేదు
- పట్టా భూమిలోనే నిర్మాణం
- చెరువును అంగుళం కూడా ఆక్రమించలేదు
- కోర్టు తీర్పు వ్యతిరేకంగా వస్తే నేనే కూల్చివేయించేవాడిని
- ప్రజలకు తప్పుడు సంకేతాలు వెళ్లాయనే వివరణ
- అక్కినేని నాగార్జున

- చెరువుల్లోని నిర్మాణాలనే 'హైడ్రా' కూల్చేస్తోంది
  నోటీసులు ఇచ్చిన తర్వాతే చర్యలు: భట్టి
- 'ఎన్' కన్వెన్షన్‌పై చర్యలు తీసుకోండి 13
  హైడ్రా కమిషనర్‌కు 21నే కోమటిరెడ్డి లేఖ
- ఎమ్మెల్యే పల్లా విద్యాసంస్థలపై కేసు
  నాడెం చెరువు బఫర్‌జోన్‌లో అనురాగ్, గాయత్రి ఎడ్యుకేషనల్ ట్రస్టు నిర్మాణాలపై..
  కక్షపూరితంగా ప్రభుత్వం: పల్లా 14
- కూల్చివేయకుండా హైడ్రాను అడ్డుకోండి
  అనురాగ్‌తో పాటు పలు విద్యాసంస్థల పిటిషన్
  చట్టప్రకారం వ్యవహరించాలని కేసు ముగించిన హైకోర్టు 14

24 గంటల్లో 17 ఆపరేషన్లు! 12

- 6 సిజేరియన్లు, 5 ఆర్థో, 2 కంటి శస్త్రచికిత్సలు
- ఓ మహిళకు గర్భసంచిలో గడ్డల తొలగింపు
- మిగతావి హెర్నియా, హైడ్రోసిల్ ఆపరేషన్లు
- వేములవాడ ఏరియా ప్రభుత్వ ఆస్పత్రి ఘనత
- ఆధునిక వసతులతో కార్పొరేట్ స్థాయి వైద్యం



నింగిలోకి భారత్ తొలి పునర్వినియోగ 2

హైబ్రిడ్ రాకెట్

రూమీ-1 ప్రయోగం విజయవంతం



'అదృశ్య' దుస్తులు!

- అవి ధరిస్తే ఇతరులకు కనిపించరు
- కుర్స్క్‌లో ఉక్రెయిన్ సైన్యం విజయానికి కారణం అదే: రష్యా 2
- పశ్చిమదేశాలు ఆ యూనిఫాంను ఉక్రెయిన్‌కు ఇచ్చాయని ఆరోపణ
- అమెరికా మిలిటరీ కంపెనీలపై సందేహాలు
- కాంతి పరావర్తనాన్ని అడ్డుకునే పదార్థాలతో అదృశ్య దుస్తుల తయారీ!

5,200 కేసులు 8 నెలల్లో..

- నిరుడు ఇదే కాలంలో 3,800
- 'హైరిస్క్'గా 10 జిల్లాలు
- సాధారణ జ్వరపీడితులూ భారీగానే..
- నెల రోజుల్లో 2.45 లక్షల మంది
- డెంగీ, మలేరియా, చికున్‌గున్యాపై వివరాలు వెల్లడించిన డీహెచ్ కార్యాలయం
- రాష్ట్రవ్యాప్తంగా డెంగీతో ముగ్గురి మృతి

డెంగీ డేంజర్ బెల్స్



హైదరాబాద్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): డెంగీ కేసులు ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. రాష్ట్రంలో డెంగీ వ్యాప్తిరేటు 7 శాతానికి చేరుకుంది. ఈ ఏడాది జనవరి 1 నుంచి ఆగస్టు 22 వరకు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 5,246 డెంగీ కేసులు నమోదయ్యాయి. ఆగస్టు మూడో వారానికే కేసుల సంఖ్య ఐదు వేలు దాటడం గమనార్హం. నిరుడు ఆగస్టు చివరి నాటికి 3,861 కేసులు నమోదయ్యాయి. అంటే.. నిరుటితో పోల్చితే 35 శాతం మేర కేసుల సంఖ్య పెరిగిందన్నమాట! రాష్ట్రంలో డెంగీ, మలేరియా, చికున్‌గున్యా కేసుల వివరాలను రాష్ట్ర ప్రజారోగ్య సంచాలకుల కార్యాలయం శనివారం విడుదల చేసింది. ప్రధానంగా పది జిల్లాల్లో డెంగీ తీవ్రత ఎక్కువగా ఉందని పేర్కొన్నారు. వాటిని హైరిస్క్ జిల్లాలుగా గుర్తించారు. వీటిలో హైదరాబాద్‌లో అత్యధికంగా 1,697 డెంగీ కేసులు

మిగతా 12వ పేజీలో...



మీ ఇంటికి 'ఐరన్ డోమ్'!

- దోమల్ని చంపే వినూత్న యంత్రం.. చైనాలో తయారీ
- రాడార్, లేజర్ టెక్నాలజీతో పనిచేసే మెషిన్
- ఎక్స్‌లో షేర్ చేసిన ఆనంద్ మహీంద్ర 2



విలేకరుల సమావేశంలో హైదరాబాద్ పోలీసు కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి

రూ.600 కోట్ల మోసాలు

- దేశవ్యాప్తంగా 983 సైబర్ నేరాలు.. తెలంగాణలోనే 131 కేసులు
- 20 కేసుల్లో రూ.12.50 కోట్లకు టోకరా.. 38.28 లక్షలు స్వాధీనం
- ఖాతాల్లో రూ.2.89 కోట్లు ఫ్రీజ్.. ఇప్పటికే రూ.1.51 కోట్ల రిఫండ్
- దర్యాప్తులో 7 బృందాల పోలీసులు.. ఏకకాలంలో దాడులు 3
- 36 మంది సైబర్ కేటుగాళ్ల అరెస్టు.. నిందితులంతా గుజరాత్ వారే
- హైదరాబాద్‌పై సైబర్ పంజా విలువ ఏటా రూ.1,000 కోట్లు

మహిళా కమిషన్‌కు కేటీఆర్ సారీ!

'మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం'పై వ్యాఖ్యలకు క్షమాపణ.. ఆమోదించిన కమిషన్



కమిషన్ ఆవరణలో కాంగ్రెస్, బీఆర్ఎస్ మహిళా నేతల బాహాబాహీ; (ఇన్‌సెట్) మీడియాతో కేటీఆర్

- పునరావృతం అయితే చర్యలుంటాయని హెచ్చరిక
- అక్కడే కేటీఆర్‌కు రాఖీ కట్టిన కమిషన్ సభ్యులు
- వారంతా బీఆర్ఎస్ హయాంలో నియమితులు..
- వారికి నోటీసులు జారీ చేస్తున్నాం: చైర్‌పర్సన్

హైదరాబాద్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మహిళల ఉచిత బస్సు ప్రయాణంపై కించపరిచేలా వ్యాఖ్యలు చేశారని ఆరోపణలు ఎదుర్కొంటున్న బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ శనివారం రాష్ట్ర మహిళా కమిషన్ ముందు హాజరై వివరణ ఇచ్చారు. తన వ్యాఖ్యలకు విచారం వ్యక్తం చేశారు. ఆయన క్షమాపణలను కమిషన్ ఆమోదించినట్లు చైర్‌పర్సన్ నేరెళ్ల శారద ప్రకటించారు. మహిళలను కించపరిచేలా, అసభ్యకరంగా మరోసారి మాట్లాడొద్దని కేటీఆర్‌కు

మిగతా 14వ పేజీలో...



రెడ్‌కార్నర్ నోటీసుకు

సీబీఐని కోరాం

- నిందితులు ఎవరినీ వదిలిపెట్టం 3
- ఫోన్‌ట్యాపింగ్ కేసుపై హైదరాబాద్ సీపీ

హైడ్రా పేరుతో హైడ్రామా

- అక్రమ నిర్మాణాలకు అనుమతులిచ్చింది కాంగ్రెస్సే
- అధికారులపై చర్యలు తీసుకోవాలి: కిషన్‌రెడ్డి
- ఎన్ కన్వెన్షన్‌పై హైకోర్టు స్టే ఎలా ఇస్తుంది..
- బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు ప్రశ్న 12

ఇండో-బంగ్లా సరిహద్దుల్లో ఉద్రిక్తత

న్యూఢిల్లీ/ఢాకా, ఆగస్టు 24: హసీనా రాజీనామా తర్వాత భారత్-బంగ్లాదేశ్ మధ్య సత్సంబంధాలు క్రమంగా బలహీనపడుతున్నాయి. తాజాగా.. భారత సరిహద్దు భద్రత దళం(బీఎస్ఎఫ్) చేపట్టిన పశువుల కంచెల నిర్మాణాన్ని బంగ్లాదేశ్ బోర్డర్ గార్డ్స్(బీజీబీ) అడ్డుకుంది. ఈ ఘటన గురువారం సాయంత్రం ఉత్తర బెంగాల్‌లోని కుచ్‌బెహార్ సమీపంలో చోటుచేసుకున్నట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతానికి పశువుల కంచె నిర్మాణాన్ని నిలిపివేశామని.. అక్టోబరులో ఢిల్లీలో జరిగే ఉభయ దళాల డైరెక్టర్ జనరల్స్ సమావేశంలో ఈ అంశంపై చర్చిస్తామని పేర్కొన్నారు. సరిహద్దుల్లో పశువుల కంచె నిర్మాణానికి 2012లో ఇరుదేశాల మధ్య ఒప్పందం కుదిరిందన్నారు. మరోవైపు శనివారం ఉదయం పొరపాటున బంగ్లాదేశ్ ప్రాదేశిక జలాల్లోకి ప్రవేశించిన ఐదుగురు పౌరులను తిరిగి అప్పగించడానికి బీజీబీ నిరాకరించింది. ఇదిలా ఉండగా, బంగ్లాదేశ్ సరిహద్దుల్లోని సిల్హెట్ వద్ద భారత్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించిన సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి షంషుద్దీన్ చౌదరి మాణిక్‌ను బీజీబీ అరెస్టు చేసింది.

2026 నాటికి నక్సలిజం అంతం: అమిత్ షా

రాయ్‌పూర్/హైదరాబాద్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్య వ్యవస్థకు నక్సలిజం అతి పెద్ద సవాలని, నక్సలిజంపై అంతిమ దాడికి సమయం ఆసన్నమైందని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అన్నారు. 2026 నాటికి నక్సలిజం అంతమవుతుందని తేల్చిచెప్పారు. శనివారం ఆయన తెలంగాణ, ఏపీ, ఛత్తీస్‌గఢ్ సహా.. ఏడు నక్సల్స్ ప్రభావిత రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు, డీజీపీలు, ఇతర ఉన్నతాధికారులతో ఏర్పాటు చేసిన 'అంతర్రాష్ట్ర సమన్వయ కమిటీ' సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. గడిచిన 4 దశాబ్దాల్లో నక్సలిజం కారణంగా 17వేల మంది ప్రాణాలను కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. 2014లో మోదీ నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పాటయ్యాక.. తాము వామపక్ష తీవ్రవాదాన్ని సవాలుగా తీసుకుని, దానిపై దృష్టి సారించామని గుర్తుచేశారు. ఈ సంవత్సరం ఇప్పటి వరకు 147 మంది నక్సలైట్లు హతమయ్యారని, 723 మంది నక్సల్స్‌ను అరెస్టు చేశామని.. రానున్న మూడేళ్లలో ఛత్తీస్‌గఢ్ నక్సల్స్ రహిత రాష్ట్రంగా మారుతుందని స్పష్టం చేశారు.

'బుల్డోజర్ న్యాయం' సరి కాదు: ప్రియాంక

న్యూఢిల్లీ, ఆగస్టు 24: 'బుల్డోజర్ న్యాయం' ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని, దానిని వెంటనే నిలుపుదల చేయాలని కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ డిమాండ్ చేశారు. హింసాత్మక సంఘటనల్లో పాల్గొన్నారన్న కారణంతో మధ్యప్రదేశ్‌లోని ఛత్తర్‌పూర్ జిల్లాలో ఓ వ్యక్తి ఇంటిని బుల్డోజర్‌తో కూల్చివేయడంపై స్పందిస్తూ ఈ డిమాండ్ చేశారు. "నేరం చేసినట్టు ఎవరిపైనైనా ఆరోపణలు ఉంటే కోర్టు మాత్రమే వారికి శిక్ష విధిస్తుంది. ఆరోపణలు వచ్చీ రాగానే నిందితుడి ఇల్లు కూల్చివేసి, మొత్తం కుటుంబానికి నిలువ లేకుండా చేయడం కోర్టులను ధిక్కరించడం కిందికే వస్తుంది. ఇది అన్యాయం. కిరాతకానికి పరాకాష్ఠ. ప్రభుత్వమే క్రిమినల్స్ మాదిరిగా వ్యవహరించకూడదు" అని వ్యాఖ్యానించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మైనార్టీలే లక్ష్యంగా బుల్డోజర్లను ప్రయోగిస్తుండడంపై కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే కూడా ఆందోళన వ్యక్తం చేశారు.

ప్రధాని మోదీ ఉక్రెయిన్ పర్యటన భేష్..!

న్యూఢిల్లీ, ఆగస్టు 24: ప్రధాని మోదీ ఉక్రెయిన్ పర్యటన, ఆ దేశ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో భేటీపై ప్రపంచ మీడియా సానుకూలంగా స్పందించింది. 'యుద్ధంలో తలపడుతున్న ఇరు దేశాల మధ్య సమతూకంతో మోదీ వ్యవహరించారు' అని న్యూయార్క్ టైమ్స్ పేర్కొంది. 'యుద్ధం విషయంలో భారత్ ఎప్పుడూ తటస్థంగా లేదు. మొదట్నుంచీ మాది శాంతి పక్షమే' అంటూ మోదీ చేసిన వ్యాఖ్యలను బీబీసీ హైలైట్ చేసింది. 'మోదీ పర్యటన చరిత్రాత్మక ఘట్టం..' అంటూ జెలెన్‌స్కీ చేసిన వ్యాఖ్యలను లె మొండే ప్రముఖంగా ప్రచురించింది. 1991లో ఉక్రెయిన్‌కు స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఆ దేశంలో పర్యటించిన తొలి భారత ప్రధాని మోదీయేనని అన్ని వార్తా సంస్థలు వెల్లడించాయి. పరస్పరం పోరాడుకుంటున్న రష్యా-ఉక్రెయిన్ దేశాల మధ్య శాంతిని నెలకొల్పేందుకు మోదీ చొరవ చూపినట్లు పేర్కొన్నాయి. తన పర్యటనల్లో ఇరు దేశాధినేతలు మోదీ ఆలింగనం చేసుకున్న విషయాన్ని ప్రముఖంగా ప్రచురించాయి.

మా అజెండాను అంగీకరిస్తే పొత్తుకు రెడీ: ముఫ్తీ

శ్రీనగర్, ఆగస్టు 24: తమ ఎన్నికల మేనిఫెస్టోకు అంగీకారం తెలిపితే నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్సీ), కాంగ్రెస్‌లతో పొత్తుకు సిద్ధమేనని జమ్మూకశ్మీర్ మాజీ సీఎం, పీపుల్స్ డెమొక్రాటిక్ పార్టీ అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తీ ప్రకటించారు. ఈ విషయాన్ని స్పష్టం చేస్తూ శనివారం ఆమె ఎన్సీ, కాంగ్రెస్‌లకు ఆహ్వానం పంపారు. ప్రస్తుతం ఎన్సీ, కాంగ్రెస్‌ల మధ్య కుదిరిన పొత్తుకు సీట్ల సర్దుబాటే ప్రధాన ప్రాతిపదిక తప్ప, ఎలాంటి ఉమ్మడి అజెండా లేదని అన్నారు. నియంత్రణ రేఖ వద్ద పాకిస్థాన్‌తో వ్యాపారాన్ని పునరుద్ధరించడం, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఉన్న హిందూ పుణ్యక్షేత్రం శారదా పీఠానికి మార్గాన్ని తెరవడం వంటి అంశాలు పీడీపీ అజెండాలో ఉన్నాయి. నియంత్రణ రేఖ వెంబడి గతంలో ఉభయ దేశాల మధ్య వ్యాపారం జరిగేది. అయితే 370 అర్టికల్‌ను రద్దు చేసిన తరువాత 2019 నుంచి పాకిస్థాన్ ఆ వ్యాపారాలను రద్దు చేసింది.

సెలవు కోసం ఢిల్లీలో 5 ఏళ్ల బాలుడి హత్య

న్యూఢిల్లీ, ఆగస్టు 24: ఒక రోజు సెలవు కోసం 5 ఏళ్ల బాలుడిని తోటి విద్యార్థులు కొట్టి చంపారు. ఈ ఘటన ఢిల్లీలోని బ్రిజ్‌పూరి మదర్సాలో శుక్రవారం రాత్రి జరిగింది. బాలుడి హత్య కేసులో ఇద్దరు 9 ఏళ్ల చిన్నారులు, 11 ఏళ్ల బాలుడు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. మదర్సాలో ఓ విద్యార్థి చనిపోయాడని శుక్రవారం రాత్రి 10 గంటల సమయంలో పోలీసులకు సమాచారం వచ్చింది. దర్యాప్తు చేపట్టిన పోలీసులు అదే మదర్సాలోని ముగ్గురు చిన్నారులు హత్య చేసినట్లు గుర్తించారు. నిందితులను పోలీసులు ప్రశ్నించగా.. మమ్మల్ని అసభ్య పదజాలంతో దూషించేవాడని, అతన్ని చంపితే మదర్సాకు ఒక రోజు సెలవు ఇస్తారని అందుకే హత్య చేసినట్లు ఒప్పుకున్నారు.

భారత్‌కు జలాంతర్గామి విధ్వంసక వ్యవస్థ

న్యూఢిల్లీ, ఆగస్టు 24: జలాంతర్గామి విధ్వంసక వ్యవస్థను భారత్‌కు విక్రయించేందుకు అమెరికా విదేశాంగమంత్రి బ్లింకెన్ ఆమోదం తెలిపారు. సుమారు రూ.442 కోట్ల(52.8 మిలియన్ డాలర్లు) విలువైన యాంటీ సబ్‌మెరైన్ వార్‌ఫేర్ సోనోబోయెస్‌ను భారత్‌కు విక్రయించనున్నట్టు వాషింగ్టన్‌లోని డిఫెన్స్ సెక్యూరిటీ కో-ఆపరేషన్ ఏజెన్సీ(డీఎస్‌సీఏ) శనివారం వెల్లడించింది. నాలుగు రోజుల అమెరికా పర్యటనకు వెళ్లిన భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్.. ద్వైపాక్షిక సంబంధాల బలోపేతం కోసం శుక్రవారం పెంటగాన్‌లో అమెరికా రక్షణ మంత్రి లాయిడ్ ఆస్టిన్‌తో చర్చలు జరిపిన అనంతరం ఈ ప్రకటన వెలువడటం విశేషం.

పింఛనుకు కొత్త పథకం

(మొదటి పేజీ తరువాయి)

అవసరం ఉంటుంది. ఉద్యోగులకు ప్రస్తుతం ఉన్న జాతీయ పింఛన్ పథకం(ఎన్‌పీఎస్) నుంచి కొత్త పెన్షన్ స్కీమ్(యూపీఎస్)కు మారేలా అవకాశం కల్పిస్తాం" అని ఆయన వివరించారు. ఇంతకు ముందే ఈ విధానం అమలుకు కసరత్తును ప్రారంభించామని, ఉద్యోగులు పలు అంశాలపై ఆందోళన వ్యక్తం చేస్తే.. ఆ మేరకు మార్పులు చేసి, అమల్లోకి తీసుకువస్తున్నామని చెప్పారు. ఈ అంశంపై అన్ని రాష్ట్రాల్లో 100కి పైగా సమావేశాలు నిర్వహించి, అన్ని వర్గాలతో చర్చలు జరిపామన్నారు. ప్రభుత్వోద్యోగుల శ్రేయస్సు, సురక్షితమైన భవిష్యత్ కోసమే ఈ విధానాన్ని తీసుకువచ్చినట్లు ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. కొత్త పింఛన్ విధానం ఉద్యోగులకు గౌరవం, ఆర్థిక భద్రతను కల్పిస్తాయన్నారు.



కేంద్రప్రభుత్వ ఉద్యోగుల ప్రతినిధులతో ప్రధాని మోదీ

యూపీఎస్‌లో ముఖ్యాంశాలు..

కేంద్ర క్యాబినెట్ ఆమోదించిన ఏకీకృత పింఛన్ పథకం ఉద్యోగులకు పింఛన్ హామీని పెంచుతూ.. గ్రాట్యుటీ, ఇతర ప్రయోజనాలకు భరోసా ఇస్తోంది. ఆ వివరాలు..

- పింఛన్‌కు భరోసా: కనీసం 25 సంవత్సరాలు సర్వీసు పూర్తిచేసుకుని, రిటైర్ అయ్యేవారికి పదవీ విరమణకు ముందు 12 నెలలు తీసుకున్న బేసిక్ పే సగటులో 50% పింఛన్‌గా వస్తుంది.
- కనీసం 10 ఏళ్ల సర్వీసు పూర్తిచేసుకుని, రిటైర్ అయ్యేవారికి అనులోమానుపాతంలో పింఛన్ వస్తుంది. ఇది 25 ఏళ్ల సర్వీసు పూర్తిచేసుకున్న వారితో పోలిస్తే.. తక్కువగా ఉంటుంది. అంటే.. పింఛన్ హామీ కనీసం రూ.10 వేలుగా ఉంటుంది.
- ఉద్యోగి మరణిస్తే.. పింఛన్‌లో 60% ఆయన/ఆమె కుటుంబ సభ్యులకు అందుతుంది.
- అఖిల భారత వినియోగదారుల ధరల సూచీ(ఏఐసీపీఐ-డబ్ల్యూ) ప్రకారం పింఛన్/కుటుంబ పింఛన్‌దారులకు కరువు ఉపశమనం లభిస్తుంది.
- రిటైర్ అయ్యాక.. గ్రాట్యుటీతోపాటు సత్వరం అదనపు లబ్ధి ఉంటుంది. దీన్ని సర్వీసులో ప్రతి ఆర్నెల్ల ప్రాతిపదికన లెక్కగడతారు. అంటే.. సర్వీసులో ఉండగా.. ప్రతి ఆర్నెల్లకు ఒక నెల జీతం+కరువు భత్యంలో పదో వంతు చొప్పున లెక్క కట్టి.. రిటైర్ అయిన వెంటనే ఆ మొత్తం ఇస్తారు. ఇది గ్రాట్యుటీకి అదనం.

బయో-ఈ-3 విధానంతో ప్రగతి

బయో ఉత్పాదక రంగాన్ని ప్రోత్సహించేలా బయోఈ-3 (బయోటెక్నాలజీ ఫర్ ఎకానమి, ఎన్విరాన్‌మెంట్, ఎంప్లాయ్‌మెంట్) విధానానికి కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. బయో రంగంలో పరిశోధనలు, అభివృద్ధి, వ్యవస్థాపకతకు ఈ విధానం దోహదపడుతుందని అశ్వినీవైష్ణవ్ వివరించారు. పారిశ్రామిక, ఐటీ విప్లవాల మాదిరిగా త్వరలో బయో విప్లవం రాబోతోందని ఆయన అభిప్రాయపడ్డారు. దీనివల్ల బయోటెక్నాలజీ, బయోసైన్స్ రంగాల్లో భారీగా ఉపాధి అవకాశాలున్నాయన్నారు. బయో కృత్రిమ మేధ(ఏఐ) హబ్‌లు, బయో ఉత్పాదక కేంద్రాలు, బయోఫౌండ్రీల ఏర్పాటుకు ఈ విధానం దోహదపడుతూ.. బయో రంగం వాణిజ్యీకరణకు వేగంగా అడుగులు పడతాయన్నారు. గ్రీన్ గ్రోత్ ద్వారా బయో ఎకానమి నమూనాలకు ప్రాధాన్యత లభిస్తుందని, ఈ విధానంతో భారతదేశ నైపుణ్య శ్రామికశక్తి విస్తరణను సులభతరం చేయడమే కాకుండా.. ఉద్యోగాల సృష్టికి దోహదపడుతుందని వివరించారు. "నెట్ జీరో కార్బన్ ఎకానమి, లైఫ్‌స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ వంటి ప్రభుత్వ కార్యక్రమాలను ఈ విధానం మరింత బలోపేతం చేస్తుంది. బయోఈ-3 విధానం ప్రపంచ సవాళ్లను ఎదుర్కొంటూ.. మరింత స్థిరమైన, వినూత్నమైన భవిష్యత్తుకు మార్గాన్ని సుగమం చేస్తుంది. వికసిత్ భారత్ కోసం బయో-విజన్‌ను నిర్దేశిస్తుంది. వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గిస్తుంది. ఆహార భద్రత, మానవ ఆరోగ్యానికి సంబంధించిన క్లిష్టమైన సామాజిక సమస్యలకు పరిష్కారంగా ఈ విధానం ఉంటుంది. పారిశ్రామికీకరణలో పెట్టుబడులకు ఉపకరిస్తుంది" అని అశ్వినీవైష్ణవ్ వ్యాఖ్యానించారు.

విజ్ఞాన్ ధార పథకం

శాస్త్ర సాంకేతిక రంగాల్లో పరిశోధనాభివృద్ధి, ఆవిష్కరణలు, సాంకేతికాభివృద్ధి వంటి పథకాలను(మూడు గొడుగుల పథకాలు) 'విజ్ఞాన్ ధార' పేరుతో ఏకీకృత పథకంగా అమలు చేయాలని క్యాబినెట్ నిర్ణయించినట్లు అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. సంబంధిత విభాగాలన్నింటినీ ఒకే గొడుగు కిందకి తీసుకురావడం వల్ల.. సమర్థంగా నిధుల వినియోగం, ఉప పథకాలు/కార్యక్రమాల మధ్య సమన్వయం సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు. ఈ మూడు పథకాలకు 15 ఆర్థిక సంఘం(2021-22 నుంచి 2025-26 వరకు) రూ.10,579 కోట్లను ఖర్చు చేయాలని నిర్దేశించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు.

బీమా సొమ్ము కోసం చనిపోయినట్టుగా నాటకం

- మృతదేహం కోసం యాచకుడి హత్య
- కర్ణాటకలో దంపతుల అరెస్టు

బెంగళూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): జీవిత బీమా సొమ్ము పొందేందుకు రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్టు నమ్మించారు. అందుకు అవసరమైన మృతదేహం కోసం ఓ యాచకుడిని హత్య చేశారు. కర్ణాటకలోని హాసన్ జిల్లాలో జరిగిన ఈ ఘటన శనివారం వెలుగు చూసింది. బెంగళూరు గ్రామీణ జిల్లా చిక్కకోలిగ గ్రామానికి చెందిన మునిస్వామిగౌడతో పాటు, అతని భార్య శిల్పారాణిని అరెస్టు చేశామని పోలీసులు తెలిపారు. ఈ నెల 13న గండసి సమీపంలోని గొల్లరహొసహళ్లి గేట్ సమీపాన ఓ ప్రమాదం జరిగింది. కారు టైరు మారుస్తున్న వ్యక్తిపై లారీ దూసుకెళ్లడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్టు కేసు నమోదైంది. మృతదేహాన్ని హాసన్ జిల్లా ఆసుపత్రిలో ఉంచారు. తర్వాత మునిస్వామిగౌడ భార్య శిల్ప ఆసుపత్రికి వెళ్లి.. అది తన భర్త మృతదేహమే అని నమ్మబలికింది. మృతదేహాన్ని తీసుకెళ్లి అంత్యక్రియలు నిర్వహించింది. అయితే, మృతదేహం గొంతుపై గాయం ఉండటంతో పోలీసులు అనుమానంతో దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలోనే తన బంధువు, శిడ్లఘట్ట సీఐ శ్రీనివాస్‌కు అనుకోకుండా మునిస్వామి ఎదురుపడ్డాడు. చనిపోయిన వ్యక్తి ఎదురుగా కనిపించడంతో సీఐ షాక్‌కు గురయ్యారు. ఎలా బతికావని అడిగితే.. తాను చనిపోలేదని, బీమా సొమ్ముకోసం నాటకం ఆడానని అసలు విషయం చెప్పాడు. దీంతో మునిస్వామిని సీఐ శ్రీనివాస్ అదుపులోకి తీసుకుని.. గండసి పోలీసులకు అప్పగించారు. పోలీసుల విచారణలో మునిస్వామి అసలు విషయం చెప్పాడు. అప్పుల నుంచి బయటపడేందుకు చనిపోయినట్టు నటించాలని దంపతులిద్దరూ పథకం వేశారు. మృతదేహం కోసం ఒక యాచకుడిని ఎంచుకున్నారు. అతడిని నమ్మించి మునిస్వామి కారులో తీసుకెళ్లాడు. గొల్లరహొసహళ్లి గేట్ సమీపాన కారు టైరు మార్చాలని యాచకుడికి సూచించాడు. అతను ఆ పనిలో ఉండగా.. పథకం ప్రకారం గొంతుకు తాడు బిగించి చంపేశాడు. ఆ తరువాత తాను ఏర్పాటు చేసుకున్న లారీని యాచకుడి మీదుగా పోనిచ్చాడు. మృతదేహాన్ని గుర్తుపట్టలేకుండా మార్చి.. రోడ్డు ప్రమాదంలో తానే మృతి చెందినట్టు నమ్మించాడు.



విధానాల రూపకల్పనకు కులగణనే పునాది

- మిస్ ఇండియా పోటీల్లో పాల్గొనేవాళ్ల జాబితాలో దళితులకు చోటేది: రాహుల్

ప్రయాగ్‌రాజ్, ఆగస్టు 24: దేశ వ్యాప్తంగా కులాల వారీగా జనాభా లెక్కల సేకరణ జరగాలని విపక్షనేత, కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ శనివారం మరోసారి డిమాండ్ చేశారు. కులగణన అంటే కేవలం ఆయా వర్గాల జనాభా వివరాలను సేకరించడం మాత్రమే కాదని, అంతకుమించి విధానపర నిర్ణయాలు తీసుకోవడానికి వేసే పునాదిలాంటిదని చెప్పారు. 90% జనాభా ఇంకా దేశంలోని ప్రధాన వ్యవస్థలతో అనుసంధానం కాలేకపోయారని, అలాంటి వారి స్థితిగతులు తెలుసుకోవాలంటే కులగణన జరపాల్సిందేనని చెప్పారు. చాలా మందికి పాలనా యంత్రాంగం, న్యాయ వ్యవస్థ, మీడియా రంగాల్లో చోటు దక్కడం లేదని అన్నారు. వారికి నైపుణ్యం, విజ్ఞానం ఉన్నా వ్యవస్థల్లో భాగస్వామ్యం కాలేకుండా దూరంగా ఉంటున్నారని, అలాంటి వారి అభివృద్ధి కోసమే కులాల లెక్కలు కావాలని డిమాండు చేస్తున్నామని చెప్పారు. మిస్ ఇండియా పోటీల్లో పాల్గొనేవారి జాబితాలో దళితులు, ఆదివాసీలు, ఓబీసీల్లో ఎవ్వరికీ చోటు కల్పించకపోవడాన్ని ఆయన ప్రశ్నించారు. శనివారం ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన సంవిధాన్ సమ్మాన్ సమ్మేళన్‌లో ప్రసంగిస్తూ కులగణన ఆవశ్యకతను రాహుల్ వివరించారు. "కులాల లెక్కలు లేకుండా వాస్తవ రూప ప్రణాళికలను రూపొందించలేం. విధానాల రూపకల్పనకు రాజ్యాంగం ఓ గైడ్‌గా ఉపయోగపడుతోంది. సామాజిక-ఆర్థిక వివరాలను వెల్లడించే కులగణన రెండో గైడ్‌గా పనికొస్తుంది. కుల గణన ద్వారా రాజ్యాంగాన్ని కాపాడాలన్నదే మా ప్రయత్నం. రాజ్యాంగాన్ని పేదలు, కూలీలు, గిరిజనులే కాపాడుతున్నారు....(అదానీలు కాదు)...అయితే ఆ 90 శాతం మందికి భాగస్వామ్య హక్కులు లేకపోతే రాజ్యాంగానికి రక్షణ ఉండదు" అని వ్యాఖ్యానించారు. దేశ ప్రజలు కులగణనకు అనుకూలంగా ఉన్నారని, ప్రధాని దీన్ని అమలు చేయకతప్పదని అన్నారు. ఒకవేళ అమలు చేయకపోతే మరొకరు ప్రధాని అవుతారని వ్యాఖ్యానించారు. తర్వాత ఆయన ట్వీట్ చేస్తూ సమాజాన్ని ఎక్స్‌రే తీయడానికి కులగణన ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రభుత్వ వ్యవస్థల్లో ఏ వర్గాలకు ఎంత భాగస్వామ్యం ఉందన్న డాటాను తెలుసుకోవచ్చని చెప్పారు.

రూమీ-1 ప్రయోగం విజయవంతం

నింగిలోకి భారత్ తొలి పునర్వినియోగ హైబ్రిడ్ రాకెట్



న్యూఢిల్లీ, ఆగస్టు 24: అంతరిక్ష పరిశోధనా రంగంలో భారత్ మరో మైలురాయిని చేరుకుంది. చెన్నైలోని తిరవిందాండై తీరం నుంచి తన మొట్టమొదటి పునర్వినియోగ హైబ్రిడ్ రాకెట్ రూమీ-1 (ఆర్‌హెచ్‌యూఎంఐ-1)ను శనివారం ఉదయం విజయవంతంగా ప్రయోగించింది. తమిళనాడుకు చెందిన స్టార్టప్ స్పేస్ జోన్ ఇండియా, మార్టిన్ గ్రూప్ కలసి దీనిని అభివృద్ధి చేశాయి. మొబైల్ లాంచర్ ద్వారా ప్రయోగించిన ఈ రాకెట్ 3 క్యూబ్ ఉపగ్రహాలు, 50 పికో ఉపగ్రహాలను మోసుకెళ్లి భూ ఉపకక్ష్యలోకి ప్రవేశపెట్టింది. ప్రయోగం తర్వాత రాకెట్ శకలాలు తిరిగి భూమికి చేరేలా పారాచూట్లను అమర్చారు. వీటిని సేకరించి మరో రాకెట్ ప్రయోగంలో వాడతారు. స్పేస్ జోన్ ఇండియా వ్యవస్థాపకుడు అనంద్ నేతృత్వంలో ఈ మిషన్ జరిగింది.

కామికేజ్ డ్రోన్లు తయారు చేద్దాం రండి!

న్యూఢిల్లీ, ఆగస్టు 24: సైనిక అవసరాల కోసం వినియోగించే అత్యాధునిక కామికేజ్ డ్రోన్ల తయారీ, అభివృద్ధి చేసేందుకు నేషనల్ ఏరోస్పేస్ లాబొరేటరీస్(ఎన్ఏఎల్).. రిక్వస్ట్ ఫర్ ప్రపోజల్(ఆర్ఎఫ్‌పీ)ను ఆహ్వానించింది. కామికేజ్ డ్రోన్లను వాణిజ్య పరంగా కూడా అభివృద్ధి చేయనున్నట్టు తెలిపింది. అత్యాధునిక మందుగుండు సామగ్రిని మోసుకువెళ్లే మానవ రహిత వైమానిక వాహనాల(కామికేజ్ డ్రోన్లు)ను ఉమ్మడిగా అభివృద్ధి చేయాలని నిర్ణయించినట్టు పేర్కొంది. ప్రస్తుతం పలు దేశాలు కామికేజ్ డ్రోన్లను వినియోగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో 15 కిలోల వార్‌హెడ్‌లు సహా 10-15 కిలోల పేలోడ్స్‌ను మోసుకు వెళ్లే డ్రోన్లను అభివృద్ధి చేయాలని ఎన్ఏఎల్ నిర్ణయించింది. ఈ డ్రోన్లు 6-9 గంటలపాటు నిర్విరామంగా పనిచేయడంతోపాటు, 900 కిలోమీటర్ల రేంజ్‌లో సంచరిస్తాయి.

నన్ను ఇరికించారు

జూనియర్ వైద్యురాలిపై హత్యాచారం కేసులో నాలుక మడతేసిన ప్రధాన నిందితుడు సంజయ్

- కలకత్తా హైకోర్టులో మెజిస్ట్రేట్ ఎదుట కన్నీరు



న్యూఢిల్లీ/పుణె ఆగస్టు 24: జూనియర్ వైద్యురాలిపై ఘోర అత్యాచారం ఘటనకు సంబంధించి నేరం చేసింది తానేనని ఒప్పుకొని.. ఎలాంటి పశ్చాత్తాపం లేకుండా 'కావాలంటే నన్ను ఉరి తీసుకోండి' (అమీ ఫాసీ దీయే దీ) అని పోలీసుల విచారణలో చెప్పిన ప్రధాన నిందితుడు సంజయ్ రాయ్ ఇప్పుడు మాటమార్చేశాడు. తనకు ఏ పాపం తెలియదని.. తాను అమాయకుడినని, తనకు కేసులో ఇరికించారని కోర్టులో న్యాయమూర్తి ఎదుట కన్నీరు పెట్టుకున్నట్లు తెలిసింది. హత్యాచార ఘటన జరిగిన మరుసటి రోజు అంటే ఆగస్టు 10వ తేదీ నుంచి కస్టడీలో ఉన్న సంజయ్ రాయ్‌ను కేసు విచారణలో భాగంగా శుక్రవారం కోర్టులో ప్రవేశపెట్టినప్పుడు అతడు సంచలన ఆరోపణలు చేసినట్లు తెలిసింది. విచారణ సందర్భంగా... లైడిటెక్టర్ (పాలిగ్రఫీ) పరీక్షకు సమ్మతించడంపై న్యాయమూర్తి ప్రశ్నించడంతో సంజయ్ రాయ్ భావోద్వేగానికి గురయ్యాడు. "నేను ఎలాంటి నేరమూ చేయలేదు. ఈ కేసులో నన్ను ఇరికించారు. బహుశా ఈ పరీక్ష (లైడిటెక్టర్ టెస్ట్)తో నేను తప్పు చేయలేదనే విషయం రుజువవ్వొచ్చు" అంటూ సంజయ్ రాయ్ కన్నీరు పెట్టుకున్నట్లు సమాచారం. మరోవైపు.. ఆర్జీకర్ వైద్యకళాశాల, ఆస్పత్రి మాజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్ మరింత చిక్కుల్లో పడ్డారు. కాలేజీలో దారుణ అత్యాచారం, హత్యకు గురైన స్థితిలో జూనియర్ వైద్యురాలి మృతదేహం లభించడంతో ఇప్పటికే విచారణను ఎదుర్కొంటున్న ఆయనపై సీబీఐ, ఆర్జీకర్‌లో ఆర్థిక అవకతవకలకు సంబంధించి కేసు నమోదు చేసింది. కలకత్తా హైకోర్టు ఆదేశాల మేరకు ఆగస్టు 13న కేసు సిట్ నుంచి సీబీఐ చేతుల్లోకి వెళ్లింది. ఈ క్రమంలో ఆర్జీకర్‌లో ఘోష్ హయాంలో ఆర్థిక అవకతవకలు జరిగాయని, ఈడీతో విచారణ జరిపించాలంటూ కాలేజీ మాజీ డెప్యూటీ సూపరింటెండెంట్ అక్తర్ అలీ కలకత్తా హైకోర్టులో పిటిషన్ వేశారు. హైకోర్టు సూచనల మేరకు ఘోష్‌పై సీబీఐ కేసు నమోదు చేసింది. హత్యాచార ఘటనకు సంబంధించి ఆయన్ను సీబీఐ ఇప్పటికే 88 గంటలపాటు ప్రశ్నించింది.

పుణెలో బాలికపై లైంగిక వేధింపులు

మహారాష్ట్ర పుణెలోని ఓ పాఠశాలలో 12 ఏళ్ల బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన కేసులో ఓ వ్యాయామ ఉపాధ్యాయుడు సహా ఎనిమిది మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పుణె పింప్రీ చించ్‌వాడ్ ప్రాంతంలోని ఓ ప్రైవేట్ బడిలో చదువుతున్న 12 ఏళ్ల బాలికను అక్కడ పనిచేసే వ్యాయామ ఉపాధ్యాయుడు రెండేళ్లుగా లైంగికంగా వేధిస్తున్నాడు. మరోవైపు అసోంలో పదో తరగతి బాలికపై ముగ్గురు మృగాళ్లు అత్యాచారానికి పాల్పడిన కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ప్రధాన నిందితుడు తఫ్జల్ ఇస్లాంను పోలీసులు శనివారం దర్యాప్తులో భాగంగా ఘటనా స్థలికి తీసుకెళ్లారు. అక్కడ అతడు ప్రాణభయంతో తప్పించుకునే ప్రయత్నంలో చెరువులో దూకి మృతి చెందాడు.

ఆరుగురికి పాలిగ్రఫీ టెస్ట్ పూర్తి

కలకత్తా హైకోర్టు అనుమతి మేరకు శనివారం సాయంత్రం ప్రధాన నిందితుడు సంజయ్ రాయ్‌కి సీబీఐ లైడిటెక్టర్ (పాలిగ్రఫీ) పరీక్ష నిర్వహించింది. ఇదేరోజు మాజీ ప్రిన్సిపల్ ఘోష్, మరో నలుగురికి కూడా లైడిటెక్టర్ పరీక్షను నిర్వహించారు. హత్యాచార ఘటనకు సంబంధించి సుప్రీంకోర్టుకు సెప్టెంబరు 17న సీబీఐ నివేదిక సమర్పించాల్సి ఉంది.

ఇంటికి 'ఐరన్ డోమ్'!

దోమల్ని చంపే వినూత్న చైనా యంత్రం.. ఎక్స్‌లో షేర్ చేసిన ఆనంద్ మహీంద్రా

ముంబై, ఆగస్టు 24: దోమల బాధ భరించలేక రకరకాల పరిష్కారాలు వెతుకుతుంటాం. మార్కెట్లో మస్కిటో కాయిల్స్ నుంచి దోమల బ్యాట్‌లు, ఆల్‌ఔట్‌లు, జెట్‌లు వరకు బోలెడన్ని ఉపకరణాలు వచ్చేశాయి. దోమల మీద కొన్ని వేల కోట్ల రూపాయల పరిశ్రమ నడుస్తోంది. అయినా ఈ సమస్య నిర్మూలన కావటం లేదు సరికదా.. ఎప్పటికప్పుడు డెంగీ, మలేరియా లాంటివి విజృంభిస్తూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రముఖ వ్యాపారవేత్త ఆనంద్ మహీంద్రా ఎక్స్ వేదికగా షేర్ చేసిన ఓ వీడియో అందరినీ ఆకర్షిస్తోంది. చైనాకు చెందిన ఓ వ్యక్తి, దోమల్ని చంపే బుజ్జి యంత్రాన్ని తయారు చేశాడని పేర్కొంటూ ఆ మెషిన్ వీడియోను ఆనంద్ మహీంద్ర షేర్ చేశారు. 'ముంబైలో డెంగీ పెరుగుతున్న ప్రస్తుత సమయంలో.. ఈ సూక్ష్మ ఆయుధాన్ని ఎలా సంపాదించాలా అని ఆలోచిస్తున్నా. ఇది దోమల్ని వెదికి మరీ చంపుతుంది. మీ ఇంటికి ఐరన్ డోమ్ (ఉక్కు తెర)లాగా రక్షణ కల్పిస్తుంది' అని కామెంట్ పెట్టారు. సదరు మెషిన్ చంపిన దోమల్ని ప్రదర్శిస్తున్న దృశ్యాలు కూడా ఈ వీడియోలో ఉన్నాయి. యుద్ధట్యాంకును పోలి ఉండే ఈ బుజ్జి యంత్రంలో ఓ రాడార్ ఉంటుంది. దోమలు ఎక్కడున్నాయో గుర్తించి రాడార్ ఆ సమాచారాన్ని యంత్రానికి అందిస్తుంది. దాని లోంచి లేజర్ కిరణాలు వెలువడి దోమల్ని చంపుతాయి. శత్రుదేశాల రాకెట్, క్షిపణి దాడులను తిప్పికొట్టే ఇజ్రాయెల్ ఐరన్ డోమ్ అంతర్జాతీయంగా పేరొందిన విషయం తెలిసిందే.



కుర్స్క్‌లో ఉక్రెయిన్ విజయానికి కారణం 'అదృశ్య' దుస్తులే!

పశ్చిమదేశాలు ఇచ్చాయని రష్యా ఆరోపణ



మాస్కో, ఆగస్టు 24: కుర్స్క్ ప్రాంతంలోకి చొచ్చుకురావడంలో ఉక్రెయిన్ బలగాలు విజయం సాధించడం వెనుక 'అదృశ్య దుస్తుల' పాత్ర ఉందని రష్యా ఆరోపించింది. పశ్చిమదేశాలు ఉక్రెయిన్ దళాలకు ఈ ప్రత్యేక యూనిఫామ్‌ను అందించాయని, వాటిని ధరించడం వల్ల ఉక్రెయిన్ సైనికులు పగలూ, రాత్రీ కూడా శత్రువులకు కనిపించలేదంటూ రూపొందించిన నివేదిక రష్యా మిలిటరీ పోర్టల్‌లో దర్శనమిస్తోంది. ఆ ఘటన వెనుక అంతర్జాతీయ కుట్ర ఉందని రష్యా ఆరోపిస్తోంది. అయితే, ఈ వాదనలను అంతర్జాతీయ మీడియా తోసిపుచ్చింది. కుర్స్క్ ప్రాంతంలోకి గణనీయంగా వచ్చిన మిలిటరీ సామగ్రి కదలికలు కనిపించకుండా చేయడం అసాధ్యమని రష్యా విమర్శకులు పేర్కొంటున్నారు. కాగా, అమెరికా ప్రైవేటు మిలిటరీ కంపెనీల భాగస్వామ్యం వల్లే ఉక్రెయిన్ ఆ ఆకస్మిక విజయం సాధించిందని అంతకుముందు రష్యా విదేశాంగ మంత్రిత్వశాఖ ఆరోపించింది. దాంతోపాటు అమెరికా జర్నలిస్టులు అక్రమంగా రష్యా భూభాగంలోకి వస్తున్నారని ఆరోపించింది.

అదృశ్య వస్త్రం అంటే..?

'అదృశ్య సైనికులు' అనేది రియల్‌ఎం సైన్స్ ఫిక్షన్ అయినప్పటికీ.. కనిపించకుండా చేసే అధునాతన పరిజ్ఞానం కోసం మిలిటరీ పరిశ్రమ కొంతకాలం నుంచి ప్రయత్నిస్తోంది. సైనిక పరికరాలు శత్రువులకు కనిపించకుండా చేయడమే దీని లక్ష్యం. వస్తువులపై పడకుండా కాంతిని వక్రీభవనం చెందించడం ద్వారా విజిబిలిటీని తగ్గించే పదార్థాల తయారీకి ప్రయత్నిస్తున్నారు. అల్ట్రావైలెట్, ఇన్‌ఫ్రారెడ్, షార్ట్‌వేవ్ కాంతిని పరావర్తనం చెందించకపోవడం వల్ల వస్తువులను కనిపించకుండా చేస్తారు. ఉక్రెయిన్ డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ మంత్రి మైఖేలో ఫెడొరోవ్ గతేడాది చివర్లోనే వస్తువులను కనిపించకుండా చేసే రియల్ వరల్డ్ అప్లికేషన్ అనే అధునాతన సాంకేతికతను 'టెలిగ్రామ్'లో ప్రస్తావించారు. రష్యా థర్మల్ ఇమేజింగ్ కంటపడకుండా ప్రత్యేకించి డ్రోన్ల కంటపడకుండా ఉక్రెయిన్ సైనికుల కోసం రూపొందించిన అదృశ్య వస్త్రాన్ని ఆయన అందులో ప్రదర్శించారు. రష్యా జనవరిలో 'అదృశ్య సూట్'ను ఆవిష్కరించినట్లు వార్తా సంస్థ 'టాస్' పేర్కొంది.

ధనిక గ్రామం

ఆ ఊరి ప్రజల పేరు మీద రూ.7వేల కోట్ల ఫిక్స్‌డ్ డిపాజిట్లు

- ఆసియాలోనే అత్యంత ధనిక గ్రామంగా గుజరాత్‌లోని మాదాపూర్

న్యూఢిల్లీ, ఆగస్టు 24: పల్లెటూరంటే అందరికీ మట్టి రోడ్లు, పంట పొలాలు, పూరి గుడిసెలు, పేద ప్రజలు గుర్తుకు వస్తారు. కానీ, గుజరాత్‌లోని భుజ్ జిల్లాలో ఉన్న మాదాపూర్ గ్రామం అలా కాదు. ఆ ఊరి ప్రజల పేరు మీద బ్యాంకుల్లో రూ.7వేల కోట్ల ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఉన్నాయి. అందుకే అది ఆసియా ఖండంలోనే అత్యంత ధనిక గ్రామంగా రికార్డులకెక్కింది. ఈ ఒక్క ఊర్లోనే 17 బ్యాంకులు ఉన్నాయి. మాదాపూర్ గ్రామ జనాభా 32వేలకు పైనే. కానీ, వీరిలో సగం కంటే ఎక్కువ(65%) మంది ఉద్యోగాలు, వ్యాపారాల నిమిత్తం విదేశాల్లోనే ఉన్నారు. అక్కడ పని చేస్తూ.. ఆ డబ్బును గ్రామంలో ఉన్న తమ కుటుంబసభ్యుల కోసం స్థానిక బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నారు.

ఆఫ్రికన్ చీతాలకు స్వేచ్ఛ.. ఏడాది తర్వాత అడవుల్లోకి

న్యూఢిల్లీ, ఆగస్టు 24: ఆఫ్రికా నుంచి భారత్‌కు తీసుకువచ్చిన చీతాలకు ఏడాది తర్వాత ఎన్‌క్లోజర్ల నుంచి విముక్తి లభించనుంది. మధ్యప్రదేశ్‌లోని కునో జాతీయ పార్కు నుంచి ఏడాది క్రితం వీటిని ఎన్‌క్లోజర్లలోకి పంపించారు. కేంద్రం ఏర్పాటు చేసిన ప్రాజెక్టు చీతా స్టీరింగ్ కమిటీ శుక్రవారం వాటిని తిరిగి అడవుల్లోకి వదిలి పెట్టాలని నిర్ణయించినట్లు అధికారులు తెలిపారు. చీతాలను, భారత్‌లో వాటికి పుట్టిన పిల్లలను రుతుపవనాల విరమణ తర్వాత దశలవారీగా అడవిలోకి వదిలి పెట్టనున్నట్లు చెప్పారు. అక్టోబరు మొదటి వారంలో మధ్యప్రదేశ్ నుంచి రుతుపవనాలు తిరుగుముఖం పడతాయని భారత వాతావరణ శాఖ అంచనా. అయితే పిల్ల చీతాలను, వాటి తల్లులను మాత్రం డిసెంబరు నెల తర్వాత వదిలి పెట్టనున్నట్లు ఒక అధికారి చెప్పారు. ప్రస్తుతం ఎన్‌క్లోజర్లలో ఉన్న 13 పెద్ద చీతాలు, 12 పిల్ల చీతాలు ఆరోగ్యంగానే ఉన్నాయని తెలిపారు. ప్రాజెక్టు చీతాలో భాగంగానమీబియా నుంచి 2022 సెప్టెంబరులో 8 చీతాలను, ద్క్షిణాఫ్రికా నుంచి మరో 12 చీతాలను తీసుకువచ్చారు.

స్టాక్‌మార్కెట్‌లో నష్టాలతో అప్పులపాలై యువకుడి ఆత్మహత్య

లోన్ యాప్ నిర్వాహకుల వేధింపులు తాళలేక బలవన్మరణం


శ్రీకాంత్(ఫైల్)

శ్రీరాంపూర్, ఆగస్టు 24 : తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించి ఉన్నతమైన జీవితం గడపాలని ఆశించిన ఓ యువకుడు అప్పులు చేసి స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టి నష్టపోయాడు. చివరికి చేసిన అప్పులు తీర్చలేక, లోన్‌యాప్ నిర్వాహకుల వేధింపులు తాళలేక బలవన్మరణానికి పాల్పడ్డాడు. మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్‌లోని అరుణక్కనగర్‌కు చెందిన శ్రీకాంత్ (29) శుక్రవారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకుని చనిపోయాడు. దానికంటే ముందు తన ఆత్మహత్యకు కారణం చెబుతూ సెల్ఫీ వీడియో తీసుకున్నాడు. అరుణక్కనగర్‌కు చెందిన నామ్తాబాజీ రాములు పెద్ద కుమారుడు శ్రీకాంత్‌కు భార్య శృతి, 8నెలల కుమారుడు ఉన్నారు. మంచిర్యాలలో సెల్ పాయింట్ నిర్వహించే శ్రీకాంత్ కుటుంబసభ్యులకు తెలియకుండా ఏడాదిగా స్టాక్ మార్కెట్‌లో ట్రేడింగ్ చేస్తున్నాడు. తెలిసిన వారు, బంధువుల వద్ద నుంచి రూ.5 లక్షలు, వేర్వేరు లోన్ యాప్‌ల ద్వారా మరో రూ.2లక్షలు అప్పు తెచ్చి షేర్ మార్కెట్‌లో పెట్టి నష్టపోయాడు. లోన్‌యాప్‌లకు క్రమం తప్పకుండా వాయిదా(ఈఎంఐ)లు చెల్లించిన శ్రీకాంత్ ఆగస్టు నెలకు సంబంధించిన చెల్లింపులు చేయలేకపోయాడు. దీంతో ఆయా యాప్‌ల నిర్వాహకులు వేధింపులకు దిగగా వాటిని తట్టుకోలేక తీవ్ర నిర్ణయం తీసుకున్నాడు. అప్పుల వాళ్లు తన కుటుంబసభ్యులను ఇబ్బంది పెట్టవద్దని వేడుకున్న శ్రీకాంత్ తాను అద్దెకు ఉంటున్న ఇంట్లోనే ఉరి వేసుకున్నాడు. శ్రీకాంత్ భార్య శృతి పుట్టింటిలో ఉండగా ఆమె చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఫోన్‌ట్యాపింగ్ కేసు.. రెడ్‌కార్నర్ నోటీసుకు సీబీఐని కోరాం

నిందితులను ఎవరినీ వదిలపెట్టం: హైదరాబాద్ సీపీ కొత్తకోట

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితులు ఎవరినీ వదిలిపెట్టబోమని హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రధాన నిందితులు– ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు, శ్రవణ్‌రావుల అరెస్టుకు రెడ్‌కార్నర్ నోటీసులు జారీ చేయాలని సీబీఐ డైరెక్టర్‌ను కోరామన్నారు. శనివారం సీసీఎస్‌లో ఓ మీడియాతో ఆయన మాట్లాడారు. "సీబీఐ ప్రస్తుతం బ్లూకార్నర్ నోటీసు జారీ చేయాలనుకుంది. దాని వల్ల నిందితులు ఎక్కడున్నారనే వివరాలు తెలుస్తాయి. అయితే.. బ్లూకార్నర్ నోటీసు ద్వారా నిందితులను అరెస్టు చేయడం కుదరదు. దాంతో రెడ్‌కార్నర్ నోటీసులు జారీ చేయాలని సీబీఐకి విజ్ఞప్తి చేశాం" అని సీపీ వివరించారు. రెడ్‌కార్నర్ నోటీసు జారీ అయితే.. నిందితులను అరెస్టు చేసి, భారత్‌కు తీసుకువస్తామన్నారు. న్యాయపరమైన సమస్యలను అధిగమిస్తూ.. దర్యాప్తును కొనసాగిస్తున్నామని వెల్లడించారు. కాగా.. ఈ కేసులో మాజీ అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్న, మాజీ డీఎస్పీ ప్రణీత్‌కుమార్, టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ(ఓఎస్డీ) రాధాకిషన్‌రావు అరెస్టయిన విషయం తెలిసిందే. హృద్రోగ రుగ్మతలతో బాధపడుతున్న భుజంగరావుకు చికిత్స నిమిత్తం ఇటీవలే కోర్టు మధ్యంతర బెయిల్ లభించింది. మిగతా ముగ్గురు చంచల్‌గూడ జైలులోనే ఉన్నారు. వీరి విచారణ సమయంలో పలువురు రాజకీయ నేతల పేర్లు వెలుగులోకి రావడంతో వారికి నోటీసులు ఇచ్చి, విచారించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.

రూ.600 కోట్ల మోసాలు

- దేశవ్యాప్తంగా 983 సైబర్ నేరాలు.. తెలంగాణలోనే 131 కేసులు
- 36 మంది సైబర్ కేటుగాళ్ల అరెస్టు.. నిందితులంతా గుజరాత్ వారే
- హైదరాబాద్ సీపీ శ్రీనివాస్‌రెడ్డి



హైదరాబాద్ సిటీ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): గుజరాత్ అడ్డాగా సైబర్ నేరాలకు పాల్పడుతున్న కేటుగాళ్ల ఆటను హైదరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులు కట్టించారు. ఏడు బృందాలుగా విడిపోయిన పోలీసులు.. 36 మంది సైబర్ నేరగాళ్లను అరెస్టు చేశారు. వీరంతా దేశవ్యాప్తంగా 983 సైబర్ నేరాలకు పాల్పడి.. రూ.600 కోట్లు కొల్లగొట్టారని పోలీసులు అంచనా వేస్తున్నారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీసీఎస్ డీసీపీ శ్వేతతో కలిసి.. నగర పోలీసు కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి వివరాలను వెల్లడించారు. ట్రేడింగ్‌లో 500% లాభాల పేరుతో రాంకోఠికి చెందిన ఓ వ్యాపారి వద్ద సైబర్ నేరగాళ్లు రూ.2 కోట్లు కొట్టేశారు. ఇదే నేరశైలితో ఓ రిటైర్డ్ ఉద్యోగిని నమ్మించి, రూ.60.88 లక్షలు దోచుకున్నారు. తమను తాము ముంబై క్రైమ్ బ్రాంచ్ పోలీసులుగా పరిచయం చేసుకున్న కేటుగాళ్లు.. మీ పేరుతో ఉన్న పార్సిల్‌లో డ్రగ్స్ ఉన్నాయంటూ బెదిరించి, సికింద్రాబాద్‌కు చెందిన 74 ఏళ్ల వయసున్న ఓ డాక్టర్ వద్ద రూ.1.60 కోట్లను కొల్లగొట్టారు. ఇలా బాధితులు చేసిన ఫిర్యాదులతో కేసులు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించిన సీసీఎస్ సైబర్‌క్రైమ్ సెల్ పోలీసులు.. నిందితుల ఆట కట్టించేందుకు రంగంలోకి దిగారు. సాంకేతిక ఆధారాలను పకడ్బందీగా సేకరించి, అన్ని ముఠాలు గుజరాత్‌కు చెందినవని గుర్తించారు. డీసీపీ కవిత, ఏసీపీల నేతృత్వంలో ఏడు బృందాలుగా విడిపోయిన సైబర్‌క్రైమ్ పోలీసులు.. 12 రోజుల పాటు గుజరాత్‌లో మకాం వేశారు. పకడ్బందీగా రెక్కీ నిర్వహించి, స్థానిక పోలీసుల సహకారంతో నిందితుల ఆట కట్టించారు. మూడు ప్రధాన కేసుల్లో ఏడుగురు నిందితులను సూరత్‌లో అరెస్టు చేశారు. వీరిని సాగర్ గోవర్ధన్ భాయ్, ప్రజాపత్, భావ్‌నగర్‌కు చెందిన పర్మార్ కిరీట్ నాథూభాయ్, రాజ్‌కోట్‌కు చెందిన చూడాసమా కుల్‌దీప్ సింగ్ కినోజియా కేతన్, సురేశ్ భాయ్, చార్టెడ్ అకౌంటెంట్ నికుంజ్ కిశోర్, ప్రవీణ్‌భాయ్ కల్లూభాయ్‌గా గుర్తించారు. వీరి నుంచి రూ.38.28 లక్షల నగదు, నాలుగు ల్యాప్‌టాప్‌లు, 64 స్మార్ట్‌ఫోన్లు, 112 సిమ్‌కార్డులను సీజ్ చేశారు. వీరిచ్చిన సమాచారంతో మిగతా 29 మంది సైబర్ కేటుగాళ్లను అరెస్టు చేసి, హైదరాబాద్‌కు తీసుకువచ్చారు.

20 కేసుల్లో.. 12.49 కోట్లు దోచేసి..

తదుపరి దర్యాప్తులో ఈ 36 మంది నిందితులను ప్రాథమికంగా విచారించిన పోలీసులు.. వీరంతా తెలంగాణలో 131, ఒక్క హైదరాబాద్‌లోనే 30 నేరాలకు పాల్పడ్డట్లు గుర్తించారు. నగరంలో కేవలం 20 కేసుల్లో రూ.12.49 కోట్లను కొట్టేసినట్లు నిర్ధారించారు. నిందితుల బ్యాంకు ఖాతాల్లో ఉన్న రూ.2.89 కోట్లను ఫ్రీజ్ చేశారు. అందులోంచి రూ.1.51 కోట్లను బాధితులకు రీఫండ్ చేశారు. ఈ ముఠా దేశవ్యాప్తంగా 983 నేరాలకు పాల్పడి.. రూ.600 కోట్లను కొట్టేసినట్లు ప్రాథమికంగా గుర్తించామని సీపీ చెప్పారు. నిందితులను పోలీసు కస్టడీకి తీసుకుని, లోతుగా విచారిస్తే.. మరిన్ని కేసులు వెలుగులోకి వచ్చే అవకాశాలున్నట్లు వివరించారు. భారీ ఆపరేషన్ నిర్వహించి, నిందితులను చాకచక్యంగా పట్టుకున్న ఇన్‌స్పెక్టర్ ప్రసాదరావు, మధుసూదన్‌రావు, ఎస్సైలు అభిషేక్, మన్మోహన్, సతీశ్‌రెడ్డి, ఇతర సిబ్బందిని సీపీ అభినందించారు.

ఏటా రూ.1000 కోట్ల సైబర్ దోపిడీ

హైదరాబాద్‌పై సైబర్ నేరాల ప్రభావం తీవ్రంగా ఉందని నగర పోలీసు కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సైబర్ కేటుగాళ్లు నగరంలో ఏటా రూ.700 కోట్ల నుంచి రూ. 1000 కోట్ల వరకు కొల్లగొడుతున్నట్లు వివరించారు. అంటే.. రోజుకు రూ.2 కోట్లకు పైనే లూటీ నడుస్తోందని పేర్కొన్నారు. అత్యాశ అనేది ఓ జబ్బుగా మారి, పౌరులు సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కుకునేలా చేస్తోందని హెచ్చరించారు. సైబర్ నేరగాళ్లు కొల్లగొట్టే డబ్బును తిరిగి రాబట్టుకోవడం చాలా కష్టమని, కొన్ని సందర్భాల్లో అస్సలు తిరిగి రాదని చెప్పారు.

స్విమ్స్‌లో వైద్యురాలిపై రోగి దాడి

- తల మంచానికేసి కొట్టడంతో స్వల్ప గాయం
- ఆందోళనకు దిగిన జూనియర్ డాక్టర్లు

తిరుపతి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న స్విమ్స్ ఆస్పత్రి అత్యవసర విభాగంలో జూనియర్ మహిళా డాక్టర్‌పై ఓ రోగి దాడి చేశారు. దీంతో తమకు భద్రత లేదంటూ 150మందికి పైగా జూనియర్ డాక్టర్లు (జూడాలు) స్విమ్స్ క్యాజువాలిటీ ఎదుట బైఠాయించి ఆందోళనకు దిగారు. ఇప్పటికే కోల్‌కతా వైద్యురాలిపై హత్యాచార ఘటనతో దేశవ్యాప్తంగా వైద్యుల ఆందోళనలతో అట్టుడుకుతున్న నేపథ్యంలో శనివారం జరిగిన ఈ ఘటన కలకలం సృష్టించింది. స్విమ్స్ ఆస్పత్రి అత్యవసర విభాగంలో శనివారం మధ్యాహ్నం విధులు నిర్వర్తిస్తున్న జూనియర్ డాక్టర్ స్పందనపై ఓ రోగి హఠాత్తుగా దాడికి పాల్పడ్డాడు. డాక్టర్‌ను వెనుక నుంచి జుట్టు పట్టుకుని తలను బెడ్‌కేసి బాదాడు. సిబ్బంది అప్రమత్తమై రోగి బారి నుంచి ఆమెను విడిపించారు. ఈ ఘటనలో ఆమె తలకు స్వల్ప గాయమైంది. దాడి చేసిన రోగి పేరు బంగార్రాజు అని, అతనిది విజయనగరం జిల్లా అని ప్రాథమిక సమాచారం. శుక్రవారం తిరుమలలో అపస్మారక స్థితిలో పడి ఉన్న అతన్ని స్విమ్స్‌కు తరలించారు. బంగార్రాజు మద్యం మత్తులో ఉన్నాడని, మానసిక పరిస్థితి కూడా సరిగా లేదని వైద్యులు, పోలీసులు చెబుతున్నారు. దాడి తర్వాత అతడి పరిస్థితి దిగజారడంతో క్యాజువాలిటీ ఐసీయూలో చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనతో భయాందోళనలకు లోనైన జూనియర్ డాక్టర్లు క్యాజువాలిటీ ఎదుట బైఠాయించారు.


ఆకతాయి చేష్టతో ఆపద

- రసాయనాలకు ఉప్పు, కాఫీ పొడి మిక్సింగ్
- విషవాయువు పీల్చి 25 మందికి అస్వస్థత
- ఏపీ బాపట్ల కేంద్రీయ విద్యాలయంలో ఘటన

బాపట్ల, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఓ విద్యార్థి చేసిన ఆకతాయి పనికి 25 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. విషవాయువు పీల్చి ఊపిరి ఆడక ఇబ్బంది పడ్డారు. ఉపాధ్యాయులు వెంటనే ఆసుపత్రికి తరలించడంతో ప్రమాదం తప్పింది. శనివారం బాపట్లలోని కేంద్రీయ విద్యాలయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. శనివారం ఉదయం కేంద్రీయ విద్యాలయంలో 6వ తరగతి విద్యార్థులకు టీచర్ సైన్స్ క్లాస్ తీసుకున్నారు. అనంతరం టీచర్ బయటకు వెళ్లారు. అక్కడ ఉన్న రసాయనాలకు ఓ విద్యార్థి శానిటైజర్‌కు తోడు మరో విద్యార్థిని బ్యాగులో ఉన్న ఉప్పు, కాఫీ పొడి మిక్స్ చేశాడు. దీంతో తరగతి గది అంతా ఒక్కసారిగా విషరసాయనాలు పొగలుగా వ్యాపించాయి. ఇవి పక్క గదిలోని ఏడో తరగతి విద్యార్థులను కూడా తాకాయి. దీంతో 25 మంది అస్వస్థతకు గుర య్యారు. వీరి ఏరియా ఆసుపత్రికి తరలించగా, వారిలో 23 మందిని సాయంత్రానికే డిశ్చార్జ్ చేశారు. మిగిలిన ఇద్దరిలో ఒకరికి తీవ్ర జ్వరం ఉండడంతో చికిత్స అందిస్తున్నారు. మరో విద్యార్థికి గుండెకు సంబంధించి ఎప్పటి నుంచో సమస్య ఉన్నట్లు వైద్య పరీక్షల్లో వెల్లడైంది. తల్లిదండ్రులు మెరుగైన చికిత్స కోసం తీసుకెళ్లారు. కాగా, విద్యార్థులు అస్వస్థతకు గురైన సంఘటనపై సీఎం చంద్రబాబు ఆరా తీశారు.

ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు ఉద్దేశించిన ఐసెట్ కౌన్సెలింగ్ వివరాలను తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి శనివారం ప్రకటించింది. మొదటి విడత ఆన్‌లైన్ కౌన్సెలింగ్ సెప్టెంబరు 1 నుంచి ప్రారంభమై 17వరకు సాగనుంది. చివరి విడత కౌన్సెలింగ్ సెప్టెంబరు 20 నుంచి 25 వరకు ఉంటుంది. సెప్టెంబరు 27న స్పాట్ అడ్మిషన్ ప్రక్రియ ఉంటుందని ఉన్నత విద్యామండలి అధ్యక్షుడు ఆచార్య లింబాద్రి తెలిపారు. -హైదరాబాద్, ఆంధ్రజ్యోతి

సోమనకే 'తెలుగు' కీర్తి



ఆగస్టు రెండున తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నోట తెలుగు విశ్వవిద్యాలయానికి సురవరం ప్రతాప రెడ్డి పేరును జోడిస్తామనే ప్రస్తావన వెలువడింది. అసెంబ్లీలో ఈ విశ్వవిద్యాలయ చట్టంలో ఆ మేరకు మార్పు చేసిన తర్వాతనే కొత్త పేరు అమలులోకి వస్తుంది. ఈ నేపథ్యంలో తెలంగాణ తెలుగు విశ్వవిద్యాలయానికి ఏ పేరు పెట్టాలి అని తిరిగి జనసామాన్యంలో చర్చమొదలయింది.

తమిళ విశ్వవిద్యాలయం, కన్నడ విశ్వవిద్యాలయం పేర్లకు మరో పేరు జోడింపు లేదు. హిందీ విశ్వవిద్యాలయానికి కూడా జోడింపు లేదు. అదే విధంగా తెలుగు విశ్వవిద్యాలయం ఏర్పడి నప్పుడు దాని పేరు తెలుగు విశ్వవిద్యాలయమే. 1985లో నాటి ముఖ్యమంత్రి ఎన్టీరామారావు ఆకాంక్ష ఫలితంగా ఆయన అధి నేతృత్వంలో తెలుగు విశ్వవిద్యాలయం ఏర్పడింది. 1998 దాకా అదే పేరు కొనసాగింది. కారణం ఏమిటో తెలియదు గానీ ఉన్నట్టుండి తెలుగు విశ్వవిద్యాయానికి 1998లో పొట్టి శ్రీరాములు పేరు జోడించారు. ఆంధ్రరాష్ట్ర అవతరణకు ఆయన ప్రాణత్యాగమే కారణం కాబట్టి ఆ పేరు పెట్టారని అనుకోవచ్చు. జీవితాన్ని ఆంధ్రాభ్యుదయానికి అంకితం చేసిన నాటి నిస్వార్థ కాంగ్రెస్ నాయకుడు పొట్టి శ్రీరాములు. ఆయన ఆత్మ బలిదానం వెలకట్ట లేనిది. అయినా ఆయన సాహిత్యకారుడు కానీ సంస్కృతి అధ్యేత కానీ చరిత్రకారుడు కానీ కాదు. తెలుగు విశ్వవిద్యాలయం భాష, సాహిత్యం, కళలు, సంస్కృతి, చరిత్రను అధ్యయనం చేయడానికి ఉద్దిష్టమైన ఉన్నతస్థాయి విద్యాసంస్థ. అందువల్ల, ఒక విశ్వవిద్యాలయానికి శ్రీరాములు పేరుపెట్టడం సబబు కాదని అనిపిస్తుంది.

ఇక, దాదాపు అరవై సంవత్సరాలుగా సాగిన ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం 2014లో సఫలమై తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. విభజన చట్టం ప్రకారం ఉమ్మడి విశ్వవిద్యాలయాలు, ఉమ్మడి సంస్థలు పదేళ్లలో విడిపోవలసి ఉంది. తెలంగాణ ఏర్పడిన నాటి నుండి తెలుగు విశ్వవిద్యాలయానికి పేరు మార్చాలనే అభిప్రాయం వ్యక్తమవుతూ వస్తోంది. పొట్టి శ్రీరాములు పేరు ఆంధ్రప్రాంతం లోని తెలుగు విశ్వవిద్యాలయానికి ఉండవచ్చు. కనుక తెలంగాణ లోని తెలుగు విశ్వవిద్యాలయానికి ఏ పేరు అనే విషయంపైన మొదటి నుండి రెండుపేర్లు ప్రముఖంగా వినవచ్చాయి. తెలంగాణ ఆదికవి పాల్కురికి సోమనాథుడు పేరు ఉండాలని, తెలంగాణ వైతాళికుడు సురవరం ప్రతాపరెడ్డి పేరు పెట్టాలనే రెండు అభిప్రాయాలు ప్రముఖంగా వ్యక్తమయ్యాయి. ఆంధ్రప్రాంతంలో రాజమండ్రిలో 2006లో విశ్వవిద్యాలయం పెట్టినప్పుడు దానికి నన్నయ పేరు పెట్టారు. అది మంచి ఆలోచనే. నన్నయకన్నా ముందు తెలుగులో కవులు చాలామంది ఉన్న ఉనికి మనకు తెలిసినా లభించిన సంపూర్ణ కావ్యం నన్నయ భారతమే కనుక ఆదికవి గౌరవం ఆయనకు దక్కింది. ఆయన పేరు ఒక విశ్వవిద్యాలయానికి పెట్టడం ఎంతైనా సముచితం. అసలు దాన్ని అక్కడి తెలుగు విశ్వవిద్యాలయానికే పెట్టినట్లైతే మరింత బాగుండేది.

> తెలంగాణలో తెలుగు విశ్వవిద్యాలయానికి పాల్కురికి సోమనాథుని పేరు, పాలమూరు విశ్వవిద్యాలయానికి సురవరం ప్రతాపరెడ్డి పేరు, తెలంగాణ విశ్వవిద్యాలయానికి సినారె పేరు పెట్టడం సముచితంగా ఉంటుంది.


ఇదే నేపథ్యంలో, తెలంగాణ తెలుగు విశ్వవిద్యాలయానికి తెలంగాణ ఆదికవి పేరుతోనే ఉండడం ఎంతైనా సమంజసం. భాషాసాహిత్యాల అధ్యయనం ప్రధాన లక్ష్యంగా ఏర్పడిన విశ్వ విద్యాలయానికి ఆది కవి అయిన పాల్కురికి సోమనాథుని పేరు ఉంచడమే సంపూర్ణంగా సమంజసమైనది. అలాగని సురవరం ప్రతాపరెడ్డిని, ఆయన కృషిని ఏ మాత్రం తక్కువ చేసినట్లుకాదు. సురవరం ప్రతాపరెడ్డి తెలంగాణ తొలితరం మేధావి. తెలంగాణ భాషకు, ఇక్కడి సాహిత్యకారులకు ఎంతో ప్రోత్సాహాన్ని అందించిన మహనీయుడు. ఆంధ్రుల సాంఘిక చరిత్రను రచించిన చరిత్రకారుడు సురవరం ప్రతాపరెడ్డి. పాత్రికేయుడుగా పనిచేశారు. తెలంగాణలో కవులు లేరని ఇతరులు ఈసడిస్తున్న కాలంలో గోల్కొండ పత్రిక ద్వారా ఎందరో తెలంగాణ కవుల ఉనికిని వారి సాహిత్యాన్ని బయటి ప్రపంచానికి తెలియజేశారు. ఆయన కథకుడు కూడా. అయితే శతాబ్దాల చరిత్ర ఉన్న తెలుగు భాష సంస్కృతులకు ప్రాతినిధ్యం వహించే తెలుగు విశ్వవిద్యాలయానికి, విస్తృత సాహిత్యాన్ని సృష్టించి సామాజిక సంస్కరణలకు దారివేసిన పాల్కురికి సోమనపేరే సరిగ్గా సరిపోతుంది. అదే పెట్టవలసిన పేరు. సురవరం ప్రతాపరెడ్డి పేరును మహబూబ్ నగర్‌లో ఏర్పడ్డ పాలమూరు విశ్వవిద్యాలయానికి కానీ మరొక విశ్వవిద్యాలయానికి కానీ పెట్టవచ్చు. కన్నడిగులు తమకీర్తి పతాక, జ్ఞానపీఠకవి అయిన కువెంపు పేరుతో ఒక విశ్వవిద్యాలయాన్నే స్థాపించారు. తెలంగాణకి తొలిసారి జ్ఞానపీఠ పురస్కారాన్ని తెచ్చిన సినారె పేరును కూడా ఒక విశ్వవిద్యాలయానికి పెట్టవచ్చు. అది శాతవాహన విశ్వవిద్యాలయానికి కానీ లేదా తెలంగాణ విశ్వవిద్యాలయానికి కానీ పెట్టవచ్చు.

ఈ దృష్ట్యా తెలుగు విశ్వవిద్యాలయానికి పాల్కురికి సోమనాథుని పేరు, పాలమూరు విశ్వవిద్యాలయానికి సురవరం ప్రతాపరెడ్డి పేరు, తెలంగాణ విశ్వవిద్యాలయానికి సినారె పేరు పెట్టడం అందరికీ ఆమోదయోగ్యంగా ఉంటుంది. మన గొప్ప సాహిత్యకారులు ముగ్గురిని ఇలా తెలంగాణ ప్రజలు గౌరవించు కున్నట్లు అవుతుంది. ప్రభుత్వ పెద్దలు, మంత్రులు దీన్ని గురించి ఆలోచించాలి. మేధావులు వారి భావాలు స్వేచ్ఛగా ప్రకటించాలి.

• ప్రొఫెసర్ పులికొండ సుబ్బాచారి

ఇనుగుర్తిలో జ్ఞాన వెలుగులు

ఒద్దిరాజు సోదరుల 'తెనుగుపత్రిక' గూర్చి చెప్పేముందు వారి గురించి కొంత చెప్పాలి. ఒద్దిరాజు సోదరుల స్వగ్రామం ఇనుగుర్తి (వరంగల్ జిల్లా, కేసముద్రం మండలం). సోదరుల్లో పెద్దవాడు సీతారామ చంద్రరావు, చిన్నవాడు రాఘవ రంగా రావు. సోదరుల మధ్య ఏడున్నర సంవత్సరాల వ్యత్యాసం. తండ్రి వెంకట రామారావు, తల్లి రంగనాయకమ్మ. ఆమె సంస్కృతాంధ్ర భాషలలో పండితురాలు. తన తాతగారి వద్ద భారత భాగవతాలు, ద్రావిడ ప్రబంధాలు, సంస్కృత శ్లోకాలే కాకుండా వివాహ ఉపనయనాలను నిర్వహించే మంత్రాలను సైతం నేర్చుకున్నారామె. ఈ చదువును ఆమె తన కుమారులకు సమున్నతంగా సంక్రమింపజేశారు. సోదరులిద్దరు ఒక్క తనువుగా మెసలుతూ తమ విద్యాభ్యాసాన్ని కొనసాగించారు, కాలం తెలియకుండా సమస్త కావ్యాలను, శాస్త్ర గ్రంథాలను ఔపోసన పట్టినారు. తెలుగుతో పాటు, సంస్కృతం, ఉర్దూ, తమిళం, మలయాళం, కన్నడం, ఇంగ్లీషు, హిందీ మొదలగు భాషలను నేర్చుకున్నారు. 1911లో సోదరులు మద్రాసు విజ్ఞాన చంద్రికా మండలి పరీక్షలు రాయడానికి ఫీజు కట్టారు. అప్పుడు తెలంగాణలో నిజాం రాజుల సిక్కా హాలీ కరెన్సీ, మద్రాసులో కల్దారు అనే కరెన్సీ లోకి మార్చి ఫీజు మనియార్డర్ ద్వారా పంపారు. పరీక్ష నిమిత్తం మద్రాసుకు 18 రోజుల ముందే బయలుదేరి వెళ్లారు. అయితే పొరపాటున తమ పుస్తకాలను గ్రామంలో మరిచిపోయారు. మద్రాసులో ఆ పుస్తకాల కొరత ఉన్నందున అక్కడే ముద్రణ జరుగుతున్న జయశంకర్ ప్రింటింగ్ ప్రెస్ అధినేత వీరన్నశెట్టిని వేడుకుని ప్రూఫ్ అవుతున్న పుస్తకాలను అక్కడనే చదువుతూ విజ్ఞాన చంద్రిక పరీక్షలను ఉన్నతశ్రేణిలో ఉత్తీర్ణత సాధించి కందుకూరి వీరేశలింగం పంతులుగారి నుంచి బంగారు పతకం, సర్టిఫికెట్ పొందినారు.



> ఒద్దిరాజు సోదరులు ఎంతో శ్రమతో తమ 'తెనుగు పత్రిక' మొదటి సంచికను 500 ప్రతులతో వెలువరించారు. వార్తా సేకరణ, కూర్పు, ముద్రణ, పంపిణీ అన్ని వారే చేసేవారు. తపాలా అధికారులతో మాట్లాడి ఒక పోస్టు ఆఫీసును ఏర్పాటు చేసారు. ప్రతి సంవత్సరం వెయ్యి ప్రతులను పెంచుతూ ఆరు సంవత్సరాలు పన్నెండు పుటల వార పత్రికగా ప్రతీ ఆదివారం వెలువరించారు. అందు వార్తలతో పాటు వ్యాసాలూ, కవితలు, కథలు ఐదుపుటలలో, ఆరోపుటలో నిజాం వార్తలు, ఇంకా పాఠకుల లేఖలు ఇలా అన్ని అంశాలను పొందుపరిచేవారు.

తరవాత వారు రచనా వ్యాసంగం పైన తమ దృష్టి పెట్టారు. పెద్దలు, విద్యావేత్తల సలహాలతో 1918 మార్చి 3న గ్రామంలో విజ్ఞాన ప్రచారిణి గ్రంథమాల అనే పేరుతో ఒక ప్రచురణ సంస్థను నెలకొల్పారు. తమవి, ఇతరులవి పలు పుస్తకాలను ప్రచురించారు. కాకతీయ రుద్రమదేవి కథాంశంతో ఒక చక్కని కథని రాసి దానిని విజయవాడ (అప్పుడు బెజవాడ) లోని మారుతీ ప్రింటింగ్ ప్రెస్సులో ముద్రించారు. తమ రచనలు ఎక్కడో ముద్రించడంలో గల కష్టాలను అధిగమించడానికి తమ గ్రామం ఇనుగుర్తిలోనే అనంతరం ఒక ప్రింటింగ్ ప్రెస్‌ను ఏర్పాటు చేసుకున్నారు. ఇనుగుర్తి ఒక దట్టమైన అటవీ గ్రామం. ఎలాంటి కనీస సౌకర్యాలు లేవు. అయినా స్వగ్రామం నుంచే తమ వ్యాసంగాన్ని కొనసాగించారు. విజయవాడ నుండి తెచ్చిన ప్రెస్సులో తామే కూర్పు చేస్తూ తమ రచనలు ముద్రించారు. వారి తృష్ణ అంతతో ఆగలేదు. పత్రికా రంగంపైకి మరలింది. ఎంతో శ్రమతో తమ 'తెనుగు పత్రిక' మొదటి సంచికను దుందుభి భాద్రపద శుద్ధ పంచమి ఆదివారం అనగా 27-8-1922 నాడు 500 ప్రతులతో వెలువరించారు. వార్తా సేకరణ, కూర్పు, ముద్రణ, పంపిణీ అన్ని వారే చేసేవారు. తపాలా అధికారులతో మాట్లాడి ఒక పోస్టు ఆఫీసును ఏర్పాటు చేసారు. ప్రతి సంవత్సరం వెయ్యి ప్రతులను పెంచుతూ ఆరు సంవత్సరాలు పన్నెండు పుటల వార పత్రికగా ప్రతీ ఆదివారం వెలువరించారు. అందు వార్తలతో పాటు వ్యాసాలూ, కవితలు, కథలు ఐదుపుటలలో, ఆరోపుటలో నిజాం వార్తలు, ఇంకా పాఠకుల లేఖలు ఇలా అన్ని అంశాలను పొందుపరిచేవారు. మిత్రుల సహకారాలతో వారి ప్రోత్సాహంతో పత్రికను, ప్రెస్సును వరంగల్లుకు మార్చినారు. కాని అక్కడ పత్రిక ఒక్క సంచిక కూడా విడుదలకు నోచుకోలేదు. ఆ విధంగా తెలంగాణ లోని మూడవ పత్రికా ప్రస్థానం నిలిచిపోయింది.

1955లో సీతారామచంద్రరావుకు గొంతు క్యాన్సర్ సోకింది. అంత బాధలోనూ తన రచనా వ్యాసంగానికి ఆయన విరామం ఇవ్వలేదు. చివరి ఘడియల్లో ఆసుపత్రిలో కూడా తన చివరి రచన సౌదామిని పరిణయం కావ్యాన్ని రాసి పూర్తి చేశారు. రుద్రమదేవి, శౌర్యశక్తి, వరహముద్ర, బ్రాహ్మణ సాహసము, స్త్రీ సాహసం, ముక్తలవ, నౌకా భంగం (రవీంద్రుని 'రెక్' నవలకు అనువాదం) సీతారామచంద్రరావు నవలల్లో కొన్ని. మోహినీ విలాసం, ప్రేమ వివాహం, శశవిశాణము ఆయన రచనల్లో నాటకాలు. ఇతర అంశాలపై రాసిన పుస్తకాలు అనేకంగా ఉన్నాయి. సంస్కృత రచనల్లో కృష్ణ స్థవ, శ్రీ స్థవ, శుకపక్షీయం, ఉత్సవానంద భాణమ్, వైభవ స్తవః విభక్త్యర్థం, ధాతు నిఘంటువులున్నాయి. పాణిని అష్టాధ్యాయి (వ్యాకరణ సూత్రములు), సిద్ధాంత కౌముదీ అనువాదము. ఆంగ్ల వ్యాకరణము (ది మాన్యువల్ ఆఫ్ ఇంగ్లీష్ గ్రామర్‌కు అనువాదం) ఇత్యాదివి శాస్త్ర గ్రంథాలు. పలు ఆంగ్ల రచనలు కూడా చేశారాయన. సీతారామచంద్రరావు 28 జనవరి 1956లో తన 68 ఏట కీర్తిశేషులయ్యారు.

రాఘవరంగారావు తమ వృద్ధాప్యంలో కళ్ళు కనపడకున్నా తనవద్దకు వచ్చిన విద్యార్థులకు చదువు చెప్పేవారు, అతని శిష్యరికంలో ఎందరో తెలుగు పండితులుగా పరీక్షలను రాసి ఉత్తీర్ణత చెంది ఉపాధ్యాయులుగా ఉపాధి సముపార్జించుకున్నారు. ఆయన తన 80వ ఏట ఇహలోకయాత్రను ముగించారు. ఈయన రచనలు: వీరావేశము (చారిత్రిక నవల), పంచకూళ కషాయం, విషములు-చికిత్సలు, సప్తపది, ఉత్తర గురుపరంపర, ముదలాయిరం, వణ్ణ మాదంగళ్ (అనువాదాలు), సుశీలా మైనావతి. అర్తి ప్రబంధం (సంస్కృతం) సప్తగాథా వాఖ్య, అష్టాధ్యాయి, తపతీ సంహరణ ఉపాఖ్యానం, మత్కునోపాఖ్యానం. ఒద్దిరాజు సోదరులు ఇరువురు కలసి -ఉపదేశ రత్నమాల, తిరుప్పల్లాండు, భక్తిసార చరిత్ర, సంస్కృత వ్యాకరణం-వంటి రచనలు చేశారు. ఒద్దిరాజు సోదరుల ఎన్నో రచనలు అముద్రితాలుగా మిగిలిపోతే, కాలక్రమేణ లభించిన రచనలను వారి వంశజులు ముద్రించారు. వారి రచనలు కొన్ని తెలంగాణ ఇంటర్, డిగ్రీ కోర్సు తెలుగు పాఠ్యాంశాలలో చోటుచేసుకున్నాయి. ఒద్దిరాజు సోదరుల రచనా వ్యాసంగంపైన శ్రీమతి కొండపల్లి నీహారిణి పరిశోధన చేసి, ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పట్టా పొందారు.

○ సుభాష్ ఒద్దిరాజు

(ఆగస్టు 27న 'తెనుగు పత్రిక' శతవత్సర వేడుక)

కృత్రిమమేధ కాలంలో కమ్యూనిస్టులు

'రెండు కాళ్ళ జీవులు ప్రమాదకరమైనవి; నాలుగుకాళ్ళ జీవులు గొప్పవి' అని జార్జ్ ఆర్వెల్ నవల 'Animal Farm'లో జంతువులన్నీ కలిసి ఒక తీర్మానం చేస్తాయి. కాళ్ళు రెక్కలు తోకలు మాత్రమే కాదు సృష్టిలో మనుషులకు ఇతర జీవులకు తేడాలను చూడాలనుకుంటే అనేకానేక వైవిధ్యాలు కనిపిస్తాయి. జంతువులు గుంపులుగా సంచరిస్తాయి; మనుషులు సమాజంగా కొనసాగుతారు. ఇతర జీవులు సంతతిని కని వాటి జీవిక కోసం ఆహారాన్ని సేకరిస్తాయి. మనిషి ఆహార సేకరణతో ఆగిపోడు; అవసరమైనప్పుడు తానే ఆహారాన్ని ఉత్పత్తి చేస్తాడు. ఉత్పత్తి అవసరాల కోసం పనిముట్లను, యంత్రాలను సృష్టిస్తాడు. 'పనిముట్లను తయారు చేసే జీవి మనిషే' అని బెంజమిన్ ఫ్రాంక్లిన్ (1706–90 అమెరికా రాజనీతిజ్ఞుడు, రచయిత, శాస్త్రవేత్త) అన్నాడు. ఆయన అంతటితో ఆగలేదు. 'మనిషి సృష్టికర్త' (Man the Maker), 'మనిషి ఆలోచనా పరుడు' (Man the Thinker) అని కూడా అన్నాడు.

తొలి పనిముట్ల నుంచి నేటి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (కృత్రిమ మేధ) సాఫ్ట్‌వేర్ దాకా యంత్రాల చరిత్రలో అనేక తరాలు సాగిపోయాయి. ప్రతి తరంలోనూ యంత్రాలు సమాజంలో కొత్త ఆలోచనల సంచయానికి కూడ దోహదం చేస్తాయి. పారిశ్రామిక విప్లవం సంభవించి వుండకపోతే డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతాన్నీ, ఫ్రాయిడ్ మనోవిశ్లేషణను, కార్ల్‌మార్క్స్ కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని అభివృద్ధి చేయగలిగేవారు కాదు. యంత్రాల అభివృద్ధి-మనిషి ఆలోచనల విస్తృతి మధ్య ఒక అవినాభావ సంబంధం ఉంటుంది.

యంత్రాలు, సాంకేతికతలు మానవ సంబంధాలనూ తీవ్రంగా ప్రభావితం చేస్తాయి. ముందు అవి సంపద సృష్టికి దోహదపడతాయి. మరోవైపు, సంపద పంపిణీ మనుషుల్ని విభజిస్తుంది. కొన్ని సమూహాలు యజమానులుగా అవతరిస్తే మిగిలిన సమూహాలు సేవకులుగా మారిపోతాయి. యంత్రాలు తమ అధీనంలో ఉంటాయి కనుక యజమాని సమూహం సహజంగానే తెలివైనదిగా మారుతుంది. ఏ రంగంలో అయినాసరే తమ ప్రయోజనాల గురించి యజమానులకు ఉన్నంత స్పృహ సేవకులకు వుండదు. సకల రంగాల యజమానుల మధ్య ప్రత్యక్షంగానో పరోక్షంగానో ఒక ఐక్యత వుంటుంది. సకల వ్యవస్థల యజమానులు క్రమంగా ఏకమవుతుంటారు.

అన్ని రంగాలలోని సేవకులు తాము కూడ యజమానులయ్యేందుకు కొంత తాపత్రయపడడం సహజం. సమాజంలో యజమానులయ్యే అవకాశం కొందరికి మాత్రమే ఉంటుందనీ అత్యధికులు సేవకులుగానే ఉండాల్సి వస్తుందనీ అర్థం కావడానికి చాలా కాలం పడుతుంది. అప్పుడు సమాజంలో సమానత్వం, సోదర భావం అనే ఆలోచనలు అపారంగా వికసిస్తాయి. ఇలాంటి నేపథ్యంలోనే కమ్యూనిజం అనే సిద్ధాంతం పుట్టింది. 'ప్రతి ఒక్కరి నుండి అతని సామర్థ్యం మేరకు, ప్రతి ఒక్కరికి అతని అవసరాలకు అనుగుణంగా' ('From each according to his ability, to each according to his needs') అనేది కమ్యూనిస్టు సమాజానికి ప్రాథమిక కొలమానం. 1875లో రాసిన 'గోథా కార్యక్రమం మీద విమర్శ' పుస్తకంలో కార్ల్‌మార్క్స్ ఈ వివరణ ఇచ్చాడు. ప్రపంచ వ్యాప్తంగా సేవక సమూహాలన్నింటిలోనూ స్పష్టంగానో అస్పష్టంగానో అంతర్లీనంగా ఇలాంటి భావనలే నిరంతరం బలపడుతుంటాయి. మరో మాటలో చెప్పాలంటే సేవక సమూహాలన్నింటి సమిష్టి స్వప్నం సమానత్వం.

ప్రపంచంలో ఎక్కడైనా సరే సేవక సమూహాలకు జీవితం దుర్భరంగా మారి సమిష్టి స్వప్నం ముందుకు వచ్చిన ప్రతీసారీ ఆందోళనలు మొదలవుతాయి. ఉద్యమాలు పోరాటాలు ఊపందుకుంటాయి. ఆందోళనలను అణిచివేయడానికి యజమాని సమూహాలకు అంతర్గతంగానే పటిష్ఠమైన వ్యవస్థ ఉంటుంది. సాయుధ పోలీసులు, తుపాకులు, జైళ్లు, ఉరికొయ్యలు, నిఘా విభాగాలు వగైరాలు వాళ్ళ అధీనంలోనే ఉంటాయి. ఆందోళనల్ని నివారించడానికి ఇంతకన్నా మెరుగైన తెలివైన ప్రత్యామ్నాయాలు కూడ వాళ్ళ దగ్గర ఉంటాయి. అవే సంక్షేమ పథకాలు.

సంక్షేమ పథకాల ద్వార సేవకుల తిరుగుబాట్లను నివారించవచ్చు అని తొలిసారిగా గుర్తించిన ఘనుడు అమెరికా ఆటోమొబైల్ దిగ్గజం హెన్రీ ఫోర్డ్. రష్యాలో అక్టోబరు విప్లవం జరగడానికి మూడున్నరేళ్ళు ముందే 1914 జనవరి 5న ఆయన తన కార్మికుల మీద వరాల జల్లు కురిపించాడు. 'రోజుకు ఐదు డాలర్లు' వేతనం ప్రకటించాడు. ఆ రోజుల్లో ఇది చాలా ఆకర్షణీయమైన జీతం. 8 గంటల పనిదినాన్ని అమలుపరిచాడు. రోజుకు రెండు షిఫ్టుల పద్ధతి స్థానంలో



> ప్రతి తరంలోనూ యంత్రాలు సమాజంలో కొత్త ఆలోచనల సంచయానికి కూడ దోహదం చేస్తాయి. పారిశ్రామిక విప్లవం సంభవించి వుండకపోతే డార్విన్ జీవపరిణామ సిద్ధాంతాన్నీ, ఫ్రాయిడ్ మనో విశ్లేషణను, కార్ల్‌మార్క్స్ కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని అభివృద్ధి చేయగలిగేవారు కాదు. యంత్రాల అభివృద్ధి-మనిషి ఆలోచనల విస్తృతి మధ్య ఒక అవినాభావ సంబంధం ఉంటుంది.

మూడు షిఫ్టుల పద్ధతిని ప్రవేశపెట్టాడు. ఒక్కో దేశంలో ఒక్కో యూనిట్ పెట్టాడు. అంటే శ్రమ విభజనతోపాటు శ్రామికులను కూడ విభజించాడు. కార్మికులకు సౌకర్యవంతమైన నివాసం, మెరుగైన విద్యా, వైద్య సేవలు అందించాడు. దానితో ప్రపంచ వ్యాప్తంగా నిపుణులైన కార్మికులు ఫోర్డ్ సంస్థలో చేరడానికి పోటీపడ్డారు. అంతకు మించి వాళ్ళు ఫోర్డుకు పరమ విధేయులుగా మారిపోయారు. ఫోర్డు సంస్థలో ఉత్పత్తి పెరిగింది. సరుకు నాణ్యత పెరిగింది. మార్కెట్లో పోటీ లేకుండా పోయింది. అంతిమంగా కంపెనీకి లాభాలు పెరిగాయి.

ఫోర్డ్ ఫార్ములా పార్లమెంటరీ ప్రజాస్వామ్య రాజకీయాల్లోనూ ప్రవేశించింది. అమెరికాలో పెద్ద ఎత్తున ఉద్దీపన చర్యలు మొదలయ్యాయి. మనదేశంలో ఉచిత బియ్యం, ఉచిత వైద్య ఆరోగ్య సేవలు, ఫీజుల రీయింబర్స్‌మెంట్, పేదలకు పక్కా ఇళ్ళు, వ్యవసాయానికి సబ్సిడీలు, భూపరిమితి చట్టాలు, వ్యవసాయ కూలీలకు భూముల పంపకాలు మొదలైన సంక్షేమ పథకాలన్నీ గతంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం, నక్సల్‌బరీ ఉద్యమం, శ్రీకాకుళం గిరిజన పోరాటం, నక్సలైట్ల పోరాటాల సందర్భంగా వివిధ కమ్యూనిస్టు పార్టీలు ముందుకు తెచ్చిన డిమాండ్లే. కమ్యూనిస్టుల డిమాండ్లను ప్రధాన స్రవంతి రాజకీయ పార్టీలు హైజాక్ చేసి ఎన్నికల హామీగా మార్చేసుకున్నాయి. ఏదో ఒక మేరకు అమలు కూడ చేస్తున్నాయి. దానితో పార్లమెంటరీ ప్రజాస్వామ్య రాజకీయాల్లో కమ్యూనిస్టు పార్టీలు అంతరించిపోతున్న జాతిగా మారిపోయాయి. దీని అర్థం దేశంలో కార్మికులు లేకుండాపోయారనీ, వాళ్ళ మీద పీడన లేదనీ కాదు. కొత్త పద్ధతుల్లో కొత్త పీడన కొనసాగుతూనే ఉంటుంది.

శ్రామిక సమూహాలను పునర్ నిర్వచించే చారిత్రక బాధ్యతను కమ్యూనిస్టు పార్టీలు ఎప్పటికప్పుడు నిర్వర్తిస్తుండాలి. అవి ఆ బాధ్యతను మరచిపోయాయి. శ్రామిక సమూహాల బహుళ అస్తిత్వాలు కూడ కమ్యూనిస్టు నాయకులకు అర్థం కాలేదు. ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనారిటీ వర్గాల ప్రజలు వ్యవసాయకూలీలుగా ఉన్న కాలంలో కమ్యూనిస్టు పార్టీలే ఆ సామాజిక సమూహాలను సంఘటిత పరిచాయి, కాంగ్రెస్ తదితర పార్టీలకన్నా మెరుగైన రాజకీయ చైతన్యాన్ని అందించాయి. అయితే, ఆ సమూహాలు తమ సామాజిక ఉనికిని ప్రదర్శించి నపుడు కమ్యూనిస్టు పార్టీల నాయకులు దాన్ని ఒక అనివార్యమైన చారిత్రక పరిణామంగా గుర్తించలేకపోయాయి. అసలు ఈ పరిణామాన్ని వాళ్ళు జీర్ణించుకోలేకపోయారు. ఇప్పుడు బహుజనులు వేరు, కమ్యూనిస్టు పార్టీలు వేరు అనే అవాంఛనీయ పరిస్థితి ఏర్పడింది.

భారత కమ్యూనిస్టు నాయకుల్లో 1940లు, 1950లలో ఒక వెలుగు వెలిగిన అగ్రనేతలందరూ వ్యవసాయిక కుటుంబాల నుండి వచ్చినవారే. వాళ్ళకు వ్యవసాయం, నీటిపారుదల గురించి లోతుగా తెలుసు. కానీ అప్పటి ఆధునిక యంత్రాల గురించి అంతగా తెలీదు. నిజానికి అప్పటికి మన దేశంలో యంత్రాల ఉపయోగం కూడ శైశవ దశలో వుంది. కమ్యూనిస్టు పార్టీ నాయకుల మేధోశక్తి కూడ ఆ పరిమితుల్లోనే వుండింది. తమ కాలం నాటి సమాజాన్ని వాళ్ళలో ఏ ఒక్కరూ సమగ్రంగా విశ్లేషించలేపోయారు. విప్లవం వ్యవసాయరంగంలో మొదలై, తొలుత గ్రామీణ ప్రాంతాలను విముక్తం చేసి, ఆ తరువాత పట్టణాలను విముక్తం చేస్తుందని వారంతా గట్టిగా నమ్మేరు. ఇప్పటికీ చాలామంది సీనియర్ కమ్యూనిస్టు అభిమానులు 1950ల నాటి 'ఆంధ్రా థీసిస్'ను మహత్తర ప్రతిపాదనగా భావిస్తుంటారు. 1940లలో చైనాలో మావో ప్రతిపాదించిన నూతన ప్రజాస్వామిక విప్లవంకు అది ఇండియన్ వెర్షన్ తప్ప అందులో మన కమ్యూనిస్టు నేతలు జోడించిన సృజనాత్మకత పెద్దగా ఏమీ లేదు. దానినే తరువాతి కాలంలో మరికొంత స్థానిక అన్వయంతో కొండపల్లి సీతారామయ్య 'వ్యవసాయిక విప్లవం'గా అభివృద్ధి చేశారు. అప్పటికే అత్యంత ఆధునిక, సంక్లిష్ట, యంత్రాల ప్రవేశంతో సమాజం సామాన్యులు విశ్లేషించలేనంత వైవిధ్యపూరితంగా మారిపోయింది. తత్కారణంగా కొండపల్లి ఫార్ములా కూడ పనిచేయలేదు. 1990లలో తూర్పు యూరోప్, రష్యా పతనాల తరువాత ప్రపంచ వాణిజ్య సంస్థ ఏర్పాటుతో నూతన ఆర్థిక సంస్కరణలు ప్రవేశించాక కమ్యూనిస్టు నాయకుల నిస్సహాయత మరింత పెరిగింది.

అణగారిన సమూహాలు పాత పద్ధతుల్లో జీవించలేని స్థితికి చేరడమేగాక, ఆధిపత్య సమూహాలు సహితం పాత పద్ధతుల్ని కొనసాగించలేని స్థితికి చేరుకున్నప్పుడే విప్లవం సంభవిస్తుందని లెనిన్ అన్నాడు. విప్లవకర పరిస్థితి, విప్లవకర పార్టీ, విప్లవించడానికి సిద్ధపడిన ప్రజా సమూహాలు లేకుండా విప్లవం సాధ్యంకాదని కూడ ఆయనే అన్నాడు. ఇప్పటికి కూడ ఇదీ భారత సమాజ స్వభావం, ఇందులో వీళ్లు విప్లవకర శక్తులు, ఇదీ వీరు చేపట్టాల్సిన విముక్తి కార్యక్రమం అని తేల్చి చెప్పగలిగిన కమ్యూనిస్టు పార్టీ ఒక్కటీ ఈ రోజు భారత దేశంలో లేదు. అధునాతన సాంకేతికతలపై సమగ్ర అవగాహన లేనివాళ్ళు విప్లవ కార్యక్రమాన్ని రూపొందించలేరు.

■ డానీ

సీనియర్ జర్నలిస్టు

ఆధిపత్యానికి 'తెలుగుదనం' ముసుగు

మొన్న ఆగస్టు 9–11 తేదీల మధ్యన బెంగళూరులో 'బుక్ బ్రహ్మ లిటరేచర్ ఫెస్టివల్ 2024' పేరిట దక్షిణ భారత సాహిత్యోత్సవాలు జరిగాయి. దీనికి తెలుగు నుంచి 'ప్రింట్ మీడియా పార్ట్‌నర్'గా ఆంధ్రజ్యోతి పత్రిక ఉన్నది. ఈ పత్రిక సంపాదకులు కె. శ్రీనివాస్ పంద్రాగస్టు రోజు తన కాలమ్ 'సందర్భం'లో 'మరీ ఇంత కళ తప్పిందేమిటి తెలుగుదనం?' పేరుతో రాసిన వ్యాసం ప్రమోషనల్ ఆర్టికల్‌గా ఉన్నది. తెలుగు సాహిత్యంలో బ్రాహ్మణాధిపత్యాన్ని స్థిరీకరించేందుకు, భిన్నత్వాన్ని సహించరానిదిగా, 'థాట్ పోలిసింగ్'గా ఉన్నది. బహుజన భావజాలాల వారిని, అస్తిత్వవాదుల్ని తెలుగు సాహిత్య సమాజ విరోధులుగా నిర్ధారించే ప్రయత్నం చేసింది. సారాంశంలో బ్రాహ్మణభావజాలమే పరిఢవిల్లాలనే భావనను ప్రచారంలో పెట్టింది. ఇన్నేండ్లుగా తన రచనలు, ఆచరణల ద్వారా 'సబాల్టర్న్' పక్షాన బలంగా నిలబడ్డ గొంతు ఇట్లా మారినందుకు బాధతో రాస్తున్న స్పందనిది.

ఈ వ్యాసంలో శ్రీనివాస్ సందర్భవశాత్తు కొంతమంది పేర్లను ఉటంకించారు. అందులో ప్రకాశ్‌రాజ్, వెంకటేశ్ కుమార్, గీతా రామస్వామి, మృణాళిని, వివిన మూర్తి, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి, నిర్వాహకులు సతీష్ చప్పరికెలు ఉన్నారు. వీరిలో ఒక్క ప్రకాశ్‌రాజ్ తప్ప మిగతావారందరూ బ్రాహ్మణులే! 'నేమ్ డ్రాపింగ్' అనేది కూడా ఒక కళ. పది నిమిషాల స్టాండింగ్ ఒవేషన్ ఇచ్చేంతగా వెంకటేశ్ కుమార్ హిందుస్తానీ గాత్ర సంగీత ప్రదర్శన జరిగింది అని రాశారు. సంతోషం. అయితే దాని వల్ల బహుజనులకు, తెలుగువారికి ఒనగూరే అదనపు ప్రయోజనం ఏమున్నది. మళ్ళీ కె.విశ్వనాథ్ 'శంకరాభరణం' లాంటి సినిమాల ద్వారా జరిగిన బ్రాహ్మణ భావజాల ప్రచారమే ఉంటుంది తప్ప జరిగే మేలు ఏమున్నది? వాళ్లది వాళ్లకు గొప్ప! మన మెందుకు నెత్తిన మొయ్యాలి? అట్లా ఆ ఘనతను కీర్తించడమంటే మనకు అట్లాంటి వారసత్వం లేదు అనే భావన కనిపిస్తున్నది. బహుశా అందుకే 'సంగీతంలోనూ నృత్య రూపాలతోను కలిసి పనిచేసే కవులెవరూ ఉండరు' అని శ్రీనివాస్ నిర్ధారించారు. నిజానికి గతంలో కన్నా ఇప్పుడు తెలంగాణ సంస్కృతి, కళలకు ఢిల్లీ స్థాయిలోనూ గౌరవం దక్కుతోంది. పేరిణి, డప్పు, ఒగ్గు కళారూపాలకు కొత్తగా జవజీవాలందిస్తూ జాతీయస్థాయిలో తెలంగాణ యువ కళాకారులు అవార్డులందుకున్నారు. బోనాలు, బతుకమ్మలతో కవులు మమేకమయింద్రు. 'ముషాయిరా'లు రక్తి కట్టిస్తున్నాయి. "నాటకం ఇంకా పురాణ కాలంలోనో, గత కాలంలోనో మాత్రమే వైభవంతో ఉన్నది" అని కూడా రాసింద్రు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నడూ రవీంద్రభారతి వేదిక మీద ప్రదర్శనకు నోచుకోని వందలమంది కళాకారులు కొత్తగా తెలంగాణ రాష్ట్రంలో వందకుపైగా నాటకాలు, అవన్నీ తెలంగాణ వాళ్లు రాసినవి, తెలంగాణ జీవితాలకు సంబంధించినవి ప్రదర్శించారు. కొత్త కొత్త టెక్నిక్‌లు ఉపయోగిస్తూ ప్రేక్షకులను కట్టిపడేస్తున్నారు. ఇక్కడి నుంచి సినిమారంగంలో కొత్తగా ఛాన్స్‌లు దక్కించుకున్నవాళ్లు పదుల సంఖ్యలో ఉన్నారు. తెలుగునాట సౌదా ప్రదర్శిస్తున్న నాటక ప్రతిభ తక్కువదేమీ కాదు. సరైన అవకాశం దొరికితే రంగస్థలాన్ని దద్దరిల్లేలాచేసే ఉద్దండులు ఎందరో ఉన్నారు. ఇవేవి పట్టింపు లేకుండా 'మన వాళ్ళు వట్టి వెధవాయలోయ్' అన్నట్టుగా స్వీపింగ్‌గా శ్రీనివాస్ రాశారు. ఇది ఆక్షేపణీయం.

ఇక రెండవది శ్రీనివాస్ పేర్కొన్న వ్యక్తుల స్పందన. వీళ్లందరూ తమ కుల కోణంలో నుంచే స్పందించారు. ముందుగా గీతా రామస్వామి స్పందన చూద్దాం. ప్రకాశ్‌రాజ్, పెరుమాళ్ మురుగన్, వసుధేంద్ర, జయమోహన్, సచ్చిదానందన్‌లను పోల్చుతూ "తెలుగు నుంచి అటువంటి సాహిత్య వ్యక్తిత్వాలు వస్తున్నాయా? సాహిత్యాన్ని, కళలని ఇంతగా అభిమానించే సమాజం మనకెందుకు లేదు?" అని గీతారామస్వామి బాధను రికార్డు చేశారు. మన తెలుగులో ఇటువంటి వాళ్లెందుకు లేరు, ఉన్నారు. అయితే వాళ్లని కొంచెం బ్రాహ్మణీయ అద్దాలు తొలగించి చూడాల్సి ఉంటుంది. ఉదాహరణకు 'శప్తభూమి' నవల రాసిన బండి నారాయణస్వామి, రాయలసీమ జీవితాలను-ఉద్యమాలను బహుజన సోయితో సాహిత్యంలో రికార్డు చేస్తున్న జి.వెంకటకృష్ణ, శాంతి నారాయణ, వి.ఆర్.రాసాని, మూడు దశాబ్దాలుగా బహుజన సోయితో రాస్తూ, ఆధిపత్యాలను ధిక్కరిస్తున్న గుంటూరు లక్ష్మీనర్సయ్య, అంబటి సురేంద్ర రాజు, దేవరాజు మహారాజు అందుకు సమర్థులు కారా? కవిత్వంలో నూతన అభివ్యక్తిని, బహుజన సోయిని ప్రదర్శిస్తున్న ప్రసాదమూర్తి, అన్నవరం దేవేందర్, జూకంటి జగన్నాథం, బహుభాషా కోవిదులు నలిమెల భాస్కర్, ముస్లిం అస్తిత్వ వాదాన్ని భుజాన మోస్తున్న స్కైబాబ, బహుజన జీవితాలను కవిత్వంలో 'కుర్చీ' మీద కూర్చోబెడుతున్న వనపట్ల సుబ్బయ్య యువ ధిక్కార గొంతుక అవనిశ్రీ, దళిత ఈస్థటిక్స్‌ని విమర్శలోకి తీసుకొచ్చిన కోయి కోటేశ్వరరావు, కథా సాహిత్యాన్ని పరిపుష్టం చేస్తున్న పెద్దింటి అశోక్‌కుమార్, కాలువ మల్లయ్య, యువ పురస్కార గ్రహీతలు పసునూరి రవీందర్, మానస ఎండ్లూరి, మెర్సీ మార్గరెట్, తగుళ్ల గోపాల్ లాంటి వ్యక్తులు లెక్కకు మించి ఉన్నారు. వాళ్లందరి పేర్లు ఇక్కడ పేర్కొనడం వీలు కాదు కాబట్టి వదిలేస్తున్న. పైన పేర్కొన్న బ్రాహ్మణ సాహిత్యవేత్తలెవ్వరికీ వీళ్లు రచయితలుగా కనబడడం లేదు. అంతేగాదు "తెలుగు నేల నుంచి అక్కడి కార్యక్రమంలో పాల్గొనడానికి వెళ్లిన వారందరిలోనూ అవే ప్రశ్నలు. ఒకవైపు ఉదాత్తమైన,



> ఆ వ్యాసంలో కె. శ్రీనివాస్ సందర్భవశాత్తు కొంతమంది పేర్లను ఉటంకించారు. వీరిలో ఒక్క ప్రకాశ్‌రాజ్ తప్ప మిగతావారందరూ బ్రాహ్మణులే. సాహిత్యంలోనే కాదు సభల్లోనూ, అవార్డుల్లోనూ బహుజనులను ప్రభుత్వ అకాడెమీలు, సంస్థలు అంటరానివారుగానే చూస్తున్నాయి. బహుజనులు ఎట్లుండాలో, ఏమి ఆలోచించాలో, ఎలాంటి సంస్కృతిని ప్రేమించాలో 'థాట్ పాలిసింగ్' చేయడం సమంజసం కాదు.

గంభీరమైన కళాసాహిత్య విషయాలను ఆనందిస్తూనే, గుండెలకు గుచ్చుకుంటున్న కించపాటుతో వారు నొప్పి పడ్డారు". ముందుగా తెలుగునేల నుంచి అక్కడి కార్యక్రమంలో పాల్గొనడానికి వెళ్లిందెవరు? ఆహ్వానితులెవ్వరు? ప్రధాన వేదికల మీద అందరూ ఆధిపత్య కులాల వాండ్లే కదా! రాజకీయ పార్టీలు బీసీ, ఎస్సీ, ఎస్టీలను 'సెల్'లకు పరిమితం చేసినట్లుగా తెలుగు దళిత మహిళలను 'సెల్'లకు పరిమితం చేసినదాని గురించి ప్రశ్నించాల్సిన అవసరం లేదా? ప్రధాన వేదికమీద తెలుగు సాహిత్య అంబాసిడర్లుగా ఎవరున్నారు? ఒక్క తెలుగు కవినయినా సభకు ఆహ్వానించారా? ఒక్క బీసీ కూడా లేకుండా సభ నిర్వహించుకునేందుకు తెగించినవారిని 53 శాతం జనాభా పక్షానా మీరు మందలించారా? పైపెచ్చు అట్లా వివక్షాపూరితంగా వ్యవహరించిన వారిని ఆరాధిస్తూ "సాంస్కృతిక జీవనంలోనూ, విలువల పాటింపులోను, కొత్త పతన స్థాయిని, లేకితనంలో కొంగ్రొత్త పతాక స్థాయిని అందుకుంటున్న ప్రయాణం తెలుగువారిది" అని మీ పత్రికను చదువుతున్న మెజారిటీ పాఠకులను అవమానపరిచారు.

శ్రీనివాస్ తన వ్యాసాన్ని కొనసాగిస్తూ "ఎవరి శిబిరం వారు నిర్వహించుకుంటూ కూడా ఉమ్మడి ఉత్సవాలు నిర్వహించుకోవచ్చు. కానీ, ఒకరి పొడ మరొకరికి గిట్టని తనం తెలుగులలో ఎక్కువ" అని సాహిత్య అకాడెమీ తెలుగు కన్వీనర్ సి.మృణాళిని అభిప్రాయంగా రాశారు. సాహిత్యంలోనే కాదు సభల్లోనూ, అవార్డుల్లోనూ బహుజనులను ప్రభుత్వ అకాడెమీలు, సంస్థలు అంటరాని వారుగానే చూస్తున్నాయి. ఆధిపత్య కుల సాహిత్యకారులు వేదిక మీద ముఖ్య అతిథులుగా ఉంటే వారి రాజసాన్ని తిలకించేందుకు, ప్రవచనాలను వినేందుకు బహుజనులు ప్రేక్షకులుగా హాజరు కావాలి. అంతేనా?

బ్రాహ్మణాధిపత్యం ప్రభుత్వ సొమ్ముతో అగ్రకులాల వారిని కుడి, ఎడమల భావజాలాలకు అతీతంగా పీటలపై, పీఠాలపై కూర్చుండబెట్టే పనిచేస్తూ ఉన్నది. సారాంశంలో బ్రాహ్మణాధిపత్యాన్ని స్థిరీకరిస్తున్నారు. అందుకే గతంలో ప్రశ్నించడం దగ్గరే ఆగిపోయిన బహుజనులు ఇప్పుడు ధిక్కరిస్తున్నారు. ఇది నొప్పిగానే ఉంటుంది. ఈ నొప్పి మెజారిటీ బహుజనులకు హాయినిస్తుంది.

నిజానికి ప్రతి సంవత్సరం సబాల్టర్న్ మిత్రులము 'బహుజన-కూడలి' సమావేశాలను ఏర్పాటు చేసుకుంటున్నాము. కోవిడ్ సమయంలో దాదాపు వందమంది బహుజన విమర్శకుల చేత బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు రాసిన కథ, కవిత్వ గ్రంథాలపై ఫేస్‌బుక్‌లో లైవ్ ప్రోగ్రామ్‌లను నిర్వహించాము. దున్న ఈద్దాసు తత్వాలను 'ఈష ఫౌండేషన్' ప్రోగ్రామ్‌లో పాడి మంగ్లీ ఆ తత్వాలకు ఎనలేని ఖ్యాతిని తీసుకొచ్చింది. బహుజనులు సృజిస్తున్న సాహిత్యాన్ని, విమర్శను ఎన్నడూ మెయిన్‌స్ట్రీమ్ మీడియా తగినంతగా పట్టించుకోలేదు. ఎందుకంటే అన్ని మీడియా హౌజ్‌ల సంపాదకులు / సాహిత్య పేజీల ఇంచార్జ్‌లు బ్రాహ్మణాధిపత్య భావజాలంతోనే ఉన్నారు. అదే బహుజనులకు ప్రధాన సమస్య.

నిజానికి 'బెంగళూరు' సమావేశంలో పాల్గొనకపోవడం గర్వంగా భావిస్తున్న మా లాంటి వారి మనోభావాలను కూడా మీరు గణనలోకి తీసుకోవాల్సింది. బ్రాహ్మణాధిపత్య సభలో పాల్గొనకపోవడం అంటే బహుజనుల స్వీయ అస్తిత్వ ప్రకటనగా చూడలేమా? దాన్ని మీరు 'స్వీయ అహంకారంగా' వ్యక్తీకరించారు. బహుజనులు ఎట్లుండాలో? ఏమి ఆలోచించాలో? ఎలాంటి సంస్కృతిని ప్రేమించాలో 'థాట్ పాలిసింగ్' చేయడం సమంజసం కాదు. ఆధిపత్య భావనకు 'తెలుగుదనం' ముసుగు తగిలించడం తగదు.

◆ డా. సంగిశెట్టి శ్రీనివాస్

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
హైదరాబాద్ నగర వార్తలు
ఆదివారం 25 ఆగస్టు 2024

శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 28.2 కనిష్ఠం 24.0

మహిళా జర్నలిస్టులపై దాడులు, ట్రోల్స్ ఆపండి

హైదరాబాద్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): వృత్తి నిర్వహణలో భాగంగా కవరేజీ చేసే మహిళా జర్నలిస్టులపై దాడులు, ఆన్‌లైన్‌లో ట్రోల్స్ చేయడం ఆపాలని రాష్ట్రంలోని వివిధ టీవీ ఛానళ్లలో పనిచేసే మహిళా పాత్రికేయులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇటీవలే ఇద్దరు మహిళా పాత్రికేయులపై దాడి జరిగిన నేపథ్యంలో 48 మంది పాత్రికేయులు తమ డిమాండ్లను ప్రభుత్వానికి విన్నవించారు. దాడులపై వెంటనే స్పందించేందుకు క్విక్ సపోర్ట్ సిస్టం ప్రారంభించాలని కోరారు.

జిల్లాను రోల్‌మోడల్‌గా చేస్తాం



- మీ సేవ దరఖాస్తులను పెండింగ్‌లో లేకుండా చూస్తున్నాం
- సిటిజన్ చార్టర్‌ను జాప్యం చేస్తే కఠిన చర్యలు
- తహసీల్దార్ల పనితీరుపై ప్రత్యేక దృష్టి
- స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లతో నిరంతర పర్యవేక్షణ
- మూసీ సుందరీకరణ, మెట్రో విస్తరణ పనుల్లో మా భాగస్వామ్యం
- వినియోగంలో లేని భవనాలు.. స్కూళ్లు, బస్తీ దవాఖానాలకు..
- పాఠశాలల్లో హాజరు శాతం పెంచేందుకే 'కాఫీ విత్ కలెక్టర్'

"ప్రభుత్వ సహకారంతో హైదరాబాద్ జిల్లాను రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దుతాం. జిల్లా పరిధిలో స్కూళ్లు, బస్తీ దవాఖానాలు, అంగన్‌వాడీ కేంద్రాలు చాలా వరకు ఇప్పటికీ అద్దె భవనాల్లోనే నడుస్తున్నాయి. వాటికి ఏడాదికి రూ. కోటికి పైగా అద్దె చెల్లిస్తున్నాం. ప్రభుత్వ అనుమతితో వాటన్నింటిని వినియోగంలో లేని సర్కారు భవనాలకు తరలించి అద్దె భారాన్ని తగ్గిస్తాం. విద్య, వైద్య రంగాలను మరింత అభివృద్ధి చేసి పేదలకు అందుబాటులోకి తీసుకువస్తాం."

ఇంటర్వ్యూ..

అనుదీప్ దురిశెట్టి
- కలెక్టర్, హైదరాబాద్ జిల్లా

'కాఫీ విత్ కలెక్టర్' లక్ష్యమేమిటి?

పాఠశాలల్లో హాజరు శాతం పెంచేందుకు కాఫీ విత్ కలెక్టర్ కార్యక్రమాన్ని ఇటీవల ప్రారంభించాం. ఉపాధ్యాయులను ప్రోత్సహించేందుకే దీనిని అమలు చేస్తున్నాం. ప్రతి రెండు వారాలకు హాజరుశాతం పెంచిన హెచ్‌ఎంలతో సమావేశమవుతున్నా. వారితో కలిసి కాఫీ తాగడంతో మంచి స్పందన వస్తోంది.

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): విద్య, వైద్యం, సంక్షేమ రంగాలను పరిపుష్టి చేస్తూ జిల్లాను అభివృద్ధి పథంలో పయనింపజేసేందుకు కృతనిశ్చయంతో ఉన్నామని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. రాష్ట్రానికి జిల్లాను రోల్‌మోడల్‌గా తీర్చి దిద్దుతామన్నారు. వెనుకబడిన రంగాలపై ప్రత్యేక దృష్టి సారించి పరిపాలన విధానంలో కఠినంగా వ్యవహరిస్తూ పలు మార్పులకు శ్రీకారం చుడుతున్నట్లు తెలిపారు. జిల్లాలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు, పరిపాలన తదితర విషయాలపై కలెక్టర్ 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

జిల్లాలో రెవెన్యూ పాలన ఎలా ఉంది?

బాగుంది. మండలాల్లో తహసీల్దార్లు మొదలుకుని కింది స్థాయి సిబ్బంది వరకు అందరూ నిబద్ధతతో పని చేస్తున్నారు. తహసీల్దార్ల పనితీరును పర్యవేక్షించేందుకు 8 మంది స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లకు రెండు మండలాల చొప్పున బాధ్యతలు అప్పగించాం. 30 అంశాలకు సంబంధించిన ప్రశ్నావళిని తయారు చేసి వారి విధులకు మార్కులు వేస్తున్నారు. ఇందులో వచ్చిన మార్కులే తహసీల్దార్ల పనితీరుకు కొలమానం. మంచిగా పనిచేస్తున్న వారిని సోమవారం జరిగే 'ప్రజావాణి'లో అభినందిస్తున్నాం.

సర్టిఫికెట్ల జారీలో జాప్యం నివారణకు ఏం చేస్తున్నారు?

కుల, ఆదాయ, ఇతర సర్టిఫికెట్ల కోసం మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకున్న వారికి నిర్ణీత కాల వ్యవధిలో అందజేస్తున్నాం. సిటిజన్ చార్టర్‌ను అమలు చేయకుండా జాప్యం చేస్తున్న వారిపై చర్యలు తీసుకుంటు న్నాం. మీ సేవా ద్వారా వచ్చిన దరఖాస్తులను, జారీ చేసిన సర్టిఫికెట్లను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో ఉంచుతున్నాం. 2023 జూలై 1 నుంచి

మిగతా 8వ పేజీలో..

పార్కింగ్ ఫీజు వసూలుపై వెనక్కి

- యూటర్న్ తీసుకున్న ఎల్ అండ్ టీ
- నాగోలు, మియాపూర్‌లలో తాత్కాలికంగా వాయిదా


నాగోల్ స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన పార్కింగ్ ఫీజు బోర్డు(ఫైల్)

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): పెయిడ్ పార్కింగ్ విధానంపై ఎల్ అండ్ టీ యూటర్న్ తీసుకుంది. నాగోలు, మియాపూర్ స్టేషన్లలో అమలులోకి తీసుకురానున్న ఫీజు వసూలును తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు శనివారం ప్రకటించింది. ఫీజు విధానంపై మరికొద్ది రోజుల్లో తేదీలను ప్రకటించనున్నట్లు వెల్లడించింది. దీంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నాగోల్ స్టేషన్‌లో ఈనెల 25 నుంచి, మియాపూర్‌లో సెప్టెంబర్ 1నుంచి పెయిడ్ పార్కింగ్‌ను అమలులోకి తీసుకొస్తున్నట్లు ఇటీవల ఎల్అండ్‌టీ ప్రకటించింది. ఇందులో భాగంగా ఈనెల 14న నాగోల్‌లో పెయిడ్ పార్కింగ్‌పై ట్రయల్‌రన్ నిర్వహించడంతో వందలాది మంది ప్రయాణికులు ఆందోళన చేపట్టారు. పెయిడ్ పార్కింగ్‌ను ఉపసంహరించకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని సామాజిక మాధ్యమాల ద్వారా హెచ్చరించారు. ఇదే క్రమంలో నాగోలు పరిసర ప్రాంతాలకు చెందిన మెట్రో ప్రయాణికులు ఆదివారం నాగోల్ మెట్రోస్టేషన్ వద్ద మహాధర్నాకు పిలుపునివ్వడంతో ఎల్ అండ్ టీ యాజమాన్యం అప్రమత్తమైంది. ఈ మేరకు నాగోలు,

మిగతా 8వ పేజీలో..

హై..డర్‌ర్!

- అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం
- కొనసాగుతున్న కూల్చివేతలు


ఎన్ కన్వెన్షన్‌లో కూల్చివేతలు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) కబ్జాదారుల గుండెల్లో వణుకు పుట్టిస్తోంది. నిబంధనలను తుంగలో తొక్కి, ఇష్టారాజ్యంగా ప్రభుత్వ స్థలాలు, చెరువులు, కుంటలను ఆక్రమించి నిర్మాణాలు చేసిన, చేస్తున్న వారిని గడగడలాడిస్తోంది. కేవలం 42 రోజుల్లో చిన్న, పెద్ద భవనాలన్నీ కలిపి దాదాపు 70కి పైగా అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేయడంతో రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. తాజాగా శనివారం ఖానామెట్ గ్రామ పరిధిలో ప్రముఖ సినీనటుడు నాగార్జునకు చెందిన ఎన్.కన్వెన్షన్‌ను కూల్చివేయడం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. చెరువులను చెరపట్టిన వారిలో ఎంతటి వారున్నా వదిలేది లేదని దూకుడు ప్రదర్శిస్తుండడం ఆసక్తికరంగా మారింది.

హైడ్రా కూల్చివేతలు ఇవే..!


- **జూలై 12:** హైడ్రా ఏర్పాటు
- **ఆగస్టు 6:** గాజులరామారం, దేవేందర్‌నగర్‌లో 52 అక్రమ నిర్మాణాల కూల్చివేత
- **7:** నందగిరిహిల్స్, జూబ్లీహిల్స్‌లో 17 నిర్మాణాల తొలగింపు
- **10:** శాస్త్రీపురంలోని బూమ్‌రుఖ్ ఉద్ దవాళ్ చెరువులో అక్రమ నిర్మాణాలు నేలమట్టం
- **15:** నిజాంపేట కార్పొరేషన్, ప్రగతినగర్ ప్రాంతంలోని ఎర్ర చెరువు (ఎఫ్‌టీఎల్) భూమిలో మూడు, ఐదంతస్తు భవనాలు..
- **18:** గండిపేట మండలం అప్పోజిగూడ పంచాయతీలోకి వచ్చే మూడు భవనాలు, చిలుకూరు పరిధిలోని ఒక భవనం కూల్చివేత
- **24:** ఖానామెట్‌లోని సినీ నటుడు నాగార్జునకు చెందిన ఎన్-కన్వెన్షన్‌ను కూల్చివేశారు.

స్నేహితుడే హంతకుడు

- బీటెక్ విద్యార్థి ప్రశాంత్ హత్య కేసు ఛేదన
- ప్రియురాలికి చెడుగా చెబుతున్నాడని హత్య
- ఏడుగురి అరెస్ట్


నిందితులతో బాలాపూర్ పోలీసులు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): స్నేహితుడే హంతకుడయ్యాడు. బాలానగర్ పీఎస్ పరిధిలో జరిగిన బీటెక్ విద్యార్థి ప్రశాంత్ హత్య కేసును పోలీసులు ఛేదించారు. ప్రేమించిన అమ్మాయికి తన గురించి చెడుగా చెబుతున్నాడన్న కక్షతోనే ప్రశాంత్‌ను అతని స్నేహితుడు హత్య చేసినట్లు పోలీసులు తేల్చారు. హంతకుడితో పాటు అతనికి సహకరించిన మరో ఆరుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. బాలాపూర్‌కు చెందిన మహదేవ్ యాదవ్, ప్రశాంత్ ఇద్దరు స్నేహితులు. సోషల్ మీడియాలో నకిలీ ఖాతాను ప్రారంభించిన ప్రశాంత్, మహదేవ్‌యాదవ్ ప్రేమించిన అమ్మాయితో చాటింగ్ చేసేవాడు. తన గురించి ప్రియురాలికి చెడుగా చెబుతున్నాడని మహదేవ్ స్నేహితుడిపై అనుమానపడి కక్ష పెంచుకున్నాడు. ఎలాగైనా ప్రశాంత్‌ను అంతమొందించాలని పథకం వేసుకున్నాడు. తన స్నేహితులు నాదర్‌గుల్‌కు చెందిన చింతల మహేష్ యాదవ్(25), రామోజు సుమంత్‌చారి(21), బాలాపూర్‌కు చెందిన నల్లపూసల మహేష్(24), దొడ్డి హరీష్(23), మాదాపురం అఖిల్ కిరణ్‌కుమార్(20), కోహెడ యశ్వంత్(19)లతో కలిసి పథకం పన్నాడు. అందులో భాగంగా ఈనెల 22న బాలాపూర్‌లోని మండీ వద్దకు ప్రశాంత్‌ను పిలిచాడు. మాటామాటా పెరగడంతో మహదేవ్ కత్తితో ప్రశాంత్‌ను పొడిచాడు. తీవ్రగాయాలు కావడంతో ప్రశాంత్ అక్కడికక్కడే చనిపోయాడు. దాడి చేసిన అనంతరం మహదేవ్.. అతని స్నేహితులతో పాటు పరారయ్యాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న బాలాపూర్ పోలీసులు కుర్మగూడ హెచ్‌పీ గోదాం వద్ద నిందితులను అరెస్ట్ చేశారు.



గ్రేటర్‌లో 9 సర్కిళ్లలో
ఎస్‌ఈల బదిలీలు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీసీఎల్) గ్రేటర్ పరిధిలోని 9 సర్కిళ్ల సూపరింటెండింగ్ ఇంజనీర్ల(ఎస్‌ఈ)ను బదిలీ చేస్తూ సీఎండీ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. బంజారాహిల్స్ సర్కిల్ ఎస్‌ఈ చంద్రశేఖర్‌ను సైబర్‌సిటీ సర్కిల్ ఎస్‌ఈగా, మేడ్చల్ సర్కిల్ ఎస్‌ఈ డీఎస్ మోహన్‌ను రాజేంద్రనగర్ సర్కిల్‌కు బదిలీ చేశారు. సికింద్రాబాద్ సర్కిల్ ఎస్‌ఈ రవికుమార్‌ను మేడ్చల్ సర్కిల్‌కు, సంగారెడ్డి సర్కిల్ ఎస్‌ఈ మాధవరెడ్డిని సరూర్‌నగర్ సర్కిల్‌కు, సరూర్‌నగర్ సర్కిల్ ఎస్‌ఈ కరుణాకర్‌బాబును బంజారాహిల్స్ సర్కిల్‌కు, సైబర్‌సిటీ సర్కిల్ ఎస్‌ఈ పి.వెంకన్నను హైదరాబాద్ సెంట్రల్ సర్కిల్ ఎస్‌ఈగా బదిలీ చేయగా, సంగారెడ్డి సర్కిల్ ఎస్‌ఈగా శ్రీనాథ్‌ను హైదరాబాద్ సౌత్ సర్కిల్ ఎస్‌ఈగా సోమిరెడ్డిని నియమించారు. గ్రీన్‌ల్యాండ్స్ డీఈ సుధీర్‌కుమార్‌కు ఎస్‌ఈగా ఫుల్ అడిషనల్ చార్జ్ (ఎఫ్ఏసీ) ఇస్తూ యాదాద్రి సర్కిల్‌కు బదిలీ చేశారు. గ్రేటర్‌జోన్‌లో 9 సర్కిళ్ల ఎస్‌ఈలను బదిలీ చేయడం ఇదే మొదటిసారి. త్వరలో సీఈ, డీఈ, ఏడీఈల బదిలీలు ఉంటాయని విద్యుత్ వర్గాల్లో చర్చ నడుస్తోంది.

సైరన్‌ను దుర్వినియోగం చేస్తే
కఠిన చర్యలు

- సిటీ కమిషనర్ కె.శ్రీనివాస్‌రెడ్డి
- అత్యవసర వాహనాల ప్రాధాన్యతకు ప్రత్యేక సాఫ్ట్‌వేర్ : అడిషనల్ సీపీ
- అంబులెన్స్ డ్రైవర్స్, ఆస్పత్రి యాజమాన్యాలతో ప్రత్యేక సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): అవసరం ఉన్నా, లేకున్నా అంబులెన్స్ సైరన్‌ను దుర్వినియోగం చేస్తే కఠినచర్యలు తీసుకుంటామని నగర పోలీస్ కమిషనర్ కె.శ్రీనివాస్‌రెడ్డి హెచ్చరించారు. బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ట్రాఫిక్ అడిషనల్ సీపీ విశ్వప్రసాద్‌తో కలిసి ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు, అంబులెన్స్ డ్రైవర్స్‌తో శనివారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. కొంతమంది అంబులెన్స్ డ్రైవర్స్ సైరన్‌ను పెద్ద ఎత్తున దుర్వినియోగం చేసి నగరవాసులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ఎమర్జెన్సీ కేసులు, ట్రామాకేర్ అవసరమయ్యే ప్రమాద బాధితులు, బేసిక్ లైఫ్‌సపోర్టు, అడ్వాన్స్‌డ్ లైఫ్‌సపోర్టు, క్రిటికల్‌కేర్ అవసరమైన రోగులను రవాణా చేసేటప్పుడు మాత్రమే అంబులెన్స్ సైరన్ వినియోగించాలని సూచించారు. రోగులను ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేసి ఇంటికి, ఇంటి నుంచి ఆస్పత్రులకు తరలించేటప్పుడు, మృతదేహాలను తరలించేటపుడు, స్వల్పంగా గాయపడిన వారిని, డయాలసిస్ రోగులను ఆస్పత్రులకు తరలించేటప్పుడు సైరన్‌ను దుర్వినియోగం చేయొద్దని సూచించారు. అలా కాకుండా ఇష్టానుసారంగా అంబులెన్స్‌లు నడిపినా, సైరన్ దుర్వినియోగం చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అడిషనల్ సీపీ విశ్వప్రసాద్ మాట్లాడుతూ అత్యవసర వాహనాల ప్రాధాన్యత కోసం త్వరలోనే కొత్త సాఫ్ట్‌వేర్‌ను అందుబాటులోకి తెస్తున్నామన్నారు. అంబులెన్స్‌లపై పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించగా.. 310 వాహనాలు చెక్ చేస్తే అందులో 152 వాహనాలు రోగులను ఆస్పత్రులకు తరలిస్తుండగా.. 20 వాహనాలు మృతదేహాలను తరలిస్తున్నాయని తెలిపారు. 17 వాహనాలు ఖాళీగా, 121 వాహనాలు ఇతర అవసరాలకోసం రవాణా జరిగినట్లు గుర్తించామన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ డీసీపీలు రాహుల్ హెగ్డే, ఆర్. వెంకటేశ్వర్లు, ఎన్. అశోక్‌కుమార్, ఆర్ఎంవో రవీందర్ నాయక్ నిలోఫర్ ఆస్పత్రి, హైదరాబాద్ ప్రైవేట్ అంబులెన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేష్, ట్రాఫిక్ ఏసీపీలు పాల్గొన్నారు.

70 వసంతాలు.. అడుగులు

90% ఖైరతాబాద్ గణేశ్ విగ్రహ ఏర్పాటు పనులు పూర్తి



8

అతివలకు భద్రత
అంతంతమాత్రమేనా.!

గ్రేటర్‌లో మహిళల రక్షణపై మొదలైన చర్చ

కోల్‌కతా వైద్యురాలిపై హత్యాచార ఘటన యావత్ దేశాన్ని కలవరపాటుకు గురిచేసింది. మొన్న ఢిల్లీలో పారా మెడికల్ విద్యార్థిని నిర్భయ ఉదంతం.. నిన్న నగరంలో దంత వైద్యవిద్యార్థిని దిశ దుర్ఘటన.. తాజాగా కోల్‌కతా మెడికో.. ఇంకెంతమంది మృగాళ్ల అమానుషత్వానికి బలికావాలన్నది మహిళా లోకం సంధిస్తున్న ప్రశ్న. దేవాలయాల్లాంటి ఆస్పత్రుల్లో దైవంతో సమంగా భావించే వైద్యురాలికే భద్రత లేకపోకపోతే, 'అతివలకు రక్షణ ఎక్కడ'?. ఈ క్రూర చర్యను నిరసిస్తూ నగరంలోనూ యువత, వైద్య విద్యార్థులు, పౌరసమాజం పోరాడుతోంది. ఈ నేపథ్యంలో 'అతివలకు నగర పరిసరాలు ఎంతవరకు సురక్షితం' అన్న విషయం మీదా చర్చ మొదలైంది.



హైదరాబాద్ సిటీ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): విశ్వనగరంగా ఖ్యాతికెక్కిన హైదరాబాద్ నగర శివారులోని అంతర్జాతీయ విమానాశ్రయానికి కూతవేటు దూరంలో తొండుపల్లి ఔటర్ రింగురోడ్డు టోల్‌ప్లాజా దగ్గర కొన్నాళ్ల కిందటి వరకు నిర్మానుష్యంగా ఉన్న ప్రదేశం 'దిశ' మరణఘోషకు మౌనసాక్షిలా నిలిచింది. ఆమె ఆర్తనాదాలతో పెక్కటిల్లిన ఆ ప్రదేశంలో ప్రస్తుత పరిస్థితి కాస్త మెరుగుపడినప్పటికీ నగరంలో అలాంటి నిర్మానుష ప్రదేశాలు మరెన్నో ఉన్నాయని మహిళా సంఘాల ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో రాత్రి తొమ్మిది గంటల తర్వాత మహిళలు ఒంటరిగా వెళ్లలేని దుస్థితి ఉందని వారు ఆవేదన చెందుతున్నారు.

బస్టాప్‌ల్లో నిల్చోవాలన్నా భయమే..

రాత్రివేళల్లో యూసఫ్‌గూడ బస్తీ బస్టాప్‌నకు ఎదురు పరిసరాలు అల్పాహార బండ్లతో సందడిగా ఉంటాయి. అయినా.. ఒంటరిగా మహిళలు అటువైపు వెళ్లలేని దయనీయ పరిస్థితి. బస్టాప్‌లో నిల్చున్న మహిళలను, అటుగా వెళ్లే కొందరు ఆకతాయిలు, పోకిరీలు

మిగతా 8వ పేజీలో..

తాగుబోతుల వీరంగంతో..

కొన్ని ప్రాంతాల్లో వైన్‌షాప్‌ల వల్ల తాగుబోతుల వీరంగంతో మహిళలు రోడ్డుమీద నడవడానికి కూడా ఇబ్బంది పడుతున్నారు. సంజీవరెడ్డినగర్ కమ్యూనిటీ హాల్ చుట్టుపక్క పరిసరాల్లో ఎన్నో ఉమెన్స్ హాస్టళ్లు, ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూట్‌లు ఉన్నాయి. అక్కడి వైన్ షాపు దగ్గర తాగుబోతుల వీరంగం సృష్టిస్తుంటారు. దీంతో అటుగా విద్యార్థినులు రాకపోకలు సాగించడానికి వెనుకాడుతున్నారు. చింతల్‌బస్తీ, బల్కంపేట రోడ్డు, కృష్ణానగర్, రెహ్మత్‌నగర్...ఇలా ఒకటేమిటి, మద్యం దుకాణాల పరిసరాలన్నీ తాగుబోతుల అడ్డాగా మారడంతో రాకపోకలు సాగించలేకపోతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మాకూ ఇళ్ల స్థలాలు ఇవ్వండి

మంత్రి పొంగులేటికి గ్రేటర్ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ నేతల విజ్ఞప్తి

చిక్కడపల్లి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): 'గ్రేటర్ హైదరాబాద్‌లో పనిచేస్తున్న మాకూ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి' అని మంత్రి పొంగులేటి శ్రీనివా‌స్‌రెడ్డిని గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ నాయకులు కోరారు. సొసైటీ అధ్యక్షుడు మామిడి సోమయ్య, కార్యదర్శి బొల్లం శ్రీనివాస్, డైరెక్టర్లు రామారావు, ఉద్రసేన్ తదితరులు శనివారం సచివాలయంలో మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సోమయ్య తమ సొసైటీ గురించి మంత్రికి వివరించారు. జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్ట్స్ సొసైటీ సభ్యులకు ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవడం అభినందనీయమని, అదే విధంగా తమ సొసైటీకీ స్థలం కేటాయించి అర్హులైన జర్నలిస్టులకు న్యాయం చేయాలని కోరారు. 2008లో ఏర్పడిన తమ సొసైటీలో చాలా మంది సీనియర్ జర్నలిస్టులు ఇళ్లస్థలాల కోసం ఎదురు చూస్తున్నారని మంత్రికి వివరించారు. కాగా, కోర్టు ఆదేశం మేరకు జవహర్‌లాల్ నెహ్రూ సొసైటీకి మొదట ఇళ్ల స్థలాలు ఇస్తామని, మిగతా సొసైటీలకు త్వరలో ఇస్తామని మంత్రి హామీ ఇచ్చారని వారు తెలిపారు.

నగరంలో పలు ప్రాంతాల్లో వర్షం

● మరో రెండురోజులు తేలికపాటి నుంచి మోస్తరు వాన

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): నగరంలో పలు ప్రాంతాల్లో శనివారం రాత్రి కురిసిన వర్షంతో రహదారులు జలమయమయ్యాయి. మోతీనగర్, బంజారాహిల్స్, పంజాగుట్ట, జూబ్లీహిల్స్ బోరబండ, యూసుఫ్‌గూడ, కూకట్‌పల్లి, కృష్ణానగర్ ప్రాంతాల్లో కురిసిన భారీవర్షానికి లోతట్టు ప్రాంతాలు నీటితో నిండాయి. మరో రెండు రోజుల పాటు గ్రేటర్‌లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం, పలు ప్రాంతాల్లో ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశముందని బేగంపేట వాతావరణశాఖ అధికారులు తెలిపారు. నైరుతి దిశగా ఉపరితల గాలులు 8-12 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశముందన్నారు.

హరిహర కళాభవన్‌లో రేపు శ్రీకృష్ణ జయంత్యుత్సవం

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో ఈనెల 26న రాత్రి 7గంటలకు 65వ శ్రీకృష్ణ జయంత్యుత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర యాదవ మహాసభ అధ్యక్షుడు యల్లావుల చక్రధర్‌యాదవ్ తెలిపారు. శనివారం సికింద్రా బాద్‌లో ఉత్సవాలకు సంబంధించిన బ్రోచర్‌ను సంఘం నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. జంట నగరాలకు చెందిన యాదవులు భారీ సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయంతం చేయాలని చక్రధర్‌యాదవ్ కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు అంజన్‌యాదవ్, ప్రవీణ్‌యాదవ్, కృష్ణయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో 300 మందికి జైలు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఆగస్టు 1నుంచి 23 వరకు నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో 3,495మంది పట్టుబడగా 300మందికి న్యాయస్థానం ఒకరోజు నుంచి 10 రోజుల వరకు జైలుశిక్ష విధించిందని అడిషనల్ సీపీ ట్రాఫిక్ విశ్వప్రసాద్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 3,495 మందిపై చార్జ్‌షీట్ నమోదు చేసి కోర్టులో హాజరుపర్చగా న్యాయస్థానం వారికి రూ.76,43,700 జరిమానా విధించింది. 19 మంది డ్రైవింగ్ లైసెన్సులను 2 నుంచి 6 నెలల వరకు రద్దు చేసింది. ఈనెల 3న నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో 318 మంది పట్టుబడ్డారు.



నాగమణికి మొక్కను అందజేస్తున్న క్యూరేటర్ డాక్టర్ సునీల్ ఎస్.హిరెమత్

డిప్యూటీ క్యూరేటర్ సేవలు అభినందనీయం

● బదిలీపై వెళ్తున్న నాగమణికి ఘనంగా వీడ్కోలు

మదీన, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): జూపార్కు అభివృద్ధి కోసం డిప్యూటీ క్యూరేటర్ ఎ.నాగమణి చేసిన సేవలు అభినందనీయమని క్యూరేటర్ డాక్టర్ సునీల్ ఎస్.హిరెమత్ అన్నారు. డిప్యూటీ క్యూరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆమె అటవీ శాఖ ప్రధాన కార్యాలయం అరణ్య భవన్‌కు బదిలీపై వెళ్లారు. శనివారం జూపార్కులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది నాగమణికి మొక్కను అందజేసి సత్కరించి ఘనంగా వీడ్కోలు పలికారు. ఆమె స్థానంలో అసిస్టెంట్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ బర్నోబ బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ (వెటర్నరీ) డాక్టర్ ఎం.ఎ. హకీమ్, అసిస్టెంట్ క్యూరేటర్లు విష్ణువర్ధన్, అమృత, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ ఆర్.దేవేందర్, అధికారులు వెంకట్‌రావు, శ్రీనివాస్, ప్రజా సంబంధాల అధికారి హనీఫుల్లా తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ విజయ్‌కుమార్ గౌడ్‌ను సత్కరిస్తున్న మోకు దెబ్బ నేతలు అమరవేని నర్సాగౌడ్, సిద్ధిరాములు గౌడ్ తదితరులు

నిరుపేద గీతకార్మికులకు ఉచితంగా వైద్యసేవలు

● డాక్టర్ విజయ్‌కుమార్ గౌడ్‌కు మోకు నాయకుల సన్మానం

బర్కత్‌పుర, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): సుప్రజ ఆస్పత్రి ఎండీ డాక్టర్ విజయ్‌కుమార్ గౌడ్ నిరుపేద గీతకార్మికులకు ఉచితంగా వైద్య సేవలు అందించడం అభినందనీయమని మోకు దెబ్బ నాయకులు కొనియాడారు. శనివారం బషీర్‌బాగ్‌లోని మోకు దెబ్బ కార్యాలయంలో జాతీయ అధ్యక్షుడు అమరవేని నర్సాగౌడ్, జనరల్ సెక్రటరీ రాగుల సిద్ధిరాములు గౌడ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొండాపురం బాలరాజుగౌడ్ తదితరులు డాక్టర్ విజయ్‌కుమార్‌గౌడ్‌కు పూలమాల వేసి శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటి వరకు తాటిచెట్లపై నుంచి కిందపడి గాయాలైన 84 మంది నిరుపేద గీతకార్మికులకు డాక్టర్ విజయ్‌కుమార్‌గౌడ్ ఉచితంగా వైద్యం అందించి వారికి మందులు అందజేశారని తెలిపారు. ఇటీవల నర్సింహులుగౌడ్‌కు ఉచితంగా వైద్యం అందించాడని వారన్నారు. తమ సేవలను మరింత విస్తృతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.



వెంకటేశ్ యాదవ్‌ను సత్కరిస్తున్న అరుణ్ సింగ్, రమేశ్ వైకర్

బోయిని వెంకటేశ్ యాదవ్‌కు సత్కారం

గోషామహల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్ యాదవ సంఘం(జాంబాగ్) అధ్యక్షుడిగా బోయిని వెంకటేశ్ యాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు గౌలిగూడలోని బీజేపీ కార్యాలయంలో శనివారం బేగంబజార్ డివిజన్ బీజేపీ యువజన నాయకులు అరుణ్‌సింగ్, రమేశ్ వైకర్, శక్తిసింగ్, ఆశీష్‌వ్యాస్ చెనారామ్, రాహుల్, శివ, ఆశీష్ వాగ్మారే, పవన్ షిండే, విజయ్, ఆనంద్‌ల ఆధ్వర్యంలో బోయిని వెంకటేశ్ యాదవ్‌ను ఘనంగా సత్కరించారు. ఆయనకు శ్రీకృష్ణుడు చిత్రపటాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్‌యాదవ్ మాట్లాడుతూ.. గ్రేటర్ హైదరాబాద్‌లో ఉన్న యాదవులందరినీ ఏకతాటిపై తీసుకొచ్చి సంఘం అభివృద్ధి కోసం కృషి చేస్తానన్నారు.



కంప్యూటర్లను అందజేసిన యంగిస్థాన్ ఫౌండేషన్ ప్రతినిధులు

ఆంధ్ర విద్యాలయ పాఠశాలకు కంప్యూటర్ల అందజేత

గోషామహల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న వెనుకబడిన విద్యార్థులను ఆదుకుంటామని యంగిస్థాన్ ఫౌండేషన్ వాలంటరీస్ ప్రతిక్ష సాలియన్ పేర్కొన్నారు. జాంబాగ్‌లోని కట్టెలమండిలో ఉన్న ఆంధ్ర విద్యాలయ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు ఏవీఐ-ఎస్‌పీఎల్ కంపెనీ, యంగిస్థాన్ ఫౌండేషన్ ఎన్‌జీఓస్ కళ్యాణ్ ముంబై వ్యవస్థాపకులు మితిలేష్ జూ సహకారంతో రెండు కంప్యూటర్లను, 50 మంది విద్యార్థులకు రెయిన్ కోట్లు శనివారం అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో వెనుకబడిన విద్యార్థులను ఆదుకోవడమే కాకుండా నూతన టెక్నాలజీతో కంప్యూటర్ విద్యను అందించడానికి చేయూతనిస్తున్నామని యంగిస్థాన్ ఫౌండేషన్ వాలంటరీస్ ప్రతిక్ష సాలియన్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రశాంత్, విశాల్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చల్లా శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు హేమ, మంజుల, సునీత, ఆర్.కవిత, ప్రియా, సంగీత తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కలతో ఇబ్బందులు

రాజేంద్రనగర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని హైదర్‌గూడ, అత్తాపూర్, శివానగర్, బుద్వేల్, రాజేంద్రనగర్ పరిసర ప్రాంతాలలో వీధి కుక్కలు బెడద తీవ్రంగా ఉంది. రోడ్లపై వెళ్తున్న వారిపై గుంపులుగా ఎగబడుతున్నాయి. దాంతో నడుచుకుంటూ వెళ్లడానికి స్థానికులు హడలిపోతున్నారు. ఎర్రబోడ, సిరిమల్లెకాలనీ, నలందనగర్‌లలో రోడ్డుపై నడుచుకుంటు వెళ్లడమే గగనంగా మారింది. హైదర్‌గూడ పరిసర కాలనీలలో ఇంటి ముందు పార్కు చేసిన కార్ల టైర్లను, విడిభాగాలను కొరికేశాయి. కారు ముందు భాగంపై కాళ్లతో రక్కడంతో గీతలు పడ్డాయి. వెటర్నరీ అధికారులు కాలనీలో గుంపులు గుంపులుగా సంచరిస్తున్న వీధి కుక్కలను పట్టుకెళ్లాలని స్థానికులు కోరుతున్నారు.



కుక్కలు కొరికేసిన కారు విడి భాగాలు



రోడ్డుపై వీధి కుక్కలు

గోషామహల్ అభివృద్ధికి ప్రణాళికలు: రాజాసింగ్



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రాజాసింగ్, కార్పొరేటర్ లాల్‌సింగ్

అఫ్జల్‌గంజ్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): గోషామహల్ నియోజకవర్గ సమగ్రాభివృద్ధి ప్రణాళికలు రూపొందించామని ఎమ్మెల్యే రాజాసింగ్ పేర్కొన్నారు. దశలవారీగా అభివృద్ధి పనులను చేపడుతున్నామని ఆయన అన్నారు. నియోజకవర్గ పరిధిలోని సీతారాంపేట్ చౌరస్తా, ఆగాపురా, ఎస్‌బీహెచ్ ఆర్యసమాజ్ లేన్ తదితర ప్రాంతాల్లో రూ.85 లక్షలతో చేపడుతున్న నూతన సీసీ రోడ్డు పనులకు కార్పొరేటర్ లాల్‌సింగ్‌తో కలిసి ఎమ్మెల్యే రాజాసింగ్ శనివారం శంకుస్థాపన చేశారు. స్థానిక బస్తీల్లో పాదయాత్ర నిర్వహించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అభివృద్ధి పనులలో కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాలను పాటించాలని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎస్.సురేశ్, నరహరి, దీపక్‌కుమార్, అక్షయ్‌సాహు, శ్యామ్‌రావు, గణేష్, ప్రవీణ్, కిషన్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను నాణ్యతతో చేపట్టాలి

● సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులు ప్రారంభించిన కౌన్సిలర్

పహాడిషరీఫ్ ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులను నాణ్యతతో చేపట్టాలని కౌన్సిలర్ బుడుమల యాదగిరి కాంట్రాక్టర్‌కు సూచించారు. జల్‌పల్లి మున్సిపాలిటీ 16వ వార్డులో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో సమీపంలోని సిరోమన్ ఇంటి నుంచి పీ సెవన్ రోడ్డు వరకు రూ. 20 లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు, భూగర్భ డ్రైనేజీ పనులను శనివారం కౌన్సిలర్ ప్రారంభించారు. సీసీ రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఆగిపోయిన పనులు, మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి చొరవతో పెండింగ్‌లోని అభివృ పనులు వేగంగా జరుగుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో వై. నర్సింహా, సిరోమన్, రాము తదితరులు పాల్గొన్నారు



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కౌన్సిలర్ బుడుమల యాదగిరి

ర్యాగింగ్, మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలి

రాజేంద్రనగర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ర్యాగింగ్, మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ డి. ప్రకాశ్‌రావు సూచించారు. సైబరాబాద్ పోలీసులు, షీ టీమ్స్ ఆధ్వర్యంలో శనివారం రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ కళాశాలలోని విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ప్రకాశ్‌రావు సైబర్ నేరాలు, మొబైల్ యాప్‌లు, సోషల్ మీడియాలో వస్తున్న గుర్తుతెలియని వ్యక్తులు పంపిస్తున్న లింకులు తదితర అంశాలపై విద్యార్థులకు వివరించారు. సాధ్యమైనంత వరకు విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలన్నారు. సబ్జెక్ట్ సంబంధించిన అంశాలను మాత్రమే వెబ్‌సైట్లలో వెతికి చక్కగా చదువుకోవాలని సూచించారు. మహిళా భద్రతకు ప్రభుత్వం, పోలీసులు పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. ఇతరులు దాడులు చేసినప్పుడు ఎలా ఎదుర్కోవాలో స్వీయ రక్షణ విన్యాసాలను మహిళా విద్యార్థినుల ద్వారా చేసి చూపించారు. యాంటీ ర్యాగింగ్ అవగాహన కార్యక్రమంలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ఏఎస్‌ఐ ప్రకాశ్‌రావు సర్టిఫికేట్‌లు అందజేశారు. ఈ సందర్భంగా 'విద్యార్థులతో ర్యాగింగ్ దూరంగా ఉంటాం.. మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలో జోలికి వెళ్లమంటూ' విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. రుద్రమదేవీ స్వీయ రక్షణ బృందం ఆధ్వర్యంలో పోకిరీల నుంచి మహిళల నుంచి తమంతట తామే ఎలా ఎదుర్కోవాలో శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ షీ టీమ్ బృందం బాల్‌రాజ్, సురేశ్, కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ సి.నరేందర్ రెడ్డి, జాతీయ సేవా పథకం ప్రోగ్రాం కో-ఆర్డినేటర్లు, విద్యార్థి వ్యవహారాల ఇన్‌చార్జి పాల్గొని యాంటీ ర్యాగింగ్ వార్షికోత్సవాలను వివరించారు.





మాట్లాడుతున్న ఏఎస్‌ఐ ప్రకాశ్‌రావు... ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

నూతన సంస్కరణలు, ఆలోచనలతో వ్యాపార రంగంలో రాణించొచ్చు

ప్రపంచీకరణ విధానాలను అర్థం చేసుకోవాలి: సిటీ కాలేజీ ప్రిన్సిపాల్

చార్మినార్ ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలోనే ప్రపంచీకరణ వ్యాపార విధానాలను అర్థం చేసుకోవాలని సిటీ కాలేజీ ప్రిన్సిపాల్ బాల భాస్కర్ సూచించారు. నూతన సంస్కరణలు, ఆలోచనలు, ప్రాముఖ్యత తెలుసుకుంటే వ్యాపార రంగంలో రాణించవచ్చని ఆయన అన్నారు. సిటీ కళాశాల కామర్స్ విభాగం, ఆంత్రప్రెన్యూర్ డెవలప్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు ఆంత్రప్రెన్యూర్‌షిప్‌పై అవగాహన సదస్సు జరిగింది. శనివారం స్కిల్ ఇండియా సఫల్ ప్రతినిధులు హాజరై వ్యాపార అవకాశాలు, మెళకువలు, ఆర్థిక వనరుల సమీకరణ, వ్యాపార నిర్వహణ, ప్రభుత్వం పథకాల గురించి విద్యార్థులకు అవగాహన కలిగించారు. విద్యార్థులలో స్వీయప్రేరణ, సమయ నిర్వహణ, వినియోగదారుల అవసరాలపై అవగాహన తదితర అంశాలపై చర్చించారు. క్యూ కామర్స్ ఏఐ ఆధారిత వ్యాపారాలను ప్రస్తుత నేడు సమాజంలో చూస్తున్నాం. వాటికి అనుగుణంగా విద్యార్థులు కూడా ఆంత్రప్రెన్యూర్‌గా మారి, నలుగురికీ ఉపాధిని అందించాలని అన్నారు. కార్యక్రమంలో కామర్స్ విభాగాధిపతి డా. మల్లికార్జున్, డా. ఝాన్సీరాణి, డా. శిరీష, డా. భాస్కర్, ఇఫత్ ఉన్నీసా, లలిత, చైతన్య తదితరులు పాల్గొన్నారు.



ఆంత్రప్రెన్యూర్‌షిప్ అవగాహన సదస్సులో సఫల్ ప్రతినిధులతో సిటీ కళాశాల ప్రిన్సిపాల్ బాలభాస్కర్



ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను కలిసిన కురుమ సంఘం నాయకులు

కురుమ సంఘం భవనానికి స్థలం కేటాయించండి

రాజేంద్రనగర్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): కురుమ సంఘం భవనానికి స్థలం కేటాయించాలని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కురుమ సంఘం నాయకులు కోరారు. ఇటీవల ఎన్నికైన కురమ సంఘం కమిటీ సభ్యులు శనివారం మైలార్‌దేవుపల్లిలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సాగర్‌గౌడ్, గోకరి సురేష్ గౌడ్ ఆధ్వర్యంలో కురమ సంఘం నాయకులు ఎమ్మెల్యేను సన్మానించారు. కురుమ సంఘం అధ్యక్షుడు తాండ్ర రమేశ్ కుమార్‌ను ఎమ్మెల్యేకు పరిచయం చేశారు. ఈ సందర్భంగా కురుమ సంఘం భవనం కోసం స్థలం కేటాయించి, భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

కార్యక్రమంలో ఉపాధ్యక్షులు కె.నరేశ్‌కుమార్, మల్లేశ్, విజయ్‌కుమార్, కె.వెంకట్, పి.రమేశ్, ప్రధాన కార్యదర్శులు కె.లక్ష్మణ్, కె.సత్యనారాయణ, ఎస్.విఠలయ్య, ఎం.జగదీశ్వర్ ప్రచార కార్యదర్శిగా బుడిగెల బాబురావు తదితరులు పాల్గొన్నారు.

చెరువులు, కుంటలను కాపాడండి

● హైడ్రాకు ఫిర్యాదు చేసిన బాలాపూర్ మాజీ ఎంపీటీసీ, వార్డు సభ్యుడు

పహాడిషరీఫ్ ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): చెరువులు, కుంటలను కాపాడాలని బాలాపూర్ మాజీ ఎంపీటీసీ వెంకటేష్, మాజీ వార్డు సభ్యుడు బొర్రా రవికుమార్ కోరారు. చెరువులను ఆక్రమిస్తున్న కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని వారన్నారు. శనివారం హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. బాలాపూర్ మండలం బాలాపూర్, కొత్తపేట్, వెంకటాపూర్, మల్లాపూర్, సుల్తాన్‌పూర్, పహాడిషరీఫ్, మామిడిపల్లి, జల్‌పల్లి గ్రామాలో ఉన్న చెరువులు కుంటలుకబ్జాకు గురవుతున్నాయని హైడ్రా కమిషనర్‌కు వివరించారు. కొందరు వ్యక్తులు చెరువులను కుంటలను కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లలో కూడా అక్రమాలు జరుగుతున్నాయని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. చెరువులు, కుంటలు కబ్జా కావడంతో సానికంగా భూగర్భ జలాలలు అడుగంటిపోయాయని వివరించారు. స్పందించిన హైడ్రా అధికారులు త్వరలో ఆయా ప్రాంతాలలో పర్యటింఛ చెరువులు కుంటలను పరిశీలిస్తామని హామీ ఇచ్చారు.

భారీ వాహనం డ్రైవర్‌పై కేసు నమోదు

బంజారాహిల్స్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేని సమయంలో భారీ వాహనం నిబంధనలకు విరుద్ధంగా రావడంతో డ్రైవర్‌పై కేసు నమోదైంది. పంజాగుట్ట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ హోంగార్డు నవాజ్ ఈనెల 23న ఎన్ఎఫ్‌సీఎల్‌లో వాహనాలు తనిఖీ చేస్తున్నాడు. ఇదే సమయంలో నిబంధనలకు విరుద్ధంగా 10 టైర్ల భారీ వాహనం పంజాగుట్ట శ్మశానవాటిక వైపు వెళ్తుండగా గమనించాడు. వాహనాన్ని పక్కకు పెట్టించాడు. డ్రైవర్‌పై బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

యూసుఫ్‌గూడ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదగిరినగర్‌లో నివాసం ఉంటున్న నరేష్‌కు 2012లో వివాహమైంది. వీరికి ముగ్గురు పిల్లలు. నరేష్ అమీర్‌పేటలో వస్త్ర వ్యాపారం చేసేవారు. సక్రమంగా నడవకపోవడంతో 2021లో మూసేశాడు. అప్పటి నుంచి ఖాళీగా ఉంటూ మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో భార్యభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. ఈ నెల 23వ తేదీ రాత్రి 11.30 గంటల సమయంలో మద్యం తాగి నరేష్ భార్యతో గొడవపడ్డాడు. భార్య, పిల్లలను బయటకు నెట్టేసి లోపల నుంచి గడియ పెట్టుకున్నాడు. ఎంతకీ తలుపు తీయకపోవడంతో వారు పోలీసులకు ఫోన్ చేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి తలుపులు పగలగొట్టి లోపలకు వెళ్లి చూడగా నరేష్ ఉరేసుకుని వేలాడుతున్నాడు. వెంటనే ఆస్పత్రికి తరలించగా మృతిచెందాడని వైద్యులు ధ్రువీకరించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మసాజ్ ముసుగులో వ్యభిచారం

యూసుఫ్‌గూడ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): సెలూన్ మసాజ్ ముసుగులో వ్యభిచారం నిర్వహిస్తున్న వారిని మధురానగర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మధురానగర్‌కాలనీ సమీపంలోని ఇంజనీర్స్‌కాలనీలో రెయిన్ ఫ్యామిలీ సెలూన్ అండ్ స్పాలో కొంతకాలం నుంచి వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమచారం అందింది. దీంతో పోలీసులు పకడ్బందీగా దాడి చేశారు. వ్యభిచారం చేస్తున్న విటుడు ఆర్.విజయ్, మరో మహిళను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారి ద్వారా వ్యభిచార నిర్వాహకుడు బోడ ప్రవీణ్, బాల్‌రాజ్, రజితతో పాటుగా వరంగల్, రాంనగర్, విజయవాడకు చెందిన ముగ్గురు మహిళా సెక్స్ వర్కర్‌లను కూడా అదుపులోకి తీసుకున్నారు. వీరిని శనివారం కోర్టుకు హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

విశ్రాంత ఉద్యోగి ఇంట్లో బంగారు ఆభరణాలు చోరీ

బంజారాహిల్స్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): చికిత్స నిమిత్తం ఆస్పత్రికి వెళ్లి వచ్చేసరికి విశ్రాంత ఉద్యోగి ఇంట్లో బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. బంజారాహిల్స్ రోడ్డునంబర్.12 ఎన్‌బీటీనగర్‌లో ఉండే ఎం.శ్రీహరిగౌడ్ విశ్రాంత ఉద్యోగి 2 రోజుల క్రితం అనారోగ్యంతో ఆస్పత్రిలో అడ్మిట్ అయ్యాడు. చికిత్స పూర్తయి ఇంటికి వచ్చేసరికి బెడ్‌రూమ్‌లోని అల్మారాలు తెరిచి ఉన్నాయి. పరిశీలించగా 30 గ్రాముల బంగారం, వెండి అభరణా లు కనిపించలేదు. శ్రీహరి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/bTqr1cuలో చదవండి.

Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.

నోట్: htpps://epaper.andhrajyothy.comలో లాగిన్ అయిన తర్వాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.



సమావేశంలో మాట్లాడుతున్న బద్దం మహిపాల్‌రెడ్డి

రాజేంద్రనగర్ గణేశ్ ఉత్సవ సమితి

కన్వీనర్‌గా శ్రీధర్

రాజేంద్రనగర్, ఆగస్టు24(ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్ నియోజకవర్గం గణేశ్ ఉత్సవ సమితి సమావేశం శనివారం ఉప్పర్‌పల్లిలోని సామ భూపాల్‌రెడ్డి గార్డెన్స్‌లో జరిగింది. సమావేశానికి సైబరాబాద్ గణేశ్ ఉత్సవ సమితి కన్వీనర్ బద్దం మహిపాల్‌రెడ్డి, భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి కార్యదర్శి రమేశ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రాజేంద్రనగర్ గణేశ్ ఉత్సవ సమితి కమిటీని ఎన్నుకొన్నారు. కన్వీనర్‌గా వై.శ్రీధర్, జాయింట్ కన్వీనర్‌లుగా బొక్క బాల్‌రెడ్డి, రాజ్‌పాల్‌రెడ్డి నియమితులయ్యారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు టి.అంజన్‌కుమార్, మైలార్‌దేవుపల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి, ఎన్.మల్లారెడ్డి, పి.మల్లేశ్ యాదవ్, బి.మహాలింగం గౌడ్, ఎం.కొమురయ్య, లక్ష్మీనారాయణ, జి.బాబురావు, ఎస్.విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు ఘరానా దొంగల అరెస్ట్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ఆటో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు ఘరానా దొంగలను హైదరాబాద్ సీసీఎస్ డిటెక్టివ్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రెండు ఆటోలు సహా.. రూ.8 లక్షల విలువైన సొత్తు స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. టోలీచౌకికి చెందిన మహ్మద్ సమీర్, మహ్మద్ ఖాసీం, ఆసిఫ్‌నగర్‌కు చెందిన షైబాజ్‌ఖాన్ ముఠా ఏర్పడ్డారు. చెడు వ్యసనాలకు బానిసలై డబ్బుకోసం దొంగతనాలు చేస్తున్నారు. శివారు ప్రాంతాల్లో, జనసంచారం లేని ప్రాంతాల్లో పార్కింగ్ చేసిన ఆటోలను చోరీచేసి, వాటిని అమ్మగా వచ్చి డబ్బుతో జల్సాలు చేస్తున్నారు. వారిపై ఇప్పటి వరకు 17 కేసులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. సిటీ పరిధిలో వరుస దొంగతనాలు జరుగుతుండటంతో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ భిక్షపతి టీమ్ రంగంలోకి దిగి నిందితుల ఆటకట్టించింది.

50 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్ స్వాధీనం

రాజేంద్రనగర్, ఆగస్టు24 (ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సన్‌సిటీ ప్రాంతంలో శనివారం రాజేంద్రనగర్ ఎస్‌ఓటీ పోలీసులు దాడులు చేసి 50 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. డ్రగ్ సరఫరా చేస్తున్న నైజీరియాకు చెందిన స్తంభ పిడిల్మా (30)ను అరెస్ట్ చేశారు. కొంత కాలంగా స్తంభ పిడిల్మా సన్‌సిటీ ప్రాంతానికి ఎండీఎంఏ డ్రగ్‌ను తీసుకువచ్చి విక్రయిస్తున్నట్లు కనుగొన్నారు. ఎక్కడి నుంచి డ్రగ్ తీసుకు వస్తున్నది. ఎప్పటి నుంచి విక్రయాలు చేస్తున్నది అనే వివరాలు తెలియాల్సి ఉంది. రాజేంద్రనగర్ ఎస్‌ఓటీ పోలీసులు ఈ కేసును రాజేంద్రనగర్ పోలీసులకు అప్పగించారు.

ఇల్లు కూలుస్తుండగా ప్రమాదం..

గోడ మీదపడి కార్మికుడి మృతి

రాజేంద్రనగర్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): పాత ఇల్లు కూలుస్తుండగా గోడ కూలి అక్కడే ఉన్న కూలీపై పడటంతో మృతిచెందాడు. అత్తాపూర్ పోలీసు కథనం ప్రకారం.. హసన్‌నగర్‌కు చెందిన షరీఫ్ అనే వ్యక్తి తన పాత ఇంటిని కూల్చి కొత్త ఇల్లు నిర్మించాలనుకున్నాడు. ఇల్లు కూల్చే పనులను యూసుఫ్ అనే వ్యక్తికి కాంట్రాక్ట్‌కు ఇచ్చాడు. అతను హసన్‌నగర్ ప్రాంతంలో నివాసముంటున్న మహబూబ్‌నగర్‌కు చెందిన హనుమంతు(54)కు పనులను అప్పగించాడు. శనివారం హనుమంతు పాత ఇల్లును కూలుస్తుండగా, గోడకూలి అతనిపై పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. అత్తాపూర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



హనుమంతు(ఫైల్)

మానసిక పరిస్థితి బాగాలేక

యువకుడి బలవన్మరణం

రాజేంద్రనగర్, ఆగస్టు24 (ఆంధ్రజ్యోతి): మానసిక పరిస్థితి బాగాలేని ఓ యువకుడు శుక్రవారం రాత్రి ఇంట్లో ఎవరులేని సమయంలో చున్నీతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. హసన్‌నగర్‌కు చెందిన మహ్మద్ గౌస్(22) మార్బుల్ కంపెనీలో పని చేస్తున్నాడు. ఆరోగ్యం బాగాలేకపోవడంతో రెండు నెలలుగా పనికి వెళ్లడం లేదు. శుక్రవారం అతడికి స్నేహితులు ఎన్నిసార్లు ఫోన్‌చేసినా స్పందించలేదు. దీంతో వారు విషయాన్ని అబ్దుల్ గౌస్ ఇంటి వారికి చెప్పారు. వారు గౌస్ గదికి వెళ్లి చూడగా తలుపులు పెట్టి ఉన్నాయి. పిలిచినా పలకకపోడంతో తలుపులు పగులకొట్టి లోపలికి వెళ్లి చూడగా, చున్నీతో ఫ్యాన్‌కు ఉరేసుకొని కనిపించాడు. సమాచారం అందుకున్న అత్తాపూర్ పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా మార్చ్యూరీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.



అబ్దుల్ (ఫైల్)



ధర్నాలో పాల్గొన్న ఆర్.కృష్ణయ్య తదితరులు

విద్యార్థుల మెస్‌చార్జీలను పెంచాలి

కార్వాన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతో వెంటనే వసతి గృహాల్లో మెస్‌చార్జీలు పెంచాలని బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు వేముల రామకృష్ణ ఆధ్వర్యంలో శనివారం మాసబ్‌ట్యాంక్‌లోని సంక్షేమ భవన్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ ఆరేళ్ల క్రితం ధరల ప్రకారం నిర్ణయించిన మెస్ చార్జీలు కొనసాగిస్తుండడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో నీలం వెంకటేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

గిరిజన వసతి గృహం ఆకస్మిక తనిఖీ

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): తిరుమలగిరి మండలం బాపూజీనగర్‌లోని ప్రభుత్వ గిరిజన వాటర్ స్పోర్ట్స్ అకాడమీ వసతి గృహాన్ని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్‌లోని వంటగది, స్టోర్ రూమ్, కంప్యూటర్ ల్యాబ్, పిల్లల విశ్రాంతి గదులు, హాజరుపట్టిక, స్టాక్ రిజిస్టర్, నిల్వలను పరిశీలించారు. అనంతరం 5వ తరగతి విద్యార్థులతో ఇంగ్లిష్, తెలుగు పాఠాలను చదివించారు. కలెక్టర్ వెంట జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి కోటాజీ, సికింద్రాబాద్ ఆర్డీవో దశరథ్‌సింగ్ తదితరులు ఉన్నారు



హాస్టల్‌లో బియ్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

సిటీ కాలేజీకి పునర్‌వైభవం తేవాలి



సదస్సులో మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్

చార్మినార్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): తొలిదశ తెలంగాణ ఉద్యమం నుంచి మలిదశ వరకు ఉద్యమ చైతన్యానికి చిహ్నంగా నిలిచిన ప్రభుత్వ సిటీ కాలేజీ భవనానికి ప్రత్యేక శ్రద్ధతో తగిన మరమ్మతులు చేయాలని ప్రొ.హరగోపాల్ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. శత వసంతాల చరిత్ర కలిగిన కాలేజీ భవనాన్ని రక్షించాలని, ప్రభుత్వం చొరవ తీసుకొని పునరుద్ధరిస్తే మరో 50 ఏళ్లు సజీవంగా నిలబడుతుందని సూచించారు. తాను కూడా సిటీ కాలేజీ విద్యార్థినని దేశవిదేశాల సందర్శన సందర్భాల్లో గర్వంగా చెప్పుకుంటానని గుర్తుచేశారు. మూసీ సుందరీకరణలో భాగంగా ఆ నది ఒడ్డునే జ్ఞాన శిఖరంలా నిలబడిన సిటీ కళాశాల భవనానికి కూడా పునర్వైభవాన్ని తేవాలని సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి కోరారు. కార్యక్రమంలో హైకోర్టు మాజీ రిజిస్ట్రార్ విద్యాధర్ భట్, ప్రిన్సిపాల్ బాలభాస్కర్, విశ్రాంత ఆచార్యుడు వెంకటరాజం, అనంతమోహన్, జనార్ధన్‌రెడ్డి, ఆమంచి, డా.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల రక్షణ చట్టం బిల్లు పెట్టాలి

చార్మినార్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ న్యాయవాదుల రక్షణ చట్టం బిల్లు వచ్చే వరకు పోరాడుతామని సిటీ సివిల్‌కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసాచారి తెలిపారు. శనివారం రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. త్వరలో జేఏసీ ఏర్పాటు చేసి కార్యాచరణ ప్రకటిస్తామని, ఇందిరాపార్కు వద్ద న్యాయవాదుల గర్జన నిర్వహిస్తామని పేర్కొన్నారు. మాజీ అడ్వొకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్, రాజేందర్‌రెడ్డి, సునీల్‌గౌడ్, హర్షవర్ధన్, రాజేష్‌కుమార్, ప్రవీణ్‌రెడ్డి, తిరుమల్ రావు పాల్గొన్నారు.

ఉద్యమకారులపై కేసులు ఎత్తివేయాలి

పంజాగుట్ట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమ సమయంతోపాటు 2014 నుంచి వివిధ సందర్భాల్లో ఉద్యమకారులపై పెట్టిన కేసులను ఉపసంహరించాలని, వారికి 240 గజాల ఇంటి స్థలం ఇవ్వాలని జేఏసీ ఆఫ్ తెలంగాణ లౌకిక ప్రజాస్వామిక వేదిక డిమాండ్ చేసింది. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లలో జరిగిన సమావేశంలో జస్టిస్ చంద్రకుమార్, ప్రొ.అన్వర్‌ఖాన్, ఇస్లాముద్దీన్, నాగరాజు, ఇంద్రవెల్లి రమేష్, మోహన్ బైరాగి, సొగరా బేగం తదితరులు మాట్లాడారు. ఎక్కడ ఉద్యమాలు జరిగినా దాని వెనుక బలమైన కారణం ఉంటుందని, బీఆర్ఎస్ హయాంలో ఉద్యమకారులకు మంత్రి పదవులివ్వకుండా ద్రోహులకు ఇచ్చారని మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకొస్తే సామాన్యులకు న్యాయం జరుగుతుందనుకుంటే దానికి భిన్నంగా పాలన సాగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ చంద్రకుమార్

70 వసంతాలు..70 అడుగులు

● వేగంగా ఖైరతాబాద్ మహా గణపతి పనులు ● 90 శాతం పూర్తి, తుది మెరుగుల్లో విగ్రహాలు
● రేయింబవళ్లు శ్రమిస్తున్న 150 మంది నిపుణులు ● ఈసారి సప్తముఖ మహాశక్తి గణపతిగా దర్శనం





ఖైరతాబాద్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్ గణపతి అంటే ఆ క్రేజే వేరు. నగర దారులన్నీ అటు వైపే అన్నట్లు 11 రోజులపాటు అక్కడి పరిసరాలు జనసంద్రంగా మారుతుంటాయి. తెలుగు రాష్ట్రాలతోపాటు దేశ,విదేశాల నుంచి అనేకమంది లంబోదరుడి దర్శనం కోసం తరలివస్తుంటారు. చివరిరోజు నిమజ్జనం నాడూ భక్తజనం శోభాయాత్రలో భారీగా పాల్గొంటుంది. 70 సంవత్సరాల ఖైరతాబాద్ గణపతి ఉత్సవాల సందర్భంగా తొలిసారి 70 అడుగుల ఎత్తుతో పూర్తిగా మట్టి, సహజ రంగులతో పర్యావరణహితంగా గణపయ్యను సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే మట్టి పనులు పూర్తికాగా.. రంగులద్దే పనులు రెండురోజుల క్రితం ప్రారంభమయ్యాయి.

రాహు,కేతువులతోపాటు అయోధ్య బాలరాముడు విగ్రహం

ఖైరతాబాద్ గణపతిని ప్రతియేటా అప్పటి తిథి, నక్షత్రాలకనుగుణంగా కాలమానం ప్రకారం ఏ విధంగా పూజిస్తే సర్వజనులకు హితం కలుగుతుందనే విషయమై పండితులతో చర్చించి నిర్ణయిస్తారు. ఈసారి సప్తముఖ మహాశక్తి గణపతిగా నామకరణం చేసి అదే రూపంలో తయారు చేస్తున్నారు. ఏడు ముఖాల్లో ఓవైపు త్రిమూర్తులైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు...మరోవైపు అమ్మవార్లు సరస్వతి, మహాలక్ష్మి, పార్వతి, మధ్యన గణపతి ఉన్నారు. 14 చేతుల్లో గణపతి కుడివైపు చక్రం, అంకుశం, గ్రంథం, శూలం, కమలం, శంఖు, ఆశీర్వాదాలు ఉండగా ఎడమ చేతిలో రుద్రాక్ష, పాశం, పుస్తకం, వీణ, కమలం, గద, లడ్డూ ఉంటుంది. ఈసారి అయోధ్య బాలరాముడిని గణపతికి కుడివైపున 12 అడుగుల ఎత్తుతో చూడముచ్చటగా తయారు చేశారు.

రాత్రింబవళ్లు నిర్మాణ పనులు

విగ్రహ ఏర్పాటులో భాగంగా షెడ్డుతో మొదలయ్యే పనులను ఆదిలాబాద్‌కు చెందిన నర్సయ్యతోపాటు 25 మంది నిపుణులు శ్రమించి ఎంతటి బలమైన గాలులు వీచినా కదలకుండా 70 అడుగులకు పైగా ఎత్తుతో ధృఢంగా తయారు చేశారు. వెల్డింగ్ పనులను మచిలీపట్నం చెందిన నాగబాబుతోపాటు 23 మంది నిపుణులు రాత్రింబవళ్లు పనిచేయగా చెన్నైకు చెందిన మూర్తి, మరో 25 మంది గణపతి ఔట్‌లైన్ పనులను, ఒడిశాకు చెందిన జోగారావుతోపాటు 20 మంది కళాకారులు రాహు, కేతువు, బాలరాముడు, శివ కల్యాణం, శ్రీనివాస కల్యాణం ఘట్టాలతోపాటు వినాయకుడి ఫినిషింగ్ పనులు చేపట్టారు. మరో 55 మంది నిపుణులు గణపతిని సహజరంగులతో ముస్తాబు చేయనున్నారు. భారీ గణపతి తయారీ కోసం దాదాపు కోటి రూపాయలకు పైగా ఖర్చవుతున్నట్లు ఖైరతాబాద్ గణేష్ ఉత్సవ కమిటీ కన్వీనర్ సందీప్‌రాజ్ తెలిపారు.

ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ (పీవోపీ) ఏ మాత్రం వాడకుండా, దానికంటే ధృఢంగా విగ్రహం ఉండేలా పనులు చేశామని, కేవలం సహజ రంగులనే వినియోగిస్తున్నట్లు విగ్రహ ప్రధాన శిల్పి చినస్వామి రాజేంద్రన్ పేర్కొన్నారు.



సీఎంకు వినతిపత్రమిస్తున్న ఖలీద్ సైఫుల్లా రహ్మానీ, అసదుద్దీన్ ఒవైసీ తదితరులు

వక్ఫ్ సవరణ బిల్లు సమస్యలపై సీఎంతో ఒవైసీ భేటీ

హైదరాబాద్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): కేంద్రం ప్రతిపాదించిన వక్ఫ్ సవరణ బిల్లు- 2024తో ఉత్పన్నమయ్యే సమస్యలపై ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు చైర్మన్ ఖలీద్ సైఫుల్లా రహ్మానీ, మజ్లిస్ అధ్యక్షుడు, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ శనివారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. కాగా, వక్ఫ్ సవరణ బిల్లుతో ఉత్పన్నమయ్యే సమస్యలపై చర్చించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి అంగీకరించినట్టు ఒవైసీ శనివారం 'ఎక్స్' వేదికగా తెలిపారు.

విద్యుత్ స్వల్ప అంతరాయాలపై ప్రత్యేక దృష్టి

● ప్రత్యామ్నాయ మార్గాలపై సీఎండీ సూచనలు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): చిన్న చిన్న కారణాలతో ఫీడర్లు ట్రిప్పయి 5 నుంచి 10 నిమిషాలపాటు విద్యుత్ సరఫరాలో అంతరాయాలకు గల కారణాలపై విద్యుత్‌శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. బల్లులు, పిల్లులు, పావురం, ఉడుత వంటివాటితో సుమారు 14 శాతం ఫీడర్ ట్రిప్ అవుతున్నట్లు ఇప్పటికే గుర్తించారు. పలు సమస్యలను సీఎండీ దృష్టికి తీసుకెళ్లగా ఫీడర్ ట్రిప్పులను తగ్గించేందుకు ప్రత్యామ్నాయ మార్గాలపై ఇంజనీర్లకు డిస్కం సీఎండీ ముషారఫ్ ఫరూఖి పలు సూచనలు చేశారు.

మెటల్ క్లాంప్‌ల స్థానంలో సిలికాన్ క్లాంప్‌లు

సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద విద్యుత్ పరికరాల్లో ప్రస్తుతం హార్న్ గ్యాప్ ఫ్యూజ్‌ల వద్ద మెటల్ క్లాంప్‌లు వినియోగిస్తున్నారు. వీటి స్థానంలో ప్రత్యేకంగా రూపొందించిన ఎఫ్ఆర్‌బీ సిలికాన్ క్లాంప్‌లను ఏర్పాటు చేయనున్నారు. ఈ సిలికాన్ క్లాంపులతో విద్యుత్ ప్రవాహకం ఉండని కారణంగా మూగజీవాలు వాటిపై వెళ్లినా ప్రమాదాలు జరగవని, ఫీడర్లు ట్రిప్పవ్వవని ఇంజనీర్లు చెబుతున్నారు. తొలుత చెట్లు అధికంగా ఉన్న ప్రాంతాల్లో 3 వేల సిలికాన్ క్లాంప్‌లను బిగించాలని సీఎండీ అధికారులను ఆదేశించారు.

సంకీర్ణ స్పృహ లేని ప్రధాని మోదీ

● సీపీఎం నేత బీవీ రాఘవులు

హైదరాబాద్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): సంకీర్ణ ప్రభుత్వాన్ని నడిపిస్తున్నామనే స్పృహ లేకుండా ప్రధాని మోదీ వ్యవహరిస్తున్నారని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు మండిపడ్డారు. హిమాయత్‌నగర్ ఎంబీ భవన్‌లో శనివారం ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వక్ఫ్ బోర్డు చట్టాన్ని సవరించాలనుకోవడం అభ్యంతరకరమన్నారు. హరియాణా, జమ్ముకశ్మీర్, మహారాష్ట్ర, జార్ఖండ్ రాష్ట్రాల్లో ఎన్నికలు జరుగుతున్నందున దుర్బుద్ధితో, మత విభేదాలు సృష్టించి ఓట్లు పొందాలని బీజేపీ చూస్తోందని విమర్శించారు. ధరణిపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ నివేదికను బయటపెట్టాలని డిమాండ్ చేశారు. భూ సమస్యలపై అఖిలపక్షాన్ని పిలవాలని రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం కోరారు. రైతుల సమస్యలపై 29న ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. హైడ్రా ఒక డ్రామా కాకుండా చూడాలని ప్రభుత్వానికి సూచించారు.



ఉత్తమ పనితీరు కనబర్చినందుకు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌ల నుంచి ప్రగతి చక్రం పురస్కారం అందుకుంటున్న హైదరాబాద్ డిపో-1 మేనేజర్ కృష్ణారెడ్డి.
-మంగళ్‌హాట్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి)



జాతీయ అవార్డు గ్రహీత, కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్‌ను సన్మానిస్తున్న తెలంగాణ యువత సంస్థ అధ్యక్షుడు ఇమ్మడి సతీశ్, గణేష్ మాస్టర్ తదితరులు.
-పంజాగుట్ట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వ ఆస్పత్రుల్లో మందుల కొరత

● డాక్టర్లు రాసిన మందుల్లో సగం మాత్రమే అందుబాటులో ● మిగతావి బయట కొనాల్సిందే

హైదరాబాద్ సిటీ/అడ్డగుట్ట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో మందుల కొరత నెలకొంది. వైద్యులు ఐదారు రకాల మందులు రాస్తే రెండు, మూడు రకాల మందులు మాత్రమే ఆస్పత్రుల్లో ఇస్తున్నారని రోగులు వాపోతున్నారు. న్యూరాలజీ, గుండె, అలర్జీ, షుగర్ వంటి వ్యాధులకు సంబంధించిన ఖరీదైన మందులను బయట కొనుగోలు చేయాల్సి వస్తోందని రోగుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సర్కారు ఆస్పత్రుల్లో బీపీ, షుగర్, కాళ్ల నొప్పుల నివారణ మందులు, మల్టీ విటమిన్ మందులు, పిల్లలకు వినియోగించే విటమిన్, డి-3, కాల్షియం వంటి మందులు కూడా ఆస్పత్రుల్లో సక్రమంగా లభించడం లేదు. బీపీ, షుగర్, గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న రోగులు మందుల కోసం వేల సంఖ్యలో ఉస్మానియా ఆస్పత్రికి వస్తుండటంతో ఓపీ ఫార్మసీ కిక్కిరిసిపోయి కనిపిస్తోంది. ఇక్కడ పది రోజులకు మందులు రాస్తే, ఐదు రోజులకు సరిపడేవి ఇస్తున్నారు. దీంతో రోగులు ప్రైవేట్ మెడికల్ షాపులను ఆశ్రయించాల్సి వస్తోంది.. గాంధీ, ఉస్మానియా ఆస్పత్రుల్లో మందులు లేకపోవడంతో ప్రతి రోగి కనీసం రూ. 200 నుంచి రూ. 300 వరకు ఖర్చు పెట్టాల్సి వస్తుందని వారు వాపోతున్నారు.



బ్రాండెడ్ పేర్లతో.

మందుల చీటీపై బ్రాండెడ్ పేర్లతో రాయొద్దని, జనరిక్ పేర్లనే రాయాలన్న ఆదేశాలను డాక్టర్లు బేఖాతర్ చేస్తూ బ్రాండెడ్ పేర్లనే రాస్తున్నారు. ఆస్పత్రిలో ఉండే మందుల పేర్లను మాత్రం జనరిక్ రాసి, బయట కొనుగోలు చేసే మందుల పేర్లను బ్రాండెడ్ పేరుతో రాస్తున్నారు. దీంతో తప్పని పరిస్థితిల్లో రోగులు బయట కొనుగోలు చేయాల్సి వస్తోంది.

ప్రైవేట్ ఫార్మసీలు కిటకిట.

ఉస్మానియా ఆసుపత్రి ప్రాంగణంలో ఐదు, గాంధీలో మూడు ప్రైవేట్ మెడికల్ షాపులు ఉన్నాయి. ఉస్మానియాలో రెండు, గాంధీలో ఒకటి జెనరిక్ మందుల షాపులు ఉన్నాయి. అయితే, ప్రైవేట్ దుకాణాల వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు మందుల కోసం రోగులు బారులు తీరుతున్నారు.

గాంధీలో కొరత ఉన్న మందులు ఇవీ...

ఫ్లుకనజోల్ , క్లోరోమోజోల్, నాక్ 40 ఎంజీ, గ్లైకోమెట్, డైరిడాన్, పారఫాన్ లిక్విడ్, ఫ్రాక్స్ 10ఎంజీ, అటివాస్ 10ఎంజీ. సారవెట్ క్రీమ్, ఆయింట్‌మెంట్ - అమోక్సోక్లేవ్, పెంటాప్, డైజిన్ సిరఫ్, కాళ్ల నొప్పులు, కీళ్ల నొప్పుల మందులు.

నగరంలో-నేడు

మారథాన్
అంశం: హైదరాబాద్ రన్నర్స్ సొసైటీ ఆధ్వర్యంలో
వేదిక : పీపుల్స్‌ప్లాజా
సమయం: ఉదయం 4.30 గంటలకు

జేఏసీ సభ
అంశం: మహనీయుల జాతర-మనువాదానికి పాతర
వేదిక : రవీంద్రభారతి
సమయం : ఉదయం 10 గంటలకు

సపోర్ట్ వాక్
అంశం: హైడ్రాకు సపోర్ట్‌గా
వేదిక : గండిపేట పార్కు
సమయం : ఉదయం 10 గంటలకు

సమావేశం
అంశం: రెవెన్యూ ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో
వేదిక : బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్
సమయం : ఉదయం 11 గంటలకు

నేడు కోకాపేటకు సీఎం రేవంత్‌రెడ్డి

నార్సింగి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం కోకాపేటకు రానున్నారు. హరేరామ-హరేకృష్ణ ట్రస్ట్ ప్రాంగణంలో 430 అడుగుల ఎత్తులో శ్రీకృష్ణ ఆలయం (హరేకృష్ణ హెరిటేజ్ టవర్) నిర్మిస్తున్న విషయం తెలిసిందే. ఈ ఆలయ నిర్మాణంలో భాగంగా అనంతశేష స్థాపన పూజా కార్యక్రమాలకు సీఎం హాజరవుతారని ట్రస్ట్ ఓ ప్రకటనలో తెలిపింది.

వర్గీకరణకు వ్యతిరేకంగా వచ్చేనెలలో ఆందోళనలు

బర్కత్‌పుర, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును తక్షణమే ఉపసంహరించుకోవాలని ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జాతీయ చైర్మన్, సుప్రీంకోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణస్వరూప్ డిమాండ్ చేశారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. వర్గీకరణకు వ్యతిరేకంగా సెప్టెంబరు 2న తెలంగాణ, ఏపీలోని తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నాలు, 11న అధికార,ప్రతిపక్ష పార్టీల నేతల ఇళ్ల ముందు నిరసన, 16న కలెక్టరేట్ల వద్ద ధర్నా చేపడుతామన్నారు. 27న లక్షలాది మందితో చలో హైదరాబాద్ నిర్వహించి సచివాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

విద్యారంగంలో పరిష్కారం కాని సమస్యలు

హైదరాబాద్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నా విద్యారంగంలో నెలకొన్న సంక్షోభాన్ని ప్రభుత్వాలు పరిష్కరించలేకపోతున్నాయని అఖిల భారత విద్యా సంఘాల సమాఖ్య(ఏఐఎఫ్ఈఏ) అభిప్రాయపడింది. నగరంలోని స్టాన్లీ ఇంజినీరింగ్ కాలేజీలో సమాఖ్య అధ్యక్షులు సుధీర్‌కుమార్ అధ్యక్షతన శనివారం జాతీయ కార్యవర్గ సమావేశం జరిగింది. సంస్థ ప్రధాన కార్యదర్శి నబ్‌కుమార్ కర్మకార్ కార్యదర్శి నివేదికను ప్రవేశ పెట్టి విద్యారంగంలో నెలకొన్న పరిస్థితులను వివరించారు. ఈ సందర్భంగా సమావేశం ఐదు తీర్మానాలను ఆమోదించింది.

కృష్ణ జన్మాష్టమి సందర్భంగా రేపు ట్రాఫిక్ ఆంక్షలు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకల సందర్భంగా ఆబిడ్స్ ఇస్కాన్ దేవాలయ పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్టు ట్రాఫిక్ అదనపు కమిషనర్ విశ్వప్రసాద్ తెలిపారు. సోమవారం ఉదయం 4 గంటల నుంచి రాత్రి 11 వరకు ఈ ఆంక్షలు అమల్లో ఉంటాయన్నారు.

మియాపూర్ ఇస్కాన్ టెంపుల్‌లో వేడుకలు



మియాపూర్ ఇస్కాన్ టెంపుల్‌లో సోమవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నామని ఆలయ ప్రెసిడెంట్ శ్రీరామ్‌దాస్ ప్రభుజీ ఒక ప్రకటనలో తెలిపారు. హెచ్ఎంటీ స్వర్ణపురి కాలనీ కమ్యూనిటీహాల్‌లో ఉదయం 7 గంటల నుంచి రాత్రి 11 వరకు పలు వైదిక కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు.

జిల్లాను రోల్‌మోడల్‌గా చేస్తాం

(5వ పేజీ తరువాయి)

ఈ ఏడాది ఆగస్టు 14 వరకు 1.67లక్షల సర్టిఫికెట్లను అందజేశాం.

ప్రభుత్వ భూముల పరిరక్షణకు ఏ చర్యలు తీసుకుంటున్నారు?

ప్రభుత్వ భూముల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. గతంలో ఆగిపోయిన ల్యాండ్ బ్యాంక్‌ను పునరుద్ధరించి స్థలాలకు జియో ట్యాగింగ్ చేశాం.

భిక్షాటన చేస్తున్న పిల్లలను గుర్తిస్తున్నారా?

రోడ్ల వెంట, ప్రధాన కూడళ్లలో భిక్షాటన చేస్తున్న అనాథ పిల్లలను గుర్తించేందుకు స్త్రీ, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో తరచూ స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నాం. పోలీసు, రెవెన్యూ, కార్మికశాఖల సమన్వయంతో ఇటీవల 226మంది బాలబాలికలను, 98మంది పిల్లల తల్లులను గుర్తించి ఆశ్రయం కల్పించాం.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ దరఖాస్తులు ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయి?

హైదరాబాద్, సికింద్రాబాద్ ఆర్డీఓల పరిధిలో 700 వరకు పెండింగ్‌లో ఉన్నాయి. సెప్టెంబర్ 1లోగా విచారణను పూర్తిచేసి జీరో దరఖాస్తులు ఉండేందుకు చర్యలు తీసుకుంటాం.

మూసీ సుందరీకరణ, మెట్రో విస్తరణకు సంబంధించిన పనులు ఏ స్థాయిలో ఉన్నాయి?

మూసీ సుందరీకరణ, మెట్రో విస్తరణ పనులకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. పాతబస్తీలో ఆస్తుల సేకరణ కోసం హైదరాబాద్ మెట్రో రైల్‌తో కలిసి రెవెన్యూ అధికారులు సర్వే చేస్తున్నారు. ఆస్తులు కోల్పోతున్న బాధితులతో ప్రత్యేకంగా మాట్లాడి పరిహారం తదితర డిమాండ్లను తెలుసుకుంటున్నారు. మూసీ సుందరీకరణలో భాగంగా బండ్లగూడ, ఆసిఫ్‌నగర్, గోల్కొండ, తదితర ప్రాంతాల్లో సర్వే చేయిస్తున్నాం. నదీ పరివాహక ప్రాంతాల్లో నివాసాలు ఏర్పాటు చేసుకున్న వారితో మాట్లాడి అభిప్రాయాలు సేకరిస్తున్నాం.

అతివలకు భద్రత అంతంత మాత్రమే !

(5వ పేజీ తరువాయి)

తోడేళ్లలాంటి చూపులతో కొందరు, మాటలతో మరికొందరు వేధిస్తుంటారు. అమీర్‌పేట, ఖైరతాబాద్, ఆర్టీసీ క్రాస్‌రోడ్స్, దిల్‌సుఖ్‌నగర్, కూకట్‌పల్లి, లింగంపల్లి, ఎల్బీనగర్.. ఒక్కటేమిటి ప్రతి ప్రాంతంలోనూ సిటీ బస్టాప్ పరిసరాలేవీ మహిళల భద్రతకు అనువుగా లేకపోవడం విచారకరం.

గస్తీ పెంచాలి

పోలీసుల గస్తీ పెంచాలని మహిళలు కోరుతున్నారు. కొన్ని సందర్భాల్లో ఒంటరిగా వెళుతున్న మహిళలను తాగుబోతులు మాటలతో వేధించడం వంటి చేష్టలకు పాల్పడుతున్నా, ఎవరికీ ఫిర్యాదు చేయలేకపోతున్నామని పేరు చెప్పడానికి ఇష్టపడని ఓ ఉద్యోగిని తన బాధను వ్యక్తం చేశారు. రాత్రిళ్లు అలాంటి ప్రదేశాలలో పోలీసుల గస్తీ కూడా సరిగ్గా ఉండకపోవడంతో నగరంలో ఉన్నామా, అడవిలో ఉన్నామా అనే సందేహం కలుగుతోందని ఆ మహిళ ఆగ్రహం వ్యక్తం చేశారు. అయినా, రోడ్డుమీద మద్యం దుకాణాలు నిర్వహించడం, అక్కడే తాగి తూలి పడిపోవడం వంటి చేష్టలను సమ్మతించడం సరికాదని మహిళా సంఘాల నాయకులు అన్నారు.

నిర్మానుష్య ప్రదేశాలు

మహిళలు అన్నిరంగాల్లో పురుషులకు దీటుగా రాణిస్తున్నారు. ఆ క్రమంలో వారు పనివేళలతో సంబంధం లేకుండా ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్న క్రమంలో వేళకాని వేళలో ప్రయాణించడం సాధారణం. చాలా ప్రాంతాల్లో వీధిలైట్లు వెలగకపోవడంతో పరిసరాలన్నీ కీకారణ్యాన్ని తలపిస్తున్నాయి. దాంతో మహిళలు ఒంటరిగా నడిచివెళ్లడానికి వెనకాడుతున్న దుస్థితి. అనేక ప్రాంతాలలోని కాలనీలలో వీధిలైట్లు సరిగ్గా లేకపోవడం, ఉన్నా అవి వెలగకపోవడం.. ఏపుగా పెరిగిన చెట్ల వల్ల చీమ్మచీకట్లు ఆవహించడం తదితర కారణాలతో నగర రోడ్లు చీకటిగుహలను తలపిస్తున్నాయి. కొన్నిసందర్భాల్లో ఆ ప్రాంతాల్లో దొంగలే కాదు, ఈవ్‌టీజర్లు కూడా విజృంభించడం చూస్తున్నాం.

పరిసరాలను తీర్చిదిద్దాలి...

నగరంలో నిర్మానుష ప్రదేశాలను గుర్తించి, అక్కడ సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం. విరివిగా పోలీసుల గస్తీ నిర్వహించడం. వీధి లైట్లు వెలిగేలా చూడటం లాంటి చర్యలు చేపట్టాలని ఎప్పటి నుంచో మహిళా సంఘాలు కోరుతున్నాయి. దీనిపై గతంలో కొందరు ఆన్‌లైన్ సిగ్నేచర్ క్యాంపెయిన్ కూడా నిర్వహించారు. వీధుల్లో మద్యం సేవించడాన్ని నిలువరించాలని కూడా డిమాండ్ చేస్తున్నారు. బస్టాపుల్లో సైతం లైట్లను ఏర్పాటుచేసి, అర్ధరాత్రిళ్లు సైతం మహిళలు ఒంటరిగా ప్రయాణించేలా పరిసరాలను తీర్చిదిద్దాలని మహిళా సంఘాల ప్రతినిధులు పలు వేదికల ద్వారా ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

పార్కింగ్ ఫీజు వసూలుపై వెనక్కి

(5వ పేజీ తరువాయి)

మియాపూర్ స్టేషన్లలో పెయిడ్ పార్కింగ్ అమలు విధానాన్ని తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది.

మండిపడుతున్న ప్రయాణికులు

ఎల్‌అండ్‌టీ యాజమాన్యం తీరుపై ప్రయాణికులు మండిపడుతున్నారు. ప్రభుత్వం ఉచితంగా కేటాయించిన స్థలాల్లో పార్కింగ్ ఫీజును వసూలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. ఓ వైపు మెట్రో బోగీలను పెంచాలని డిమాండ్ చేస్తున్నా పట్టించుకోని యాజమాన్యం.. ఫస్ట్‌మైల్, లాస్ట్ మైల్ కనెక్టివిటీని సరిగ్గా నిర్వహించలేని సంస్థ.. నష్టాలను సాకుగా చూపించి దోచుకునే ప్రయత్నం చేస్తోందని ఆగ్రహిస్తున్నారు. పార్కింగ్ ఫీజును వసూలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరిస్తున్నారు. ఇదిలా ఉండగా, నగరంలోని మియాపూర్- ఎల్బీనగర్, జేబీఎస్-ఎంజీబీఎస్, నాగోలు-రాయదుర్గం కారిడార్ల పరిధిలోని 57 స్టేషన్లలో 10 చోట్ల మాత్రమే ఉచిత పార్కింగ్ సదుపాయం ఉంది. విగతా 47 స్టేషన్లలో వాహనాలకు ఫీజు వసూలు చేస్తున్నారు.

'భూసమస్యల పరిష్కారానికే కొత్త రెవెన్యూ చట్టం'

మేడ్చల్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న నూతన ఆర్వోఆర్ చట్టం ముసాయిదా బిల్లుపై సలహాలు, సూచనలివ్వాలని మేడ్చల్ కలెక్టర్ గౌతమ్ పోట్రు కోరారు. శనివారం కలెక్టరేట్‌లో రెవెన్యూ అధికారులు, న్యాయవాదులు, రైతులు, యువకులు, నిపుణులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. భూసమస్యల పరిష్కారానికి నూతన రెవెన్యూ చట్టం రూపకల్పనకు ప్రభుత్వం సంకల్పించిందని, ఇందులో భాగంగా రెవెన్యూ చట్టం-2024 ముసాయిదా బిల్లు ప్రవేశపెట్టిందన్నారు. ఈ సందర్భంగా పలువురు సూచనలు, సలహాలు ఇచ్చారు.

కాలం చెల్లిన పాలపౌడర్‌తో పన్నీర్, స్వీట్ల తయారీ

● 5,280 కిలోల పౌడర్ స్వాధీనం

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): కాలం చెల్లిన పాల పౌడర్‌తో పన్నీర్, స్వీట్లు తయారు చేసి విక్రయిస్తున్న వ్యక్తిని ఫుడ్‌సేఫ్టీ అధికారులతో కలిసి సౌత్ ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. బోలక్‌పూర్‌కు చెందిన చిట్టిబోయిన దామోదర్ (46) తార్నాక విజయపురి కాలనీలో పాల ఉత్పత్తుల దుకాణం నిర్వహిస్తున్నాడు. అధిక లాభాల కోసం రవికిరణ్ నుంచి కాలం చెల్లిన పాల పౌడర్‌ను కొనుగోలు చేసి నందిని బ్రాండ్ ప్యాకెట్లలో మార్చి నగరంలో విక్రయిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దామోదర్ దుకాణంపై దాడులు నిర్వహించి రూ.11.50 లక్షల విలువైన 5,280 కిలోల కాలం చెల్లిన పాలపౌడర్‌ను స్వాధీనం చేసుకున్నారు.

ఆదివారం

అలా పిలవటం గొప్పగా అనిపిస్తుంది

ఎప్పటికప్పుడు డిఫరెంట్ లుక్స్‌తో కనపడే బాలీవుడ్ కథానాయిక నర్గీస్ ఫక్రి. ఈ అమెరికన్ భామ బాలీవుడ్‌లో 'రాక్‌స్టార్' కథానాయికగానే ఇప్పటికీ పాపులర్. నర్గీస్ ఫక్రి గురించి కొన్ని విశేషాలు..

ఇటీవలే సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లో జిమ్ ఫొటోలను షేర్ చేసింది. ఈ ఫొటోలు వైరల్ అయ్యాయి. దీంతో పాటు ఈ అమ్మడు 'మహిళలకు మజిల్స్ అవసరమే. ప్రతిరోజూ జిమ్ చేసి శారీరక ఆరోగ్యమే కాదు మానసిక ఆరోగ్యాన్నీ కాపాడుకోవాల్సిన అవసరం ఉంది' అంటోంది నర్గీస్. ఈ మధ్యకాలంలో కెటిల్ బెల్ వర్కవుట్స్ చేస్తోందీమె.

అలా సినిమాల్లో అవకాశం..

నర్గీస్ అమెరికాలో పుట్టింది. తన తండ్రి పాకిస్తాన్‌కు చెందిన వ్యక్తి. పేరు మహ్మద్ ఫక్రి. ఇక తల్లి చెక్ రిపబ్లిక్‌కు చెందిన మహిళ. నర్గిస్‌కు ఆరేళ్లున్నప్పుడే పేరెంట్స్ విడిపోయారు. ఆ తర్వాత తన తండ్రి చనిపోయారు. అమెరికన్ నేషనాలిటీ వచ్చింది. అయితే ఆమె గ్లోబల్ సిటిజన్‌గా చెప్పుకోవటానికే ఇష్టపడుతుంది. ఇక పదహారేళ్ల వయసులోనే నర్గీస్ మోడల్‌గా అడుగుపెట్టింది. ఫ్యాషన్‌గాళ్‌గానే కాకుండా మోడల్‌గా క్రేజ్ సంపాదించింది. 2009 సమయంలో మనదేశంలోని కింగ్ ఫిషర్ క్యాలెండర్ గాళ్‌గా కనపడింది. అలా ఆమెకు పేరొచ్చింది. 'ఒక రోజు డెన్మార్క్‌లో షూటింగ్ ఉన్నా. ఒక ఈమెయిల్ వచ్చింది. ఇండియన్ మూవీలో నటించాలని ఆ మెయిల్ సారాంశం. అయితే నమ్మటం కష్టమన్నాను. చివరికి మీకు హిందీ నేర్పిస్తాం. నేను ఫలానా డైరక్టర్ దగ్గర అసిస్టెంట్‌గా పని చేస్తాను. మీరు ఒకసారి ముంబై రండి అని చెప్పారు. దీంతో ఇక్కడికొచ్చాను. ఆడిషన్‌లో పాల్గొన్నా. ఆ సినిమానే



'రాక్‌స్టార్'. అలా బాలీవుడ్ కథానాయికగా కెరీర్‌ను ఆరంభించాను' అంటుందీమె.

అలా ఊహించలేదు..

ఇంతియాజ్ అలీ దర్శకత్వంలో వచ్చిన రొమాంటిక్ మ్యూజికల్ స్టోరీలో నర్గీస్ నటకు మంచి మార్కులు పడ్డాయి. సినిమా కూడా సూపర్ హిట్ అవటంతో ఆమెకు అవకాశాలు వచ్చాయి. 'తొలి సినిమానే సూపర్ హిట్ అవుతుందని ఊహించలేదు. ఆ సమయంలో ఎలాంటి సినిమాలు ఎంచుకోవాలనే ఆలోచన కూడా కోల్పోయాను. తొలి సినిమానే విజయం సాధించటంతో గ్రేట్‌గా ఫీలయ్యా. ఇప్పటికీ రాక్‌స్టార్ హీరోయిన్ అనే పిలుస్తారు. ఇదెంతో గొప్పగా అనిపిస్తుంది.

> నర్గీస్ ఫక్రి అమెరికన్ లుక్స్‌లో ఉన్న బాలీవుడ్ హీరోయిన్. ఇన్‌స్టాలో ఎనిమిది మిలియన్ల మంది ఆమెను ఫాలో అవుతున్నారు. సినిమా విశేషాలతో పాటు జీవితంలో ముఖ్య విషయాలను షేర్ చేస్తుంటుంది. ఫిట్‌నెస్ వీడియోలతో పాటు ప్రయాణాలను పోస్ట్ చేస్తుంది. ముఖ్యంగా ఇన్‌స్టాలో ఆమె చేసే ఫొటోషూట్ ఫొటోలే హైలైట్. ఇంటర్నేషనల్ యాక్ట్రెస్ అంటూ ఓ వెబ్‌సైట్‌ను కూడా నర్గీస్ ఫక్రి తన పేరుతో తయారు చేయించుకుంది.

శ్రీలంక సివిల్ వార్ నేపథ్యంలో వచ్చిన 'మద్రాస్ కేఫ్'లో నటించింది. 'పాత పోస్టర్ నిఖిలా హీరో', 'కిక్' చిత్రాల్లో ఆమె చేసిన ఐటమ్ సాంగ్స్ మంచి పేరు తీసుకొచ్చాయి. 'స్పై' అనే హాలీవుడ్ చిత్రంలో నటించింది. 'హౌస్‌ఫుల్ 3', 'అమవాస్', 'తొర్బాజ్' లాంటి చిత్రాల్లో నటించినా ఆమెకు పెద్దగా పేరు రాలేదు. దీంతో ఆమె కెరీర్ ముగిసినట్లే అనుకున్నారు. అయితే ప్రస్తుతం 'హరి హర వీర మల్లు' చిత్రంలో నటిస్తోంది.

అదే నా ఆశ..

ముంబైలోని స్ట్రీట్ ఫుడ్ తినటం అంటే చాలా ఇష్టం. చాలా సార్లు సిక్ అయ్యాను. అయితే తినకుండా ఉండలేనంటుంది నర్గిస్. 'ఇంట్లో బటర్ చికెన్ వండుతాను. అది కూడా ఇన్‌స్టా వీడియోలను చూసి. ఒకప్పుడు కాఫీ ఎక్కువగా తాగేదాన్ని. ఇండియాలో ఉన్నా కాబట్టి టీకి బానిసయ్యాను' అంటుందీమె. ఒకప్పుడు ఎక్కువగా చాక్లెట్స్ తినేదట. ఇప్పుడు మానేసింది. 'రణ్‌బీర్ కపూర్, వరుణ్ ధావన్, ఇలియానా.. ఇలా అందరం షూటింగ్ టైమ్‌లో హోమ్ ఫుడ్ షేర్ చేసుకునేవాళ్లం. ఇప్పటికీ నా బెస్ట్ కథానాయకుడు రణ్బీర్ కపూర్. అతనే 'రాక్‌స్టార్' అంటుంది నర్గీస్. ఇకపోతే ఓటీటీ ప్లాట్ ఫామ్స్‌లో, వెబ్‌సిరీస్‌లో తనకు మంచి పాత్రలు దొరుకుతాయని ఆమె ఆశగా ఎదురుచూస్తోంది. విభిన్నమైన కథల్లో నటించినప్పుడే సత్తా తెలుసుకోవచ్చు అంటుంది నర్గిస్. 'కాబోయే వరుడు ఇండియన్ అయి ఉండాలనుకుంటాను' అంటూ మనసులో మాటను చెబుతుంది నర్గిస్ ఫక్రీ.

'బుట్ట బొమ్మ.. బుట్ట బొమ్మ' అంటూ కుర్రకారుతో స్టెప్స్ వేయించినా, 'అనగనగనా... అరవిందట తన పేరు...' అంటూ ఉత్సుకతను రేకెత్తించినా... అర్మాన్ మాలిక్‌ది విభిన్నమైన శైలి. అర్మాన్ తల్లి సొంత ఊరు వైజాగ్. అందుకే "మేము అప్పుడప్పుడు తెలుగులో మాట్లాడుతూ ఉంటాం. తెలుగు నేర్చుకోవడానికి ప్రత్యేకంగా క్లాసులు కూడా తీసుకుంటున్నా" అంటున్న అర్మాన్ వచ్చే నవంబర్‌లో తనకు ఇష్టమైన వైజాగ్‌లో షో కూడా చేయబోతున్నాడు. ఈ నేపథ్యంలో ఒక ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొనటానికి హైదరాబాద్ వచ్చిన అర్మాన్‌ను 'నవ్య' పలకరించింది.

సండే సెలబ్రిటీ



అదే సంగీతం గొప్పతనం

మీకు తెలుగు వచ్చా?

అమ్మ, నేను అప్పుడప్పుడు తెలుగులో మాట్లాడుకుంటూ ఉంటాం. నాకు తెలుగులో మాట్లాడితే అర్థమవుతుంది. ఇంట్లో హిందీ, ఇంగ్లీష్‌లో మాట్లాడుకుంటాం. కానీ నాకు తెలుగంటే చాలా ఇష్టం. అందుకే తెలుగు నేర్చుకోవటానికి ప్రత్యేకంగా క్లాసులకు వెళుతున్నా.

మీరు ఈ సంగీత ప్రపంచంలోకి ఎలా ప్రవేశించారు?

మాది మ్యూజిక్ ఫ్యామిలీ కాబట్టి నేను ఈ ప్రపంచంలోకి వచ్చానని అందరూ అనుకుంటూ ఉంటారు. అది కొంతవరకే నిజం. నాకు చిన్నప్పటి నుంచి నేపథ్య సంగీతం పాడాలని ఉండేది. కారణం తెలియదు కానీ సినీ సంగీతం నన్ను చాలా ఆకర్షించేది. నేను మ్యూజిక్ కంపోజ్ చేస్తాను. కానీ ఒక పాట పాడుతుంటే వచ్చే ఆనందమే వేరు.

ఒక సింగర్‌కు సాధన ఎలా ఉపయోగపడుతుంది? మీరు రోజూ ఎన్ని గంటలు సాధన చేస్తారు?

వ్యాయామం చేసే సమయంలో ముందు వార్మప్‌లు చేస్తారు. మన గాత్రానికి కూడా అలాంటి వార్మప్ అవసరం. రోజూ కనీసం పావుగంట సాధన చేస్తాను. పాశ్చాత్య సంగీతాన్ని కూడా పాడటానికి అనువుగా నా స్వరాన్ని తయారుచేసుకుంటా. ఇక కాన్సర్ట్స్ ఉన్న సమయంలో... ఏదో ఒక పాటను తీసుకొని ప్రాక్టీస్ చేస్తా. దానివల్ల మిగిలిన పాటలు సులభమవుతాయి.

> 'హమే తుమే ప్యార్ కిత్నా' అనే కిశోర్‌కుమార్ పాట అంటే నాకు చాలా ఇష్టం. నన్ను ప్రభావితం చేసిన సింగర్- సోనూ నిగం. చిన్నప్పటి నుంచి ఆయనలా పాడాలనుకొనేవాణ్ణి.
>
> నాకు వైజాగ్ అంటే చాలా ఇష్టం. నవంబర్ 9న అక్కడ షో ఉంది. మా అమ్మ వైజాగ్‌కు చెందినదే! కాబట్టి నాతో పాటు మా అమ్మ కూడా చాలా ఆతృతగా ఎదురుచూస్తోంది.



స్టేజ్ మీద పాడుతున్నప్పుడు ఎప్పుడైనా మిమ్మల్ని మీరు మర్చిపోయారా?

లండన్‌లోని వెంబ్లీ ఎరినాలో ఒకసారి షో జరిగింది. దీనిలో రెండు గంటలు పాడాను. బయటకు వచ్చిన తర్వాత - "ఎలా ఫీలయ్యారు?" అని అక్కడివారు అడిగారు. నాకు ఆ స్టేజీ మీద పాడిన ఒక పాట కూడా గుర్తు లేదు. అంత తన్మయత్వంలో మునిగిపోయా. నాకే కాదు. అనేకమంది గాయనీ, గాయకులకు ఇలాంటి అనుభవం ఎప్పుడో ఒకప్పుడు కలిగే ఉంటుంది. దీన్ని మామూలు మాటల్లో చెప్పలేను. మైమరిచిపోయానని మాత్రమే చెప్పగలను. సంగీతానికి ఉన్న గొప్పతనం అదే.

ఏ భాషలో పాటలు పాడటం కష్టం?

మలయాళం. మీరు ఏ సింగర్‌నైనా అడగండి... మలయాళంలో పాడటం కష్టమని చెబుతారు. ఆ భాష చాలా అందంగా ఉంటుంది. అదే సమయంలో దాన్ని ఒడిసిపట్టుకోవటం కూడా చాలా కష్టం. కొన్ని పదాలను కొన్ని విధాలుగానే పలకాలి.

ఏ భాషలో పాడటం సులభం..

తెలుగు, కన్నడలలో పాడటం చాలా సులభమనిపిస్తుంది. రెండు భాషల మధ్య సారూప్యత కూడా ఉంది. ఈ రెండు భాషల్లో పాడుతున్నప్పుడు ఎలాంటి శ్రమ ఉండదు.

దక్షిణ భారత దేశంలోని ఒకో భాషకు ఒక ప్రత్యేకత ఉంటుంది. యాస ఉంటుంది. అలాంటప్పుడు - ఆ భాషకు తగ్గట్టుగా ఎలా పాడగలుగుతారు?

జాగ్రత్తగా నేర్చుకుంటే అంత కష్టం కాదు. ఉదాహరణకు నేను తెలంగాణ యాసలోను, ఆంధ్ర యాసలోను, రాయలసీమ యాసలో పాడగలను. ఈ మూడు వేర్వేరు. చిన్న చిన్న పదాలను పట్టించుకుంటే తేడాలు తెలుస్తాయి. జాగ్రత్త తీసుకోకపోతే వేరే భాషకు చెందిన సింగర్ పాడుతున్నాడని తెలిసిపోతుంది. నా పాట విన్న వారు- 'ఇతను మన భాషవాడే' అనుకోవాలి. అప్పుడే పాటకు న్యాయం చేసిన వాళ్లమవుతాం. లేకపోతే విఫలమయినట్లే.

మీకు నచ్చిన సంగీత దర్శకులు ఎవరు?

ఒకరని చెప్పలేను. అనేకమంది ఉన్నారు. ఎ.ఆర్.రెహమాన్ సర్, సంజయ్ లీలా భన్సాలీ సర్, సలీం-సులైమాన్, తమన్ సర్, అనూప్ రూబెన్స్, గోపీ సుందర్- ఇలా చెప్పుకుంటూ పోతే అనేకమంది ఉన్నారు. ఒక్కొక్కరికి ఒకో ప్రత్యేకత ఉంటుంది. ఇక ఈ సంగీత దర్శకులందరూ తమ దగ్గర పాడే సింగర్స్‌కు స్వేచ్ఛను ఇస్తారు. నేను రెహమాన్ సర్ దగ్గర తొలి సారి పాడేటప్పుడు చాలా భయపడ్డా. కానీ ఆయన "నువ్వు ఎలా పాడాలనుకున్నావో... అలా పాడు" అన్నారు. అదొక అనుభవం. ఇక సంజయ్ లీలా భన్సాలీ సర్ చాలా కచ్చితంగా ఉంటారు. నేను ఆయనకు 'సుకూన్' అనే ఆల్బమ్‌లో ఒక గజల్‌ను ఏడుసార్లు పాడాను. ఏడు నెలలు ఏడు రకాలుగా పాడి వినిపించాను. ఆయన ప్రతి మాటను.. ప్రతి స్వరాన్ని పట్టించుకుంటారు. నేను అన్నిసార్లు ఏ పాటనూ పాడలేదు. నాకు ఇప్పటికీ అదే ఫేవరెట్ సాంగ్. నాకు ఆ అవకాశం వచ్చినందుకు ఆనందపడుతూ ఉంటాను. ఆ గజల్ తర్వాత నేను మంచి సింగర్ అయ్యాననుకుంటాను.

> గతంలో మాదిరిగా ఇప్పుడు గాయనీగాయకులు ఏళ్ల తరబడి నిలబడడం లేదు. సోషల్ మీడియా వచ్చిన తర్వాత అందరికీ అవకాశాలు పెరిగాయి. ఒకప్పుడు సింగర్స్ కొద్దిమందే ఉండేవారు. ప్రత్యేకంగా ప్రయత్నం చేస్తే తప్ప అవకాశాలు వచ్చేవి కావు. సోషల్ మీడియా వచ్చిన తర్వాత సంగీత దర్శకులకు, గాయకులకు మధ్య ఉన్న దూరం తగ్గిపోయింది. ఎవరైనా పాట పాడి యూట్యూబ్‌లో పెట్టవచ్చు. దాని ద్వారా అవకాశాలు రావచ్చు. కాబట్టి ప్రతి సంవత్సరం బ్లాక్ బస్టర్ హిట్స్ ఇస్తే తప్ప ఏ గాయకుడూ ఎక్కువ కాలం నిలబడలేడు. నేను 16 ఏళ్ల నుంచి పాడుతున్నా. కొత్త తరం ఇష్టపడే సంగీతంతో వెళ్లకపోతే.. వెనకబడిపోతామని ఈ ప్రయాణంలో నేను తెలుసుకున్నా. కాలంతో కూడా మనం మారాలి.


• సీవీఎల్ఎన్ ప్రసాద్

"మలయాళ సాహితీ దిగ్గజం వాసుదేవన్ నాయర్ రాసిన తొమ్మిది కథల ఆంథాలజీ సిరీస్ 'మనోరతంగల్'. కేరళలో సాహిత్య, సినిమా రంగాలు కలిసున్నాయనడానికి ఇదొక నిదర్శనం. తమిళంలోనూ 'పొన్నియన్ సెల్వన్' నవల సినిమాగా వచ్చిన సంగతి తెలిసిందే. అలాంటి ప్రయత్నాలు తెలుగులో మచ్చుకైనా సాగడంలేదన్నది సినీ, సాహిత్యాభిమానుల ఆవేదన. ఈ సందర్భంగా తెలుగు సాహిత్యం తెరకెక్కదా? అలాంటి ప్రయత్నాలు ఇక్కడెందుకు జరగడంలేదు? తదితర విషయాలపై ప్రముఖ సాహిత్య విమర్శకురాలు ప్రొఫెసర్ మృణాళిని చెబుతున్న అభిప్రాయమిది.

మన సాహిత్యం తెరకెక్కదా?



మన దర్శక, నిర్మాతలు, నటులు పెద్దగా సాహిత్యాన్ని చదవరు. కాబట్టి గొప్ప తెలుగులో సాహిత్యం ఉందనే విషయం వారికి తెలిసే అవకాశం చాలా తక్కువ. అదే తమిళం, మలయాళంలో మంత్రులతో సహా చాలామంది పుస్తకాలు చదువుతారు. నటులు ఆధారంగా కథ రాసుకోవడం మనకున్న అతి పెద్ద జాడ్యం. గ్లోరిఫై చేసిన నెగెటివిటీని, క్రౌర్యాన్ని మాత్రమే మనవాళ్లు స్వీకరిస్తారు తప్ప.. ఒక బలహీనత ఉన్న, సహజమైన వ్యక్తి కథా నాయకుడిగా ఉండే కథలను, నవలలను మనవాళ్లు స్వీకరించలేరు. సాహిత్యంలోని షేడ్స్‌ను సినిమాల్లోకి తీసురావడానికి వాళ్ళ స్టార్‌డమ్, అభిమానగణం అడ్డుపడతాయి. అలాంటప్పుడు సాహిత్యం నుంచి సినిమాకు కథ తీసుకోడానికి ఆస్కారం ఉండదు. ఉత్తమ సాహిత్యం స్టార్ డమ్‌కు లొంగదు. అదే మలయాళంలో చూడండి... మమ్ముట్టి 'కాథల్- ది కోర్' సినిమాలో హోమోసెక్సువల్ పాత్ర పోషించారు. సూపర్‌స్టార్ స్థాయిలోని నటుడు అలాంటి పాత్రలో నటించాడంటే... నటుడిగా అతను ఎంతటి నిజాయితీపరుడు కాకపోతే అలా చేయగలడు. ఆ నిజాయితీ మన తెలుగు నటుల్లో లేదు. ఒకప్పుడు 'దేవదాసు', 'బాటసారి', 'అర్ధాంగి' లాంటి సూపర్‌హిట్ సినిమాలన్నీ నవలల ఆధారంగా వచ్చినవే! ఇక 1960, 70 దశకాలలో కోడూరి కౌసల్యాదేవి, యద్దనపూడి సులోచనారాణి



తదితరుల కథలు, నవలలు... ప్రేమ కథా, కుటుంబ కథా చిత్రాలుగా వచ్చాయి. ఆ నవలలు ఎంతగా హిట్ అయ్యాయో... సినిమాలూ అంతగా హిట్ అయ్యాయి. ఇప్పుడు ఆ జానర్ పనికిరాదు. ఇప్పుడు మంచి క్లాసిక్ నవలలను సినిమాగా తీయాలంటే... ట్రెండ్‌కు తగినట్టు వాటిని మలచగలిగే దక్షత దర్శకులకు ఉండాలి. ఉదాహరణకు గోపీచంద్, బుచ్చిబాబు, చలం, విశ్వనాథ సత్యనారాయణ, కొ.కు రచనలు సినిమాగా తీయాలంటే దర్శకులకు సాహిత్యాభిరుచి ఒక్కటే చాలదు, తాత్విక దృక్కోణమూ ముఖ్యం. అందుకే మనం క్లాసిక్ నవల అని చెప్పుకోదగ్గది ఏదీ సినిమాగా రాలేదు. విశ్వనాథ 'వేయిపడగలు' లాంటి క్లాసిక్స్ రచనలు కొన్ని టెలివిజన్ ధారావాహికలుగా వచ్చాయి. కొంతవరకు మంచి నవలను సినిమాగా తీసినవాటిల్లో 'బలిపీఠం', 'ఇదెక్కడి న్యాయం' లాంటివి ఉన్నాయి. చలం 'దోషగుణం' కథను 'గ్రహణం' పేరుతో ఇంద్రగంటి మోహన్‌కృష్ణ చక్కగా తీశారు. 'కన్యాశుల్కం' నాటకం తర్వాత 'దోషగుణం' క్లాసిక్స్‌కు కాస్త న్యాయం చేసిన సినిమాగా చెప్పవచ్చు.

ఆ ట్రెండ్ కొనసాగలేదు...

ఎంటీ వాసుదేవన్ నాయర్ మలయాళంలో మంచి రచయిత మాత్రమే కాదు, సినిమాలకు దర్శకత్వం వహించినవాడు కూడా. జయమోహన్ కూడా 'పొన్నియన్ సెల్వన్' లాంటి సినిమాలకు మాటలు రాశారు. సాహిత్య రచయితలు సినిమాలకు కూడా రాయడం, ఆ రెండూ కలిసిమెలిసి ఒకే రకమైన స్థాయిలో కొనసాగడం వేరే భాషల్లో చూస్తాం. మనదగ్గర సినిమా అన్నది వేరే స్థాయిలో ఉంటుంది. అది సాహిత్య స్థాయికి రావడం లేదు. కొందరు ప్రముఖ రచయితలు ఆనాడు సినిమా కథలు రాద్దామని వెళ్లి భంగపడి బయటకు వచ్చారు. ఉదాహరణకు గోపీచంద్, రావి శాస్త్రి తదితరులు. మంచి రచయితలను వినియోగించుకోవడం మన సినిమా వారికి చేతకాలేదు. అదే బుచ్చిబాబు రాసిన మూలకథకు దేవులపల్లి కృష్ణశాస్త్రి సృజన తోడవడంతో 'మల్లీశ్వరి'లాంటి కథ పుట్టింది. ఆ ట్రెండ్ తర్వాత కొనసాగలేదు. బుచ్చిబాబు 'చివరికి మిగిలేది' నవలను సినిమాగా తీస్తానని ఇంద్రగంటి మోహన్‌కృష్ణ ప్రకటించాడు. క్రిష్ కూడా కొంతవరకు ప్రయత్నిస్తున్నాడు. అయితే, 'కొండపొలం' నవలను సినిమాగా తీసే క్రమంలో కమర్షియల్ ఎలిమెంట్‌కు లొంగిపోయాడు. ఒక నవల లేదా కథను సినిమాగా తీయాలంటే, దాని ఫోకస్ పాయింట్‌ను పట్టుకోకపోతే ఆ రచనకు న్యాయం జరగదు.

- ప్రొఫెసర్ సి.మృణాళిని
కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు విభాగం కన్వీనర్



అలనాటి కథ

మనకున్న గొప్ప రచయితలలో ముక్దుం ఒకరు. ఆయనతో నాన్నకు మంచి స్నేహం ఉండేది. నిన్న పాత పుస్తకాలు తిరగేస్తుంటే ముక్దుం పుస్తకాలు బయటకు వచ్చాయి. అనేక జ్ఞాపకాలు మదిలో మెదిలాయి.

ముక్దుం జ్ఞాపకాలు..



నాన్న రాజా ధన్‌రాజ్‌గిరి ఉర్దు, పర్షియన్ పుస్తకాలు చదువుతూ ఉండేవారు. అలా ఆయనకు ముక్దుంతో పరిచయం ఏర్పడింది. నాన్నకు ఆయన కవిత్వం పట్ల విపరీతమైన ఆసక్తి ఏర్పడి ఆయనను కలవాలనుకున్నారు. ఒక స్నేహితుడి ఇంట్లో కలుసుకున్నారు. ఒక రోజు నాన్న- ముక్దుంను, ఇతర స్నేహితులను ఇంటికి డిన్నర్‌కి పిలిచారు. నేను డైనింగ్ రూమ్ దగ్గరకు వెళ్లేసరికి- నాన్న స్నేహితులందరూ కూర్చుని మాట్లాడుకుంటున్నారు. ఒక వ్యక్తి దూరంగా కూర్చుని చార్మినార్ సిగరెట్ తాగుతున్నాడు. నేను నాన్న స్నేహితులతో పిచ్చాపాటి మాట్లాడుతూ - "కమ్యూనిస్టులు చాలా చెడ్డవాళ్లు" అన్నాను. అప్పుడు దూరంగా కూర్చుని వ్యక్తి నా వైపు చూసి - "నీకు కమ్యూనిజం గురించి ఏం తెలుసు?" అన్నాడు. నాకు అప్పటి దాకా ఆయనే ముక్దుం అనే విషయం తెలియదు. "నాకు కమ్యూనిజం గురించి ఎక్కువ తెలియదు. నేను నిన్నే వియన్నా నుంచి వచ్చాను. అక్కడ నా కెమెరా లాగేసుకున్నారు.. మ్యూజియంకి వెళ్తే అక్కడ నన్ను తనిఖీ చేశారు" అని చెప్పా. ఆయన నావైపు నిరసనగా చూశాడు. ఎందుకో తెలియదు కానీ ఆయనంటే నాకు మంచి అభిప్రాయం ఏర్పడలేదు. నాన్న ఇంకెప్పుడు ఆయనను ఇంటికి పిలవకపోతే బావుండుననుకున్నాను. కానీ రెండు రోజుల తర్వాత మళ్లీ ముక్దుం మా ఇంటికి వచ్చాడు. నాన్న ఆయన కవిత్వం చదువుతుంటే రికార్డు కూడా చేశారు. "ప్రాణాన్ని తీసుకుందాం.. విశ్వాన్ని తీసుకుందాం.. పదండి.. మొత్తం ప్రపంచాన్ని మనతో తీసుకువెళ్దాం.." అనే ఆయన కవితా పంక్తులు నాలో ఆసక్తి కలిగించింది. ఆ తర్వాత కాలంలో ముక్దుం మా ఇంటిలో జరిగే అనేక పార్టీలకు వస్తూ ఉండేవాడు. ఇలా ముక్దుంతో పరిచయం పెరిగింది.

> నాకు శ్రీశ్రీ కవిత్వాన్ని పరిచయం చేసింది ముక్దుమే! తనే తొలిసారి శ్రీశ్రీ కవిత్వ పుస్తకం వచ్చింది... చదవమని చెప్పాడు. ఇలా అనేక మంది గొప్ప రచయితలను నాకు పరిచయం చేశాడు.

ఒక రోజు ముక్దుం నాకు ఫోన్ చేసి- "నా పుస్తకం ముద్రించాలి.. ఒక వెయ్యి రూపాయలు ఇస్తావా?" అని అడిగాడు. ఆ సమయంలో నా పాకెట్ మనీ 300రూపాయలే! దాంతో నా దగ్గర అంత డబ్బు లేదని చెప్పాను. ఆ తర్వాత మళ్లీ ఎప్పుడు తను డబ్బుల గురించి నాతో మాట్లాడలేదు.



మా చెల్లిని స్విట్జర్లాండ్‌లో స్కూల్లో చేర్చటానికి నేను కూడా వెళ్లాను. అక్కడ నుంచి లండన్‌కు కూడా వెళ్లాను. నేను లండన్‌లో ఉన్న సమయంలో ముక్దుం నాకు "గుల్ ఏ తార్" (తాజా పువ్వులు) అనే పుస్తకాన్ని పంపించాడు. ముక్దుం రాసిన గజల్స్ పుస్తకమిది. ఒకో గజల్ ఒకో అద్భుతంలా అనిపించింది. "నాకు కూడా గజల్స్ రాయటం నేర్పుతారా?" అని ముక్దుంను అడిగాను. "నువ్వు రాసి పంపించు.. వాటిని నేను సరిచేస్తాను" అన్నాడు. నేను లండన్ నుంచి ముంబాయి వచ్చాను. అక్కడ నుంచి తనకు ఒక గజల్ రాసి పంపాను. దానిలో మూడు చరణాలు- ఇతర కవులవి. రెండు నావి. అవి చదివిన తర్వాత ముక్దుం- ఇతర కవులు రాసి మూడు చరణాలకు టిక్ పెట్టి పంపాడు. నేను రాసిన రెండు చరణాలు కొట్టేసి- "ఇది రాసే పద్ధతి కాదు" అని రాసి పంపాడు. ఆ సమయంలో ముక్దుం సిటీ కాలేజీలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ ఉండేవాడు. ఒకసారి ముక్దుం, ప్రముఖ ఇంగ్లీషు రచయిత ముల్కరాజ్ ఆనంద్‌తో కలిసి రష్యా వెళ్లాడు. అక్కడ వారిద్దరు ఒక చోట కూర్చుని కవిత్వం గురించి మాట్లాడుకుంటుంటే - ముల్కరాజ్ ఆనంద్ వ్యంగంగా- "ప్రతి భారతీయ కవి ఇంగ్లీషు రాయాలనుకుంటాడు.." అన్నాడుట. అప్పుడు ముక్దుం- "నువ్వే ఇంగ్లీషులో రాస్తున్నప్పుడు- ఇతరులు అనుకుంటే తప్పేముంది?" అన్నాడట. ఈ విషయాన్ని నాకు ముక్దుం స్వయంగా చెప్పాడు. ఆ తర్వాతి కాలంలో ముక్దుం కమ్యూనిస్టు భావాలను ప్రచారం చేసే కవుల్లో అగ్రగామిగా నిలిచాడు.

ఆ తర్వాతి కాలంలో హైదరాబాద్‌లో జేషిన్ ఈ ముక్దుం అనే కార్యక్రమం జరిగింది. దేశవ్యాప్తంగా ఉన్న కవులందరూ వచ్చారు. ముక్దుంకు ఘన సన్మానం చేశారు. ఆ తర్వాత ముక్దుం ప్రజల హక్కుల కోసం జరిగిన ఒక కార్యక్రమంలో నిరాహార దీక్షకు కూర్చున్నాడు. దాని తర్వాత అతని ఆరోగ్యం పాడైపోయింది.. తనకు ఆరోగ్యం పాడైన సమయంలో నేను మారిషస్‌లో ఉన్నా. మారిషస్ నుంచి బొంబాయికి వచ్చిన వెంటనే నాన్న పర్సనల్ సెక్రటరీ వచ్చి - "మీకో చెడు వార్త. ముక్దుం చనిపోయాడు" అని చెప్పాడు. నాకు విపరీతమైన దుఃఖం కలిగింది. ముక్దుం బతుకున్న రోజుల్లో- "నన్ను మసీదులో కాకుండా ఒక పొలంలో సమాధి చేయండి. నా సమాధి మీద గులాబీ పూల మొక్కలు, ద్రాక్ష మొక్కలు నాటండి" అని చెబుతూ ఉండేవాడు. నేను హైదరాబాద్‌కు వచ్చే సరికే అతనిని ఖననం చేసేశారు. ఆ తర్వాత నేను తన సమాధి దగ్గరకు వెళ్లి గులాబీ పూలతో శ్రద్ధాంజలి ఘటించి వచ్చాను. ముక్దుం లేకపోయినా అతని రచనలను ఈనాటికి ప్రజలు చదువుతున్నారు. గుర్తు చేసుకుంటున్నారు.

• రాజకుమారి ఇందిరాదేవి ధన్‌రాజ్‌గిర్

ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు



ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ	ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
అమెజాన్ ప్రైమ్ నో గైన్ నో లవ్ ది లార్డ్ ఆఫ్ ది రింగ్స్ 2	కొరియన్ సిరీస్ వెబ్‌సిరీస్	ఆగస్టు 26 ఆగస్టు 29	**డిస్నీ ప్లస్ హాట్‌స్టార్** ఓన్లీ మర్డర్స్ ఇన్ ది బిల్డింగ్ 4 కానా కానూమ్ కాళంగల్	వెబ్‌సిరీస్ తమిళ సిరీస్	ఆగస్టు 27 ఆగస్టు 30
నెట్‌ఫ్లిక్స్ ఐ.సి 814: ది కాందహార్ హైజాక్ ది డెలివరెన్స్ బ్రీత్‌లెస్	హిందీ సిరీస్ వెబ్‌సిరీస్ వెబ్‌సిరీస్	ఆగస్టు 29 ఆగస్టు 30 ఆగస్టు 30	**బుక్ మై షో** ట్విస్టర్స్	హాలీవుడ్ మూవీ	ఆగస్టు 30
			జియో సినిమా ఎబిగైల్ గాడ్జిల్లా వర్సెస్ కాంగ్	హాలీవుడ్ మూవీ హాలీవుడ్ మూవీ	ఆగస్టు 26 ఆగస్టు 29
జీ 5 ముర్షిద్	హిందీ సిరీస్	ఆగస్టు 30	**ఆపిల్ టీవీ ప్లస్** కె-పాప్ ఐడల్స్	కొరియన్ సిరీస్	ఆగస్టు 30





ఐసీ 814 హైజాక్ సంఘటనతో...



1999లో ఖాట్మాండు నుంచి ఢిల్లీకి వస్తున్న ఐసీ 814 ఇండియన్ ఎయిర్‌లైన్స్ విమానాన్ని ఉగ్రవాదులు హైజాక్ చేసిన సంఘటన ఆధారంగా రూపుదిద్దుకున్న వెబ్‌సిరీస్ 'ఐసి 814 : ది కాందహార్ హైజాక్'. దేశాన్ని కుదిపేసిన ఈ ఘటనలో 188 మంది ప్రయాణికులు, 15 మంది సిబ్బంది వారం రోజుల పాటు కాందహార్‌లో తాలిబన్ల చేతుల్లో బందీలుగా ఉన్నారు. హైజాక్ అయిన విమానాన్ని నియంత్రణలోకి తీసుకోవడానికి ఇండియన్ ఆర్మీ చేసిన ప్రయత్నాలు,ఢిల్లీలోని వార్‌రూమ్‌లో రూపొందిన వ్యూహాలు ప్రయాణికులను భద్రంగా స్వదేశానికి తీసుకురావడానికి భారత ప్రభుత్వం చేసిన ప్రయత్నాల నేపథ్యాన్ని ఈ సిరీస్ కళ్లకు కడుతుందని ట్రైలర్‌ను బట్టి తెలుస్తోంది. విజయ్ వర్మ, అరవింద్ స్వామి, నసీరుద్దీన్ షా, దియా మీర్జా కీలకపాత్రలు పోషించారు. అనుభవ్ సిన్హా దర్శకత్వం వహించారు. ఆగస్టు 29 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ అవనుంది.

నిమ్స్‌లో మాస్టర్ ఆఫ్ ఫిజియోథెరపీ

హైదరాబాద్‌లోని నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(నిమ్స్)- మాస్టర్ ఆఫ్ ఫిజియోథెరపీ(ఎంపీటీ) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఈ ప్రోగ్రామ్‌లో మస్క్యులో స్కెలెటల్ సైన్సెస్, కార్డియోవాస్క్యులర్ అండ్ పల్మనరీ సైన్సెస్, న్యూరో సైన్సెస్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. ఒక్కోదానిలో అయిదు చొప్పున మొత్తం 15 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఎంట్రెన్స్ టెస్ట్, కౌన్సెలింగ్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బ్యాచిలర్ డిగ్రీ ఇన్ ఫిజియోథెరపీ(బీపీటీ) ఉత్తీర్ణులై ఉండాలి. 2024 ఆగస్టు 31 నాటికి ఆరు నెలల ఇంటర్న్‌షిప్ పూర్తి చేసి ఉండాలి. ఏ ఇతర కోర్సుల్లో ప్రవేశం పొంది ఉండకూడదు. అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి 22 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి. నిమ్స్ ఉద్యోగులకు వయోపరిమితి నిబంధనలు వర్తించవు.

ఎంట్రెన్స్ టెస్ట్ వివరాలు: దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో మొత్తం 60 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. అభ్యర్థి ఎంచుకొన్న స్పెషలైజేషన్‌కు సంబంధించి బేసిక్ అండ్ క్లినికల్ సైన్సెస్, బయోమెకానిక్స్, ఫిజియోథెరపీ టెక్నిక్స్, క్రిటికల్ కేర్, రీహాబిలిటేషన్ అంశాల నుంచి 30 ప్రశ్నలు; జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, పీడియాట్రిక్, గైనకాలజీ, ఎలక్ట్రోథెరపీ, ఎక్సర్‌సైజ్ థెరపీ, ఫస్ట్ ఎయిడ్, సోషల్ అండ్ ప్రివెంటివ్ మెడిసిన్, రేడియాలజీ, సోషియాలజీ, సైకాలజీ వంటి జనరల్ క్లినికల్ సైన్సెస్ అంశాల నుంచి 30 ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నలన్నీ బీపీటీ సిలబస్ ప్రకారం ఉంటాయి. సమాధానాలను ఓఎంఆర్ పత్రం మీద గుర్తించాలి. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 60. పరీక్ష సమయం గంట. ఈ టెస్ట్‌లో అర్హత సాధించాలంటే కనీసం 50 శాతం మార్కులు రావాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 40 శాతం మార్కులు చాలు. ఈ పరీక్షలో సాధించిన మెరిట్ ఆధారంగా అభ్యర్థులను కౌన్సెలింగ్‌కు పిలుస్తారు.



- **దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 2
- **ఎంట్రెన్స్ టెస్ట్ తేదీ:** అక్టోబరు 4
- **వెబ్‌సైట్:** www.nims.edu.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/ZxDNefDలో చదవండి.

దిక్సూచి DIKSUCHI

ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్‌లో పీహెచ్‌డీ

హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ(జేఎన్ఏఎఫ్ఏయూ)- పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఫుల్ టైమ్, పార్ట్ టైమ్ విధానాలు అందుబాటులో ఉన్నాయి. ఫుల్ టైమ్ ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. పార్ట్ టైమ్ ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. రిటెన్ టెస్ట్, ఇంటర్వ్యూల ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు.

స్పెషలైజేషన్‌లు-సీట్లు: ఆర్కిటెక్చర్ 5, అర్బన్ అండ్ రీజనల్ ప్లానింగ్ 2, పెయింటింగ్ 2

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి సంబంధిత విభాగాల్లో మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేసి ఉండాలి. కనీసం 55 శాతం మార్కులు తప్పనిసరి. యూజీసీ నెట్/సీఎస్ఐఆర్ నెట్/గేట్/సీడ్ అర్హత ఉన్నవారికి ఇంటర్వ్యూ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. వీరు ఎంట్రెన్స్ టెస్ట్ రాయనవసరం లేదు.

రిటెన్ టెస్ట్: దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. రీసెర్చ్ ఆప్టిట్యూడ్ నుంచి 75, నాలెడ్జ్ ఆఫ్ సబ్జెక్ట్ స్పెషలైజేషన్ నుంచి 75 చొప్పున మొత్తం 150 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఇస్తారు. మొత్తం మార్కులు 150. పరీక్ష సమయం మూడు గంటలు. ఈ పరీక్షలో కనీసం 50 శాతం మార్కులు వచ్చిన వారిని మాత్రమే ఇంటర్వ్యూకి అనుమతిస్తారు. ఎంట్రెన్స్ టెస్ట్ స్కోర్‌కు 70 శాతం, ఇంటర్వ్యూలో సాధించిన మార్కులకు 30 శాతం వెయిటేజీ ఇస్తారు.

- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** సెప్టెంబరు 19
- **వెబ్‌సైట్:** www.jnafau.ac.in

జయశంకర్ వర్సిటీలో డిగ్రీ కౌన్సెలింగ్

హైదరాబాద్-రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ(పీజేటీఎస్ఏయూ)- ఎంపీసీ స్ట్రీమ్ కింద నిర్వహిస్తున్న బీటెక్ ప్రోగ్రామ్‌లలో ఫార్మర్స్ కోటా సీట్లు; బీఎస్సీ ఆనర్స్ ప్రోగ్రామ్‌లో నాన్ రూరల్ అండ్ రూరల్ కోటా సీట్ల భర్తీకి కౌన్సెలింగ్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. తెలంగాణ ఈఏపీసెట్ 2024 ర్యాంక్ ఆధారంగా కౌన్సెలింగ్ నిర్వహించి అడ్మిషన్స్ ఇస్తారు. రెగ్యులర్(ఫార్మర్స్ కోటా), సెల్ఫ్ ఫైనాన్సింగ్ కేటగిరీల్లో సీట్లు ఉన్నాయి. గ్రామీణ రైతు కుటుంబాలకు చెందిన అభ్యర్థుల కోసం 40 శాతం సీట్లు ప్రత్యేకించారు. సెల్ఫ్ ఫైనాన్సింగ్ సీట్ల భర్తీకి విడిగా కౌన్సెలింగ్ నిర్వహిస్తారు.

బీటెక్(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్): సంగారెడ్డి-కందిలోని కాలేజ్ ఆఫ్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్‌లో మొత్తం 29 సీట్లు ఉన్నాయి. వీటిలో ఫార్మర్స్ కోటా కింద 20 రెగ్యులర్ సీట్లు, సెల్ఫ్ ఫైనాన్సింగ్ కోటా కింద 9 సీట్లను నిర్దేశించారు.

బీటెక్(ఫుడ్ టెక్నాలజీ): నిజామాబాద్-రుద్రూర్‌లోని కాలేజ్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో మొత్తం 15 సీట్లు ఉన్నాయి. వీటిలో ఫార్మర్స్ కోటా కింద 10 రెగ్యులర్ సీట్లు, సెల్ఫ్ ఫైనాన్సింగ్ కోటా కింద 5 సీట్లను నిర్దేశించారు.

బీఎస్సీ ఆనర్స్(కమ్యూనిటీ సైన్స్): హైదరాబాద్-సైఫాబాద్‌లోని కాలేజ్ ఆఫ్ కమ్యూనిటీ సైన్స్‌లో మొత్తం 42 సీట్లు ఉన్నాయి. వీటిలో 37 రెగ్యులర్ సీట్లు, 5 సెల్ఫ్ ఫైనాన్సింగ్ సీట్లు ఉన్నాయి. మూడేళ్ల డిప్లొమా(హోమ్ సైన్స్) అభ్యర్థుల కోసం అదనంగా 8 రెగ్యులర్ సీట్లు కేటాయించారు.

అర్హతలు: గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండో తరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. తెలంగాణ ఈఏపీసెట్ 2024లో ర్యాంక్ సాధించి ఉండాలి. అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి జనరల్ అభ్యర్థులకు 17 నుంచి 22 ఏళ్ల మధ్య, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 17 నుంచి 25 ఏళ్ల మధ్య దివ్యాంగులకు 17 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి.

- **కౌన్సెలింగ్ తేదీ:** ఆగస్టు 28న ఉదయం పది గంటలకు
- **వేదిక:** ఎగ్జామినేషన్ సెంటర్, వాటర్ టెక్నాలజీ సెంటర్ ఎదురుగా, పీజేటీఎస్ఏయూ, రాజేంద్రనగర్, హైదరాబాద్.
- **వెబ్‌సైట్:** www.pjtsau.edu.in

నిట్ వరంగల్‌లో బీఎస్సీ-బీఈడీ

వరంగల్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్)- నాలుగేళ్ల వ్యవధి గల ఇంటిగ్రేటెడ్ బీఎస్సీ-బీఈడీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇందులో మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ మేజర్ సబ్జెక్టులుగా; కంప్యూటర్ సైన్స్, మేథమెటిక్స్ మైనర్ సబ్జెక్టులుగా ఉంటాయి. ఇది సెకండరీ స్థాయి ప్రోగ్రామ్. మొత్తం 50 సీట్లు ఉన్నాయి. నేషనల్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(ఎన్‌సీఈటీ) 2024 స్కోర్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా ప్రథమశ్రేణి మార్కులతో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. 2022/2023/2024 సంవత్సరాల్లో ఇంటర్ స్థాయి పరీక్ష ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. ఎన్‌సీఈటీ 2024 అర్హత తప్పనిసరి.

- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** ఆగస్టు 27
- **వెబ్‌సైట్:** www.nitw.ac.in


నవ్య | చిత్రజ్యోతి

నిజంగా స్మగ్లింగ్ చేస్తే తప్పు పట్టాలి

● అల్లు అర్జున్ మామ కంచర్ల చంద్రశేఖర్‌రెడ్డి

పవన్ కల్యాణ్, నాగబాబు, అల్లు అర్జున్ తరచూ చేస్తున్న వ్యాఖ్యలతో మెగా ఫ్యామిలీలో విభేదాలు ఉన్నాయంటూ కొన్నాళ్లుగా మీడియాలో ఉధృతంగా ప్రచారం జరుగుతోన్న విషయం తెలిసిందే. అయితే ఈ వార్తలపై ఇప్పటి దాకా మెగా, అల్లు కుటుంబాల నుంచి ఎవరూ నేరుగా పెదవి విప్పింది లేదు. కానీ ఇప్పుడు తొలిసారి అల్లు అర్జున్ మామ కంచర్ల చంద్రశేఖర్‌రెడ్డి ఈ విషయంపై స్పందించారు. ఓ మీడియా ఛానల్ నిర్వహించిన చర్చా కార్యక్రమంలో ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'ఇప్పుడు హీరోలు స్మగ్లర్ల వేషాలు వేస్తున్నారు' అంటూ పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు, 'స్నేహితుల కోసం ఎక్కడిదాకా అయినా వస్తాను' అంటూ అల్లు అర్జున్ చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఆయన తన అభిప్రాయాన్ని వెలిబుచ్చారు.

● కల్యాణ్ గారు ఏ సందర్భంలో అలా మాట్లాడారో తెలియదు. ఆయన మాటవరసకు అలా అని ఉంటారు అని నేను అనుకుంటున్నాను. కానీ ప్రజల్లోకి తప్పుడు సందేశం పోతోంది. తర్వాతైనా ఆయన 'నా ఉద్దేశం ఇది' అని చెబితే బాగుండేది. ఆయనే స్వయంగా పూనుకొని సరిదిద్దితే బాగుండేదని నా అభిప్రాయం.



● ఎన్టీఆర్ నటుడిగా రావణుడు, దుర్యోధనుడి పాత్రలు పోషించారు. అంటే దానర్థం మొత్తం స్త్రీ జాతిని ఆయన కించపరిచాడని కాదు కదా. ఆ తర్వాత ఆయన ముఖ్యమంత్రి కూడా అయ్యారు. పవన్ కల్యాణ్ కూడా నటుడిగా ఉండి రాజకీయ నాయకుడయ్యారు. సినిమా యాక్టర్‌ను యాక్టర్‌గానే చూడాలి. వారి వ్యక్తిత్వాలకు ఆ పాత్రల స్వభావాన్ని అంటగట్టే ప్రయత్నం చేయకూడదు. అల్లు అర్జున్ నిజంగా స్మగ్లింగ్ చేస్తే తప్పు పట్టాలి.

● అల్లు అర్జున్‌కు జాతీయ ఉత్తమ నటుడి అవార్డ్ వచ్చింది. 69 ఏళ్లలో ఎవరికీ రాని అవార్డ్ ఆయన్ను వరించింది. ఆయన మిత్రపక్షం బీజేపీ కేంద్రంలో అధికారంలో ఉంది. ఎన్డీయే ప్రభుత్వమే అర్జున్‌కు ఉత్తమ నటుడు అవార్డ్ ఇచ్చింది. అది పవన్ కల్యాణ్‌కు తెలియదా? మంచీ చెడూ చూడకుండానే భారత ప్రభుత్వం ఆ పురస్కారాన్ని ఇవ్వలేదు కదా?. ఆయన అభిమానులేమో అల్లు అర్జున్‌నే అన్నాడు అని అనుకుంటున్నారు. ఇప్పుడు ఈ వివాదానికి శుభంకార్డు పడాలంటే 'ఇది నేను జనరల్‌గా అన్నాను' అని పవన్ కల్యాణ్ ఓ ప్రకటన చేయాలి. లేదంటే ఆయన భాగస్వామిగా ఉన్న ఎన్డీయే ప్రభుత్వాన్ని తప్పు పట్టినట్లే. భారత ప్రభుత్వ నిర్ణయాన్ని వివాదాస్పదం చేస్తున్నట్లుగానే భావించాలి. చిరంజీవి గారు పవన్ కల్యాణ్, అల్లు అర్జున్‌తో మాట్లాడి ఈ వివాదానికి ముగింపు పలకాలి.



బ్రదర్.. తప్పకరావాలి!

కమర్షియల్ తెలుగు సినిమాకు ఒక ఊపుని తెచ్చి, బాక్సాఫీసు దగ్గర సునామీ సృష్టించిన హీరోలు మెగాస్టార్ చిరంజీవి, నందమూరి బాలకృష్ణ. వయసుతో సంబంధం లేకుండా వరుసగా సినిమాలు చేస్తూ కుర్ర హీరోలకు గట్టి పోటీ ఇస్తూ దూసుకుపోతున్నారు. ఎన్నోసార్లు బాక్సాఫీసు దగ్గర వీరిరువురి చిత్రాలూ పోటీ పడినప్పటికీ ఎటువంటి పొరపొచ్చాలు లేకుండా, ఒకరి మీద మరొకరు ప్రత్యేక అభిమానం కురిపిస్తూ మంచి స్నేహితులుగా మెలుగుతుంటారు. ఒకరు ఎక్కువ, మరొకరు తక్కువ అనే భేదం ఈ ఇద్దరి హీరోలలోనూ లేదు. వృత్తిపరమైన పోటీని సినిమాలకే పరిమితం చేసి నిజజీవితంలో ఎంతో ఎమోషనల్ బాండింగ్ కలిగి ఉంటారు చిరంజీవి, బాలకృష్ణ. గురువారం రాత్రి జరిగిన గీత రచయిత రామజోగయ్యశాస్త్రి ఇంట జరిగిన వివాహ వేడుకలో ఈ అనుబంధం మరోసారి ఆవిష్కృతమైంది. ఈ వేడుకకు చిరంజీవి, బాలకృష్ణ హాజరయ్యారు. చిరంజీవి ఎదురు పడగానే 'బ్రదర్.. ఎలా ఉన్నారు?' అని ఆప్యాయంగా పలకరించారు బాలకృష్ణ. ఇద్దరూ కాసేపు మాట్లాడుకున్న తర్వాత సెప్టెంబర్ ఒకటిన జరిగే తన సన్మాన కార్యక్రమానికి తప్పకుండా రావాలని చిరంజీవిని ఆహ్వానించారు. వస్తానని చిరంజీవి చెప్పారు. అలాగే 'అన్‌స్టాపబుల్' కార్యక్రమం గురించి కూడా వీరిద్దరి మధ్య సంభాషణ జరిగిందని సమాచారం.

కాలం కలిసొస్తే నడిచొచ్చే సినిమా



నాని హీరోగా నటించిన భారీ బడ్జెట్ చిత్రం 'సరిపోదా శనివారం'ఈ నెల 29న విడుదల కానుంది. వివేక్ ఆత్రేయ దర్శకత్వంలో డీవీవీ దానయ్య, కల్యాణ్ ఈ చిత్రాన్ని నిర్మించారు. శనివారం హైదరాబాద్‌లో జరిగిన ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో నాని మాట్లాడుతూ 'ఈ సినిమా గురించి చాలా చెప్పేశాను. దర్శకుడు వివేక్ ఇందులో శివ తాండవం చూపించాడు. అతని కెరీర్‌కి ఈ సినిమా ఓ మైల్‌స్టోన్. మా కష్టాన్ని చూసి మీరు ఎంజాయ్ చేస్తారని భావిస్తున్నా. కాలం కలసి వస్తే నడిచి వచ్చే సినిమా వస్తుందంటారు. అటువంటి సినిమానే 'సరిపోదా శనివారం' అన్నారు. దర్శకుడు వివేక్ ఆత్రేయ మాట్లాడుతూ 'మా దర్శకుల కుటుంబం అంతా ఈ వేడుకకి వచ్చి ఆశీస్సులు అందజేశారు. ఈ సినిమా 29న విడుదల చేయడానికి దర్శకుల టీమ్ కూడా ఓ కారణం. నాని నా మీద ఉంచిన నమ్మకానికి 'సరిపోదా శనివారం' ఇచ్చా' అన్నారు. 'ఈ సినిమా బ్లాక్ బస్టర్ హిట్ అవుతుంది. నాని కథల ఎంపికలో బెస్ట్. కథ నచ్చితే కొత్త దర్శకుడైనా అవకాశం ఇస్తారు. ఆయనతో సినిమా చేస్తే నిర్మాతకు ఏ టెన్షన్ ఉండదు' అన్నారు నిర్మాత దానయ్య. ఒక రకమైన యాక్షన్ ఫిల్మ్‌ను దర్శకుడు వివేక్ విభిన్నంగా మలిచారని ఎస్.జె.సూర్య ప్రశంసించారు.

ఇన్ ప్రోగ్రెస్

టైటిల్ సాంగ్ వచ్చేసింది



బిగ్‌బాస్ ఫేమ్ గౌతమ్‌కృష్ణ హీరోగా నవీన్‌కుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'సోలో బాయ్'. సతీశ్ కుమార్ నిర్మిస్తున్నారు. శనివారం ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్‌గా టైటిల్ సాంగ్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు నవీన్‌కుమార్ మాట్లాడుతూ "ఈ సినిమా అందరినీ ఆకట్టుకుంటుంది. మంచి సబ్జెక్ట్‌తో తెరకెక్కుతోన్న ఈ మూవీలో చాలా ఆకట్టుకునే అంశాలు ఉన్నాయి" అని చెప్పారు.

మహిళలకు మాత్రమే



నూతన నటీనటులతో తెరకెక్కిన చిత్రం 'ఎంత పనిచేశావ్ చంటి'. ఉదయ్ కుమార్ దర్శకత్వంలో లడ్డే బ్రదర్స్ నిర్మించారు. త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రం ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని యూనిట్ నిర్వహించింది. దర్శకుడు నక్కిన త్రినాథరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దర్శకుడు మాట్లాడుతూ 'విభిన్న కథతో 'ఎంత పనిచేశావ్ చంటి' చిత్రాన్ని తెరకెక్కించాం. ఈ సినిమాను మగవాళ్లు చూడకూడదు. మహిళలు మాత్రమే చూడాలి' అని అన్నారు. శ్రీనివాస్‌డలిశెట్టి, దియారాజ్, నిహారిక శాంతిప్రియ జంటగా నటించారు. సంగీతం: పవన్ సినిమాటోగ్రఫీ: సంతోష్.

పెద్ద హిట్టవ్వాలి



లక్షణమూర్తి రతన, భ్రమరాంబిక తూటిక ప్రధాన పాత్రలో తెరకెక్కుతోన్న చిత్రం 'సీతారామ్ సిత్రాలు'. డి.నాగశశిధర్ రెడ్డి దర్శకత్వంలో పి.పార్థసారధి, డి.నాగేంద్ర రెడ్డి, కృష్ణ చంద్ర విజయబట్టు నిర్మిస్తున్నారు. ఈ నెల 30న సినిమా విడుదలవుతున్న సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆకాశ్ జగన్నాథ్ ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఆకాశ్ మాట్లాడుతూ "ఈ సినిమా పెద్ద హిట్టవ్వాలని కోరుకుంటున్నాను" అని చెప్పారు.

అందరూ ప్రశంసిస్తున్నారు



ఇటీవలే 'ఆయ్' సినిమాకు ఆకట్టుకునే సంగీతాన్ని అందించారు అజయ్ అరసాడ. ఈ సినిమా ఘన విజయం సాధించడంతో ఆయన మీడియాతో మాట్లాడారు. "నేను 'ఆయ్' చిత్రంలో సంగీతం అందించిన మూడు పాటలు అందరికీ విపరీతంగా నచ్చాయి. పాటలతో పాటు నేపథ్య సంగీతానికి విశేషాదరణ లభిస్తోంది. ఎంతో మంది మంచి సంగీతం ఇచ్చావని ప్రశంసిస్తున్నారు. ఓ సంగీత దర్శకుడిగా అన్ని జోనర్ సినిమాలు చేయాలనుంది. ప్రస్తుతం రెండు చిత్రాలకి సంగీతం అందిస్తున్నాను" అని చెప్పారు.

థ్రిల్లింగ్ అంశాలతో...



తమిళంలో విడుదలై ఘనవిజయం సాధించిన చిత్రం 'బంపర్'. ఇప్పుడు అదే పేరుతో తెలుగులోనూ రాబోతోంది. వెట్రి, శివాని నారాయణ్ ముఖ్య పాత్రలు పోషించారు. ఎమ్. సెల్వకుమార్ దర్శకత్వం వహించారు. శనివారం ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు సెల్వకుమార్ మాట్లాడుతూ "ఓ లాటరీ నేపథ్యంలో సాగే థ్రిల్లర్ చిత్రమిది. ఇందులో వినోదంతో పాటు బోలెడు థ్రిల్లింగ్ అంశాలు ఉంటాయి" అని చెప్పారు.

సోషల్ మీడియా టు సినిమా



ఒకప్పుడు సినిమాల్లోకి రావాలంటే చాలా తతంగం ఉండేది. ఫొటోల ఆల్బమ్ చేత్తో పట్టుకుని ఆఫీసుల చుట్టూ చెప్పులు అరిగేలా తిరగాల్సి వచ్చేది. ఫొటోలు నచ్చితే ఆడిషన్స్‌కు పిలుపు వచ్చేది. ఆడిషన్స్‌లో ఓకే అనిపించుకున్నా అవకాశం వస్తుందో రాదో తెలియని పరిస్థితి.. అయితే ఇప్పుడు ట్రెండ్ మారింది. ఆర్టిస్టులను ఎంపిక చేసే విధానమూ మారింది. సోషల్‌మీడియాలో కొంత హల్‌చల్ చేస్తే చాలు సినిమాల్లో అవకాశాలు వెదుక్కుంటూ వచ్చేస్తున్నాయి. యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ లే వేదికగా తమ టాలెంట్ ప్రదర్శించి, సినిమాల్లోకి ఎంట్రీ సంపాదించిన నటీమణులు కొందరున్నారు. వారెవరో ఇప్పుడు చూద్దాం.

యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్‌లో డ్యాన్స్ రీళ్లతో అదరగొడుతూ లక్షలాది మందిని ఆకర్షించారు ఇమాన్ ఇస్మాయెల్ (ఇమాన్వీ). రీల్స్ చేయడమే కాకుండా ఆమె ఓ షార్ట్ ఫిల్మ్‌లోనూ నటించారు. యూట్యూబ్‌లో దాదాపు రెండు మిలియన్ల సబ్‌స్క్రైబర్లు.. ఇన్‌స్టాలో దాదాపు తొమ్మిది లక్షల ఫాలోవర్లు ఆమెకు ఉన్నారు. దాంతో ఇప్పుడీ ఢిల్లీ భామ ఏకంగా ప్రభాస్ సరసన నటించే లక్కీ ఛాన్స్ పొందింది. తొలి సినిమానే పాన్ ఇండియా ఫిల్మ్ కావడం గ్రేట్ కదా! 1940ల నేపథ్యంలో హిస్టారికల్ డ్రామాగా ఈ సినిమాకు హను రాఘవపూడి దర్శకుడు.

గీతా ఆర్ట్స్‌లో..

యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో వీడియోలు, రీల్స్ ద్వారా ఫేమస్ అయిన మరో కంటెంట్ క్రియేటర్ నిహారిక ఎన్.ఎమ్. ఆమె కూడా నటిగా టాలీవుడ్‌లోనూ.. కోలీవుడ్‌లోనూ అడుగు పెట్టనున్నారు. గీతా ఆర్ట్స్ బ్యానర్‌లో అల్లు అరవింద్ నిర్మించే ఓ తెలుగు చిత్రంలో.. ఆకాశ్‌భాస్కర్ దర్శకత్వంలో అధర్వ హీరోగా ఓ తమిళ సినిమాలోనూ నటిస్తున్నారు. నిహారిక ఇటీవలే అమెరికన్ యానిమేటెడ్ కామెడీ టెలివిజన్ సిరీస్ 'బిగ్ మౌత్' సీజన్ 7లో ఓ క్యారెక్టర్‌కు వాయిస్ కూడా అందించడం విశేషం. పలు సామాజిక సమస్యలపై సోషల్ మీడియాలో అవగాహన వీడియోలు చేసే నిహారికకు యూట్యూబ్ సబ్‌స్క్రైబర్లు.. ఇన్‌స్టాగ్రామ్ ఫాలోవర్లు మిలియన్లలో ఉన్నారు.

'బేబీ' కాంబోలో..

సోషల్ మీడియాను తెలివిగా వాడుకుని సినిమాల్లో ఎంట్రీ కార్డ్ దక్కించుకున్న తెలుగమ్మాయి అలేఖ్య హారిక (దేత్తడి హారిక). యూట్యూబ్‌లో షార్ట్ ఫిల్మ్స్.. కవర్ సాంగ్స్.. వెబ్ సిరీస్‌లలో నటించి పాపులర్ అయ్యారు. ఆమె ప్రస్తుతం సంతోష్ శోభన్ హీరోగా సాయి రాజేశ్ దర్శకత్వంలో ఎస్.కే.ఎన్ తెరకెక్కిస్తున్న ఓ చిత్రంలో నటిస్తున్నారు.

వరుసగా నాలుగో చిత్రం

సోషల్ మీడియాతో వరుస అవకాశాలు తెచ్చుకున్నారు కేరళకు చెందిన అనంతిక సనీల్‌కుమార్. కంటెంట్ క్రియేటర్‌గా ఓ వైపు రాణిస్తూనే.. క్లాసికల్ డ్యాన్సర్‌గా.. కరాటేలో బ్లాక్ బెల్ట్ హోల్డర్‌గా పలు రంగాల్లో పట్టు తెచ్చుకున్నారు. ఇప్పటికే మూడు చిత్రాల్లో నటించారు. 'రాజమండ్రి రోజ్‌మిల్క్' చిత్రంతో తెరంగేట్రం చేసి.. 'మ్యాడ్' సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఆమె ప్రస్తుతం 'మను' ఫేమ్ ఫణీంద్ర నార్సెట్టి దర్శకత్వం వహిస్తున్న 'ఎనిమిది వసంతాలు' చిత్రంలో కథానాయికగా నటిస్తున్నారు.

వీళ్లతో పాటు సోషల్‌మీడియాను కేరాఫ్ అడ్రస్‌గా వాడుకుని ఇప్పటికే ఎంతో మంది తారలు సినిమాల్లో అవకాశాలు పట్టేశారు. వారిలో 'బేబీ' ఫేమ్ వైష్ణవి చైతన్య ఒకరు. షార్ట్ ఫిల్మ్స్.. సినిమాల్లో అతిథి పాత్రల్లో నటించిన ఆమె కెరీర్‌ను 'బేబీ' సినిమా సక్సెస్ ఒక్కసారిగా మార్చేసింది. వైష్ణవిని ఓవర్‌నైట్ స్టార్‌ను చేసి వరుస అవకాశాలు తెచ్చిపెట్టింది. మరో నాయిక రుహాని శర్మ కూడా సోషల్ మీడియా నుంచి వెండితెర ప్రయాణం చేసి 'ఇచ్చట వాహనాలు నిలుపరాదు' 'చి.ల.సౌ. స్రవంతి' చిత్రాలలో నటించి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. మోడల్‌గా ట్రయిల్స్ దశలో ఉన్న సాక్షి వైద్య సోషల్‌మీడియాలో తన ఫొటోల ద్వారా సినిమా అవకాశాలు దొరకబుచ్చుకున్నారు. అలా ఆమె 'ఏజెంట్' చిత్రంలో తళుక్కుమన్నారు. ఆ సినిమా సక్సెస్ కాకపోయినా.. ఈ అమ్మడుకు మాత్రం మరో రెండు క్రేజీ ప్రాజెక్ట్స్ లైన్‌లో ఉన్నట్లు సమాచారం. ఈ కోవలోకి చెందిన వారే.. 'బీస్ట్' ఫేమ్ అపర్ణా దాస్, 'రొమాంటిక్', 'అంగరంగ వైభవంగా' ఫేమ్ కేతిక శర్మ, 'టాక్సీవాలా' ఫేమ్ ప్రియాంక జవాల్కర్. ఇలా ఎంతో మంది సోషల్ మీడియా స్టార్స్‌కు సినిమా తలుపులు తెరుస్తూనే ఉంది. మరి వీరిలో ఎంత మంది హీరోయిన్లుగా నిలబడతారో వేచి చూడాలి.








జ్ఞానదత్తుకు కాంస్యం



న్యూఢిల్లీ: చైనాలోని చెంగ్డూలో జరుగుతున్న బ్యాడ్మింటన్ ఆసియా అండర్-17 చాంపియన్‌షిప్‌లో తెలుగు కుర్రాడు జ్ఞానదత్తు పతకంతో మెరిశాడు. తెలంగాణకు చెందిన జ్ఞానదత్తు అండర్-17 బాలుర సింగిల్స్‌లో కాంస్య పతకం సాధించాడు. శనివారం జరిగిన సింగిల్స్ సెమీఫైనల్లో జ్ఞానదత్తు 21-9, 13-21, 13-21తో రాధిత్య బయు వర్దానా (ఇండోనేసియా) చేతిలో పోరాడి ఓడి కాంస్యంతో సరిపెట్టుకున్నాడు. ఇక, అండర్-15 బాలికల సింగిల్స్‌లో భారత షట్లర్ తన్వీ పత్రి ఫైనల్‌కు దూసుకెళ్లింది. సెమీఫైనల్లో టాప్‌సీడ్ తన్వీ 21-19, 21-10తో ఆరోసీడ్ కుంగుకే కకానిక్ (థాయ్‌లాండ్)పై గెలిచింది.

ఫైనల్లో నవ్య

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): భారత జూనియర్ ఇంటర్నేషనల్ బ్యాడ్మింటన్ సిరీస్ బాలికల అండర్-19 సింగిల్స్‌లో హైదరాబాద్ అమ్మాయి నవ్య ఫైనల్ చేరింది. శనివారం గచ్చిబౌలిలోని గోపీచంద్ అకాడమీలో జరిగిన సెమీఫైనల్లో నవ్య 18-21, 21-19, 21-13తో భారత్‌కే చెందిన టానూ చంద్రపై నెగ్గింది. బాలుర సింగిల్స్‌లో లక్ష్ చెంగప్ప 11-21, 21-14, 21-19తో చియాంగ్ చెయి (తైపీ)పై గెలిచి ఫైనల్ చేరాడు.



పారిస్‌కు షూటర్ల బృందం

న్యూఢిల్లీ: పది మంది సభ్యులతో కూడిన భారత పారా షూటర్ల బృందం ప్రతిష్ఠాత్మక పారాలింపిక్స్‌లో పోటీపడేందుకు శనివారం పారిస్ బయల్దేరింది. టోక్యో క్రీడల్లో రెండు పతకాలతో చరిత్ర సృష్టించిన షూటర్ అవనీ లేఖరా మరోసారి అదే తరహా ప్రదర్శన చేయాలని ఆశిస్తోంది. పిస్టల్ షూటర్ మనీష్ నర్వాల్‌పై కూడా స్వర్ణ ఆశలు ఉన్నాయి. గత క్రీడల్లో షూటింగ్‌లో భారత్ రెండు స్వర్ణాలు సహా ఐదు పతకాలు సాధించింది. ఈసారి అంతకంటే ఎక్కువ మెడల్స్ సాధిస్తారన్నది అంచనా.

క్రికెట్ నుంచి వైదొలిగిన శిఖర్ ధవన్

గబ్బర్ గుడ్‌బై





న్యూఢిల్లీ: భారత జట్టు ఓపెనర్ శిఖర్ ధవన్ సంచలన నిర్ణయం తీసుకున్నాడు. అంతర్జాతీయ, దేశవాళీతో పాటు అన్ని ఫార్మాట్ల క్రికెట్‌కు వీడ్కోలు పలుకుతున్నట్టు ప్రకటించాడు. అభిమానులతో గబ్బర్ అని ముద్దుగా పిలిపించుకునే 38 ఏళ్ల ధవన్.. రిటైరవుతున్నట్టు శనివారం సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. 2010లో ఆస్ట్రేలియాతో వైజాగ్ వన్డే ద్వారా అరంగేట్రం చేసిన ఎడమచేతి బ్యాటర్ ధవన్ అనతికాలంలోనే మూడు ఫార్మాట్లలోనూ ఆడగలిగాడు. అయితే ఫామ్‌లేమి కారణంగా రెండేళ్లుగా అతడిని సెలెక్టర్లు పరిగణనలోకి తీసుకోవడం లేదు. 2022లో బంగ్లాదేశ్‌తో చివరి వన్డే ఆడాడు. 'నా క్రికెట్ ప్రయాణానికి ముగింపు పలుకుతున్నా. జీవితంలో మరో కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టాల్సిన సమయం వచ్చింది. అందుకే అంతర్జాతీయ, దేశవాళీ క్రికెట్ నుంచి వైదొలుగుతున్నా. చాలాకాలం జట్టు తరఫున క్రికెట్ ఆడగలిగాననే ఆనందంతో నా మనసు ప్రశాంతంగా ఉంది. జాతీయ జట్టుకు ఆడాలనే జీవితాశయాన్ని నెరవేర్చుకున్నా. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, కోచ్‌లు, ఢిల్లీ క్రికెట్ సంఘం, బీసీసీఐ, నా సహచరులు, అభిమానులకు కృతజ్ఞతలు తెలుపుతున్నా' అని ధవన్ అన్నాడు. కాగా.. ఐపీఎల్‌లో ప్రాతినిధ్యంపై ధవన్ స్పష్టత ఇవ్వలేదు. అయితే 2008 ఆరంభ సీజన్ నుంచి శిఖర్ లీగ్‌లో నిరంతరాయంగా కొనసాగుతున్నాడు. ప్రస్తుతం అతను పంజాబ్ కింగ్స్ కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు.

కెరీర్ సాగిందిలా..

ఫార్మాట్	మ్యా	ప	శ	అ. స్కో
టెస్టులు	34	2315	7	190
వన్డేలు	167	6793	17	143
టీ20లు	68	1759	0	92

గమనిక- ఫా: ఫార్మాట్; మ్యా: మ్యాచ్‌లు; ప:పరుగులు; శ: శతకాలు; అ.స్కో: అత్యధిక స్కోరు

'మిస్టర్' ఐసీసీ

2010లో భారత జట్టు తరఫున తొలిసారిగా బరిలోకి దిగిన ధవన్‌కు ఆ మ్యాచ్ చేదు జ్ఞాపకంగానే నిలిచింది. ఆస్ట్రేలియాపై రెండు బంతులే ఆడి డకౌటయ్యాడు. ఇక రెండేళ్లుగా జట్టుకు దూరమై ఇప్పుడు ఆట నుంచి తప్పుకొన్నాడు. కానీ ఈ మధ్యలో 14 ఏళ్లు అతడు జట్టుకు అందించిన సేవలను తక్కువగా చూడలేం. జీరోతో సాగిన ధవన్ కెరీర్ ప్రస్థానం, ఆ తర్వాత పరిమిత ఓవర్లలో విజయవంతమైన ఓపెనర్లలో ఒకడిగా నిలబెట్టింది. రోహిత్, విరాట్‌లతో పాటు ధవన్ కొంతకాలం భారత బ్యాటింగ్‌కు వెన్నెముకలా నిలిచాడు. అయితే ఆ ఇద్దరి మేనియా ముందు గబ్బర్ ఆట పెద్దగా వెలుగులోకి రాలేదనే చెప్పొచ్చు. 2013 నుంచి 2022 వరకు వన్డేల్లో 85కు పైగా స్ట్రయిక్ రేట్‌తో దూకుడు కొనసాగించాడు. 2016, 17, 18 సంవత్సరాల్లో అయితే ఇది 100+తో సాగింది. రోహిత్‌తో కలిసి శిఖర్ ఓపెనర్‌గా 5,148 పరుగులు అందించగా, ఇందులో 18 సెంచరీ భాగస్వామ్యాలుండడం విశేషం. సచిన్-గంగూలీ (21) తర్వాత వన్డే క్రికెట్‌లో ఇదే సెకండ్ బెస్ట్. ఇక మైదానంలో తొడ గొట్టి చేతిని పైకి లేపి ధవన్ చేసుకునే సంబరాలు ఆరోజు మ్యాచ్‌కే హైలైట్‌గా నిలిచేవి. ఐసీసీ టోర్నీ (వన్డే వరల్డ్‌కప్, చాంపియన్స్ ట్రోఫీ)ల్లో ధవన్ ఆకాశమే హద్దుగా చెలరేగేవాడు. ఏకంగా 65.15 అత్యధిక సగటుతో ఎవరికీ అందనంత ఎత్తులో నిలిచాడు. ఇక చాంపియన్స్ ట్రోఫీలో ఈ ఢిల్లీ స్టార్ పరుగుల వరదే పారించాడు. 2013లో ఈ టోర్నీలో భారత్ విజేతగా నిలవడంలో ధవన్‌దే కీలక పాత్ర. రెండు వరుస సెంచరీలతో మొత్తం 363 పరుగులతో ప్లేయర్ ఆఫ్ ద సిరీస్‌గా నిలిచాడు. 2017 చాంపియన్స్ ట్రోఫీలోనూ ధవన్ (338)వే అత్యధిక పరుగులు. అందుకే అతడిని క్రికెట్ వర్గాల్లో మిస్టర్ ఐసీసీగా పిలుచుకుంటారు. మరోవైపు తన వందో వన్డేలో శతకం సాధించిన కొద్దిమంది (10) క్రికెటర్లలో శిఖర్ ఒకడిగా నిలిచాడు. ఇక ఆసీస్‌తో వన్డే అరంగేట్రం విఫలమైనా అదే జట్టుతో తన టెస్టు ప్రస్థానాన్ని చిరస్మరణీయం చేసుకున్నాడు. సెహ్వాగ్ గైర్హాజరీలో ఓపెనర్‌గా ఆడిన అతను 85 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేశాడు. అరంగేట్ర టెస్టు మ్యాచ్‌లో నమోదైన ఫాస్టెస్ట్ శతకంగా ఇప్పటికీ ఇదే రికార్డు కావడం విశేషం. బుల్లెట్ వేగంతో సాగిన ధవన్ కవర్ డ్రైవ్స్, రివర్స్ స్వీప్ షాట్లకు బౌలర్లు చేష్టలుడిగి పోయేవారు.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)



"బ్యాట్‌తో అద్భుతాలు సృష్టించి, ఎన్నో చిరస్మరణీయ ఇన్నింగ్స్ ఆడావ్. ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా నీ మోముపై చిరునవ్వు చెదరలేదు. - బీసీసీఐ

నీ దూకుడైన ఆటను క్రికెట్ మైదానం మిస్ అవుతుంది. నీ చిరునవ్వు, నీ శైలి, క్రికెట్ పట్ల నీకున్న ప్రేమ ఎప్పటికీ అభిమానుల గుండెల్లో నిలిచిపోతుంది. - సచిన్

మొహాలీలో నా స్థానంలో ఓపెనర్‌గా ఎంట్రీ ఇచ్చినప్పటి నుంచి నీవు వెనుదిరిగి చూడలేదు. అద్భుత ప్రదర్శన చేశావు. - సెహ్వాగ్

అద్భుత కెరీర్‌కు జేజేలు. భవిష్యత్‌లో నువ్వు ఎంచుకోబోయే ఏపనిలోనైనా ఇదే తరహా సంతోషాన్ని నింపుతావని ఆశిస్తున్నా. - గంభీర్"

ముష్ఫికర్ భారీ శతకం

బంగ్లా తొలి ఇన్నింగ్స్ 565 ● పాక్‌తో మొదటి టెస్టు



ముష్ఫికర్ (191)

రావల్పిండి: మిడిలార్డర్ బ్యాటర్ ముష్ఫికర్ రహీమ్ (191) భారీ శతకంతో ఆకట్టుకున్నాడు. దీంతో పాకిస్థాన్‌తో జరుగుతున్న తొలి టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో బంగ్లాదేశ్ 565 పరుగులు చేసింది. మెహెదీ హసన్ (77), లిట్టన్ దాస్ (56) అర్ధశతకాలు సాధించారు. నసీమ్ షాకు 3.. షహీన్, అలీలకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన పాక్ నాలుగోరోజైన శనివారం ఆట ముగిసేసరికి 23/1 స్కోరుతో నిలిచింది. క్రీజులో అబ్దుల్లా (11), షాన్ మసూద్ (9) ఉన్నారు. తొలి ఇన్నింగ్స్‌ను 448/6 స్కోరుతో డిక్లేర్ చేసిన పాక్.. ప్రస్తుతం మరో 94 పరుగులు వెనుకంజలో ఉంది. ఆటకు ఆదివారం ఆఖరి రోజు కావడంతో మ్యాచ్ డ్రాగా ముగిసే అవకాశం కనిపిస్తోంది.

ఇంగ్లండ్‌దే విజయం

మాంచెస్టర్: శ్రీలంకతో మూడు టెస్టుల సిరీస్‌లో ఇంగ్లండ్ శుభారంభం చేసింది. శనివారం నాలుగు రోజే ముగిసిన తొలి టెస్టులో ఆతిథ్య జట్టు ఐదు వికెట్లతో నెగ్గింది. 205 పరుగుల ఛేదనకు రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన ఇంగ్లండ్ 5 వికెట్లకు అన్నే పరుగులు చేసి నెగ్గింది. జో రూట్ (62 నాటౌట్) అజేయ అర్ధశతకం సాధించాడు. అంతకుముందు లంక రెండో ఇన్నింగ్స్‌లో 326 రన్స్ చేసింది. కమిందు (113) శతకం సాధించాడు. ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 358, లంక 236 రన్స్ చేశాయి.

మనోళ్లకు మళ్లీ డ్రా

సెయింట్ లూయిస్ (యూఎస్ఏ): సింక్వీఫీల్డ్ కప్ చెస్ టోర్నీలో భారత గ్రాండ్‌మాస్టర్లు ప్రజ్ఞానంద, గుకేష్‌కు మరో రౌండ్‌లోనూ డ్రా తప్పలేదు. ఐదో రౌండ్‌లో వెస్లీ సో (అమెరికా)తో ప్రజ్ఞానంద.. అబ్దుసతరోవ్ (ఉజ్బెకిస్థాన్)తో గుకేష్ గేమ్‌ను డ్రా చేసుకున్నారు.

జోర్డాన్‌లో చిక్కుకుపోయిన మహిళా రెజ్లర్లు

న్యూఢిల్లీ: వరల్డ్ రెజ్లింగ్ అండర్-17 చాంపియన్‌షిప్ కోసం జోర్డాన్ రాజధాని అమ్మాన్ వెళ్లిన భారత యువ మహిళల జట్టు అక్కడే చిక్కుకుపోయింది. శుక్రవారం పోటీలు ముగియడంతో తొమ్మిది మంది మహిళా రెజ్లర్లు, ముగ్గురు కోచ్‌లు శనివారం స్వదేశానికి తిరుగు పయనమయ్యారు. ఈ క్రమంలో రెజ్లర్లకు కతార్ ఎయిర్‌వేస్, కోచ్‌లకు ఎమిరేట్స్ ఫ్లైట్స్ బుక్ చేశారు. అయితే, కోచ్‌ల ఫ్లైట్ నిర్ణీత సమయానికి బయలుదేరగా, తమ ఫ్లైట్ మాత్రం నిర్ణీత సమయానికంటే ముందే బయలుదేరడంతో రెజ్లర్లు అమ్మాన్ విమానాశ్రయంలోనే ఉండిపోవాల్సి వచ్చింది. కాగా.. యువ రెజ్లర్లకు, కోచ్‌లకు వేర్వేరు విమానాల్లో టిక్కెట్లు బుక్ చేయడమేంటంటూ భారత రెజ్లింగ్ అధికారులపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అమ్మో..అది ఎంత భయపెట్టిందో!



న్యూఢిల్లీ: ఐదేళ్ల క్రితం 'కాఫీ విత్ కరణ్' షోలో స్టార్ క్రికెటర్లు కేఎల్ రాహుల్, హార్దిక్ పాండ్యా మహిళలపై చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. దాంతో వారిద్దరిపై బీసీసీఐ చెరో రూ. 20 లక్షల జరిమానా విధించడంతోపాటు సస్పెన్షన్ వేటు కూడా వేసింది. నాటి ఉదంతాన్ని కేఎల్ రాహుల్ తాజాగా ఓ కార్యక్రమంలో గుర్తు చేసుకున్నాడు. 'నేను ఎంతో సిగ్గరిని. టీమిండియాకు ఆడడం ప్రారంభించాక నాలో ఆత్మవిశ్వాసం పెరిగింది. 100 మంది ఎదుట కూడా అనర్గళంగా మాట్లాడేవాడిని. అయితే ఇప్పుడు అలా చేయలేకపోతున్నా. కాఫీ విత్ కరణ్ ఇంటర్వ్యూ నన్ను ఎంతో భయపెట్టింది. స్కూల్లో నేనెప్పుడూ సస్పెండ్ కాలేదు. కానీ ఆ ఇంటర్వ్యూ తర్వాత జీవితంలో తొలిసారి శిక్షకు గురి కావాల్సి వచ్చింది. దానిని ఎలా ఎదుర్కోవాలో తెలియలేదు. అదిప్పటికీ మాయని మచ్చలా మిగిలింది' అని రాహుల్ అన్నాడు.

తొలిరోజు హైదరాబాద్ రేసర్లకు నిరాశ

చెన్నై: మద్రాస్ ఇంటర్నేషనల్ రేసింగ్ సర్క్యూట్‌లో ఫార్ములా-4 కార్లు రయ్.. రయ్ మంటూ దూసుకెళ్లాయి. శనివారం ఇక్కడ ప్రారంభమైన ఇండియన్ రేసింగ్ లీగ్ (ఐఆర్ఎల్) తొలిరోజు పోటీల్లో హైదరాబాద్ బ్లాక్ బర్డ్స్ జట్టు రేసర్లు నిరాశపర్చారు. ఒక దశలో ముందంజలో నిలిచిన హైదరాబాద్ డ్రైవర్ హ్యూ బార్టర్ మధ్యలో రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరగడంతో బెంగళూరు స్పీడ్ స్టార్స్ రేసర్ జాడెన్ పరియట్‌ను విజయం వరించింది. ఇక, ఫార్ములా-4 ఎ-లెవల్ ఆరంభ రేసులో ఇంగ్లండ్ రేసర్ జోన్ లాంకాస్టర్ విజేతగా నిలిచాడు.

బిజినెస్

బంగారం, వెండి ఆభరణాల ఎగుమతిపై డ్రాబ్యాక్ రేట్లు సగానికి పైగా తగ్గింపు

న్యూఢిల్లీ: పసిడి, వెండి ఆభరణాల ఎగుమతులపై కేంద్ర ప్రభుత్వం డ్రాబ్యాక్ రేట్లను సగానికి పైగా తగ్గించింది. ఈసారి బడ్జెట్లో కేంద్రం ఈ విలువైన లోహాలపై దిగుమతి సుంకాన్ని గణనీయంగా తగ్గించిన విషయం తెలిసిందే. ఈ సవరణకు అనుగుణంగా డ్రాబ్యాక్ రేట్లనూ తగ్గించింది. రెవెన్యూ శాఖ శనివారం విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం.. స్వర్ణాభరణాల్లో నికర బంగారంపై గ్రాముకు డ్రాబ్యాక్ రేటు రూ.704.1 నుంచి రూ.335.5కు తగ్గించారు. వెండి ఆభరణాలు, వెండి ఆర్టికల్స్‌లో నికర లోహంపై డ్రాబ్యాక్ రేటును కిలోకు రూ.4,468కి తగ్గించారు. ఈసారి బడ్జెట్లో గోల్డ్, సిల్వర్‌పై దిగుమతి సుంకాన్ని 15 శాతం నుంచి 6 శాతానికి తగ్గించారు.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	73,040 ▲	66,950 ▲	93,000 ▲
ముంబై	71,424 ▼	65,424 ▼	84,615 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

25వ తేదీ

హైదరాబాద్	450	విజయవాడ	485
వరంగల్	452	గోదావరి	485
చిత్తూరు	508	విశాఖపట్నం	505
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	109	విజయవాడ	113
వరంగల్	109	గుంటూరు	110
కరీంనగర్	109	ఒంగోలు	110
మహబూబ్‌నగర్	109	చిత్తూరు	104
కర్నూలు	109	నెల్లూరు	104
విశాఖపట్నం	109	అనంతపురం	110
గోదావరి	113		

విదేశీ విస్తరణపై జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ ఫోకస్

సౌదీ, కువైట్ ప్రాజెక్టుల కోసం బిడ్డింగ్



రూ.5,000 కోట్ల సమీకరణ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): దేశంలో రెండో అతిపెద్ద విమానాశ్రయాల నిర్వహణ సంస్థ జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్.. విదేశీ విస్తరణపై దృష్టి సారించింది. సౌదీ అరేబియా, కువైట్‌కు చెందిన రెండు ఎయిర్‌పోర్ట్ ప్రాజెక్టులను దక్కించుకునేందుకు పోటీపడుతోంది. కువైట్ ఎయిర్‌పోర్ట్‌లో టెర్మినల్ 2 కోసం బిడ్‌తో పాటు సౌదీ అరేబియాలోని అబా ఎయిర్‌పోర్ట్ కోసం రెక్వెస్ట్ ఫర్ క్వాలిఫికేషన్ (ఆర్ఎఫ్‌క్యూ) డాక్యుమెంట్‌ను సమర్పించింది. కువైట్ ఎయిర్‌పోర్ట్ విషయానికొస్తే, 10 ఏళ్ల కార్యకలాపాల నిర్వహణ బాధ్యతలకు సంబంధించిన కాంట్రాక్టు అని, తమతో పాటు మరో ఇద్దరూ ఈ ప్రాజెక్ట్ కోసం పోటీపడుతున్నారని జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ సీఈఓ (బిజినెస్ డెవలప్‌మెంట్ అండ్ కమర్షియల్) రాజేశ్ అరోరా తెలిపారు. సౌదీ ప్రాజెక్టు కోసం ఆర్ఎఫ్‌క్యూ సమర్పించామని, అందులో అర్హత లభించాక తదుపరి దశలోకి ప్రవేశిస్తామన్నారు. ప్రస్తుతం ఈ రెండు ప్రాజెక్టులపై ఫోకస్ పెట్టామని ఈ మధ్య జూన్ త్రైమాసిక ఆర్థిక ఫలితాల విడుదల అనంతరం ఇన్వెస్టర్లతో నిర్వహించిన ఎర్నింగ్స్ కాల్‌లో అరోరా వెల్లడించారు.

2014లోనే అంతర్జాతీయ మార్కెట్లోకి..

జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ దేశీయంగా ఢిల్లీ, హైదరాబాద్, గోవా విమానాశ్రయాలను నిర్వహిస్తుండటంతో పాటు ఆంధ్రప్రదేశ్, విజయనగరం జిల్లా భోగాపురంలో గ్రీన్‌ఫీల్డ్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌ను నిర్మిస్తోంది. ఏటా 60 లక్షల మందికి సేవలందించగలిగే సామర్థ్యంతో నిర్మిస్తున్న భోగాపురం ఎయిర్‌పోర్ట్ 2026 మార్చికల్లా అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. కాగా, ఫిలిప్పీన్స్‌లోని మక్టన్-సెబూ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ అభివృద్ధి, నిర్వహణ ప్రాజెక్టును ఉమ్మడి భాగస్వామ్యం ద్వారా చేజిక్కించుకోవడం ద్వారా జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ 2014లో తొలిసారిగా అంతర్జాతీయ మార్కెట్లోకి అడుగు పెట్టింది. ఆ తర్వాత ఇండోనేషియాలోని కౌలానము ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌ను సైతం జాయింట్ వెంచర్ ద్వారా దక్కించుకుంది. గ్రీస్‌లోని క్రీట్ ఎయిర్‌పోర్ట్ జీఎంఆర్‌కు లభించిన మూడో విదేశీ ప్రాజెక్టు.

జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ మార్కెట్ నుంచి ఒకేసారి లేదా పలు విడతల్లో రూ.5,000 కోట్లు సమీకరించనుంది. సెక్యూరిటీల జారీ, క్యూఐపీ లేదా ఫారిన్ కరెన్సీ కన్వర్టబుల్ బాండ్స్ జారీ ద్వారా ఈ నిధులను సేకరించాలని భావిస్తోంది. వ్యాపార విస్తరణతో పాటు ప్రస్తుత విమానాశ్రయాల కార్యకలాపాల సామర్థ్యాన్ని మరింత మెరుగుపరుచుకునేందుకు ఈ నిధులను వినియోగించుకోవాలని యోచిస్తోంది.

కాగా గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో జీఎంఆర్ నిర్వహణలోని విమానాశ్రయాల్లో ప్రయాణికుల రద్దీ వార్షిక ప్రాతిపదికన 20 శాతం పెరిగి 12.08 కోట్లకు చేరుకుంది. కాగా, విమానాల ట్రాఫిక్ 12 శాతం పెరుగుదలతో 7,81,500గా నమోదైంది. అంతేకాదు, 2023-24లో స్థూల ఆదాయం 27 శాతం వృద్ధితో రూ.9,210 కోట్లకు పెరిగింది.

ఆకాశ ఎయిర్‌లోకి ప్రేమ్‌జీ పెట్టుబడులు!?

న్యూఢిల్లీ: దివంగత ఇన్వెస్టర్ రాకేశ్ ఝున్‌ఝున్‌వాలా కుటుంబం మెజారిటీ వాటా కలిగిన ఆకాశ ఎయిర్‌లైన్స్‌లో విప్రో వ్యవస్థాపకులు అజీమ్ ప్రేమ్‌జీతో పాటు మణిపాల్ గ్రూప్‌నకు చెందిన రంజన్ పాయ్ స్వల్ప వాటాలు దక్కించుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. వాటా విక్రయం ద్వారా 12.5 కోట్ల డాలర్ల (సుమారు రూ.1,050 కోట్లు) వరకు సమీకరించేందుకు అజీమ్ ప్రేమ్‌జీ వ్యక్తిగత పెట్టుబడి సంస్థ ప్రేమ్‌జీ ఇన్వెస్ట్‌తో పాటు పాయ్‌కి చెందిన క్లేపాండ్ క్యాపిటల్‌తో ఆకాశ ఎయిర్‌లైన్స్ యాజమాన్యం చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. ఆకాశ ఎయిర్‌లో ఝున్‌ఝున్‌వాలా కుటుంబం, సీఈఓ వినయ్ దూబేకు కలిపి 65 శాతం వాటా ఉంది. ప్రస్తుతం 24 విమానాలతో 27 నగరాలకు విమానయాన సేవలందిస్తోన్న ఆకాశ ఎయిర్.. 4.7 శాతం మార్కెట్ వాటాను కలిగి ఉంది.

పబ్లిక్ ఇష్యూకి హీరో మోటార్స్

రూ. 900 కోట్ల సమీకరణ లక్ష్యం

న్యూఢిల్లీ: హీరో మోటార్స్ కంపెనీ (హెచ్ఎంసీ) గ్రూప్ ఆటో కాంపోనెంట్స్ సంస్థ హీరో మోటార్స్ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)కి వస్తోంది. ఈ మేరకు మార్కెట్ నియంత్రణ మండలి సెబీకి ప్రాథమిక ముసాయిదా పత్రాలు (డీఆర్‌హెచ్‌పీ) సమర్పించింది. ఈ ఇష్యూలో భాగంగా కొత్త ఈక్విటీ షేర్లు జారీ చేయటం ద్వారా రూ.500 కోట్లు సమీకరించాలని భావిస్తోంది. అలాగే ప్రమోటర్లు ఆఫర్ ఫర్ సేల్ (ఓఎ్‌ఫఎస్) రూ.400 కోట్ల విలువైన షేర్లను విక్రయించనున్నారు. ఓఎ్‌ఫఎస్‌లో భాగంగా ఓపీ ముంజాల్ హోల్డింగ్స్ రూ.250 కోట్ల విలువైన షేర్లను విక్రయించనుండగా భాగ్యోదయ్ ఇన్వెస్ట్‌మెంట్స్, హీరో సైకిల్స్ చెరో రూ.75 కోట్ల విలువైన షేర్లను విక్రయించనున్నాయి. తాజా ఈక్విటీ షేర్ల జారీ ద్వారా సమీకరించిన మొత్తాల్లో రూ.202 కోట్లను రుణ చెల్లింపుల కోసం వినియోగించనుండగా రూ.125 కోట్లను ఉత్పత్తి సామర్థ్యం పెంపు కోసం వెచ్చించనుంది.

కరారో ఇండియా రూ.1,812 కోట్ల ఐపీఓ

ట్రాన్స్‌మిషన్ సిస్టమ్స్ తయారీ కంపెనీ కరారో ఇండియా లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూ ద్వారా రూ.1,812 కోట్ల మొత్తాలను సమీకరించేందుకు రెడీ అవుతోంది. ఈ మేరకు సెబీకి ముసాయిదా పత్రాలు సమర్పించింది. ఈ ఇష్యూ పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ (ఓఎ్‌ఫఎస్)గా ఉండనుంది. కరారో ఎస్‌పీఏ అనుబంధ సంస్థగా 1997లో కరారో ఇండియా ఏర్పాటైంది. ప్రస్తుతం కంపెనీ మహారాష్ట్రలోని పుణెలో రెండు ప్లాంట్లను నిర్వహిస్తోంది.

యాక్సిస్ ఎంఎఫ్.. యాక్సిస్ కన్సంప్షన్ ఫండ్

యాక్సిస్ మ్యూచువల్ ఫండ్.. యాక్సిస్ కన్సంప్షన్ ఫండ్‌ను తీసుకువచ్చింది. ఇది కన్సంప్షన్ థీమ్‌తో తీసుకువచ్చిన ఓపెన్ ఎండెడ్ ఈక్విటీ పథకం. ఈ ఫండ్‌కు నిఫ్టీ ఇండియా కన్సంప్షన్ టీఆర్ఐ బెంచ్‌మార్క్‌గా ఉండనుంది. కనీస పెట్టుబడి రూ.100. ఆ తర్వాత రూపాయి చొప్పున పెట్టుబడులు పెంచుకుంటూ పోవచ్చు. ఈ ఫండ్ ముగింపు తేదీ సెప్టెంబరు 6.

బంధన్ ఎంఎఫ్.. బీఎస్ఈ హెల్త్‌కేర్ ఇండెక్స్ ఫండ్

బంధన్ మ్యూచువల్ ఫండ్.. బంధన్ బీఎస్ఈ హెల్త్‌కేర్ ఇండెక్స్ ఫండ్‌ను ప్రారంభించింది. ఇది ఓపెన్ ఎండెడ్ పథకం. ఫార్మాస్యూటికల్స్, హాస్పిటల్స్, డయాగ్నోస్టిక్స్, బయోటెక్నాలజీ, మెడికల్ ఎక్విప్‌మెంట్ విభాగాలతో కూడిన హెల్త్‌కేర్ ఇండెక్స్‌లోని కంపెనీల వృద్ధి అవకాశాలను మదుపరులు చేజిక్కించుకునే విధంగా ఈ ఫండ్‌ను రూపొందించింది. ఈ ఫండ్ కనీస పెట్టుబడి రూ.1,000. ఈ ఫండ్ ముగింపు తేదీ సెప్టెంబరు 3.

ఐటీఐ ఏఎంసీ.. లార్జ్, మిడ్ క్యాప్ ఫండ్

ఐటీఐ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ (ఐటీఐ ఏఎంసీ).. ఐటీఐ లార్జ్, మిడ్ క్యాప్ ఫండ్‌ను తీసుకువచ్చింది. టాప్ 250 కంపెనీలతో కూడిన ఈక్విటీ, ఈక్విటీ సంబంధిత సెక్యూరిటీల్లో ఈ ఫండ్ పెట్టుబడులు పెట్టనుంది. ఈ ఫండ్ కనీస పెట్టుబడి రూ.5,000. క్రమానుగత పెట్టుబడి విధానం (సిప్)లో పెట్టుబడులు పెట్టాలనుకునే వారు కనీసం రూ.500 ఇన్వెస్ట్ చేయాల్సి ఉంటుంది. ఈ ఫండ్ ముగింపు తేదీ సెప్టెంబరు 4.

జీఎస్‌టీఆర్-1ఏ రిటర్న్ అంటే ?

ఇదీ GST



రాంబాబు గొండాల

వస్తు సేవల పన్ను కింద నమోదైన వ్యాపారస్తులు అందరికీ జీఎస్‌టీఆర్-1 రిటర్న్ అంటే అవగాహన ఉంటుంది. ఒక వ్యాపారి తాను జరిపిన అమ్మకాలు లేదా సరఫరాల తాలుకు వివరాలను ఈ జీఎస్‌టీఆర్-1 రిటర్న్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలి. ఈ వివరాలను బట్టి తదుపరి దాఖలు చేసే జీఎస్‌టీఆర్-3బీ రిటర్న్ ద్వారా పన్ను చెల్లింపులు చేస్తాడు. అలాగే జీఎస్‌టీఆర్-1లో ఇచ్చే వివరాలను బట్టే అవతలి వ్యక్తి అంటే కొనుగోలుదారుడు ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) తీసుకుంటాడు. కాబట్టి ఈ రిటర్న్ ఎంతో ముఖ్యమైనది. అయితే జీఎస్‌టీఆర్-1 రిటర్న్‌లో పొరపాటున తప్పుడు వివరాలు ఇస్తే, సవరణ చేయటానికి ఇప్పటి వరకు ఎలాంటి సౌలభ్యం లేదు. దీనివల్ల పన్ను చెల్లింపుదారులు ఎదుర్కొనే ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఈ నెల నుంచి కొత్త జీఎస్‌టీఆర్-1ఏ అనే రిటర్న్‌ను ప్రవేశపెట్టింది. ఈ వివరాలు మీ కోసం..

జీఎస్‌టీఆర్-1ఏ అనేది సవరింపు కోసం ఉద్దేశించినది కాబట్టి, ఇది తప్పనిసరిగా దాఖలు చేయాలనే నియమం ఏమీ లేదు. అవసరాన్ని బట్టి దాఖలు చేయవచ్చు. అలాగే ఇది జూలై నెల నుంచి అమల్లోకి వస్తుంది. అంటే జూలై నెలకి సంబంధించి దాఖలు చేసిన జీఎస్‌టీఆర్-1లో ఏదేనీ సవరణలు చేయాలంటే ఈ కొత్త రిటర్న్ ద్వారా చేసుకోవచ్చు. ఈ రిటర్న్ అనేది జీఎస్‌టీఆర్-1 దాఖలు చేయటానికి గడువు తేదీ లేదా దాఖలు చేసిన తేదీ.. ఈ రెండింటిలో ఏది వెనకైతే అప్పటి నుంచి సదరు వ్యక్తికి అందుబాటులో ఉంటుంది. ఉదాహరణకు జూలై నెలకు సంబంధించి జీఎస్‌టీఆర్-1 దాఖలు చేయటానికి గడువు తేదీ ఆగస్టు 11. ఒక వ్యాపారి తన జీఎస్‌టీఆర్-1 రిటర్న్ ఆగస్టు 14న దాఖలు చేశాడనుకుంటే.. ఈ రెండు తేదీల్లో చివరి తేదీ ఆగస్టు 14 కాబట్టి, ఈ తేదీ నుంచి ఈ కొత్త రిటర్న్ సదరు వ్యక్తి స్క్రీన్‌లో లభిస్తుంది. అలాగే ఈ రిటర్న్ దాఖలు చేయటానికి గడువు తేదీ ఏదీ లేకున్నా, జీఎస్‌టీఆర్-3బీ దాఖలు చేస్తే మాత్రం, జీఎస్‌టీఆర్-1ఏ దాఖలు చేయలేరు. అలాగే ఇందులో ఈ నెలకు సంబంధించిన సవరణలు మాత్రమే చేయగలరు. అంటే, ఇంతకు ముందు నెలకు సంబంధించిన సవరణలు ఈ నెల రిటర్న్‌లో చేయలేరు. సాధారణ సరఫరా వివరాలతో పాటుగా క్రెడిట్ నోట్, డెబిట్ నోట్ వివరాలను కూడా ఇందులో పొందుపరచవచ్చు. ఒకసారి, జీఎస్‌టీఆర్-1ఏ దాఖలు చేసిన తర్వాత తదనుగుణంగా జీఎస్‌టీఆర్-3బీ లో కూడా మార్పులు చోటు చేసుకుంటాయి. అయితే ఈ సవరించిన వివరాలు, కొనుగోలుదారుని జీఎస్‌టీఆర్-2బీ లో మాత్రం తరువాతి నెలలో కనిపిస్తాయి.

ఇదే విధంగా త్రైమాసిక జీఎస్‌టీఆర్-1 రిటర్న్ దాఖలు చేసే వారికి కూడా ఈ కొత్త రిటర్న్ అందుబాటులో ఉంటుంది. ఏది ఏమైనా జీఎస్‌టీఆర్-1ఏ అనేది జీఎస్‌టీలో నమోదైన వారికి ఒక మంచి అవకాశం అని చెప్పవచ్చు.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.

24 గంటలు.. 17 ఆపరేషన్లు!

- వీటిలో 6 సిజేరియన్లు, 5 ఆర్థో, 2 కంటి శస్త్రచికిత్సలు
- మహిళకు గర్భసంచిలో గడ్డల తొలగింపు
- మిగతావి హెర్నియా, హైడ్రోసిల్ ఆపరేషన్లు
- వేములవాడ ఏరియా ఆస్పత్రి డాక్టర్లు, సిబ్బంది ఆదర్శం

సిరిసిల్ల, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఆ ప్రభుత్వాస్పత్రి వైద్యుల చొరవ, అంకితభావం గురించి తెలిశాక బహుశా ఎవరూ సర్కారు దవాఖానాలో మంచి చికిత్స లభిస్తుందని నమ్మలేం అనే సాహసం చేయరు కావొచ్చు! ఎందుకంటే.. మంచి చికిత్స లభిస్తుందని ఆశతో వచ్చిన రోగుల నమ్మకాన్ని ఆ సర్కారు దవాఖానాలోని వైద్యులు వమ్ము చేయలేదు! ఆస్పత్రిలో కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వం కల్పించిన ఆధునాతన వైద్య సదుపాయాలతో రోగులకు వెంటవెంటనే శస్త్రచికిత్సలు పూర్తిచేశారు! కేవలం 24 గంటల్లో విరామం అన్నదే లేకుండా ఏకంగా 17 శస్త్రచికిత్సలు పూర్తిచేశారు. ఈ ఘనత.. సిరిసిల్ల జిల్లా వేములవాడ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిది.. అక్కడి వైద్యులు, ఇతర సిబ్బందిదీనూ! ఈ ఆస్పత్రిలో ఐసీయూ, బ్లడ్ బ్యాంక్ వంటి సౌకర్యాలను ఏర్పాటు చేసి అవసరమైన శస్త్రచికిత్సలను అందిస్తున్నారు. తాజాగా సూపరింటెండెంట్, సర్జన్ డాక్టర్ పెంచలయ్య ఆధ్వర్యంలోని వైద్యులు సంధ్య, రత్నమాల, అనిల్, రాజశ్రీ, తిరుపతిలతో కూడిన వైద్య బృందం శుక్ర, శనివారాల్లో (24 గంటల్లోనే) ఆరు సిజేరియన్లు, ఐదు ఆర్థో ఆపరేషన్లు, రెండు కంటి ఆపరేషన్లు, హైడ్రోసిల్, హెర్నియాకు సంబంధించి మూడు శస్త్రచికిత్సలు, గర్భసంచిలో గడ్డల తొలగింపునకు సంబంధించి శస్త్రచికిత్స చేశారు. ఈ ఆస్పత్రిని 2021లో ఏరియా ఆస్పత్రిగా మార్చి వంద పడకలకు విస్తరించారు. ఫలితంగా ఇక్కడ పలు రకాల వైద్య సేవలు అందుబాటులోకొచ్చాయి. ఇప్పటికే ఇక్కడ కీళ్ల మార్పిడి ఆపరేషన్ కూడా చేశారు. జిల్లాలో ఓ ప్రభుత్వాస్పత్రిలో కీళ్ల మార్పిడి ఆపరేషన్లు చేయడం ఈ ఆస్పత్రిలోనే తొలిసారి. గర్భిణులకు సహాయకారిగా ఉండేందుకు 'మాతృసేవ' పేరుతో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశారు. గర్భిణులకు నెలవారీగా ఆరోగ్య పరీక్షల నుంచి.. వారు పురుటి నొప్పులతో ఆస్పత్రిలో చేరి.. ప్రసవం జరిగి.. బిడ్డతో కలిసి ఇంటికి చేరేదాకా ప్రత్యేక సేవలు అందిస్తున్నారు.


సిరిసిల్ల జిల్లా వేములవాడ ఏరియా ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది

అన్ని రకాల వైద్య సేవలు అందిస్తాం

వేములవాడ ఆస్పత్రిలో నిరుపేద రోగులకు సేవలు అందించే దిశగా, చికిత్సపై వారిలో నమ్మకాన్ని పెంచే విధంగా కృషి చేస్తున్నాం. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా సహకారంతో ప్రజలకు అన్నిరకాల వైద్యసేవలు అందుబాటులోకి తెస్తాం. వీటిని రోగులు వినియోగించుకోవాలి.

- డాక్టర్ పెంచలయ్య, ఆస్పత్రి సూపరింటెండెంట్

నేడు సబ్‌రిజిస్ట్రార్లతో పొంగులేటి భేటీ

- మార్కెట్ విలువల పెంపుపై చర్చించే అవకాశం

హైదరాబాద్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. అదే తరహాలో మంత్రులు కూడా తమ శాఖల్లో పురోగతిని, ఉద్యోగులతో సత్సంబంధాలను పెంచుకునేలా ప్రత్యేక సమావేశాల నిర్వహణకు సన్నద్ధమవుతున్నారు. అందులో భాగంగా ఆదివారం రిజిస్ట్రేషన్ శాఖ అధికారులతో ఆ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సమావేశం నిర్వహిస్తున్నారు. హైదరాబాద్‌లోని ఎంసీహెచ్‌ఆర్‌డీ ఆవరణలో నిర్వహించనున్న ఈ సమావేశం ఉదయం 10.30 గంటలకు ప్రారంభం కానుంది. దీనికి సబ్ రిజిస్ట్రార్లు, రిజిస్ట్రార్లు, డీఐజీలు, జాయింట్ ఐజీ, అదనపు ఐజీ, ఐజీ స్థాయి వరకు అందరూ హాజరుకానున్నారు. ఇందులో ఆరుగురు డీఐజీలు ఆరు అంశాలపై ప్రసంగించే అవకాశం ఉన్నట్లు తెలిసింది. అందులో ముఖ్యంగా మార్కెట్ విలువల పెంపుపై చర్చ జరిగే అవకాశం ఉంది. దీంతోపాటు ఉద్యోగుల సమస్యల మీద, బకాయిలు, ఇటీవల ఇతర రాష్ట్రాల పర్యటనకు వెళ్లి వచ్చిన బృందాల నివేదికలపై చర్చించే అవకాశం ఉన్నట్లు సమాచారం.

త్వరలో ఆర్పీఎస్ బకాయిలు రూ.200 కోట్లు

- ఆర్టీసీ ఉద్యోగులకు మంత్రి పొన్నం హామీ
- ఉత్తమ సేవలకు ప్రగతిచక్ర అవార్డుల ప్రదానం

హైదరాబాద్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగుల శ్రమ, కష్టాన్ని ప్రభుత్వం గుర్తించిందని, పెండింగ్‌లో ఉన్న రూ.200 కోట్ల ఆర్పీఎస్ బాండ్ డబ్బులను త్వరలో సిబ్బందికి అందించేందుకు చర్యలు తీసుకుంటానని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మహాలక్ష్మి పథకంలో ఇప్పటివరకు 81 కోట్ల మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని వినియోగించుకుని, రూ.2,750 కోట్లు ఆదా చేసుకున్నారన్నారు. శనివారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లి ఆర్టీసీ కళా భవన్‌లో నిర్వహించిన ఆర్టీసీ ఉత్తమ ఉద్యోగులకు ప్రగతిచక్ర అవార్డుల ప్రదానోత్సవ సభలో మంత్రి పొన్నం మాట్లాడారు. రద్దీకి అనుగుణంగా ఆర్టీసీ కొత్త బస్సులు కొంటుందన్నారు. ఇప్పటికే 3,035 పోస్టుల భర్తీకి ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని, నియామక ప్రక్రియ కొనసాగుతోందన్నారు. ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ మాట్లాడుతూ పీఎఫ్, సీసీఎస్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. అత్యుత్తమ సేవలందించిన 124 మంది ఉద్యోగులకు పురస్కారాలు ప్రదానం చేశారు. రాష్ట్రస్థాయిలో ఉత్తమ బస్టాండ్ అవార్డు ఖమ్మం నూతన బస్టాండ్‌కు, ఉత్తమ డిపో అవార్డు సత్తుపల్లి డిపోకు లభించాయి. ప్రమాదవశాత్తూ విద్యుదాఘాతంతో మరణించిన వరంగల్-2 డిపోకు చెందిన డ్రైవర్ మెరుగు సంపత్ కుటుంబ సభ్యులకు రూ.1.15కోట్ల బీమా చెక్‌ను మంత్రి పొన్నం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ డిప్యూటీ జోనల్ హెడ్ అరుణ్ కుమార్, రీజనల్ హెడ్ సత్యం పలుగుల పాల్గొన్నారు.

వయనాడ్ బాధితులకు సీతక్క ఆర్థిక సాయం

- రూ.20లక్షల చెక్కు, రూ.10లక్షల సరుకులు అందజేత

హైదరాబాద్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): వయనాడ్ విపత్తు బాధితులకు తెలంగాణ మంత్రి సీతక్క ఆర్థిక సాయం అందించారు. బాధితులకు అందించేందుకు ఆమె సేకరించిన రూ.20 లక్షల నిధులకు సంబంధించిన చెక్కును, రూ.10 లక్షలు విలువైన నిత్యావసర వస్తువులు, దుస్తులను వయనాడ్ ఎమ్మెల్యే టి.సిద్ధికి శనివారం స్వయంగా అందజేశారు. వయనాడ్‌లో పర్యటించిన మంత్రి సీతక్క.. వరదలతో మృత్యువాత పడిన వారిని సామూహిక ఖననం చేసిన ముండక్కై స్మశాన వాటిక దగ్గరకు వెళ్లి మృతులకు శ్రద్ధాంజలి ఘటించారు. బాధిత కుటుంబసభ్యులను ఓదారుస్తూ భావోద్వేగానికి గురయ్యారు. మంత్రి సీతక్క వెంట వెళ్లిన ఆమె వ్యక్తిగత భద్రతా సిబ్బంది కూడా రూ.50 వేలు ఆర్థిక సాయం అందజేశారు.

బషీర్ బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నేడు ఉద్యోగుల సమావేశం

- డిప్యూటీ కలెక్టర్ల సంఘం అధ్యక్షుడి పిలుపు

హైదరాబాద్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, సీపీఎస్, పింఛను, ఒప్పంద, పొరుగు సేవల ఉద్యోగ సంఘాలతో డిప్యూటీ కలెక్టర్ల సంఘం అధ్యక్షుడు వి.లచ్చిరెడ్డి ఆదివారం ఒక సమావేశం ఏర్పాటు చేశారు. ఈమేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సంఘాలతో కలిసి ఆదివారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఉదయం 11 గంటలకు సమావేశం నిర్వహించనున్నారు. గత ప్రభుత్వంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పింఛనుదారులు ఎదుర్కొన్న సమస్యల దృష్ట్యా ఉద్యోగుల హక్కులు, సమస్యల పరిష్కారానికి ప్రజా ప్రభుత్వంలో అంతా ఏకతాటిపై నిలవాల్సిన అవసరం ఉందని లచ్చిరెడ్డి పేర్కొన్నారు. గత పదేళ్లుగా నిరంకుశ, ఉద్యోగ వ్యతిరేక విధానాలపై నిరంతరం పోరాడుతూ అనేక నిర్బంధాలు, అవమానాలు, అణచివేతలను ఎదుర్కొన్న వారికి ఐకాస ఏర్పాటు చేసే హక్కు ఉందా..? లేక ఉద్యోగ, ఉపాధ్యాయ, పింఛనుదారుల ప్రయోజనాలు తాకట్టు పెట్టి, గత పదేళ్లుగా సకల భోగాలు అనుభవించి, రాక్షస ప్రభుత్వాన్ని మరోసారి ఎన్నుకోవాలని జెండాలు మోసిన వారికి ఐకాస ఏర్పాటు చేసే హక్కు ఉంటుందా అని ప్రశ్నించారు. విజ్ఞులైన ఉద్యోగులు స్వార్థ, సంకుచిత రహస్య ఎజెండాతో పని చేస్తున్న నాయకులను వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు.

తెలంగాణ కన్సాలిడేటెడ్ ఫండ్ నుంచి ఏపీకి రూ.2,500 కోట్లు

హైదరాబాద్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): విదేశీ బ్యాంకుల అప్పుల అంశంలో ఏపీకి అనుకూలంగా కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఉమ్మడి రాష్ట్రంలో ఇన్నర్‌రింగ్‌రోడ్డు, హుస్సేన్‌సాగర్ పనుల కోసం విదేశీ బ్యాంకులు, ఆర్థిక సంస్థల నుంచి అప్పటి ప్రభుత్వం అప్పులు తెచ్చింది. అయితే, తెలంగాణ వాటా అప్పును కూడా పదేళ్లుగా తామే చెల్లిస్తున్నామని, ఆ మొత్తాన్ని తెలంగాణ నుంచి తమకు ఇప్పించాలని ఏపీ ఇటీవల కేంద్రాన్ని కోరింది. దాంతో కేంద్ర ప్రభుత్వం తెలంగాణ కన్సాలిడేటెడ్ ఫండ్ నుంచి రూ.2,500 కోట్లను ఏపీకి మళ్లించింది. ఇది ఇప్పుడు తెలంగాణలో చర్చనీయాంశమైంది.


వధూవరులను ఆశీర్వదిస్తున్న సంతోష్‌రెడ్డి, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తదితరులు

ఘనంగా 'ఎస్ఆర్' డైరెక్టర్ కుమార్తె రిసెప్షన్

మడికొండ, ఆగస్టు 24: ఎస్ఆర్ విద్యా సంస్థల డైరెక్టర్ సంతోష్‌రెడ్డి ప్రథమ కుమార్తె సంజన-గౌతమ్‌ల రిసెప్షన్ శనివారం ఘనంగా జరిగింది. హనుమకొండ జిల్లా మడికొండలోని రెడ్డి కన్వెన్షన్ హాల్‌లో ఈ వేడుక జరిగింది. పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీలు, రాజకీయ, వ్యాపార వర్గాలకు చెందిన ప్రముఖులు వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఎస్ఆర్ విద్యా సంస్థల చైర్మన్ వరదారెడ్డి, ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఉపశమనం కల్పించండి

(మొదటి పేజీ తరువాయి)

గురించి గుర్తు చేశానన్నారు. గత బీఆర్ఎస్ సర్కారు బడ్జెటేతర రుణాలు తీసుకుందని, అవి ప్రస్తుతం రాష్ట్ర ఖజానాకు పెనుభారంగా మారాయన్నారు. వాటిని రీస్ట్రక్చరింగ్ చేసి, కొంత ఉపశమనం కలిగించాలని కోరానన్నారు. గత ప్రభుత్వం అధిక వడ్డీకి రూ.31,795 కోట్ల మేర అప్పులు చేసిందన్నారు. జీతాల కంటే అప్పులపై వడ్డీకే ఎక్కువ అవుతోందన్నారు. విద్యుత్ విషయంలో ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణకి రావాల్సిన నిధుల గురించి గుర్తు చేశానన్నారు. రాష్ట్రంలో వెనుకబడిన జిల్లాలకు గత కొన్నేళ్లుగా కేంద్రం నుంచి రావాల్సిన బకాయి నిధులు ఇవ్వాలని కోరానన్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ అధికారుల సమావేశం ఏర్పాటు చేసి చర్యలు తీసుకుంటామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చినట్లు భట్టి తెలిపారు.


కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌తో మాట్లాడుతున్న భట్టి విక్రమార్క

కేంద్రాన్ని భట్టి ఏం అడిగారంటే..

- సాగునీటి ప్రాజెక్టులు, తాగునీటి పథకాల కోసం పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్(పీఎఫ్‌సీ), రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్(ఆర్ఈసీ) నుంచి రూ.31,795 కోట్ల బడ్జెటేతర రుణాలను ప్రభుత్వం తీసుకుంది. వీటికి 10.75 శాతం, 11.25 శాతం అధిక వడ్డీ రేట్లు అమలవుతున్నాయి. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని, ఈ రుణాలను రీస్ట్రక్చర్ చేసేలా ఆర్థిక సంస్థలను ఒప్పించాలి.
- కేంద్ర సౌజన్య పథకాల(సీఎస్ఎస్) కింద 2024-25లో ఏపీ, తెలంగాణకు విడివిగా రావాల్సిన నిధులను పొరపాటున ఏపీకి విడుదల చేశారు. దాంతో తెలంగాణ నిధులు రూ.495.20 కోట్లు ఏపీకి వెళ్లాయి. వాటిని తిరిగి ఇప్పించాలి.
- ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం.. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి నిధి కింద తెలంగాణకు 2019-20 నుంచి 2023-24 వరకు నిధులు రావాలి. వీటిని వెంటనే విడుదల చేయాలి.
- ఆంధ్రప్రదేశ్ భవన, నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమ బోర్డుకు సంబంధించిన రూ.455.76 కోట్లు, ఏపీ కార్మిక సంక్షేమ నిధికి సంబంధించిన రూ.9.15 కోట్లను ఇప్పటివరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలంగాణకు బదిలీ చేయలేదు. వీటిని బదిలీ చేసేలా కేంద్రం చర్యలు తీసుకోవాలి.
- ఆంధ్రప్రదేశ్ పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి రావాల్సిన రూ.1,270 కోట్లను ఇప్పించండి.
- వాణిజ్య పన్నుల శాఖకు సంబంధించి నెట్ క్రెడిట్ క్యారీడ్ ఫార్వార్డ్ కింద ఏపీ నుంచి రావాల్సిన రూ.208.24కోట్లను ఇప్పించండి.
- ఉమ్మడి రాజ్‌భవన్, హైకోర్టు, లోకాయుక్త, మానవ హక్కుల కమిషన్ వంటివాటిపై తెలంగాణ రూ.703.43 కోట్లు వ్యయం చేసింది. దీని కింద ఏపీ నుంచి తెలంగాణకు రావాల్సిన రూ.408.49 కోట్లు ఇప్పించండి.
- ఏపీ, తెలంగాణ మధ్య రూ.6,756.92 కోట్ల విద్యుత్తు బకాయిల సమస్య ఉందని కేంద్రం ప్రకటించింది. ఏపీ నుంచి తెలంగాణకు రావాల్సిన బకాయిలు రూ.24,132 కోట్ల వరకు ఉన్నాయి. ఈ సమస్యను పరిష్కరించండి.
- విభజన సందర్భంలో మాకు 61 ఐపీఎస్ పోస్టులే ఇచ్చారు. ఆ సంఖ్యను పెంచాలి.

తీగల బ్రిడ్జిని పూర్తి చేయండి

- గడ్కరీకి జూపల్లి వినతి

కృష్ణా నదిపై సోమశిల(తెలంగాణ)-సంగమేశ్వర (ఆంధ్ర ప్రదేశ్) మధ్య డబుల్ డెకర్ కేబుల్ ఐకానిక్ బ్రిడ్జ్ నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేయాలని కేంద్ర రవాణా, జాతీయ రహదారుల మంత్రి నితిన్ గడ్కరీకి రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక మంత్రి జూపల్లి కృష్ణారావు విజ్ఞప్తి చేశారు. అంతర్జాతీయ ప్రమాణాలతో రూ.1,082.56 కోట్లతో నిర్మించ తలపెట్టిన తీగల వంతెన నిర్మాణం వివిధ కారణాల వల్ల రెండేళ్లుగా పెండింగ్‌లో ఉందని తెలిపారు. బ్రిడ్జ్ నిర్మాణంతో పాటు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని వివిధ జాతీయ రహదారుల అభివృద్ధి ప్రాజెక్టుల గురించి గడ్కరీతో జూపల్లి సుదీర్ఘంగా చర్చించారు. శనివారం ఢిల్లీలోని గడ్కరీ నివాసంలో ఆయనతో మంత్రి జూపల్లి భేటీ అయ్యారు. తీగల వంతెన నిర్మాణంతో రెండు రాష్ట్రాల్లో పర్యావరణ, దేవాలయ పర్యాటక రంగాన్ని ప్రోత్సహించడమే కాకుండా, తెలంగాణ నుంచి తిరుపతికి 70-80 కి.మీ. దూరం తగ్గే అవకాశం ఉందని తెలిపారు. మరోవైపు అలంపూర్ ఎక్స్ రోడ్ (ఎన్‌హెచ్-44) నుంచి నల్లగొండ (ఎన్‌హెచ్-565) వరకు ఉన్న 203.5 కి.మీ రోడ్డును జాతీయ రహదారిగా అప్‌గ్రేడ్ చేయడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఐకానిక్ బ్రిడ్జిపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని, సెప్టెంబరు నెలాఖరులోగా టెండర్లు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని జూపల్లి చెప్పారు. కాగా, తెలంగాణలో పర్యాటక రంగ అభివృద్ధికి చేయూతనివ్వాలని కేంద్ర పర్యాటక మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌ను మంత్రి జూపల్లి కృష్ణారావు కోరారు. షెకావత్ క్యాంపు కార్యాలయంలో ఆయనతో జూపల్లి భేటీ అయ్యారు. అనంతరం కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్‌తో మంత్రి జూపల్లి మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు.


దాశరథి రంగాచార్యకు నివాళులర్పిస్తున్న సీఎం రేవంత్, సంపత్, బలరాంనాయక్

ఢిల్లీలోనే పీసీసీ ఆశావహులు

- ముగిసిన సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన
- దాశరథి రంగాచార్యకు ఘన నివాళి..!

న్యూఢిల్లీ, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): తెలంగాణ పీసీసీ అధ్యక్ష పదవి ఆశావహులు ఢిల్లీలోనే మకాం వేశారు. రేసులో ముందున్నట్లు ప్రచారం జరుగుతున్న మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్, ఎంపీ బలరాంనాయక్‌తో పాటు మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ దేశ రాజధానిలోనే ఉన్నారు. బలరాంనాయక్, సంపత్ శనివారం సీఎం రేవంత్‌ను ఢిల్లీ నివాసంలో కలిశారు. కాగా, రేవంత్ శనివారం మధ్యాహ్నం తర్వాత హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమయ్యారు. శుక్రవారం రెండు గంటల పాటు రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి ఉత్తమ్ అధిష్ఠానంతో చర్చించారు. టీ-ఫైబర్ ప్రాజెక్టుకు కేంద్రం నుంచి వడ్డీ రహిత రుణం, స్పోర్ట్స్ యూనివర్సిటీకి ఆర్థిక సాయం కోరుతూ రేవంత్ కేంద్ర మంత్రులతో భేటీ అయ్యారు. కాగా, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, సాహితీవేత్త దాశరథి రంగాచార్య జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి రేవంత్ పూలమాల వేసి నివాళులర్పించారు. పెన్ను గన్ను కలిపి సాగించిన పయనం దాశరథి అని కొనియాడారు.


మృతిచెందిన అయాన్ష్, రంజిత్, ప్రేమ్ కుమార్ (ఫైల్)

డెంగీతో ముగ్గురి మృతి

సిద్దిపేట టౌన్, ఖానాపూర్, తొర్రూరు, ఆగస్టు24: డెంగీ బారిన పడి రాష్ట్రవ్యాప్తంగా ఐదేళ్ల చిన్నారి సహా ఒకేరోజు ముగ్గురు మృతిచెందారు. సిద్దిపేటలోని రాజు, రజిత దంపతుల కుమారుడు అయాన్ష్ (5)కు ఈ నెల 19న జ్వరమొచ్చింది. పట్టణంలోని పిల్లల ఆస్పత్రికి తీసుకెళ్లగా పరీక్షించి మాత్రలు రాసిచ్చి ఇంటికి పంపారు. జ్వరం తగ్గకపోవడంతో ఈ నెల 22న మరోసారి బాలుడిని అదే ఆస్పత్రికి తీసుకెళ్లారు. రక్త పరీక్షలు చేశాక చిన్నారికి డెంగీ అని నిర్ధారణ జరిగింది. బాలుడికి వెంటనే చికిత్స ప్రారంభించారు. మరుసటి రోజు రాత్రి బాలుడికి తీవ్ర జ్వరం రావడంతో మెరుగైన వైద్యం కోసం శనివారం ఉదయం 3:30 గంటల ప్రాంతంలో పట్టణంలోని మరో ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వెంటిలేటర్‌పై చికిత్స పొందుతూ బాలుడు మృతి చెందాడు. నిర్మల్ జిల్లా ఖానాపూర్‌లో తొంటికూరి రంజిత్ (30) వారం రోజుల నుంచి జ్వరంతో బాధపడుతున్నాడు. నిర్మల్‌లో వైద్య పరీక్షలు నిర్వహించగా డెంగీ అని తేల్చారు. హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో రంజిత్ చేరగా అక్కడ చికిత్స పొందుతూ రంజిత్ మృతిచెందాడు. రంజిత్‌కు భార్య ప్రవళిక, రెండేళ్ల కూతురు ఉన్నారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు వాస్తవ్యుడు, బీటెక్ విద్యార్థి బేతమల్లు ప్రేమ్ కుమార్ (23) డెంగీతో మృతిచెందాడు. 22న అతడికి తీవ్రస్థాయిలో జ్వరం వచ్చింది. నిర్మల్ ఆస్పత్రికి తరలించగా డెంగీ అని నిర్ధారించారు. ఖమ్మంలోని సురక్ష ఆస్పత్రికి తరలించగా శనివారం తెల్లవారుజామున 4 గంటలకు మృతిచెందాడు.

బీఏఎస్ పథకానికి నిధులివ్వండి


- డిప్యూటీ సీఎం భట్టికి హరీశ్‌రావు లేఖ

హైదరాబాద్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 25 వేల మంది పేద విద్యార్థులు ప్రైవేటు స్కూళ్లలో ఉచితంగా చదువుకునే అవకాశం కల్పించే బెస్ట్ అవేలబుల్ స్కూల్స్(బీఏఎస్) పథకానికి నిధులను విడుదల చేయాలని సిద్దిపేట ఎమ్మెల్యే టి.హరీశ్‌రావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు శనివారం లేఖ రాశారు. ఈ పథకం కింద పెండింగ్‌లో ఉన్న రూ.80 కోట్లతో పాటు 2024-25కు అవసరమైన రూ.130 కోట్లను విడుదల చేయాలని కోరారు. బీఏఎస్ పథకం కింద రాష్ట్రంలోని 150 ప్రైవేటు స్కూళ్లలో 18 వేల మంది ఎస్సీ, ఏడు వేల మంది ఎస్టీ విద్యార్థులు ఉన్నారని వివరించారు. వీరంతా అణచివేతకు గురైన బడుగు, బలహీన వర్గాలు, జోగిని వ్యవస్థకు గురైన వారి పిల్లలని పేర్కొన్నారు. కాగా, విష జ్వరాలతో మృతి చెందిన వారి కుటుంబాలకు ప్రభుత్వం రూ.10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పాలనతో వైద్యారోగ్య రంగం పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని ఆరోపించారు. 45 రోజుల్లో రాష్ట్రంలో 5,246 డెంగీ కేసులు నమోదయ్యాయని, గతేడాదితో పోలిస్తే ఇది 36శాతం అధికమని పేర్కొన్నారు.

డెంగీ డేంజర్ బెల్స్

(మొదటి పేజీ తరువాయి)

నమోదయ్యాయి. సూర్యాపేటలో 416, మేడ్చల్‌లో 405, ఖమ్మంలో 346, నల్లగొండలో 322, నిజామాబాద్‌లో 243, రంగారెడ్డిలో 222, జగిత్యాలలో 147, సంగారెడ్డిలో 115, వరంగల్‌లో 102 కేసులు నమోదయ్యాయని ప్రజారోగ్య శాఖ లెక్కలు చెబుతున్నాయి. ఇప్పటివరకు డెంగీతో ఒక్కరూ కూడా చనిపోలేదని ప్రజారోగ్య సంచాలకుల కార్యాలయం చెబుతోంది. వాస్తవానికి ఇప్పటికే డెంగీ మరణాలు నమోదు అవుతున్నాయి. అయితే డీహెచ్ చెప్పేలెక్కలకు క్షేత్రస్థాయిలో నమోదయ్యే కేసులకు భారీగా వ్యత్యాసం కనిపిస్తోంది. నాలుగు రోజుల క్రితం ఒక్క రోజే ఐదుగురు డెంగీతో మరణించారు. జిల్లాల్లో ప్రతిరోజూ డెంగీ మరణాలు నమోదు అవుతున్నాయి. రాష్ట్రంలో వైరల్ జ్వరాలు విజృంభణ కొనసాగుతోంది. కొన్ని పల్లెల్లో ఇంటికొకరు చొప్పున మంచం పట్టారు. కానీ వైద్యశాఖ లెక్కల ప్రకారం ఇప్పటివరకు 2,45,111 మందే జ్వర బాధితులున్నట్లు గుర్తించారు. ఈ ఏడాది జూలై 23 నుంచి ఆగస్టు 22 వరకు రాష్ట్రవ్యాప్తంగా వైద్యశాఖ ఇంటింటా సర్వే నిర్వహించింది. మొత్తం 1,27,49,028 గృహాలను సందర్శించినట్లు ప్రజారోగ్య శాఖ గణాంకాలు చెబుతున్నాయి. ఈ ఇంటింట జ్వర సర్వేలో మొత్తం 3.91 కోట్ల మందిని స్క్రీనింగ్ చేశామని, అందులో 2.45 లక్షల మంది జ్వర బాధితులున్నట్లు డీహెచ్ కార్యాలయపు లెక్కలు పేర్కొన్నాయి. ఇక చికెన్‌గున్యా కేసులు కూడా ఎక్కువగానే నమోదవుతున్నాయి. ఈ ఏడాది జనవరి నుంచి ఆగస్టు మూడోవారం వరకు రాష్ట్రవ్యాప్తంగా 106 చికున్‌గున్యా కేసులొచ్చాయి. మొత్తం 2036 నమూనాలను పరీక్షించగా ఆ కేసులొచ్చినట్లు లెక్కలు చెబుతున్నాయి.



రాష్ట్రంలో చికున్‌గున్యా హైరిస్క్‌లో ఉన్న జిల్లాల్లో జాబితాలో హైదరాబాద్, వనపర్తి, మహబూబ్‌నగర్ ఉన్నాయి. ఈ మూడు జిల్లాలోనే 75 కేసులు నమోదయ్యాయి. నిజానికి చికున్‌గున్యా కేసుల సంఖ్య కూడా వైద్యశాఖ వెల్లడించిన దానికంటే వందలరెట్లు ఎక్కువగా ఉన్నాయి. మలేరియా కేసులు ఆగస్టు మూడోవారం నాటికి తెలంగాణ వ్యాప్తంగా 188 వచ్చాయి. మొత్తం 22.79 లక్షల నమూనాలను పరీక్షించగా ఆ కేసులు వచ్చినట్లు గణాంకాలు పేర్కొన్నాయి.

కట్టడిలో వైఫల్యం...

సీజనల్ వ్యాధుల నియంత్రణ, అవగాహనపై వేసవిలోనే ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవాలి. కట్టుదిట్టమైన ప్రణాళికలతోనే ఇది సాధ్యమవుతుంది. కానీ ప్రజారోగ్య శాఖలో అనుభవజ్ఞులైన ఉన్నతాధికారులు లేకపోవడంతో ఈ ఏడాది సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. క్షేత్రస్థాయిలో ఒక్కరోజు కూడా పనిజేయని వారిని సీనియారిటీ పేరుతో ఉన్నత స్థానంలో కూర్చోబెట్టారని, దానికితోడు అనుభవరాహిత్యం కూడా ప్రధాన కారణమని, క్రైసిస్ మేనేజ్‌మెంట్‌ను హ్యాండిల్ చేయలేకపోవడం వల్లే సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

మంకీపాక్స్ నోడల్ కేంద్రంగా గాంధీ ఆస్పత్రి

రాష్ట్రంలో రోజురోజుకూ డెంగీ కేసులు పెరుగుతున్నాయని ప్రజారోగ్య సంచాలకులు రవీంద్రనాయక్ తెలిపారు. శనివారం కోఠిలో తన కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. వాతావరణ మార్పుల కారణంగా రాష్ట్రంలో సీజనల్ వ్యాధులు వస్తున్నాయని తెలిపారు. ఈ ఏడాది జనవరి 1 నుంచి ఆగస్టు 20 వరకు రాష్ట్ర వ్యాప్తంగా 4,648 డెంగీ కేసులు నమోదయ్యాయని వెల్లడించారు. అన్ని జిల్లాల్లో ఇంటింటా జ్వర సర్వే నిర్వహిస్తున్నామన్నారు. నిరుటితో పోల్చితే ఈ ఏడాది డెంగీ కేసులు బాగా పెరుగుతున్నాయని ప్రకటించారు. డెంగీతో పాటు చికున్‌గున్యా కేసులు కూడా పెరుగుతున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 106 కేసులు నమోదయ్యాయని తెలిపారు. మంకీపాక్స్ నోడల్ కేంద్రంగా గాంధీ ఆస్పత్రిని ఏర్పాటు చేశామ చెప్పారు.

హైడ్రా పేరుతో హైడ్రామా

- కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి



న్యూఢిల్లీ/హైదరాబాద్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): హైడ్రా పేరుతో రాష్ట్రంలో హైడ్రామా నడుస్తోందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. గతంలో అక్రమ నిర్మాణాలకు అనుమతులు ఇచ్చిన ప్రభుత్వమే ఇప్పుడు కూల్చివేతలు చేస్తోందని విమర్శించారు. "అక్రమ నిర్మాణాలకు అప్పుడు ఎలా అనుమతులు ఇచ్చారు..? విద్యుత్, నీటి సదుపాయం ఎలా కల్పించారు..? రోడ్లను నిర్మించి సదుపాయాలు ఎలా కల్పించారు..?" అని నిలదీశారు. అక్రమ నిర్మాణాలకు అనుమతులు ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏ చర్యలైనా, చట్టమైనా అందరికీ సమానంగా వర్తింపచేయాలని కోరారు. శనివారం ఢిల్లీలోని తన నివాసంలో కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. జమ్మూకశ్మీర్‌లో బీజేపీ ఒంటరిగానే పోటీ చేస్తుందని తెలిపారు. నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీతో జతకట్టడం ద్వారా.. కాంగ్రెస్ కుట్రలు మరోసారి బహిర్గతమయ్యాయని అన్నారు. కాగా, బీబీనగర్‌లోని ఎయిమ్స్‌కు అనుబంధంగా అర్బన్ హెల్త్, ట్రైనింగ్ సెంటర్(యూహెచ్‌టీసీ)ను ఏర్పాటు చేయడానికి హైదరాబాద్‌లో 2 ఎకరాల భూమిని కేటాయించాలని సీఎం రేవంత్‌రెడ్డికి కిషన్‌రెడ్డి లేఖ రాశారు. అంత వరకు తాత్కాలికంగా ఏదైనా ప్రభుత్వ భవనాన్ని కేటాయించాలని కోరారు. యూహెచ్‌టీసీ ద్వారా వైద్య విద్యార్థులకు అవసరమైన బోధన, శిక్షణతో పాటు నగర ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడానికి వీలు కలుగుతుందని తెలిపారు.

సీఎం రేవంత్‌కు నాంపల్లి కోర్టు నోటీసులు

కేంద్రంలో బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు రద్దు చేసే అవకాశం ఉందని సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ఆరోపణలపై నాంపల్లి స్పెషల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు నోటీసులు జారీ చేసిందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు తెలిపారు. పార్లమెంటు ఎన్నికల సందర్భంగా రేవంత్ చేసిన ఈ వ్యాఖ్యలపై తాము కోర్టులో ఫిర్యాదు చేశామని.. దీంతో ఆయనకు న్యాయస్థానం నోటీసులు ఇచ్చిందని.. సెప్టెంబరు 25న కోర్టుకు రావాలని ఆదేశించిందని తెలిపారు.

హైకోర్టు స్టే ఎలా ఇస్తుంది?

- ఎన్ కన్వెన్షన్‌ను కూల్చాలని చెప్పింది కదా: రఘునందన్

హైదరాబాద్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ఎన్ కన్వెన్షన్ కూల్చివేతపై హైకోర్టు స్టే ఇవ్వడం విస్మయం కలిగిస్తోందని ఎంపీ రఘునందన్ రావు అన్నారు. ఆ కన్వెన్షన్ మూడున్నర ఎకరాల చెరువు భూమిని కబ్జా చేసిందని గతంలో టీఆర్ఎస్ ప్రభుత్వం మార్కింగ్ కూడా ఇచ్చిందని తెలిపారు. హైకోర్టు చెబితేనే నాడు సర్వే చేయించారని గుర్తు చేశారు. చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలో నిర్మాణాలను నోటీసులు ఇవ్వకుండానే కూలగొట్టాలని దేశ అత్యున్నత న్యాయస్థానమే ఆదేశించిందని గుర్తు చేశారు. అయినా ఎన్ కన్వెన్షన్ వ్యవహారంపై హైకోర్టు స్టే ఇవ్వడమేంటని ప్రశ్నించారు. కళ్లకు ఉన్న గంతలను తొలగించి భాగ్య నగరవాసులను కాపాడాలని కోరారు. ఎన్ కన్వెన్షన్‌పై గతంలో హైకోర్టు ఇచ్చిన తీర్పులను చూసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సర్వే, మార్కింగ్ చేసిన తర్వాత కూల్చివేయాలని చెప్పాలి గానీ, స్టే ఇవ్వడమేంటని అన్నారు. అలా చేయడం వల్ల మీ కంటే ముందు న్యాయమూర్తి ఇచ్చిన ఉత్తర్వులను కాదనాలా..? అని ప్రశ్నించారు. శనివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో రఘునందన్ మీడియాతో మాట్లాడారు. ఎన్ కన్వెన్షన్‌ను కూల్చివేయాలని 2014లోనే హైకోర్టు ఉత్తర్వులిస్తే ఎందుకు ఇన్నాళ్లు మీనమేషాలు లెక్కించారని.. దాని వెనక ఉన్న లాలూచీ ఏంటని మునిసిపల్ శాఖ మాజీ మంత్రి కేటీఆర్‌ను నిలదీశారు. చెరువుల ఆక్రమణలకు బాధ్యుడు నాటి మునిసిపల్ మంత్రి కేటీఆరే అని.. చెరువుల్లో అక్రమంగా భవనాలకు అనుమతులు ఇచ్చినందుకుగాను ఆయనను అరెస్టు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని డిమాండ్ చేశారు. ఎన్ కన్వెన్షన్ ఒక్కో ఫంక్షన్‌కు గడచిన పదేళ్లలో రూ.50లక్షల నుంచి రూ.కోటి వసూలు చేసిందని.. ఆ సొమ్మును వసూలు చేయాలని సర్కారును కోరారు. చెరువులు, కుంటల పరిరక్షణే ప్రభుత్వ లక్ష్యమయితే.. గడచిన పదేళ్లలో కట్టిన అక్రమ కట్టడాలను ముందు కూలగొట్టాలని డిమాండ్ చేశారు. "111 జీవో పరిధిలో హరీశ్‌రావు, కవిత, కేటీఆర్‌కు ఆస్తులు లేవా..? జన్వాడ ఫాంహౌస్‌ను కూల్చివేసేందుకు ఎందుకు భయపడుతున్నారు..? కవిత, హరీశ్‌రావు ఫాంహౌస్‌ల కూల్చివేతలో ఇబ్బందేంటి..?" అని సీఎం రేవంత్‌ను ప్రశ్నించారు. గడచిన రెండు దశాబ్దాల్లో జరిగిన చెరువుల ఆక్రమణలపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

చెరువుల్లోని నిర్మాణాలనే 'హైడ్రా' కూల్చేస్తోంది

» నోటీసులిచ్చాకే కూల్చివేతలు: భట్టి



న్యూఢిల్లీ/హైదరాబాద్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): చెరువులను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలనే 'హైడ్రా' కూల్చివేస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ఢిల్లీలో శనివారం కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌తో భేటీ అనంతరం భట్టి మీడియాతో మాట్లాడారు. చట్టానికి లోబడి ప్రతి పనికి నోటీసులిచ్చిన తర్వాతనే చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. హైదరాబాద్ అంటేనే లేక్స్, రాక్స్(సరస్సులు, రాళ్ల)కు నెలవని, వీటిని కాపాడుకోవాలంటూ పర్యావరణవేత్తలు గతంలో ఆందోళనలు కూడా చేశారని గుర్తుచేశారు. చెరువుల పరిరక్షణ కోసమే హైడ్రాను ఏర్పాటు చేశామని తెలిపారు. హైడ్రా చేపట్టిన కూల్చివేతలను ప్రజలందరూ ఆహ్వానిస్తున్నారన్నారు. గత పదేళ్లలో చెరువులు ఎంత మేర ఆక్రమణకు గురయ్యాయన్న విషయాన్ని శాటిలైట్ ఫొటోల ద్వారా తెలుసుకుంటున్నామన్నారు. అప్పట్లో ఎన్ని చెరువులు ఉండేవి? ఇప్పుడు ఎన్ని ఉన్నాయి? ఆ భూముల్లో ఉన్న భవనాలెన్ని? అనే వివరాలను ప్రజల ముందు ఉంచుతామన్నారు. కూల్చివేతల్లో అధికార పార్టీ, ప్రతిపక్ష పార్టీ అనే తేడా ఉండదని తెలిపారు.

ఎన్ కన్వెన్షన్‌పై చర్యలు తీసుకోండి

» హైడ్రా కమిషనర్‌కు 21నే కోమటిరెడ్డి లేఖ



మొయినాబాద్ రూరల్/హైదరాబాద్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఎన్ కన్వెన్షన్‌పై చర్యలు తీసుకోవాలంటూ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌కు ఈ నెల 21నే లేఖ రాశారు. ఫుల్ ట్యాంక్ లెవల్‌లో ఎత్తైన ప్రహరీ నిర్మించారని లేఖలో ప్రస్తావించారు. ఈ నిర్మాణాల వలన తమ్మిడికుంట చెరువులో నీటి పరిమాణం తగ్గిపోతుందని తెలిపారు. కాగా, చెరువుల పరిరక్షణ కోసం ఏర్పాటు చేసిన హైడ్రా కమిటీ తన పని తాను చేస్తుందని, ఇందులో సందేహాలకు తావులేదని మంత్రి కోమటిరెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లాలోని హిమాయత్‌నగర్‌లో ఆయన మాట్లాడారు. ఆక్రమణల తొలగింపుల్లో రాజకీయాలకు తావే లేదని, ఇటీవల కాంగ్రెస్ కీలక నేత ఫాంహౌస్‌ను సైతం కూల్చివేశారని గుర్తు చేశారు. 111జీవో విషయంలో ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూసుకునే బాధ్యత తనదని, అధికారులు ఎవరైనా ఇబ్బంది పెడితే తన దృష్టికి తేవాలని నాయకులకు సూచించారు.

నీలా.. నాకే ఫాంహౌజ్ లేదు కేటీఆర్!

» ఇకనైనా అబద్ధాలు మానుకో: యాష్కీ

హైదరాబాద్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): కేటీఆర్ లాగా విలాసవంతమైన జీవితాన్ని గడిపేందుకు తనకే ఫాంహౌజ్ లేదని టీపీసీసీ ప్రచార కమిటీ ఛైర్మన్ మధుయాష్కీగౌడ్ అన్నారు. తాను అందరిలా సాధారణ జీవితాన్ని గడుపుతున్నానని చెప్పారు. గండిపేట చెరువు దగ్గర తమకు మామిడి, సపోట తోట ఉన్న మాట వాస్తవమని, వాచ్‌మెన్ కుటుంబం ఉండేందుకు నిర్మాణం తప్ప అక్కడ ఏ ఫాంహౌజ్ లేదని ఓ ప్రకటనలో వెల్లడించారు. చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలో వ్యవసాయం చేసుకోవచ్చని కేటీఆర్‌కు తెలియదా? అని ప్రశ్నించారు. కనైనా అబద్ధాలు మానుకోవాలని హితవు పలికారు.

ఏ శక్తులు అడ్డుపడుతున్నాయ్!

నాడు బీఆర్‌ఎస్‌ను నిలదీసిన రేవంత్ వీడియో వైరల్

ఎన్ కన్వెన్షన్ కూల్చివేత నేపథ్యంలో గతంలో అసెంబ్లీలో రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యల వీడియో తాజాగా వైరల్‌గా మారింది. ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని నిర్మించిన ఎన్ కన్వెన్షన్‌ను తొలగించడానికి ఏ శక్తులు అడ్డుపడుతున్నాయో చెప్పాలంటూ.. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని 2016 సమయంలో అసెంబ్లీలోనే ప్రతిపక్ష టీడీపీ ఎమ్మెల్యే రేవంత్ నిలదీశారు. సీఎం ఆ పాత వీడియోను అభిమానులు, కాంగ్రెస్ కార్యకర్తలు సామాజిక మాధ్యమాల్లో షేర్ చేసి.. 'రేవంత్‌రెడ్డి అక్రమార్కుల పాలిట సింహ స్వప్నం.. నాడు, నేడు ఆయనది ఒక్కటే మాట' అంటూ క్యాప్షన్లు జత చేస్తున్నారు.

ట్రెండింగ్‌లో ఎన్ కన్వెన్షన్ కూల్చివేత

» హైడ్రా చర్యపై నెటిజన్ల ఆసక్తికర చర్చ

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): సినీ నటుడు అక్కినేని నాగార్జునకు చెందిన ఎన్ కన్వెన్షన్ సెంటర్ కూల్చివేత అంశం సోషల్ మీడియాలో శనివారం దుమారం రేపింది. హైడ్రా చేపట్టిన ఈ కూల్చివేతపై సామాజిక మాధ్యమాల్లో తీవ్ర చర్చ జరగ్గా పలువురు నెటిజన్లు ఆసక్తికర అంశాలను ప్రస్తావించారు. ఈ క్రమంలో ఎక్కువ మంది ప్రభుత్వ చర్యను సమర్థించగా, పలువురు నాగార్జునకు మద్దతు పలికారు.ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా కూల్చివేత చేపట్టారని నాగార్జున తన పోస్టులో పేర్కొనగా.. ఆ నోటీసు మీకు అంది ఉండకపోవచ్చునని ఒకరు కామెంట్ చేశారు. ఒక్క అంగుళం కూడా కబ్జా చేయలేదని నాగ్ చెప్పారంటే వాస్తవం ఉండే ఉంటుందని మరొకరు అభిప్రాయపడ్డారు.



భారీ యంత్రంతో ఎన్ కన్వెన్షన్‌ను కూల్చివేస్తున్న దృశ్యం

కూల్చివేతలు చట్టవిరుద్ధం

స్టే ఆర్డర్, కోర్టు కేసులున్నా పట్టించుకోలేదు: నాగార్జున



హైదరాబాద్ సిటీ, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ఎన్ కన్వెన్షన్ విషయంలో హైడ్రా చట్ట విరుద్ధంగా వ్యవహరించిందని సినీ నటుడు నాగార్జున తెలిపారు. స్టే ఆర్డర్‌లు, కోర్టు కేసులున్నా కూల్చివేయడం బాధాకరమని వ్యాఖ్యానించారు. పట్టా భూమిలోనే నిర్మాణం చేపట్టామని, చెరువు స్థలం అంగుళం కూడా ఆక్రమించలేదని పేర్కొన్నారు. చట్టాన్ని ఉల్లంఘించేలా ఎలాంటి చర్యలకూ పాల్పడలేదని చెప్పారు. కన్వెన్షన్ కూల్చివేతపై నాగార్జున 'ఎక్స్' వేదికగా స్పందించారు. కూల్చివేత కోసం గతంలో జారీ చేసిన నోటీసుపై కోర్టు స్టే ఇచ్చిందన్నారు. కూల్చివేత.. తప్పుడు సమాచారంతో లేదా చట్ట విరుద్ధంగా జరిగిందని భావిస్తున్నట్లు తెలిపారు. తమకు ఎలాంటి నోటీసు ఇవ్వలేదని, కోర్టులో కేసు ఉన్నప్పుడు ఇలా చేయడం సరికాదని అభిప్రాయపడ్డారు. కోర్టు తనకు వ్యతిరేకంగా తీర్పునిస్తే.. చట్టాన్ని గౌరవించే పౌరుడిగా దగ్గరుండి కూల్చివేయించే వాడినన్నారు. తాజా పరిణామాలతో.. మేం ఆక్రమణలు చేశామని, తప్పుడు నిర్మాణాలు చేపట్టామని ప్రజలకు సంకేతాలు వెళ్లే ప్రమాదం ఉందని, అందుకే ఈ వివరాలు వెల్లడించినట్లుగా పేర్కొన్నారు.

ఎన్ కన్వెన్షన్ కూల్చివేత

(మొదటిపేజీ తరువాయి)

చేసింది. హైడ్రా అధికారులు.. జీహెచ్‌ఎంసీ, ఇరిగేషన్, రెవెన్యూ తదితర విభాగాల అధికారులతో కలిసి శనివారం తెల్లవారుజామున 4.30 గంటలకు భారీగా పోలీసులు, యంత్రాలతో కన్వెన్షన్ సెంటర్ వద్దకు వెళ్లారు. ఉదయం 6 గంటల సమయంలో కూల్చివేతలు మొదలుపెట్టి 11 గంటల వరకు సింహభాగం పూర్తి చేశారు. ఆక్రమణల తొలగింపు నేపథ్యంలో మాదాపూర్ నుంచి కూకట్‌పల్లి వైపు వెళ్లే రహదారులను మూసివేసి వాహనాల రాకపోకలను మళ్లించారు. కూల్చివేతలు జరుగుతున్న సమయంలోనే నాగార్జున హైకోర్టును ఆశ్రయించారు. చట్టవిరుద్ధంగా కూల్చివేతలు చేపట్టారని, తమకు ఎలాంటి నోటీసులు ఇవ్వలేదని తెలిపారు. దీంతో కూల్చివేతలను వెంటనే నిలిపివేయాలంటూ న్యాయస్థానం మధ్యంతర స్టే ఇచ్చింది. అయితే అప్పటికే కూల్చివేతలు దాదాపుగా పూర్తయ్యాయి. కన్వెన్షన్ సెంటర్‌తోపాటు చుట్టుపక్కల ఉన్న ఇతర షెడ్లనూ నేలమట్టం చేశారు. ఈ చర్య ద్వారా అందరి సందేహాలను హైడ్రా పటాపంచలు చేసినట్లయింది. ప్రముఖవ్యక్తికి చెందిన కట్టడాన్ని కూల్చివేయడంతో హైడ్రా పేరుతో సామాన్యులపైనే ప్రతాపం చూపిస్తున్నారన్న విమర్శలకు చెక్ పెట్టినట్లయింది. కాగా, ఎన్ కన్వెన్షన్ కూల్చివేత అంశం తెలుగు రాష్ట్రాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

కన్వెన్షన్ కథా కమామిషు ఇదీ..

ఖానామెట్ గ్రామం సర్వే నెంబర్ 36లో 29.06 ఎకరాల విస్తీర్ణంలో తమ్మిడికుంట చెరువు ఉంది. పక్కనే ఉన్న సర్వే నెంబర్ 11/2లో సినీనటుడు నాగార్జునకు ఎనిమిది ఎకరాల భూమి ఉంది. ఈ భూమిలో 2010లో ఎన్ కన్వెన్షన్, ఇతర నిర్మాణాలను చేపట్టారు. అయితే సర్వే నెంబర్ 11/2లోని మూడు ఎకరాలు తమ్మిడికుంట చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ఉందని అధికారులు చెబుతున్నారు. ఇందులోని నిర్మాణాలనే కూల్చివేశారు. కాగా, ఎన్ కన్వెన్షన్.. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ఉందంటూ ఉమ్మడి రాష్ట్రంలోనే జీహెచ్‌ఎంసీకి, రెవెన్యూ విభాగాలకు ఫిర్యాదులందాయి. 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన అనంతరం అప్పటి ప్రభుత్వం ఎన్ కన్వెన్షన్ సెంటర్‌కు నోటీసులు జారీ చేసింది. అనుమతి పత్రాలు, స్థల యజమాన్యపు హక్కు వివరాలు ఇవ్వాలని పేర్కొంది. కానీ, యజమానుల నుంచి సమాధానం రాకపోవడంతో.. దానిని అనుమతి లేని నిర్మాణంగా పరిగణించి కూల్చివేతకు రంగం సిద్ధం చేసింది. దీంతో ఎన్ కన్వెన్షన్ యాజమాన్యం కోర్టుకు వెళ్లింది. పట్టా భూమిలో నిర్మాణం ఉందని, చెరువు/ప్రభుత్వ భూమి కాదని పేర్కొంటూ పిటిషన్ దాఖలు చేసింది. కోర్టు ఆదేశాల మేరకు జీహెచ్‌ఎంసీ, రెవెన్యూ, ఇరిగేషన్ విభాగాలు సంయుక్తంగా సర్వే నిర్వహించి ఎన్ కన్వెన్షన్.. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లోనే ఉన్నట్లు నిర్ధారించారు. అయితే ఎఫ్‌టీఎల్ నిర్ధారణ సక్రమంగా లేదంటూ కన్వెన్షన్ యాజమాన్యం 2017లో మరోసారి మియాపూర్‌లోని అదనపు జిల్లా జడ్జి కోర్టును ఆశ్రయించింది. అప్పటి నుంచి కేసు పెండింగ్‌లో ఉంది. దీంతో ప్రభుత్వ విభాగాలు కూడా కూల్చివేతల దిశగా ఎలాంటి చర్యలు తీసుకోలేదు.



కూల్చివేతకు భారీ కసరత్తు!

ఎన్ కన్వెన్షన్ కూల్చివేతకు ముందు హైడ్రా భారీగానే కసరత్తు చేసినట్లు సమాచారం. చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ఎన్ కన్వెన్షన్ నిర్మాణం జరిగినట్లు 'జనం కోసం' అనే స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఈ నెల 20న హైడ్రాకు ఫిర్యాదు చేశారు. మరోవైపు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కూడా ఎన్ కన్వెన్షన్‌పై చర్యలు తీసుకోవాలంటూ లేఖ రాశారు. ఈ ఫిర్యాదుల నేపథ్యంలోనే హైడ్రా రంగంలోకి దిగింది. అయితే ప్రముఖ వ్యక్తికి చెందిన ఆస్తి కావడంతో ఈ విషయంపై పట్టణ ప్రణాళికా విభాగం నుంచి పూర్తి వివరాలను హైడ్రా సేకరించినట్లు సమాచారం. హెచ్‌ఎండీఏ నిర్ధారించిన మేరకు నిర్మాణం ఎఫ్‌టీఎల్‌లో ఉందా? బఫర్ జోన్‌లోనా? అన్నది కూడా పరిశీలించారు. న్యాయ నిపుణుల సలహాలు తీసుకున్నాక.. నిర్మాణంపై చర్యలు తీసుకోవద్దంటూ కోర్టు ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదని నిర్ధారించుకున్నారు. అనంతరం 'ఆపరేషన్ ఎన్ కన్వెన్షన్'కు శ్రీకారం చుట్టారు. శనివారం ఉదయమే భారీ యంత్రాలు, సిబ్బందితో వెళ్లిన హైడ్రా అధికారులు.. కన్వెన్షన్ సెంటర్ కూల్చివేత ప్రారంభించారు. మొత్తం వ్యవహారాన్ని హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్వయంగా పరిశీలించినట్లు తెలిసింది.

ఇతర నిర్మాణదారుల్లో గుబులు!

29.6 ఎకరాల విస్తీర్ణంలో ఉండాల్సిన తమ్మిడికుంట చెరువు 10 ఎకరాలకు కుచించుకుపోయింది. సుమారు 19ఎకరాల చెరువు స్థలం కబ్జాకు గురైంది. ఇళ్లు, ఇతర నిర్మాణాలు వెలిశాయి. ఎన్ కన్వెన్షన్ కూల్చివేతతో వారిలో గుబులు మొదలైంది. ఏం జరుగుతుందో అని ఆందోళన చెందుతున్నారు.

నెక్స్ట్ టార్గెట్ మల్లారెడ్డి?

చెరువుల్లో ఆక్రమణల కూల్చివేత కొనసాగుతుందని హైడ్రా వర్గాలు చెబుతున్నాయి. అయితే, మేడ్చల్ జిల్లా పరిధిలోని మాజీ మంత్రి మల్లారెడ్డికి చెందిన కళాశాలలు, హాస్టళ్లు చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్, ప్రభుత్వ స్థలాల్లో ఉన్నాయన్నది గత కొంత కాలంగా చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో తదుపరి కూల్చివేతలు మల్లారెడ్డికి సంబంధించిన నిర్మాణాలేనని ప్రచారం జరుగుతోంది. పలు ఆక్రమణలపై కోర్టు స్టేలు ఉండగా.. ఇటీవల కాప్రా సర్కిల్ పరిధిలోని నిర్మాణంపై స్టే వెకేట్ అయినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో చర్యలు తీసుకునేందుకు మేడ్చల్ అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. మరోవైపు ఘట్‌కేసర్ మండలం వెంకటాపూర్ పరిధిలోని నాదం చెరువు బఫర్ జోన్‌లోని 1.5ఎకరాలను ఆక్రమించి ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అనురాగ్ యూనివర్సిటీ భవనాలు నిర్మించారని ఇరిగేషన్ అధికారులు ఫిర్యాదు చేశారు. ఈ నిర్మాణలపైనా చర్యలుంటాయని ప్రచారం జరుగుతోంది.

నిబంధనలు అతిక్రమించి కన్వెన్షన్

నిర్మాణానికి అనుమతులు లేవు: హైడ్రా

ఎన్ కన్వెన్షన్ సెంటర్‌ను నిబంధనలు ఉల్లంఘించి నిర్మించారని హైడ్రా తెలిపింది. ఈ విషయాన్ని గతంలోనే నిర్ధారించినట్లు పేర్కొంది. ఇతర అక్రమ నిర్మాణాలను తొలగించినట్లుగానే ఎన్ కన్వెన్షన్‌నూ కూల్చివేసినట్లు వెల్లడించింది. కన్వెన్షన్ కూల్చివేత సంచలనంగా మారడం, కోర్టు కేసులు, స్టే ఆర్డర్‌లు ఉన్నాయన్న అభిప్రాయాల నేపథ్యంలో హైడ్రా శనివారం అధికారిక ప్రకటన విడుదల చేసింది.

* తమ్మిడికుంట చెరువు ఎఫ్‌టీఎల్/బఫర్ జోన్ నిర్ధారణకు సంబంధించి హెచ్‌ఎండీఏ 2014లో ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసింది. 2016లో నోటిఫికేషన్ విడుదల చేసింది.
* ప్రాథమిక నోటిఫికేషన్ విడుదల అనంతరం 2014లో ఎన్ కన్వెన్షన్ యజమానులు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో ఎఫ్‌టీఎల్ నిర్ధారణలో నిబంధనల ప్రకారం నడుచుకోవాలని కోర్టు సూచించింది. ఈ మేరకు కన్వెన్షన్ యాజమాన్యం సమక్షంలోనే అధికారులు సర్వే నిర్వహించి.. నివేదికను వారికి కూడా ఇచ్చారు. అనంతరం దీనిపై ఎన్ కన్వెన్షన్ యాజమాన్యం 2017లో అదనపు జిల్లా జడ్జి కోర్టును కోర్టుకు వెళ్లింది. కేసు పెండింగ్‌లో ఉంది. ఎలాంటి స్టే ఆర్డర్ ఇవ్వలేదు.
* ఎన్ కన్వెన్షన్ యాజమాన్యం స్పష్టంగా నిబంధనలు ఉల్లంఘించింది. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ఉన్న అక్రమ నిర్మాణంలో వ్యాపార కార్యకలాపాలను కొనసాగిస్తోంది. ఎఫ్‌టీఎల్ పరిధిలోని 1.12 ఎకరాలు, బఫర్ జోన్‌లోని 2.18 ఎకరాలను ఎన్ కన్వెన్షన్ ఆక్రమించింది.
* నిర్మాణాన్ని క్రమబద్ధీకరించుకునేందుకు ప్రయత్నించారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉండడంతో జీహెచ్‌ఎంసీ తిరస్కరించింది.
* తమ్మిడికుంట చెరువు చుట్టూ, నాలాల వెంట ఆక్రమణలతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆక్రమణలతో చెరువు విస్తీర్ణం 50-60 శాతం కుచించుకుపోయింది.
* ఎన్ కన్వెన్షన్ ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ఉంది. నిర్మాణ అనుమతులు లేవు.
* నిబంధనల ప్రకారమే ఇతర విభాగాలతో కలిసి పూర్తిగా నేలమట్టం చేశాం.
* హైకోర్టు మధ్యాహ్నం మధ్యంతర స్టే ఇచ్చింది.

దాహార్తి తీర్చి.. సంస్కృతిలో భాగమై!

చరిత్రలో తమ్మిడికుంట చెరువు జ్ఞాపకాలు.. 40 ఏళ్ల క్రితం వరకు ఖానామెట్ ప్రజల తాగు, సాగునీటికి ఆ చెరువే ఆధారం

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ అంటేనే చెరువులు, కుంటలు, ఉద్యానవనాలతో అలరారిన నగరం. మహ్మద్ కులికుతుబ్ షా కలలకు అనుగుణంగా మీర్ మోమిన్ రూపకల్పనలో పురుడు పోసుకున్న ఈ నగర నిర్మాణంలోనే అవన్నీ భాగమయ్యాయి. కనుకే దీన్ని లేక్ సిటీ, బాగ్ నగరంగానూ చరిత్రకారులు అభివర్ణించారు. ఎన్ కన్వెన్షన్ కూల్చివేతతో ఇవాళ దేశవ్యాప్తంగా తమ్మిడికుంట చెరువుపై చర్చ సాగుతున్న సమయంలో దాని చరిత్రను చూస్తే ఆసక్తికరమైన విషయాలు తెలుస్తాయి. మాదాపూర్ నేడు దేశంలోనే పేరెన్నికగన్న సైబర్ కాపిటల్‌గా ఖ్యాతికెక్కింది. కానీ మూడు దశాబ్దాల కిందటి వరకు ఆ ప్రాంతం చెరువులు, కుంటలు, అరుదైన రాళ్ల గుట్టలు, పంట చేలతో అలరారింది. అదే ప్రాంతంలోని దుర్గం చెరువు... కుతుబ్ షాహీల ఏలికలో అంటే, 350 ఏళ్ల కిందటి వరకు గోల్కొండ కోటకు తాగునీరు అందించింది! దానికి నాలుగు కిలోమీటర్ల దూరంలో నెలవైన తమ్మిడికుంట సహజసిద్ధంగా ఏర్పడిందా లేక మానవ నిర్మితమో తెలియరాలేదు. కానీ నలభై ఏళ్ల కిందటి వరకు అది ఖానామెట్ ప్రజల తాగు, సాగునీటి అవసరాలు తీర్చిందని ఆ చెరువు పరిరక్షణ కోసం సుదీర్ఘకాలంగా ఉద్యమిస్తున్న కసిరెడ్డి భాస్కర్ రెడ్డి చెబుతున్నారు. 29 ఎకరాల 60 గుంటల విస్తీర్ణంలోని తమ్మిడికుంట నిన్నమొన్నటి వరకు పరిసర ప్రాంత ప్రజల సంస్కృతిలో భాగమైంది. గణపతి నిమజ్జనం, బతుకమ్మ పండుగ లాంటి వేడుకలకు నిన్నటి తరం జ్ఞాపకాల్లో ఆ కుంట పదిలం. ఈ కుంటకు ఆ పేరు ఎలా వచ్చిందని ఆరా తీయగా... తమ్మి అంటే పద్మమని, తామరపూలకు నెలవైనందున తమ్మిడికుంట పేరు స్థిరపడి ఉంటుందని భాషావేత్త ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి వివరించారు.



తమ్మిడికుంట చెరువు సమగ్ర స్వరూపం

గ్రామం **ఖానామెట్**; సర్వే నెంబర్లు **36, 11/2**; విస్తీర్ణం **29.6** ఎకరాలు

నాగార్జున భూమి **8** ఎకరాలు (**11/2** సర్వే నెంబర్‌లో ఉంది)

ఇందులో ఎఫ్‌టీఎల్‌లో **1.12** ఎకరాలు, బఫర్ జోన్‌లో **2.18** ఎకరాలు

వీటిలో ఉన్న ఎన్ కన్వెన్షన్, ఇతర షెడ్లు కూల్చివేశారు. ఎన్ కన్వెన్షన్ నిర్మాణానికి ముందు ఆ భూమిలో నాగార్జున అతిథి గృహం ఉండేది.

ఎఫ్‌టీఎల్ పరిధి

బఫర్ జోన్ పరిధి

ఎన్ కన్వెన్షన్ హాల్ (సర్కిల్‌లో)

ఎన్ కన్వెన్షన్ కూల్చివేతపై యథాతథ స్థితి

హైకోర్టు మధ్యంతర ఆదేశాలు జారీ

హైదరాబాద్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీనటుడు నాగార్జునకు చెందిన ఎన్ కన్వెన్షన్ కూల్చివేతపై హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ(హైడ్రా) ముందుకు వెళ్లకుండా యథాతథ స్థితి(స్టేటస్ కో) విధిస్తూ హైకోర్టు శనివారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. తమకు ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా అక్రమంగా కూల్చివేతలు చేపడుతున్నారని పేర్కొంటూ ఎన్ కన్వెన్షన్ మాతృసంస్థ ఎన్3 ఎంటర్‌ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ నల్ల ప్రీతమ్ రెడ్డి హైకోర్టులో హౌజ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం ఖానామెట్ గ్రామంలోని 291/1 11/2, 11/3, 11/36 సర్వే నంబర్లలో 27,063 చదరపు మీటర్లలో ఉన్న ఆస్తిని అక్రమంగా కూల్చివేస్తున్నారని పిటిషనర్ పేర్కొన్నారు. ఎన్ కన్వెన్షన్ ఓ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ అని.. 2009లో అక్కినేని నాగార్జున నుంచి లీజుకు తీసుకున్న స్థలంలో ఎన్ కన్వెన్షన్ హాల్ నిర్మించినట్లు పేర్కొన్నారు. తమకు లీజుకు ఇచ్చిన స్థల యజమాని నాగార్జున రిజిస్టర్డ్ సేల్ డీడ్ ద్వారా స్థలం కొని, అన్ని అనుమతులతో నిర్మాణాలు చేపట్టినట్లు తెలిపారు. తమ ఆస్తి పక్కనే సర్వే నంబర్ 36లో తమ్మిడికుంట ఉందని.. కొన్ని దశాబ్దాల కిందే దానికి బండ్ కట్టారని.. దానికి సంబంధించిన నీళ్లు తమ ఆస్తిలోకి ఎప్పుడూ రాలేదని తెలిపారు. "2014లో సైతం తమ్మిడికుంట ఫుల్ ట్యాంక్ లెవల్(ఎఫ్‌టీఎల్)లో ఎన్ కన్వెన్షన్ ఉందని అధికారులు హద్దులు పెట్టారు. మేం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా అప్పటి ప్రభుత్వం ఎఫ్‌టీఎల్ హద్దులు ఖరారు చేయలేదని, హద్దులు ఖరారు చేసే పక్షంలో నోటీసులు ఇస్తామని వివరణ ఇచ్చింది. సదరు వివరణతో రిట్ పిటిషన్‌ను హైకోర్టు ముగించింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎఫ్‌టీఎల్ గుర్తించలేదు. గుర్తిస్తే నోటీసు ఇవ్వాల్సి ఉంటుంది. దీనికి సంబంధించి కూకట్‌పల్లి కోర్టులో మరో సివిల్ సూట్ కొనసాగుతోంది. 2007 నాటి జీవో నెంబర్ 901 ప్రకారం పెనలైజేషన్ అండ్ రెగ్యులరైజేషన్ స్కీం కింద జీహెచ్‌ఎంసీకి దరఖాస్తు చేసుకున్నాం. ఈ దరఖాస్తును ఎలాంటి కారణాలు లేకుండా తిరస్కరించడంపై హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా.. మళ్లీ దరఖాస్తు పరిశీలించాలని ఆదేశాలు జారీ చేసింది. సుదీర్ఘకాలం దరఖాస్తు పెండింగ్‌లో ఉన్న తర్వాత 2021లో జీహెచ్‌ఎంసీ అధికారులు మళ్లీ తిరస్కరించారు. అనధికారిక కట్టడాల క్రమబద్ధీకరణ నిబంధనలు-2015 కింద ప్రభుత్వానికి అప్పీల్ చేశాం. అప్పీల్‌ను స్వీకరించిన ప్రభుత్వం 2021 ఆగస్టు 7న స్టేటస్ కో విధిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. ఈ స్టేటస్ కోతోపాటు ఎఫ్‌టీఎల్ నివేదికపై సివిల్ కోర్టులో కేసు పెండింగ్‌లో ఉంది. ఈ పరిస్థితుల్లో హైడ్రా అనే సంస్థ ఎన్ కన్వెన్షన్ కూల్చబోతోందని మీడియాలో విస్తృత కథనాలు వచ్చాయి. మా చట్టబద్ధమైన హక్కులను హరించేలా ఎలాంటి నోటీసు లేకుండా కూల్చివేతలు ప్రారంభించారు"అని పిటిషనర్ తెలిపారు. పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ వినోద్‌కుమార్ ధర్మాసనం.. యథాతథస్థితి విధిస్తూ మధ్యంతర ఆదేశాలు జారీచేసింది. ప్రహరీ నిర్మాణానికి అనుమతివ్వాలని పిటిషనర్ న్యాయవాది విజ్ఞప్తిచేయగా ధర్మాసనం తిరస్కరించింది.



'ఎన్'.. ఎందుకంత ప్రత్యేకం?

» హైదరాబాద్‌లో దీనిది ప్రముఖ స్థానం
» పెళ్లిళ్ల నుంచి ఫ్యాషన్ షోల వరకు ఇక్కడే
» హాలులో 3 వేలమంది కూర్చునే అవకాశం
» అద్దె రూ.5 లక్షల నుంచి ప్రారంభం

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): పార్టీలు, పెళ్లిళ్లు, ఫ్యాషన్ షోలు, బోర్డు మీటింగ్‌లు, ఎగ్జిబిషన్‌లు..! హైదరాబాద్‌లో కాస్త ఉన్నత స్థాయి వేడుక ఏదైనా వేదికగా మొదట 'ఎన్ కన్వెన్షన్'కే ప్రాధాన్యం. నటుడు అక్కినేని నాగార్జున తన స్నేహితుడు, వ్యాపార భాగస్వామి నల్లా ప్రీతమ్‌రెడ్డితో కలిసి 14 ఏళ్ల కిందట ఎన్3 ఎంటర్‌ప్రైజెస్ పేరిట దీనిని నిర్మించారు. 'సందర్భం ఏదైనా వేదిక మాది..' అనే ట్యాగ్‌లైన్‌తో మరెక్కడా జరగనన్ని వేడుకలకు ఇది వేదిక అయింది. ఇప్పుడు హైడ్రా దెబ్బకు కాలగర్భంలో కలిసింది. ఎన్‌లో నాలుగు హాళ్లు ఉండగా.. 27 వేల చ.అ. విస్తీర్ణంలో 3 వేలమంది కూర్చునే ప్రధాన హాల్‌లో ఖరీదైన వివాహాలు, రిసెప్షన్లతో పాటు ఫ్యాషన్ షోలు, సినిమా వేడుకలు జరిగేవి. దీనిని ఆనుకుని 37 వేల చ.అ. విస్తీర్ణంలోని భారీ గార్డెన్‌లో పెళ్లిళ్లు లేదంటే భారీ ఫంక్షన్స్, అంతర్జాతీయ సంస్థల ప్రమోషన్స్ నిర్వహించేవారు. 5 వేల చ.అ.లలోని డైమండ్ హాల్‌లో 500 మందితో చిన్న వేడుకలు, కంపెనీల ఉత్పత్తుల ఆవిష్కరణలు జరిగేవి. దీని బయట మర్రి చెట్టు చెంత బనియాన్ అంటూ ఓపెన్ ఎయిర్ వెన్యూ 26 వేల చ.అ.లలో ఉంది. ఈ రెండింటి అవసరాలను తీర్చుతూ ఏడు వేల చ.అ.లలో అనెక్స్ హాల్‌ను నిర్మించారు.

శ్రావణ మాసంలో పెళ్లిళ్లు ఎలా?

ఓపక్క సైబరాబాద్, మరోపక్క గుట్టల నడుమ తమ్మిడికుంట చెరువుతో పాటు నగరం మధ్యలో ఉండడం, రవాణా సదుపాయాల కారణంగా అద్దె ఎక్కువ (రూ.5 లక్షలతో ప్రారంభం) అయినా సరే ఎన్ కన్వెన్షన్‌ను ఎంచుకునేవారు. ఇక్కడ జరిగిన ఉన్నత వర్గాల వారి వివాహాలు, వేడుకల జాబితా చాలానే ఉంది. ఎన్‌లో కార్యక్రమ నిర్వహణను హోదాగానూ భావించేవారు. ఖాళీ లేకపోతే వాయిదా వేసుకున్నవారూ ఉన్నారు. ఓ ఫ్యాషన్ ఇన్‌స్టిట్యూట్ తమ షోలన్నీ ఇక్కడే జరిపేది. కొన్ని కంపెనీలు వార్షిక వేడుకలు, ఫ్యామిలీ గెట్ టు గెదర్‌లు ఏర్పాటు చేసేవి. ఇక కొత్త సంవత్సర వేడుకల వేళ 4వేదికలలో వేర్వేరు పార్టీలతో ఎన్ కన్వెన్షన్‌కు ప్రత్యేక గుర్తింపే ఉంది. కాగా, శ్రావణ మాసం కావడంతో దీనిని ఈ నెల 28న, ఆ తర్వాత మరో పెళ్లి, ఇతర పార్టీలకు బుక్ చేసుకున్నట్టు తెలిసింది. కూల్చివేతతో గందరగోళం నెలకొంది. ఇంత తక్కువ సమయంలో మరో చోటు వెదుక్కోవడం ఎలాగని సంబంధిత వ్యక్తులు ఆందోళన చెందుతున్నారు.



ఎయిర్‌పోర్ట్ తరహాలో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్

- 2026 నాటికి పునరాభివృద్ధి పనులు పూర్తి
- కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి రవ్‌నీత్ సింగ్

హైదరాబాద్, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్ ఎయిర్‌పోర్టు తరహాలో ప్రపంచశ్రేణి ప్రమాణాలతో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌ను ఆధునిక రైల్వేస్టేషన్‌గా తీర్చిదిద్దుతున్నామని కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి రవ్‌నీత్ సింగ్ పేర్కొన్నారు. సుమారు రూ.700 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ రైల్వే స్టేషన్ పునరాభివృద్ధి పనులను 2026నాటికి పూర్తి చేయాలన్న లక్ష్యంతో ఉన్నామని తెలిపారు. ఇప్పటి వరకు 27శాతం పనులు పూర్తయ్యాయని చెప్పారు. శనివారం దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్, తదితర రైల్వే అధికారులతో కలిసి రవ్‌నీత్ సింగ్ సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌ను సందర్శించి పునరాభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడుతూ దక్షిణ మధ్య రైల్వే పరిధిలో రూ.5,000 కోట్లకుపైగా అంచనా వ్యయంతో 119 రైల్వేస్టేషన్లను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్ మాట్లాడుతూ హైదరాబాద్, కాచిగూడ రైల్వేస్టేషన్ల అభివృద్ధికి ప్రతిపాదనలు తుది దశలో ఉన్నాయని తెలిపారు. ఇదిలా ఉండగా.రైల్ నిలయంలో శనివారం కేంద్ర మంత్రి రవ్‌నీత్‌సింగ్‌తో ఎంపీ ఈటల రాజేందర్ భేటీ అయ్యారు.

వైద్య కళాశాలలు, బోధనాస్పత్రులకు ఇన్‌చార్జిలు

హైదరాబాద్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాల్లోని ప్రభుత్వ వైద్య కళాశాలలు, వాటి అనుబంధ ఆస్పత్రులకు ఇన్‌చార్జిలను నియమిస్తూ సర్కారు ఉత్తర్వులు జారీ చేసింది. మొత్తం 23 చోట్ల ఇన్‌చార్జ్‌లను నియమించింది. ప్రస్తుతం అదనపు వైద్యవిద్య సంచాలకుల పదోన్నతులను వైద్యశాఖ చేపట్టిన సంగతి తెలిసిందే. కొద్దిరోజుల్లో ఆ పదోన్నతులు పూర్తయి, వారికి పోస్టింగ్స్ ఇచ్చేవరకే ఈ ఇన్‌చార్జిల పాలన ఉంటుందని వైద్యశాఖ వర్గాలు తెలిపాయి. కాగా, హైదరాబాద్‌లోని బోధనాస్పత్రులకు ఇంకా ఇన్‌చార్జ్‌లను నియమించకపోవడం గమనార్హం.

కులగణన కోసం 2న కలెక్టరేట్ల ముట్టడి: జాజుల

హైదరాబాద్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సమగ్ర కులగణనను వెంటనే ప్రారంభించి, బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. కులగణన కోసం ఈ నెల 26న తలపెట్టదలచిన కలెక్టరేట్ల ముట్టడి శ్రీ కృష్ణ జన్మాష్టమి కారణంగా సెప్టెంబర్ 2కు వాయిదా వేసినట్టు ఆయన తెలిపారు. కలెక్టరేట్ల ముట్టడిలో రాజకీయ పార్టీలకు అతీతంగా బీసీలంతా స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కులగణన నిర్వహించే వరకు బీసీ ఉద్యమాన్ని ఆపేది లేదన్నారు. ఇప్పటికైనా రాష్ట్రప్రభుత్వం తక్షణం కులగణను ప్రారంభించి బీసీ రిజర్వేషన్లు పెంచాలని జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు.

ఈ హైడ్రా.. జీవశాస్త్రంలోని హైడ్రాలాగే!

హైదరాబాద్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): హైడ్రా అంటే తెలుసు కదా? ఏదీ.. హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్ (హైడ్రా)నా? లేదూ.. బహుకణ జీవిగా, టెంటకిల్స్‌తో పిల్లిమొగ్గలేసే జీవశాస్త్రంలోని హైడ్రానా? అని అంటారా? ఈ రెండూ లెండి! చెరువులు, పార్కుల్లో ఆక్రమణలపై బుల్డోజర్లతో విరుచుకుపడుతున్న హైడ్రాను బహుకణజీవి హైడ్రాతో పోల్చారు ఓ ఉన్నతాధికారి! అక్రమ కట్టడాలను కూల్చివేస్తున్న హైడ్రా ఇలానే కొన్నేళ్లపాటు ముందుకు దూసుకుపోవాలి అని ఆకాంక్షించారు! ఈ మేరకు చంచల్‌గూడ కేంద్ర కారాగారం సూపరింటెండెంట్ శివకుమార్ తన 'ఎక్స్' ఖాతాలో చేసిన పోస్టింగ్‌పై చర్చ మొదలైంది. 'బడికి వెళ్లేరోజుల్లో జీవశాస్త్రంలో హైడ్రా చలనంపై చదువుకున్నట్లు గుర్తు. హైదరాబాద్‌లో ఇప్పుడు హైడ్రా చలనం కూడా ఇలాగే కొన్ని సంవత్సరాలపాటు కొనసాగాలి. అందుకు తగ్గ శక్తి, బలాన్ని హైడ్రాకు ఇవ్వాలని దేవుణ్ని కోరుకుంటున్నా' అని శివకుమార్ పోస్ట్ చేశారు.

రైతులకు ఎరువులు సమయానికి అందాలి..

- డీలర్లు బ్లాక్ చేస్తే కఠినచర్యలు: మంత్రి తుమ్మ



హైదరాబాద్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): రైతులకు సమయానికి ఎరువులు అందేలా చూడాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులకు సూచించారు. డీలర్లు ఎరువులను బ్లాక్ చేస్తే కఠినచర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శనివారం సచివాలయంలో ఎరువుల పరిస్థితిపై సమీక్షించారు. రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయని అధికారులు వివరించారు. జిల్లా కేంద్రాల నుంచి గ్రామాలకు అవసరమైన మేర ముందుగానే పంపించేలా ఏర్పాట్లు చేయాలని మంత్రి సూచించారు. ఎరువుల లభ్యతపై ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాలన్నారు

ఉద్యోగులకు 2 డీఏల విడుదలపై సర్కారు దృష్టి?

నిధుల సమీకరణ కోసం ఆర్థిక శాఖకు సీఎం ఆదేశం

హైదరాబాద్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు, పెన్షనర్లకు రెండు కరువు భత్యాల(డీఏ)ను విడుదల చేయడానికి ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలిసింది. వీటి కోసం నిధులను సమీకరించాలంటూ ఆర్థిక శాఖ అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించినట్లు సమాచారం. ఇప్పటికే ఉద్యోగులకు నాలుగు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయి. సెప్టెంబరు నెలాఖరులోగానీ, అక్టోబరు మొదటి వారంలోగానీ రెండు డీఏలను క్లియర్ చేయవచ్చని సమాచారం. పెండింగ్ డీఏలను విడుదల చేయాలని టీఎన్‌జీవోలు, టీజీవోలు, ఇతర సంఘాలతో జాయింట్ యాక్షన్ కమిటీ కూడా ఏర్పాటైంది.

ఎస్సీ వర్గీకరణ రూపశిల్పి చంద్రబాబు

- వర్గీకరణ మార్గదర్శి బాలగోపాల్: మందకృష్ణ

హైదరాబాద్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ రూపశిల్పి ఏపీ సీఎం చంద్రబాబు అని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. శనివారం చంద్రబాబు నివాసానికి వెళ్లిన మందకృష్ణ.. ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఏపీలో వర్గీకరణను త్వరగా అమల్లోకి తేవాలని కోరారు. మడమ తిప్పని పోరాటంతో మంద కృష్ణ విజయం సాధించారని చంద్రబాబు అభినందించారు.


చంద్రబాబును సత్కరిస్తున్న మందకృష్ణ

కాగా, మానవ హక్కుల ఉద్యమకారుడు బాలగోపాల్ రచనలే వర్గీకరణకు దారిచూపాయని మంద కృష్ణ అన్నారు. బాలగోపాల్ ఇంటికి వెళ్లి ఆయన సతీమణి వసంతలక్ష్మిని కలిశారు. వర్గీకరణను రద్దు చేస్తూ 2004లో సుప్రీం ఇచ్చిన తీర్పును తప్పుపడుతూ.. వర్గీకరణ ఆవశ్యకతపై బాలగోపాల్ రచనలు చేశారని గుర్తు చేశారు. రిజర్వేషన్లపై బాలగోపాల్ రాసిన పుస్తకాన్ని వసంతలక్ష్మి.. మంద కృష్ణకు అందించారు.

మహిళా కమిషన్‌కు కేటీఆర్ సారీ!

(మొదటి పేజీ తరువాయి)

సూచించారు. పునరావృతమైతే తగిన చర్యలుంటాయని హెచ్చరించారు. కేటీఆర్ అవమానకరమైన వ్యాఖ్యలు చేశారన్న అభియోగాలను సుమోటోగా తీసుకున్న రాష్ట్ర మహిళా కమిషన్ కేటీఆర్‌కు ఇటీవల నోటీసులు జారీ చేసింది. కేటీఆర్ శనివారం ఉదయం 11 గంటలకు విచారణకు హాజరై వివరణ ఇచ్చిన అనంతరం చైర్‌పర్సన్ నేరెళ్ల శారద ట్వీట్ చేశారు. మహిళలపై చేసిన వ్యాఖ్యల పట్ల కేటీఆర్ విచారం వ్యక్తం చేశారని, క్షమాపణలు చెప్పారని, అలాంటి ప్రకటనలు సరికాదని, తనలాంటి నాయకత్వ స్థాయికి అలాంటి వ్యాఖ్యలు చేయకూడదని, సరికాదని కేటీఆర్ అంగీకరించారని వెల్లడించారు. భవిష్యత్‌లో అలాంటి వ్యాఖ్యలు చేయొద్దని కమిషన్ సూచించిందని చెప్పారు. విచారణకు కేటీఆర్ వెంట మాజీ మంత్రి సబిత, ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి, హరిప్రియా నాయక్, సత్యవతి రాథోడ్ వచ్చారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్, కాంగ్రెస్ మహిళా నాయకురాళ్లకు మధ్య తోపులాట జరిగింది. పరస్పరం భౌతిక దాడులకు పాల్పడ్డారు. ఉద్రిక్త వాతావరణం ఏర్పడటంతో పోలీసులు మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతారావు సహా పలువురు కాంగ్రెస్ నాయకురాళ్లను అరెస్ట్ చేసి అక్కడి నుంచి తరలించారు. కాగా, కమిషన్ ముందు హాజరవ్వడానికి వచ్చిన కేటీఆర్‌కు చైర్మన్ చాంబర్‌లోనే బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నియమితులైన కమిషన్ సభ్యులు ఆరుగురు రాఖీ కట్టారు. దీనిపై చైర్‌పర్సన్ శారద తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరుగురు సభ్యులకు నోటీసులు ఇవ్వాలని, న్యాయ సలహా అనంతరం తదుపరి చర్యలకు ఉపక్రమించాలని నిర్ణయించారు. నిష్పక్షపాతంగా వ్యవహరించాలని సభ్యులకు ముందే హెచ్చరించినప్పటికీ సభ్యుల ప్రవర్తన అనుచితంగా, కమిషన్ నియమాలకు విరుద్ధంగా ఉందని అభిప్రాయపడ్డారు. కమిషన్ నిష్పాక్షికతను, విశ్వసనీయతను దెబ్బతీసేలా వ్యవహరించారని అభిప్రాయపడ్డారు. వీరిపై న్యాయపరమైన చర్యలకు ఉపక్రమించనున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. రాఖీ కట్టడం తప్పు కాదని, కమిషన్ కార్యాలయంలో కట్టడం సమంజసం కాదని చెప్పారు.


మహిళా కమిషన్ ఎదుట మీడియాతో మాట్లాడుతున్న కేటీఆర్

కమిషన్‌పై గౌరవంతోనే హాజరయ్యా

కమిషన్‌పై గౌరవంతోనే స్వయంగా హాజరై నోటీసులకు సమాధానం ఇచ్చానని కేటీఆర్ అన్నారు. చైర్‌పర్సన్‌ను కలిసి తన వ్యాఖ్యలపై వివరణ ఇచ్చిన అనంతరం మీడియాతో మాట్లాడారు. యధాలాపంగా చేసిన వ్యాఖ్యలపై ఇదివరకే క్షమాపణలు కోరానని చెప్పారు. తనకు మద్దతుగా కమిషన్ కార్యాలయానికి వచ్చిన బీఆర్ఎస్ మహిళా కార్యకర్తలపై కాంగ్రెస్ మహిళా కార్యకర్తలు దాడులు చేయడాన్ని ఖండిస్తున్నానని చెప్పారు. ఎమ్మెల్యేలు సబిత, సునీత మాట్లాడుతూ, ముఖ్యమంత్రి తమపై చేసిన వ్యాఖ్యలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. సీఎం డౌన్ డౌన్ నినాదాలు చేశారు. కాగా, కేటీఆర్‌కు కమిషన్ సభ్యులు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలపడం విడ్డూరంగా ఉందని బీజేపీ నాయకురాలు మాధవి విమర్శించారు. విచారణకు పిలిచిన వారందరికీ రాఖీలతో స్వాగతం పలుకుతారా?అని ప్రశ్నించారు.

మాపై దాడులు చేయించారు: సునీతరావు

కేటీఆర్ కమిషన్ ముందు, ట్విట్టర్‌లో కాకుండా బస్సు ఎక్కి మహిళలకు బహిరంగ క్షమాపణలు చెప్పాలని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు డిమాండ్ చేశారు. మహిళా కమిషన్ కార్యాలయం వద్ద.. అడ్డమీది కూలోళ్లను తీసుకొచ్చి తమపై కేటీఆర్ దాడులు చేయించారని ఆరోపించారు. దీన్ని సుమోటో కేసుగా తీసుకుని కేటీఆర్‌పై కేసు పెట్టాలని మహిళా కమిషన్‌ను కోరారు. మహిళా కమిషన్ కార్యాలయానికి కేటీఆర్ విచారణ కోసం వెళ్లారా.. లేక దాడుల కోసమా అని మహిళా కార్పొరేషన్ చైర్మన్ బి.శోభారాణి ప్రశ్నించారు. తప్పును ఒప్పుకొని క్షమాపణలు అడగడానికి వచ్చిన కేటీఆర్.. మందిమార్బలంతో గొడవ ఎందుకు చేయించారని ప్రశ్నించారు.

వాల్మీకి స్కాంలో తెలంగాణ నేతల హస్తం: కేటీఆర్

కర్ణాటక ప్రభుత్వాన్ని కుదిపేస్తున్న వాల్మీకి స్కామ్ వ్యవహారంలో తెలంగాణ నాయకులు, వ్యాపారవేత్తల హస్తం ఉందని కేటీఆర్ ఆరోపించారు. అలాంటి వారిపై ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. వాల్మీకి స్కామ్‌లో తలెత్తుతున్న ప్రశ్నలకు కాంగ్రెస్ అగ్రనేతలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. "ఎస్టీ కార్పొరేషన్ నుంచి రూ.45కోట్లు హైదరాబాద్‌లోని 9బ్యాంకు ఖాతాలకు బదిలీ చేశారు. ఆ ఖాతాలు ఎవరివి? వీ6 పేరుతో ఉన్న బిజినెస్ మీద ఆరోపణలు ఉన్నాయి. దాని యజమాని ఎవరు? వాల్మీకి స్కాంకు సంబంధించి హైదరాబాద్‌లో సిట్, సీఐడీ, ఈడీ దాడులు నిర్వహించిన తర్వాత కూడా ఈ వార్తలు తెలంగాణలో ఎందుకు రాలేదు?" అని కేటీఆర్ ప్రశ్నించారు.


గండిపేటలో అక్రమ నిర్మాణాల కూల్చివేత

28 దుకాణాలను నేలమట్టం చేసిన అధికారులు

నార్సింగ్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): నార్సింగ్ మున్సిపాలిటీ పరిధిలోని గండిపేటలో రోడ్డుని ఆనుకుని అక్రమంగా నిర్మించిన 28 దుకాణాలను అధికారులు కూల్చేశారు. శనివారం నార్సింగ్ మునిసిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు మధ్య జేసీబీలతో దుకాణాలను పూర్తిగా నేలమట్టం చేశారు. అనుమతిలేనందునే ఆయా నిర్మాణాలను కూల్చేశామని.. నిబంధనలు అతిక్రమించినా, అనుమతులు తీసుకోకపోయినా ఇలాంటి చర్యలే ఉంటాయని మునిసిపల్ అధికారులు హెచ్చరించారు. కాగా, అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం మోపుతూ హైడ్రా చేపట్టిన కూల్చివేతను సమర్థిస్తూ గండిపేట వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం గండిపేట వాక్ నిర్వహించనున్నారు. ఇందుకోసం భారీ ఏర్పాట్లు చేశారు.


అక్రమ నిర్మాణాలను జేసీబీలతో కూల్చివేయిస్తున్న అధికారులు


అక్రమ నిర్మాణాల కూల్చివేతను చేపట్టిన హైడ్రాకు మద్దతుగా ఆదివారం గండిపేటలో మార్నింగ్ వాక్ నిర్వహిస్తున్నట్లు ఏర్పాటు చేసిన పోస్టర్



ప్రాజెక్టులన్నీ నిండుగా..

- 589.70 అడుగులకు సాగర్ నీటి మట్టం
- శ్రీశైలం, జూరాలకు మళ్లీ పెరిగిన వరద
- నేడు 18 జిల్లాల్లో వర్షాలు.. ఎల్లో అలర్ట్

హైదరాబాద్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): వరద రాక కొనసాగుతుండడంతో నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిండుకుండలా మారింది. పూర్తి స్థాయి నీటి మట్టం 590 అడుగులకు గాను శనివారం 589.70 అడుగులుగా ఉంది. 69,284 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. 40,070 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. తుంగభద్ర-సుంకేసుల ప్రాజెక్టుల మధ్య భారీగా వర్షాలతో శ్రీశైలానికి 1.15 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. పూర్తి నీటి మట్టం 885 అడుగులు కాగా 884.40 అడుగులకు చేరింది. ఎగువ కృష్ణ, ఎగువ బీమా పరివాహకాలలో వర్షాలతో కృష్ణా నదికి స్వల్పంగా వరద వస్తోంది. ఆల్మటి పూర్తి సామర్థ్యం 129.72 టీఎంసీలు అయితే 128.19 టీఎంసీలకు చేరింది. 6,565 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. నారాయణపూర్‌కు 30 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతోంది. 35 వేల క్యూసెక్కులను వదులుతున్నారు. తుంగభద్ర గేటు మరమ్మతు అనంతరం నిల్వలను పెంచుతున్నారు. 31 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 10 వేల క్యూసెక్కులను విడిచిపెడుతున్నారు. జూరాలకు వరద గణనీయంగా పెరిగింది. 86 వేల క్యూసెక్కులు చేరుతుండగా ఔట్‌ఫ్లో 82 వేల క్యూసెక్కులుగా ఉంది. పులిచింతలకు 30,520 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతోంది. 28,631 క్యూసెక్కులను వదులుతున్నారు. కాళేశ్వరంలో ప్రధానమైన మేడిగడ్డకు 1.31 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా మొత్తం నీటిని కిందకు పంపిస్తున్నారు. ఎల్లంపల్లికి 23,094 క్యూసెక్కుల ప్రవాహం ఉంది. కాగా, రాష్ట్రంలో రెండు రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. 18 జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

గురుకులాల పనితీరు భేష్

- విద్యాశాఖకు గవర్నర్ ప్రశంస

హైదరాబాద్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని సంక్షేమ గురుకుల పాఠశాలలు, కళాశాలలు అత్యుత్తమ పనితీరును కనబరుస్తున్నాయని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రశంసించారు. నాణ్యమైన బోధనతో మంచి ఫలితాలు సాధిస్తున్నాయని కొనియాడారు. విద్యాశాఖ ఉన్నతాధికారులతో గవర్నర్ శనివారం రాజ్‌భవన్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలు, విద్యాసంస్థల్లో బోధన, తదితర అంశాల గురించి విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం గవర్నర్‌కు వివరించారు. అనంతరం గవర్నర్ మాట్లాడుతూ, జాతీయ సేవాపథకం (ఎన్ఎస్ఎస్) వాలంటీర్లను సామాజిక పరివర్తన దిశగా మళ్లించేందుకు విద్యాశాఖ చేస్తున్న కృషిని ఆయన ప్రశంసించారు.


వెంకటాపూర్ నాడెం చెరువు బఫర్‌జోన్‌లోని అనురాగ్ విద్యాసంస్థల నిర్మాణాలు

ఎమ్మెల్యే పల్లా విద్యాసంస్థలపై కేసు

- నాడెం చెరువు బఫర్ జోన్‌లో అనురాగ్ విద్యా సంస్థలు, గాయత్రి ట్రస్ట్ నిర్మాణాలు
- నీటిపారుదల ఏఈ ఫిర్యాదుతో కేసు
- నిబంధనల ప్రకారమే భవన నిర్మాణాలు
- ప్రభుత్వం కక్ష కట్టింది: రాజేశ్వర్‌రెడ్డి

ఘట్‌కేసర్ రూరల్/హైదరాబాద్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ నేత, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి చెందిన విద్యాసంస్థలపై పోచారం ఐటీసీ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. రాజేశ్వర్‌రెడ్డికి చెందిన అనురాగ్ విద్యాసంస్థలు, గాయత్రి ఎడ్యుకేషనల్ ట్రస్టు.. మేడ్చల్ జిల్లాలోని నాడెం చెరువు బఫర్‌జోన్‌లో అక్రమ నిర్మాణాలు చేపట్టాయంటూ నీటిపారుదల శాఖ ఇచ్చిన ఫిర్యాదుతో ఈ కేసు నమోదు చేశారు. మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ మండలం, వెంకటాపూర్ పంచాయతీ, కొర్రెముల రెవెన్యూ పరిధిలోని 813 సర్వే నంబర్‌లో ఈ విద్యాసంస్థలు పలు నిర్మాణాలు చేపట్టాయి. అయితే నాడెం చెరువుకు 30 మీటర్ల బఫర్ జోన్ వదిలిపెట్టి నిర్మాణాలు చేపట్టాల్సి ఉండగా, సదరు విద్యాసంస్థల యాజమాన్యం ఈ నిబంధనల్ని ఉల్లంఘిస్తూ అక్రమంగా నిర్మాణాలు చేపట్టిందన్న ఆరోపణలు వచ్చాయి. దీంతో మండల ఇరిగేషన్ ఏఈ పరమేశ్ ఈ నెల 22న బఫర్‌జోన్‌లోని నిర్మాణాలను పరిశీలించి వాల్టా చట్టం కింద పోచారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజువర్మ తెలిపారు. కాగా, గతంలో నంగార భేరి లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు గణేష్‌నాయక్.. నాడెం చెరువు బఫర్‌జోన్‌లో నిర్మించిన అక్రమ నిర్మాణాలపై జిల్లా కలెక్టర్‌కు, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా ఎటువంటి చర్యలు తీసుకోలేదు. దీంతో గణేష్‌నాయక్ హైకోర్టును ఆశ్రయించి అక్రమ నిర్మాణాలు చేపట్టిన ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి చెందిన అనురాగ్ విద్యాసంస్థలు, గాయత్రి ఎడ్యుకేషనల్ సొసైటీపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

కక్షపూరితంగా ప్రభుత్వ చర్యలు: పల్లా

తాము అన్ని అనుమతులు, నిబంధనల మేరకే భవన నిర్మాణాలు చేపట్టామని అనురాగ్ విద్యాసంస్థల చైర్మన్, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వం తనపై, తన విద్యాసంస్థలపై కక్షపూరితంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తనకు సంబంధించిన విద్యాజ్యోతి కళాశాల, కోదాడలోని అనురాగ్ ఇంజనీరింగ్ కళాశాలకు ఏఐసీటీఈ, జేఎన్‌టీయూ అనుమతులు ఇచ్చిన తరువాత కూడా ప్రస్తుతం ఉన్న కోర్సుల్లో 480 సీట్లను రాష్ట్ర ప్రభుత్వం కోత పెట్టిందని తెలిపారు. రాష్ట్రంలో 99 శాతం కళాశాలలకు అనుమతులు ఇచ్చి.. తన కళాశాలకు మాత్రం అనుమతులు ఇవ్వకుండా కక్షసాధింపులకు పాల్పడుతోందన్నారు. తన విద్యాసంస్థలపై ఇప్పటికే విజిలెన్స్, ఇంటెలిజెన్స్, నీటిపారుదల శాఖ, విద్యాశాఖ, రెవెన్యూ శాఖల ద్వారా నిత్యం సోదాలు చేస్తున్నారని తెలిపారు. అయినా ఏ తప్పులూ దొరక్కపోవడంతో 2017లో అనుమతులు ఇచ్చిన నీటిపారుదల శాఖ అధికారులపై ఒత్తిడి తెచ్చి తనపై మరో కేసు నమోదు చేశారని ఆరోపించారు. తద్వారా అనురాగ్ యూనివర్సిటీని, అందులో చదువుతున్న విద్యార్థులను, తనను ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. వైద్య కళాశాల నిర్మాణం జరిగిన సర్వే నంబరు 813/పి, 796/పికి సంబంధించి వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చిన పత్రాలనూ పరిశీలించలేదన్నారు. ప్రభుత్వం ఎన్ని అక్రమ కేసులు పెట్టినా చట్టప్రకారమే నడుచుకుంటానని పేర్కొన్నారు.

కూల్చివేయకుండా హైడ్రాను అడ్డుకోండి

- హైకోర్టులో విద్యా సంస్థల పిటిషన్
- వాటిలో అనురాగ్ వర్సిటీ కూడా..
- చట్టప్రకారం వ్యవహరించాలని కేసు ముగించిన ధర్మాసనం

హైదరాబాద్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): హైడ్రా తమ ఆస్తుల విషయంలో అక్రమంగా జోక్యం చేసుకుంటోందని, కూల్చివేతలు చేపట్టకుండా అడ్డుకోవాలని కోరుతూ శనివారం పలు విద్యా సంస్థలు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశాయి. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి చెందిన అనురాగ్ యూనివర్సిటీతో పాటు, గాయత్రి ఎడ్యుకేషనల్ అండ్ కల్చరల్ ట్రస్ట్, నీలిమ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ తదితర సంస్థలు హౌజ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశాయి. మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ మండలం కుర్రెముల గ్రామంలోని 813/ఈ, 813/ఈఈ, 813/ఏఏ/2, 813/ఏఏ/1796 సర్వే నంబర్లలోని 17.21 ఎకరాల భూమి, నిర్మాణాల విషయంలో హైడ్రా, ఇతర ప్రభుత్వ శాఖలు జోక్యం చేసుకోవడంతో పాటు విచారణల పేరుతో ఇబ్బందులకు గురిచేస్తున్నాయని తెలిపాయి. నిర్మాణాలు తొలగించేందుకు సిద్ధమవుతున్న హైడ్రాను అడ్డుకోవాలని కోరాయి. లేదంటే కూల్చివేసే ప్రమాదం ఉందని న్యాయవాదులు పేర్కొన్నారు. వాదనలు విన్న జస్టిస్ టి.వినోద్‌కుమార్ ధర్మాసనం.. నిబంధనల ప్రకారం వ్యవహరించాలని అధికారులను ఆదేశించింది. ఈ మేరకు ప్రభుత్వ న్యాయవాది హామీ ఇవ్వడంతో కేసును ముగించింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No. 70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.

జవహర్ నవోదయ విద్యాలయాల్లో
ఆరోతరగతి ప్రవేశాలు

నవోదయ విద్యాలయ సమితి(ఎన్‌వీఎస్)- దేశవ్యాప్తంగా ఉన్న జవహర్ నవోదయ విద్యాలయాల్లో ఆరో తరగతిలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. 'జవహర్ నవోదయ విద్యాలయ సెలెక్షన్ టెస్ట్(జేఎన్‌వీఎస్‌టీ) 2025' ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. ఇవి కో-ఎడ్యుకేషనల్ రెసిడెన్షియల్ స్కూళ్లు. బాల బాలికలకు విడివిడిగా హాస్టల్స్ ఉంటాయి. భోజన, వసతి సౌకర్యాలతోపాటు పన్నెండో తరగతి వరకు బోధన ఉచితం. యూనిఫాం, పాఠ్య పుస్తకాలు కూడా ఇస్తారు. తొమ్మిది నుంచి పన్నెండో తరగతి విద్యార్థులు మాత్రం విద్యాలయ వికాస్ నిధి కోసం నెలకు రూ.600 చెల్లించాల్సి ఉంటుంది. బాలికలు; దివ్యాంగులు; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు; పేదింటి పిల్లలకు దీని నుంచి మినహాయింపు వర్తిస్తుంది. ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలైతే నెలకు రూ.1500 చెల్లించాలి. ఆరు నుంచి ఎనిమిదో తరగతి వరకు మాతృ భాష/ప్రాంతీయ భాషలో బోధన ఉంటుంది. తరవాత మేథమెటిక్స్, సైన్స్ సబ్జెక్టులను ఆంగ్ల మాధ్యమంలో; సోషల్ సైన్స్‌ను హిందీలో బోధిస్తారు. ఈ విద్యాలయాల్లో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) వార్షిక పరీక్షలు నిర్వహిస్తుంది.



విద్యాలయాలు-సీట్లు: దేశవ్యాప్తంగా మొత్తం 653 జేఎన్‌వీలు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో 13 విద్యాలయాలు ఉన్నాయి. ఎస్సీ, ఎస్టీ వర్గాల జనాభా అధికంగా ఉన్న ప్రాంతాలకు మరో రెండు విద్యాలయాలు కేటాయించారు. తెలంగాణలో 9 జేఎన్‌వీలు ఉన్నాయి. ఒక్కో విద్యాలయంలో ఆరోతరగతిలో గరిష్ఠంగా 80 మందికి అవకాశం కల్పిస్తారు. జిల్లాల వారీగా సంబంధిత జేఎన్‌వీల్లో గ్రామీణ విద్యార్థులకు 75 శాతం సీట్లు ప్రత్యేకించారు.

అర్హత వివరాలు: ప్రస్తుతం ప్రభుత్వ/ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో అయిదో తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎన్ఐఓఎస్ నుంచి 2024 సెప్టెంబరు 15 నాటికి 'బి' సర్టిఫికెట్ కాంపిటెన్సీ కోర్సు పూర్తిచేసేవారు కూడా అర్హులే. విద్యార్థులు 2013 మే 1 నుంచి 2015 జూలై 31 మధ్య జన్మించి ఉండాలి.

జేఎన్‌వీ సెలెక్షన్ టెస్ట్: దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. పరీక్ష సమయం 2 గంటలు. మొత్తం మార్కులు 100. ఈ పరీక్షలో మూడు సెక్షన్లు ఉంటాయి. వీటిలో మొత్తం 80 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. మెంటల్ ఎబిలిటీ టెస్ట్‌లో 40 ప్రశ్నలు అడుగుతారు. దీనికి 50 మార్కులు కేటాయించారు. అర్థమెటిక్ టెస్ట్, లాంగ్వేజ్ టెస్ట్‌ల్లో ఒక్కో దానిలో 20 ప్రశ్నలు ఇస్తారు. ఒక్కో దానికి 25 మార్కులు ఉంటాయి. నెగెటివ్ మార్కులు లేవు. మెంటల్ ఎబిలిటీ టెస్ట్‌కు గంట; మిగిలినవాటికి ఒక్కోదానికి అర్ధగంట పరీక్ష సమయం ఇస్తారు. విద్యార్థులు బ్లూ/బ్లాక్ బాల్ పాయింట్ పెన్‌తో ఓఎంఆర్ పత్రం మీద సమాధానాలు గుర్తించాలి. తెలుగు రాష్ట్రాల్లో ఈ పరీక్షని తెలుగు, హిందీ, ఇంగ్లీష్, మరాఠీ, ఉర్దూ, ఒరియా, కన్నడ మాధ్యమాల్లో నిర్వహిస్తారు. పరీక్ష సిలబస్ కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

ముఖ్య సమాచారం
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 16
- **జేఎన్‌వీ సెలెక్షన్ టెస్ట్ తేదీలు:** 2025 జనవరి 18, ఏప్రిల్ 12
- **వెబ్‌సైట్:** www.navodaya.gov.in

రిమైండర్

జేవియర్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్- 'జేవియర్ ఆప్టిట్యూడ్ టెస్ట్(ఎక్స్‌ఏటీ)2025' నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ పరీక్షలో సాధించిన స్కోర్ ద్వారానే దేశవ్యాప్తంగా కొన్ని ప్రముఖ బీ-స్కూళ్లు, పార్టిసిపేటింగ్ ఇన్‌స్టిట్యూషన్‌లలో ఎంబీఏ, ఇతర మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలు కల్పిస్తారు. ఎక్స్ఎల్ఆర్ఐ జంషెడ్‌పూర్, ఢిల్లీ క్యాంపస్‌లు అందిస్తున్న పీజీడీఎం ప్రోగ్రామ్‌లో కూడా అడ్మిషన్ పొందవచ్చు.

జేవియర్ ఆప్టిట్యూడ్ టెస్ట్



అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు, సీఏ/సీఎస్/ఐసీడబ్ల్యూఏఐ వంటి ప్రొఫెషనల్ కోర్సులు పూర్తిచేసినవారు అర్హులు. ప్రస్తుతం చివరి సంవత్సరం చదువుతున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. వీరికి 2025 జూన్ నాటికి పరీక్షలు పూర్తికావాలి. వయోపరిమితి నిబంధనలు లేవు.

ఎక్స్‌ఏటీ 2025: ఇది కంప్యూటర్ బేస్డ్ టెస్ట్. ఇందులో రెండు పార్టులు ఉంటాయి. మొదటి పార్ట్‌లో వెర్బల్ ఎబిలిటీ అండ్ లాజికల్ రీజనింగ్ నుంచి 26 ప్రశ్నలు, క్వాంటిటేటివ్ ఎబిలిటీ అండ్ డేటా ఇంటర్‌ప్రిటేషన్ నుంచి 28 ప్రశ్నలు, డెసిషన్ మేకింగ్ నుంచి 21 ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. వీటికి నెగెటివ్ మార్కులు వర్తిస్తాయి. తప్పుగా గుర్తించిన సమాధానానికి పావు మార్కు కోత విధిస్తారు. రెండో పార్ట్‌లో జనరల్ నాలెడ్జ్ నుంచి 25 ప్రశ్నలు ఇస్తారు. ఒక అనలిటికల్ ఎస్సే రాయాల్సి ఉంటుంది. వీటికి నెగెటివ్ మార్కులు లేవు. జనరల్ నాలెడ్జ్ స్కోర్‌ను పరిగణనలోకి తీసుకోరు. పరీక్ష సమయం మూడున్నర గంటలు. మొదటి పార్ట్‌లో సాధించిన స్కోర్ ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేసి వీరు రాసిన ఎస్సేలను మాత్రమే పరిశీలిస్తారు. తరవాత పర్సనల్ ఇంటర్వ్యూలు ఉంటాయి.

ముఖ్య సమాచారం
- **దరఖాస్తు ఫీజు:** రూ.2,200(ఎక్స్ఎల్ఆర్ఐ అందిస్తున్న పీజీడీఎంలో చేరాలంటే అదనంగా రూ.200 చెల్లించాలి)
- **ఎక్స్ఎల్ఆర్ఐ ప్రోగ్రామ్‌లు:** బిజినెస్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్, పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్, ఫెలో ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్, ఎక్స్ఎల్ఆర్ఐ-ఆర్‌బీఎస్ డబుల్ మాస్టర్స్ ప్రోగ్రామ్, ఇన్నోవేషన్-ఆంత్రప్రెన్యూర్‌షిప్-వెంచర్ క్రియేషన్ ప్రోగ్రామ్
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** నవంబరు 30
- **అడ్మిట్ కార్డ్‌ల డౌన్‌లోడింగ్:** డిసెంబరు 20 నుంచి
- **తెలుగు రాష్ట్రాల అభ్యర్థులకు పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, వరంగల్, కర్నూలు, రాజమండ్రి, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం
- **ఎక్స్‌ఏటీ 2025 తేదీ:** 2025 జనవరి 5
- **టెస్ట్ ప్రాథమిక కీ విడుదల:** 2025 జనవరి 10
- **ఫలితాలు విడుదల:** 2025 జనవరి 20
- **వెబ్‌సైట్:** www.xatonline.in, mbauniverse.com

ఇండోర్ ఐఐఎంలో
పీజీపీఎంఎక్స్

ఇండోర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎం)- పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్ ఫర్ వర్కింగ్ ఎగ్జిక్యూటివ్స్(పీజీపీఎంఎక్స్)లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇది రెండేళ్ల వ్యవధి గల ఆల్టర్నేట్ వీకెండ్ ప్రోగ్రామ్. ఏడాదికి మూడు టర్మ్‌లు ఉంటాయి. మొదటి ఏడాది కోర్ కోర్సులు, రెండో ఏడాది ఎలక్టివ్ కోర్సులు పూర్తిచేయాల్సి ఉంటుంది. ప్రోగ్రామ్‌లో భాగంగా ఆయిదు రోజుల ఇంటర్నేషనల్ ఇమ్మర్షన్ ప్రోగ్రామ్, ఆన్‌లైన్ ప్రిపరేటరీ కోర్సులు, క్యాప్‌స్టోన్ కోర్సు, కోర్సు రైటింగ్ ఉంటాయి. ఈ ప్రోగ్రామ్‌ని ముంబై క్యాంపస్‌లో నిర్వహిస్తారు. ఆప్టిట్యూడ్ టెస్ట్, ఇంటర్వ్యూల ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు. నిబంధనల ప్రకారం ప్రోగ్రామ్ పూర్తిచేసిన వారికి ఎంబీఏ డిగ్రీని ప్రదానం చేస్తారు.

ఎలక్టివ్ కోర్సులు: కమ్యూనికేషన్, ఎకనామిక్స్, ఫైనాన్స్ అండ్ అకౌంటింగ్, ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్, మార్కెటింగ్, ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్, ఆర్గనైజేషనల్ బిహేవియర్ అండ్ హెచ్ఆర్ఎం, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్, స్ట్రాటజిక్ మేనేజ్‌మెంట్

ఆన్‌లైన్ ప్రిపరేటరీ కోర్సులు: ఫైనాన్స్, ఫైనాన్షియల్ అకౌంటింగ్, మేనేజ్‌మెంట్ కమ్యూనికేషన్, మేథమెటిక్స్ ఫర్ మేనేజ్‌మెంట్, క్వాంటిటేటివ్ మెథడ్స్, స్ప్రెడ్‌షీట్ మోడలింగ్.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం అయిదేళ్ల మేనేజీరియల్/ప్రొఫెషనల్ అనుభవం ఉండాలి.

- **ప్రోగ్రామ్‌నకు సంబంధించిన ఇన్ఫర్మేషన్ వెబినార్‌లు:** సెప్టెంబరు 1, సెప్టెంబరు 29 ఉదయం పదిన్నరకు
- **దరఖాస్తు ఫీజు:** రూ.5,000
- **దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 13
- **ఆప్టిట్యూడ్ టెస్ట్, ఇంటర్వ్యూలు:** అక్టోబరు 20
- **ఓరియంటేషన్ ప్రోగ్రామ్:** నవంబరు 30
- **వెబ్‌సైట్:** iimidr.ac.in

జాబ్ కార్నర్

ఎన్‌పీసీఐఎల్‌లో స్టయిపెండరీ ట్రెయినీలు

ఖాళీలు 279

రావత్‌భట రాజస్థాన్ సైట్‌లోని న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్... కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

1. కేటగిరీ-2 స్టయిపెండరీ ట్రెయినీ ఆపరేటర్: **153 పోస్టులు**
2. కేటగిరీ-2 స్టయిపెండరీ ట్రెయినీ మెయింటైనర్: **126 పోస్టులు**

విభాగాలు: ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ఎలక్ట్రానిక్స్, ఇన్‌స్ట్రుమెంటేషన్, మెషినిస్ట్/టర్నర్, వెల్డర్.

అర్హత: పోస్టును అనుసరించి 10వ తరగతి, 12వ తరగతి(సైన్స్ సబ్జెక్టుల్లో), సంబంధిత విభాగంలో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.

వయోపరిమితి: 2024 సెప్టెంబరు 11 నాటికి 18 నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి.

ఎంపిక విధానం: ప్రిలిమినరీ టెస్ట్, అడ్వాన్స్‌డ్ టెస్ట్, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఆధారంగా

దరఖాస్తు రుసుము: రూ.100. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, ఈఎస్ఎం, మహిళా అభ్యర్థులకు ఫీజు చెల్లింపు నుంచి మినహాయింపు ఉంటుంది.

దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 11

వెబ్‌సైట్: www.npcil.nic.in/index.aspx

బీఈఎంఎల్‌లో గ్రూప్-సి పోస్టులు

ఖాళీలు 100

భారత ప్రభుత్వ రక్షణ మంత్రిత్వశాఖకు చెందిన బెంగళూరులోని భారత్ ఎర్త్ మూవర్స్ లిమిటెడ్(బీఈఎంఎల్ లిమిటెడ్)... ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

1. ఐటీఐ ట్రెయినీ: **54 పోస్టులు**
2. ఆఫీస్ అసిస్టెంట్ ట్రెయినీ: **46 పోస్టులు**

విభాగాలు: ఫిట్టర్, టర్నర్, మెషినిస్ట్, ఎలక్ట్రీషియన్, వెల్డర్

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో కనీసం 60 శాతం మార్కులతో ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: 37 ఏళ్లు మించకూడదు

దరఖాస్తు ఫీజు: రూ.200; ఎస్సీ/ఎస్టీ/పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు ఫీజులో మినహాయింపు ఉంటుంది.

ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష/ట్రేడ్ టెస్ట్ తదితరాల ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 4

వెబ్‌సైట్: www.bemlindia.in/

ఎన్ఐఓలో స్టెనోగ్రాఫర్ పోస్టులు

ఖాళీలు 9

గోవాలోని సీఎస్ఐఆర్ - నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీ(ఎన్ఐఓ)... తాత్కాలిక ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. జూనియర్ స్టెనోగ్రాఫర్: **5 పోస్టులు**
2. జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్(ఫైనాన్స్ అండ్ అకౌంట్స్, స్టోర్స్ అండ్ పర్చేస్): **4 పోస్టులు**

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో 10+2/ఇంటర్మీడియట్ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.

జీతం: నెలకు జూనియర్ స్టెనోగ్రాఫర్ పోస్టుకు రూ.25,000- రూ.81,000; జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్ పోస్టుకు రూ.19,900 - రూ.63,200.

వయోపరిమితి: 2024 సెప్టెంబరు 19 నాటికి జూనియర్ స్టెనోగ్రాఫర్ పోస్టుకు 27 ఏళ్లు; జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్ పోస్టుకు 28 ఏళ్లు మించకూడదు.

దరఖాస్తు ఫీజు: రూ.100. ఎస్సీ/ఎస్టీ/పీడబ్ల్యూబీడీ/మహిళా అభ్యర్థులకు ఫీజులో మినహాయింపు ఉంటుంది.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 19

వెబ్‌సైట్: www.nio.res.in/

యూసీఎస్ఎల్‌లో ఎగ్జిక్యూటివ్ ట్రెయినీలు

ఖాళీలు 8

మాల్పే(కర్ణాటక)లోని ఉడిపి కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్(యూసీఎస్ఎల్)... కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

విభాగాలు: మెకానికల్, ఎలక్ట్రికల్, నావల్ ఆర్కిటెక్చర్

అర్హతలు: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో కనీసం 65 శాతం మార్కులతో ఇంజనీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: 2024 సెప్టెంబరు 5 నాటికి 27 ఏళ్లు మించకూడదు. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్ల సడలింపు ఉంటుంది.

ఎంపిక విధానం: రాత పరీక్ష, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

దరఖాస్తు ఫీజు: జనరల్ అభ్యర్థులకు రూ.1000. ఎస్సీ/ఎస్టీలకు ఫీజులో మినహాయింపు ఉంటుంది.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 5

వెబ్‌సైట్: https://udupicsl.com/

ఎన్ఐబీలో జూనియర్ సైంటిస్టులు

ఖాళీలు 6

నోయిడా(ఉత్తరప్రదేశ్)లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బయోలాజికల్స్... డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- సైంటిస్ట్ గ్రేడ్-1: **1 పోస్టు**
- సైంటిస్ట్ గ్రేడ్-2: **2 పోస్టులు**
- జూనియర్ సైంటిస్ట్: **2 పోస్టులు**
- అసిస్టెంట్ -2: **1 పోస్టు**

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎంబీబీఎస్, పీజీ, మెడికల్ పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.

ఎంపిక ప్రక్రియ: అభ్యర్థుల విద్యార్హత, రాత పరీక్ష/స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ, పర్సనాలిటీ టెస్ట్ ఆధారంగా

దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 23

వెబ్‌సైట్: https://www.nib.gov.in/

సాహిత్య అకాడమీలో ఉద్యోగాలు

ఖాళీలు 12

ఢిల్లీలోని సాహిత్య అకాడమీ... డైరెక్ట్ ప్రాతిపదికన కింద పేర్కొన్న ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టుల వివరాలు
1. డిప్యూటీ సెక్రటరీ
2. రీజనల్ సెక్రటరీ
3. పబ్లికేషన్ అసిస్టెంట్
4. ప్రోగ్రామ్ అసిస్టెంట్
5. స్టెనోగ్రాఫర్ గ్రేడ్-3
6. జూనియర్ క్లర్క్
7. అసిస్టెంట్ ఎడిటర్
8. సబ్ ఎడిటర్(ఇంగ్లీష్)
9. ప్రూఫ్ రీడర్ కమ్ జనరల్ అసిస్టెంట్
10. మల్టీ టాస్కింగ్ స్టాఫ్

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పదో తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లొమా జర్నలిజం, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

జీతం: నెలకు డిప్యూటీ సెక్రటరీ పోస్టుకు రూ.67,700 - రూ.2,08,700; అసిస్టెంట్ ఎడిటర్ పోస్టుకు రూ.56,000 - రూ.1,77,500; పబ్లికేషన్ అసిస్టెంట్, సబ్ ఎడిటర్, ప్రోగ్రామ్ అసిస్టెంట్ పోస్టులకు రూ.25,000 - రూ.81,100.

పని ప్రదేశాలు: ఢిల్లీ, బెంగళూరు, ముంబయి

ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ దరఖాస్తులను సెక్రటరీ, సాహిత్య అకాడమీ, రవీంద్ర భవన్, 35 ఫిరోజ్‌షా రోడ్, ఢిల్లీ చిరునామాకు పంపించాలి.

దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 16

వెబ్‌సైట్: sahityaakademi.gov.in/




లిటిల్స్




ధర్మారాయుడి తీర్పు

ఒక ఊరిలో ధర్మారాయుడు అనే గ్రామాధికారి ఉండేవాడు గ్రామంలో వచ్చే చిన్నా పెద్దా తగాదాలలో అతను మంచి న్యాయమైన తీర్పులు చెబుతాడని చుట్టుపక్కల అతనికి మంచి పేరుండేది. ఆ గ్రామంలో ఒక వర్తకుడు రామయ్య అనే రైతుకు తన పొలంలోని బావిని అమ్మాడు. కానీ రామయ్య ఆ బావిలోని నీళ్లు వాడుకోబోతుండగా వర్తకుడు రామయ్యతో 'నేనునీకు బావి మాత్రమే అమ్మాను కానీ అందులోని నీళ్లు కాదు. ఆ నీళ్లు ఇంకా నావే. కాబట్టినువ్వు ఎట్టి పరిస్థితుల్లోనూ ఆ బావిలోని నీళ్లు వాడుకోకూడదు' అని షరతు పెట్టాడు. ఈ మాటలు విన్న రామయ్యకు ఏం చేయాలో పాలుపోక, ధర్మారాయుడికి ఫిర్యాదు చేశాడు. గ్రామంలోని మిగతా వారందరికీ వర్తకుడు పెట్టిన షరతు అన్యాయంగా అనిపించినా ఎవరూ ఏమీ చేయలేక ఊరుకున్నారు. విషయం తెలుసుకున్న ధర్మారాయుడు వర్తకుడిని పిలిచి, నువ్వు రామయ్యకు బావిని మాత్రమే అమ్మావు కనుక అతని బావిలో నీ నీళ్లు ఉండటం న్యాయ సమ్మతం కాదు. నీ నీళ్లు అన్నిటినీ తీసుకెళ్లి మరెక్కడైనా దాచుకో లేదా నీళ్లు బావిలో ఉంచినందుకు, రామయ్యకు అద్దెచెల్లించు అని తీర్పు ఇచ్చాడు. అందరూ వర్తకుడి మోసనపు బుద్ధికి మంచి గుణపాఠం నేర్పాడని ధర్మారాయుడిని పొగిడారు.




10 తేడాలు గుర్తించండి

సరైన నీడ ఏది



దాగి ఉన్న 10 వస్తువులను కనిపెట్టండి?



ఆవులు, ఎద్దులు ఎన్ని ఉన్నాయి?





దారి కనుక్కోండి

డైలీ సుడోకు - 393

	6	4			5
3				4	
	5				1
2			4	1	

సుడోకు - 392 సమాధానం

1	6	4	3	2	5
5	2	3	1	6	4
3	1	6	5	4	2
4	5	2	6	3	1
6	4	1	2	5	3
2	3	5	4	1	6

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.